# తత్త్వోపన్యాసములు

కన్నడ మూలం

**స్వామి విజయీంద్రులు**

తెలుగు అనువాదం

**శ్రీ కె. సుధాకరరావ్,** *M.A.* (తెలుగు)
*M.A.* (సంస్కృతం)

ప్రకాశకులు :

**శ్రీ అచ్యుతాశ్రమము**

**విరుపాపురగడ్డ, సానాపుర పోస్టు,**
**గంగావతి తాలూక, కొప్పళజిల్లా,**
**కర్నాటక - 583234**

**TATWOPANYASAMULU**

First Edition : 2011

*Copies :* **1000**

*Published on the Occassion of the*
**53rd Jayanthi on 18-2-2011**

All Rights Reserved by
**SRI ACHYUTHAASRAMAMU**

Price : **Rs.50/-**

*Printed at :*
**WELCOME GRAPHICS,**
2/5, Brodipet, GUNTUR

# ఆశీస్సులు

"తత్త్వోపన్యాసములు" అను ఈ తెలుగు అనువాద గ్రంథముద్రణకు ఆర్థిక సహాయమును అందించినవారు

కీ॥శే॥ శ్రీ బిజ్జాల నరహరిగారి జ్ఞాపకార్థము, వారి భార్య శ్రీమతి బిజ్జాల లక్ష్మమ్మగారు, వారి కుమారులు – కోడళ్లు, కుమార్తెలు – అల్లుళ్ళు మరియు వారి మనుమలు – మనుమరాళ్లు.

| **కుమారులు** | **కోడళ్లు** |
|---|---|
| శ్రీ బిజ్జాల జగన్నాథమ్ | శ్రీమతి జయమ్మ |
| శ్రీ బిజ్జాల మల్లేశమ్ | శ్రీమతి అంజమ్మ |
| శ్రీ బిజ్జాల భూషయ్య | శ్రీమతి పద్మ |
| శ్రీ బిజ్జాల నిరంజన్ | శ్రీమతి శోభారాణి |

| **అల్లుళ్లు** | **కుమార్తెలు** |
|---|---|
| శ్రీమిట్టపల్లి పాండరయ్య | శ్రీమతి కేదారమ్మ |
| శ్రీ కొండూరు అంజయ్య | శ్రీమతి మహేశ్వరి |

| **మనుమలు** | **మనుమరాళ్లు** |
|---|---|
| శ్రీ కండే రాజేందర్ | శ్రీమతి రాధిక |
| శ్రీ ఆలంపల్లి కిషోర్ | శ్రీమతి హైమావతి |
| శ్రీ రేణుకుంట సుమన్‌కుమార్ | శ్రీమతి కల్పన |
| డా॥మంచుకొండ శ్యామ్‌ప్రసాద్ | శ్రీమతి శ్రీలత |



ఆధ్యాత్మిక గ్రంథముద్రణకు ముందుకు వచ్చిన వీరి దాతృత్వము మిగుల ప్రశంసింపదగినది. వీరందరికీ శ్రీ అచ్యుత గురుదేవులు చిరాయురారోగ్య ఐశ్వర్యములను అనుగ్రహించ గలందులకు ప్రార్థించు చున్నాను.

కన్నడ భాషలో ఉన్న ఈ గ్రంథమును తెలుగు వారికి కూడ చేరువచేసిన శ్రీ కె.సుధాకరరావు గారికి శ్రీ అచ్యుత గురుదేవుల కృప లభించగలందులకు ప్రార్థించుచున్నాను.

ఈ గ్రంథమును అందముగా అచ్చొత్తించిన వెల్‌కమ్ గ్రాఫిక్స్ – గుంటూరు అధినేతలైన శ్రీ పి.పురుషోత్తమ్‌గారికి శ్రీ అచ్యుత గురుదేవులు ఆశీస్సులు అందించగలందులకు ప్రార్థించుచున్నాను.

జయ అచ్యుత

**స్వామి సీతారామ్**
**ప్రధానగురువు**
**శ్రీ అచ్యుతాశ్రమము**

తేది : 10-4-2010
ఉరవకొండ

# పూజ్యయోగి అచ్యుతుల సందేశం

**ఓం శాంతిః**

తత్త్వజ్ఞానం అనేది మానవ జీవితానికి చాలా అవసరం. అనుభవానికి, ఆనందానికి సాధన ముఖ్యం. ప్రపంచంలో విభిన్న వ్యక్తులకు వివిధ కార్యక్షేత్రాల్లో విభిన్న లక్ష్యాలుంటాయి. ఆయా లక్ష్యాలకు అనుగుణంగా సాధనామార్గాలుంటాయి. అలాగే, తత్త్వానుభవానికి, మొదటి నుంచి వస్తూన్న ఒక నిర్దిష్ట సాధన ఉంది. ఆ సాధనను చూపించడమే తత్త్వవేత్త పని. ఆ సాధనతో పాటు, జగత్తులో సుఖశాంతులతో జీవిస్తూ లక్ష్యాన్ని అందుకునేందుకు అవసరమైన విషయాల్లో కొన్నింటిని శ్రీ విజయీంద్రుల ఉపన్యాసాలు వివరిస్తాయి. ప్రజలు ఈ అంశాలను గ్రహించడం ద్వారా అత్యుత్తమ ప్రయోజనాన్ని పొంది, సత్యమార్గం వైపుకు ముందుకు సాగాలని నా ఆకాంక్ష.

**అచ్యుతులు**



# శ్రీ విజయీంద్ర స్వాముల స్వీకారం

శ్రీ జయతీర్థులు తన తీరిక సమయాల్లో నా యాత్రలలో జరిగిన ఉపన్యాస కార్యక్రమాలకు వచ్చేవారు. అక్కడికక్కడే ఆ ఉపన్యాసాల్ని రాసుకునేవారు.

ఆ ఉపన్యాసాల్నే ఆదోని తాలూకు ఎమ్మిగనూరులోని తత్వసేవా సమితి 'తత్త్వోపన్యాసాలు' అనే పేరిట ప్రచురించింది. ఈ సమితికి, వీరికి త్రికరణశుద్ధిగా సాయంచేసిన తత్త్వ జిజ్ఞాసువు లందరికి ఆ భగవంతుడు శుభాన్ని అందించాలని ప్రార్థిస్తున్నా.

ఇకపోతే – ఈ ఉపన్యాసాల గురించి ఎక్కువగా చెప్పేదేమీ లేదని భావిస్తా. రక్తబంధువై, గురుభ్రాతయై, అన్నివిధాల హార్దికమైన సంబంధం కల్గిన శ్రీ జయతీర్థులు మహాసాహసం చేశారు. ఈ ఉపన్యాసమాలిక సత్యానికి చాలా సమీపంలో ఉందని మాత్రం చెప్పదలిచాను.

ఈ సత్సంకల్పం జనులకు నచ్చాలనీ, ఆరకంగా కరుణించమని పరమపూజ్య యోగి అచ్యుతులవారిని ప్రార్థించి, భగవంతునికి ఆత్మనివేదన చేస్తున్నా.

10–8–56 మీవాడు

విశ్వకుటీరం **విజయీంద్ర**

## విన్నపం

శ్రీ విజయీంద్రస్వాముల వారు తమ 'తత్త్వోపన్యాసా'ల్ని ముద్రించేందుకు అంగీకారం తెలుపుతూ నా సేవ గురించి ప్రస్తావించారు.

నాకు శీఘ్ర లిపి తెలియదు. వారి ఉపన్యాసంలోని ప్రతి ఒక్క శబ్దమూ ఇందులో వచ్చిందంటే అతిశయోక్తే!

ఇది వారి ఉపన్యాసాల సారసంగ్రహమని మాత్రం చెప్పగలను. 'సత్యానికి చాలా దగ్గరలో ఉన్నాయ'ని వారు సెలవిచ్చారు. నిజానికి భావం ఎక్కడా చెడిపోకుండా తగిన జాగ్రత్త వహించాను. భాష, శైలి విషయంలో కూడ సాధ్యమైనంత వరకు ఆయన ఛాయలు కన్పిస్తున్నాయి ప్రతి నిత్యపు సహవాసం, ఒకే గురువు (అచ్యుతులు) గారి వద్ద పెరిగి పెద్ద వాళ్ళమయ్యే భాగ్యం లభించింది. ఆ అదృష్టం కొద్దీ ఈ ఉపన్యాస మాలిక వెలువడింది.

ఎక్కడైనా భావం అస్పష్టమైతే అది నా దోషం ! ఇందులో కన్పించే జ్ఞానదీప్తి – స్వామి విజయీంద్రుల వైశిష్ట్యమే !

సేవకుడు

**జయతీర్థులు**



## విషయసూచక


| | | |
|---|---|---|
| 1. | ధర్మ సమన్వయం | 1 |
| 2. | ధర్మసభ ఉద్ఘాటన | 32 |
| 3. | మనస్సు | 35 |
| 4. | కర్మ సిద్ధాంతం | 52 |
| 5. | భారత సంస్కృతి | 68 |
| 6. | జీవితం | 89 |
| 7. | తత్త్వసాహిత్యం | 99 |
| 8. | సాధన | 115 |
| 9. | మానవ పూర్ణత్వం (భౌతికం) | 137 |
| 10. | మానవ పూర్ణత్వం (ఆధ్యాత్మికం) | 159 |
| 11. | వేదాంత సిద్ధాంతం | 180 |
| 12. | యోగం మరియు పూర్ణత్వం | 192 |
| 13. | గీతా సందేశం | 202 |
| 14. | అమర జీవనం | 214 |


ꕥꕥꕥ

# 1. ధర్మ సమన్వయం

**పూజ్యులారా ! అన్నదమ్ములారా ! అక్క చెల్లెళ్ళారా !**

తొలుత నా భాషను క్షమించాలని మనవి చేస్తున్నా, సరిహద్దు ప్రదేశంలో ఉండే మీ కందరికీ కన్నడ అర్థమౌతుంది. అయినా నా భాష, శైలి మీకు కష్టంగా అన్పించకుండాలని భగవంతుని ప్రార్థించి, ఆ జాగరూకతతోనే మాట్లాడుతాను. తత్వవిషయంలో దేశభాషల భేదాలు అడ్డం రాకుండనీ ! ఒకే తత్త్వాన్ని తెలుసుకునే వేళ పదునాల్గు లోకాలతో కూడిన త్రిభువనాత్మకమైన అఖండ బ్రహ్మాండమే మన స్వదేశమని అర్థం కాదా ?

ఉపన్యాసం ప్రణాళికాబద్ధంగా ఉండాలనేది పెద్దలమాట. ఉపదేశం చేయగలను; నాలో యోగ్యత ఉంది అని చెప్పలేను. విశాలమైన విశ్వంలో ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవాల్సింది చాలా ఉందనే అంశాన్ని గ్రహించి, పెరిగే (ఎదిగే) విద్యార్థికి వాస్తవం తెలుస్తుంది. నిజానికి నేనూ విద్యార్థినే ! నేనొక్కణ్ణే ఎందుకు ? జాగరూకుడైన ప్రతి ఒక్క మానవుడూ జీవితాంతం విద్యార్థే ! అదీకాక, ఈ సమావేశంలో మీరంతా విద్యావంతులే ! సుమతి వాక్యం మొదలు కొని ఉపనిషన్మంత్రాల దాకా, సర్వజ్ఞ వచనాల నుండి వేదవాక్యాల దాకా అధ్యయనం చేసిన వాళ్ళూ ఉన్నారు. జిజ్ఞాసువులున్నారు. నాకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులూ, కన్నడభాష లేనిచోట పిల్లల్ని ప్రోత్సహించి నేర్పించిన భాషాసేవకులు ఉన్నారు. ఇలా విద్యావంతులైన మీరంతా యువకుణ్ణయిన నన్ను పిలిచి, నా ద్వారా ఉపన్యాసమిప్పించి సంతోషించాలనుకున్నారు. ఇది నాకొక పరీక్షగా భావిస్తున్నా. నాజ్ఞానపు స్థాయిని మీ జ్ఞానపు ఒరిపిడి రాతికి

రుద్ధి గ్రహించేందుకు ఇదొక మంచి అవకాశం. నా పరిచయం చేసేవేళ మీ అధ్యక్షులు పలికిన మాటల్లో చాలా గొప్ప గొప్ప వాక్యాలుండేవి. నేను ఆ ప్రశంసకు తగిన వాణ్ణి కాదంటే మీకు సమాధాన ముండదు. మీ ప్రేమ ఆయోగ్యతకు, విశ్వాసానికి తగిన రీతిలో నాలోంచి విషయాల్ని రాబట్టగల్గి, మిమ్మల్ని సంతోషపరిస్తే నేను ధన్యుణ్ణి !

ఆధ్యాత్మిక జీవనంలో 'దివ్యత్వం' అనేది మన దేశానికి మాత్రమే పరిమితం కాదు. ఆ దివ్యత్వాన్ని పొందడం ప్రతి మనిషికీ సాధ్యం. అయినా తత్వవిచారం అనేది మన దేశ ప్రజల జీవితంలో పడుగు పేకల్లా అల్లుకుని, రక్తగతమై ఎలా ప్రవహించిందనే అంశాన్ని తెలుసుకున్నాక, మనదేశపు మూలపురుషులు ఇక్కడ వేసిన సంస్కారపు పునాది చాలా మహత్వపూర్ణమనేది తేటతెల్లమౌతుంది. పిల్లల జీవితంలో కూడ దీని ఛాయలు కన్పిస్తాయి. మన దేశంలోని ఒక పాఠశాల విద్యార్థిని పిలిచి "నిన్న నీవు ఎందుకు పాఠశాలకు రాలేదు?" అని ప్రశ్నిస్తే "నా ఒంట్లో బాగాలేకున్నది" అంటాడు. విదేశంలో విద్యార్థి "I was not doing well" అనే జవాబిస్తాడు. ఇక్కడ ఈ పిల్లలిద్దరికీ "నా దేహం వేరు నేను వేరా" "నా దేహమే నేను" అనే స్పష్టజ్ఞానం లేకున్నా, ఆయా దేశాల సంస్కార ఛాయలు అక్కడ వ్యక్తమయ్యాయి. విశ్వంలో ఒకదేశంలో ఆధ్యాత్మిక జీవనానికి ప్రాధాన్యముండి, మరోదేశంలో భౌతిక జీవనానికి పెద్ద పీట వేసేవేళ – అన్ని దేశాల్లోనూ, అన్ని కాలాల్లోనూ అలాంటి వ్యక్తులు మనకు గోచరిస్తారు. అలాగే ఏసుక్రీస్తు పర్వతోపదేశం, పైగంబర్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరికీ స్వీకార యోగ్యాలే! అది అలా ఉండనీ !

ప్రతి మనిషిలోనూ ఉండే 'నేను, నేను' శబ్దం తెలిసిందే! అయితే ఈ 'నేను' అనేది దేహమా ? కదలకుండా నిలిచిన శవం 'నేను' అని



చెప్పవచ్చా ? అన్నప్పుడు ఈ శరీరంలో ఉండే చైతన్యం 'నేను'. దాన్ని మొదట తెలుసుకోవాలి. ఇదే తత్వబోధకు లందరి శుభసందేశం.

తత్త్వమనేది పెద్దవిపత్తులో చిక్కుకున్న వాళ్ళకు, సోమరిపోతులకు, పెద్ద పెద్ద గ్రంథాల్ని చదివిన పండితుడు, శాస్త్రి, ఆచార్యులకే అవసరం ! మనకెందుకు ? అని అనేవాళ్ళే ఎక్కువ. అయితే ఈ మాటలో సత్యం ఉందా ? చూస్తా. మాకేదీ వద్దు. సుఖం మాత్రమే చాలని భావిద్దాం. ఓ కూలివాడు రోజుకి 10 రూపాయలు సంపాదిస్తాడు. మనశ్శాంతి ఉందా అతనికి ? అడగండి. చెప్పుకోదగిన, చూపించదగిన కష్టం, దుఃఖమేదీ లేకున్నా ఏదో గజిబిజి. శాంతి 'లేదు' అంటాడు. ఎందుకు ? మనుష్య జీవనం కేవలం యాంత్రికంగా ఉండేందుకు తగనిది. సంపాదిద్దాం! చెబుదాం, తిరుగుదాం, నిద్రిద్దాం అనే మాటల్లో ఏమర్థం ఉందని అంటారు దాసులవారు. ఈ యాంత్రిక క్రియల్ని జంతువులు కూడ చేస్తున్నాయి. మానవజీవితం అంతటితో నిలిచిపోదు. నిలిచిపోరాదు. మనఃప్రాధాన్యం కల్గిన ఈ మానవ జీవనంలో ఆమనస్సు యొక్క చాపల్యం, చాంచల్యం, వ్యాపకత్వాల వల్ల అనేక సమస్యలు కల్గుతున్నాయి. వీటికి నివారణోపాయాలు కూడా ఉన్నాయి. అన్నంతమాత్రాన మనస్సు యొక్క "కోర్కెలకు" అంతమనేదుందా? 'చాలు' అనేది దేనివల్ల వుంటుంది ? దేన్ని తెలుసుకున్నాక ఇక తెలుసుకునేందుకు ఏమీ మిగలదో, పొందాల్సిందేమీ ఉండదో, ఆ ఆత్యంతిక శ్రేష్ఠ వస్తు ప్రాప్తి గురించిన ఆలోచన ఈ రోజు ఇక్కడ ప్రారంభమైన మీ 'దివ్యజ్ఞాన సమాజ'పు లక్ష్యంతో మాత్రమే సాధ్యం.

"మనస్సు చాలా శక్తివంతం. దాని ఆకారం చాలా పెద్దది". "ఆ ముని చెప్పాడు. ఆ ఋషి పలికాడు. ఆ తపస్వి పరిశోధించాడు. దాని

లోతు తెలుసుకోవాలని లోపలికి దిగితే ఆకాశంలో తారల్ని లెక్కిస్తే విశ్వమంతా నిండిన గాలి చలనాన్ని సీమలే లేని నదుల స్వేచ్ఛను విజ్ఞాన సాధకులు చూసినంతనే సుజ్ఞానంలో ఎత్తుపల్లాల్ని ఎదుర్కొని అల్లకల్లోలాన్ని రేపే ఈ మనస్సు యొక్క ఆకారాన్ని, బృహదాకారాన్ని చూడవయ్యా !" ఇలా విశ్వవాణి చెబుతోంది. అనుభవం పొందిన వాళ్ళు వర్ణించారు. మనస్సు యొక్క తత్త్వాన్ని మాత్రం తెలుసుకుంటే – ఇక ఆ వ్యక్తికి తెలియని రహస్యమంటూ ఉండదు. నిజం ! ఇంద్రియాల సామ్రాజ్యానికి రాజు మనస్సు. మన పూర్వీకులు విజ్ఞానవేత్తలు. విశేషమైన జ్ఞానం కల్గిన వాళ్ళు దీన్ని గ్రహించగల్గారు. వారు సూక్ష్మ విజ్ఞానమున్న వాళ్ళు. ప్రస్తుతం మనం సృష్టికి మూలకారణాలైన పంచభూతాల్ని పూజించకుండా బానిసలైపోయాం.

ప్రాచీనులు కూడ పంచభూతాల వల్ల ప్రయోజనాన్ని పొందేవాళ్ళు. నిజం! అయితే ఎలా ? వాటిని ఆశ్రయించి, ఉపాసించి, సఖ్యాన్ని పొంది, హక్కును పొంది లోకకల్యాణం కోసం వాటి శక్తిని మానవత్వానికి తగిన రీతిలో ఉపయోగించుకునేవారు. తత్త్వాను సంధానానికి సరిపోని స్థూల విజ్ఞానపు దుష్పరిణామం మనకు గోచరిస్తోంది. అది ఈనాటికి మాత్రమే పరిమితమైంది కాదు. ఎల్లప్పుడూ సమాజపు ఈర్ష్యలో చిక్కుకుని యుద్ధోన్ముఖమయ్యాక దాన్ని ప్రాచీనకాలపు దృష్టిలో పరికించాక, "రామాయణ, మహాభారతాలు" మమ్మల్ని హెచ్చరించాయి. రాముడిలాంటి పూర్ణవ్యక్తిత్వం అవతరించినా భౌతిక విజ్ఞానపు దురంతాల్నే ఎదురించాల్సి వచ్చింది. మొన్న మొన్న ద్వాపరాంత్య భాగంలో పరిపూర్ణస్వామి కృష్ణుడు అవతరించి వచ్చినా, అతడే సమాజపు వక్తగా లభించకున్నా, అప్పటి మానవుల స్వభావం వికృతంగా తయారయ్యాక వైజ్ఞానిక దురుపయోగమనే



దురంతం కల్గిందనే విషయం మీకెవరికి తెలియదు ? అక్కడ హెచ్చరిక కోసం మనం చూడాల్సింది కృష్ణుని భగవద్గీతనే. ఇక్కడ ఈ విషయం వస్తుందన్నపుడు ఏ ముఖంతో విజ్ఞానాన్ని దూషించడం సాధ్యమౌతుందనే విషయం గ్రహించబడి, దానికి తగ్గట్టుగా పూర్ణానుభవ దృష్ట్యా కన్పించని శుష్క వేదాంత ధోరణిలో ఏదో ఒక మైకంలో వైజ్ఞానిక ప్రగతిని ఖండించడం జరిగితే అది కేవలం ఒక అల్పత్వమే ఔతుంది. పూర్ణ పరిపక్వతా లక్షణం కాజాలదని మీ ముందు విన్నవించుకోవాలనేదే నా కోరిక. విజ్ఞానాన్ని విమర్శనాత్మకరీతిలో తగిన మట్టుకు ఉపయోగించుకొని, దాని ఆత్యంతిక సత్యమైన తత్త్వాన్ని గ్రహించేందుకు పరిశోధన పెరగాలి. అప్పుడే మనిషి ప్రగతిపథంలో సాగుతున్నాడని తెలిపినట్లవుతుంది. మనస్సు యొక్క ప్రగతి అకుంఠితం. అదే మనస్తత్త్వం – కర్తవ్యం. మనస్సు యొక్క ప్రగతి అకుంఠితమనే అంశం మీ నిత్యజీవితంలో మీ కందరికీ అర్థమౌతూనే ఉంది. ఆ మనస్సు యొక్క సృష్టిశక్తి ఒక సుందరమైన సాధనను నిర్మించుకుంది. ఒక ఆశాకిరణ మనేదే లేకుంటే – అనేకరకాల సంఘర్షణల్లో ఈ మానవుని గతి ఏమిటి ? అందువల్లనే – ఆ మనస్సు తన ప్రగతిని నిరంతరం కొనసాగించే సాధనంగా ఒక ఆశాకిరణమనే దివ్యత్వాన్ని సృష్టించుకుంది. ఆ కిరణమే రమ్యతగా మారి మన లక్ష్యం పరమోత్కృష్టం కావాలనే, ఇలా అనేక ప్రయత్నాలు చేసి మానవుడు పరిపుష్టుడై తెలియజేస్తున్నాడు. ఎంతో కొంతప్రగతిగా భావించి, చాలా రోజుల్నించి మనుష్యత్వం గురించి రకరకాలుగా ఆలోచించా! పరిశోధించా ! పరిస్థితి విషమించినపుడు విప్లవానికి బలి అయ్యా. దాని కోసమే ఒక ఉత్కంఠమైన శాంతి ఆకాంక్ష నాలో ఉద్భవించింది. ఆశాంతిని అందించాలంటే ఇంతటి గందరగోళం తప్పదు. లోలోపల ఎన్నిరకాల బుద్బుదస్థితులు పుట్టలేదు.

ఇవన్నీ అధఃపతనాన్ని అందించేవి మాలో ఉన్నాయి. ఈ వికారాలన్నింటినీ అవతలికి నెట్టి విమర్శించే శక్తి ఏది ? అది 'నేను' 'నేను' అనేది. ఈ 'నేను' నేనైతే, మరి ఆ 'నేను' ఏమిటి ? లేదా "నేనెవరు ?" అనే అన్నిరకాల నిర్దిష్టస్థితుల్ని పెద్ద పెద్ద మాటల్లో ఇదమిత్థంగా చెప్పడమేదీని పనికాదు. శుద్ధ, సత్యపూరితమైన, అనుభవోపేత, దివ్య ఆధ్యాత్మిక చింతనం, భవ్య ఆధ్యాత్మిక జీవనం – వీటి ఆవశ్యకత అధికం.

**"జన్మ ఎందుకు వచ్చింది ? ఏమేమి కార్యాలు చేసింది?**
**మిథ్యా వస్తువుల్ని కోరడానికి వచ్చిందా ? వృథాగా**
**సమయం గడిపేందుకు వచ్చిందా ? సమస్య**
**పరిష్కరించబడలేదు. శాంతి సమకూరనే లేదు. ఈ రకమైన**
**పరిశోధన కొనసాగించే వాడే ధన్యజీవి"**

అనే విశ్వవాణిలోని ఆత్మ విమర్శ ప్రతిమనిషి బ్రతుకులో ఉండాలి. అదే మానవత్వానికి ప్రథమసోపానం !

"నేను చనిపోయినా నీ కోసం రోదించేవాళ్ళని అందించు దేవా!" అంటాడో కవి. ఇక్కడ నలుగురికి ఉపయోగపడే తల్లి ఆలోచనకు సంబంధించిన నియమాల కనుగుణంగా ఉండాలనేదే కవిగారి ఆలోచన. పశుజీవనంలా ఉండరాదనేదే ఉద్దేశ్యం.

ఇక్కడ మనుష్యత్వమంటే ఏమిటి ? అనే అంశాన్ని తెలుసుకోవడం అవసరం కాదా ? స్థూలరూపురేఖల్ని పొందిన ఈ మానవ రూపం మనుష్యత్వాన్ని గ్రహించేందుకు ఉపకరించే సాధనం. చైతన్యంతో నిండిన ఒక యంత్రం మాత్రమే ఇది ! సృష్టిలో జీవన పూర్ణత్వాన్ని అందుకుని, సర్వతోముఖ వికాసపు ప్రయాణంలో పరిపుష్టతను పొందేందుకు



సాధ్యమయ్యే ఒక స్థితి కాదా ? తన లోంచి లోపలా, బయటా సుప్తమైన ఆవరణలో సూక్ష్మంగా అణిగి ఉండే అన్నింటికి సంబంధించిన విజ్ఞానపు ఉపయోగాన్ని గ్రహించడం ఎంతో అవసరం. ఈ స్థితిని సార్థకం చేసుకోవడంలో మనకు జ్ఞానం కల్గుతుంది. ఒక ముఖ్యమైన మనస్సు యొక్క ప్రధానమైన స్థితిలో దీన్ని జీర్ణించుకోవాలి. తన దేహం యొక్క స్థితి ఆ దేహపు లోపలి స్థితుల్ని, చైతన్యాలను, విశిష్ట జ్ఞానాన్ని జీర్ణం కావించుకుంటూ అలాగే అనువైన సాధనామార్గంలో పయనిస్తూ నిర్దిష్ట లక్ష్యాన్ని పొందగల్గాలి కదూ ? అదే విద్యార్థి జీవితం. దాని ప్రకారం నేనో విద్యార్థిని. ఇక్కడ బయటి వస్తు విన్యాసం, వస్తురూపాకారంలో ఉండే మూలభూతాల కలయికల ప్రమాణం, రీతులు అలాగే తనలోని క్రమం, స్థూలప్రకృతికి, తనకూ ఉండే అన్యోన్య సంబంధం, దానివల్ల కల్గే పరిణామాల్ని గ్రహించి, మూలభూతాలలో ముఖ్యమైన వాటిని ఆశ్రయించి, విశేషాల్ని తనకు తగిన రీతిలో మలచుకుని , సామరస్యాన్ని పెంచుకుని ఆంతరంగిక విజ్ఞానపు అత్యున్నతస్థితుల గురించి తెలుసుకునే విధానమే విద్యార్థి జీవనం. అలాగే నాలో నేను గ్రహిస్తూ పోయే ప్రయత్నం చేశాక భావనకు దొరికి, భాషారూపంలో నాలోంచి ఆ జ్ఞానం ప్రకటమై, మీ ఎదుట ఉపన్యాస రూపమైతే నేను ధన్యుణ్ణి. ఈ వేదిక నాకు ఒక జ్ఞానపు పాఠశాల మాత్రమే. ఇది నా ఉపదేశం కోసం ఉండే సంస్థ కాదు. అందుకే నేనో విద్యార్థిని. ఇలా తెలుసుకోవడాన్నే వేదాంతులు విద్యాభ్యాసం చేసేవ్యక్తి, విద్యార్థి జీవనం అని అంటారు. కేవలం బాహ్య విషయాల్ని గురించి సమాచారాన్ని పొందడం అపరా విద్య. తనను తాను గ్రహించే విద్య పరావిద్య అని అన్నారు పెద్దలు. ఈ నిజమైన విద్యార్థి దశ ఎంత దాకా ?

అని ఆలోచించేవేళ, మనుష్యత్వంలో పూర్ణత్వాన్ని పొందేంతవరకు అనేదే జవాబు. ఎల్లవేళలా జాగరూకుడై స్థూలసూక్ష్మ విషయాలనన్నింటినీ తెలుసుకునే ప్రయత్నం చేస్తూ ధర్మకర్మబద్ధుడై 120 సంవత్సరాలు జీవించే వేళలో సాధ్యమౌతుందని జ్ఞానులు చెప్పారు. ఈ దృష్టిలో చూస్తే ప్రజలకు మార్గదర్శనం అందించే మహాపురుషులంతా విద్యార్థులుగానే లభిస్తారు. తరచూ మమ్మల్ని హెచ్చరిస్తూ ముందుకు నడిపించేందుకు సిద్ధపురుషులు కూడా విద్యార్థి స్థితికి దిగి, నిలిచిపోతారు. ఇది మా పుణ్యం ! అలా లభించే మార్గదర్శనాన్ని గ్రహించేందుకు ప్రయత్నించేవేళ ఈనా చిన్ని బ్రతుకు యొక్క అంశాన్నే స్వీకరిస్తే తప్పేమిటి ? కేవలం 16 సంవత్సరాల ప్రాయంలో బాల్యంలో కష్టమనేదే తెలియకుండా పెరిగిన నేను, ఎలాగో బట్టలుతకడాన్ని నిలబడి చూసిన నా గురువుగారు "విజయాంధ్రా ! ఇంత చిన్న విషయం తెలియని నువ్వు తత్త్వాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నావు కదా ! అంధాను కరణంతో ఇది సాధ్యమా ? ఈ ఆకారంలో జీవం వచ్చినంతనే మానవత్వం మరుగై పోయిందా ? తన బాహ్యాభ్యంతర, స్థూలసూక్ష్మ విజ్ఞానాన్ని గ్రహిస్తూ సాగే వ్యక్తికి మాత్రమే మనుష్యత్వపు జాగృతి కల్గుతుంది. మరో రకంగా ఇది కల్గదు. నువ్వు ఒక మనుష్య ప్రాణివి" అన్నారు.

నన్ను హెచ్చరిస్తూ ఆయన నిలిచిన ఆ ఠీవి, ఆ మాటల్లోని ధ్వని,ఆ కళ్ళలోని ప్రసన్నత, సిద్ధపురుషునిలో ఉండే పూర్ణత్వాన్ని, పరిపూర్ణ మనుష్యత్వాన్ని సూచించాయి.

అన్నింటికీ మూలమైన పరమాత్మ దర్శనానికి ఇన్ని కష్టాలు పడడం ఎందుకు ? సుదీర్ఘకాలపు నియమపూరిత కఠోర జీవనపు సాధన లెందుకు? ప్రహ్లాదుడు మొదలైన వాళ్ళు బాల్యంలో కాదు, గర్భంలో ఉన్నప్పుడే



గ్రహించారట. ఇలాంటి పురాణేతిహాసాలు అనుమానానికి దారితీయడం లేదూ ? మనస్సులో కల్పన చేస్తే అర్థంకాని కొంతమంది వైశిష్ట్య పూర్ణ వ్యక్తుల విషయాన్ని ప్రస్తుతానికి పక్కన పెట్టి, పూర్వజన్మ సంస్కారం పరమాత్ముని కరుణా విశేషం అనే సమాధానాన్ని అందించి, ప్రస్తుతానికి అందరినీ అర్థం చేసుకుంటూ పోయి, పూర్ణత్వపు లక్ష్యాన్ని అందుకునే మార్గం ఉందా? అనే అంశాన్ని విశ్లేషించి, గ్రహించడంలో చాలా ఔచిత్యముంది.

ఈ ఆధ్యాత్మిక జీవనానికి అధికారులు ఎవరు ? అనేది ప్రశ్న. జాతి, మతం, పంథా, వర్ణం, ఆశ్రమం, లింగం ఈ భేదాలు వ్యక్తి యొక్క స్వీయ ఆధ్యాత్మిక జీవనానికి అడ్డుగోడలు కాజాలవు. అడ్డు గోడలు కారాదు. అదే నిజమైతే వాల్మీకి, అనసూయ మొదలగు వ్యక్తుల గొప్పతనం, ఆదర్శాలు మనకు తెలిసే అవకాశమే ఉండేది కాదు. ఇక్కడ స్వరూపదర్శనానికి కావలసిన సాధనలు అనేకం ఉన్నాయి. అవి కాలం, యుగం – వీటికి తగినట్లుగా మారతాయి అనే మాటలు విన్పిస్తూ వస్తాయి కదా ? నిజం. అయితే సత్యం అలా లేదు. ఇక్కడ ఆ మాటలు రావడానికి కారణాన్ని చెప్పేవేళ కొంచెం చేదు నిజాన్నే చెప్పాలి. సత్యాన్ని దాచనవసరం లేదు.

మనదేశంలో చాలా కాలం నుంచి, ద్వాపరయుగాంతం తర్వాత నుంచి అన్నా తప్పు లేదు. చాలా శతాబ్దాల నుండి అందాం ! తత్త్వానుభవానికి కావలసిన తత్త్వానుసంధాన సాధన తప్పిపోయి, కేవలం తర్కంతోనే తత్త్వాన్ని గ్రహించాలనే ప్రయత్నం జరిగింది. తెలుసుకోవాలనే భ్రాంతి కల్గింది. దీంతో వివిధ ధర్మాల మధ్య భిన్నాభిప్రాయం ఏర్పడింది. ఈ రకమైన తర్కశక్తి కొన్నిసార్లు గందరగోళాన్ని రేపుతూ, సత్యపరాఙ్ముఖమైన దిశగా పెరిగి, మానవజీవనానికి అధఃపతనాన్ని కల్గించే మతాంధత్వంగా

పరిణమించి, విప్లవాలు చెలరేగేందుకు తగిన వాతావరణం ఉద్భవించేట్లు చేసింది. అలాంటి స్థితిలో ధర్మతత్త్వాల విషయంలో వ్యాపించిన తప్పు కల్పనల్ని నివారించేందుకు, అప్పటి జనాల జ్ఞానస్థాయికి తగినరీతిలో, దేశకాలానుగుణంగా సత్యపు బాహ్యావరణమైన ఆచారవిచారాల్ని ఏర్పరచిన వ్యక్తులే మతాల ఆచార్యులుగా ప్రసిద్ధి చెందారు. పూర్ణత్వ లక్ష్యాన్ని ప్రత్యక్ష సాధనలో తమ జీవితంలో ఆస్వాదించి, ఆ అనుభవ వేద్యమైన జ్ఞానాన్ని, దాని మార్గాన్ని నిర్దిష్టంగా వివరించిన జ్ఞానులే ఆచార్యపురుషులు. ఒక్కో యుగంలో కేవలం 4-6 మంది మాత్రమే దొరుకుతారు. ఇదీ ప్రజల పుణ్యమే ! ఆ దృష్టితో చూస్తే ఇదివరకటి ఉపనిషన్మహర్షులు, తర్వాత అవతరించిన యోగీశ్వరుడైన శ్రీకృష్ణుడు ఆ శ్రేణిలో మనకు కన్పిస్తారు.

గత కొన్ని శతాబ్దాలుగా ఈ సత్యపథాన్ని గుర్తించి, గమ్యస్థానాన్ని చేరుకునేందుకు సాగిపోయే కొంతమంది మహాపురుషులు, ఆయాకాలాల ప్రజల క్షుద్రమనస్సుల వల్ల మనకు దక్కకుండా పోయారు. శ్రీ శంకరాచార్యుల వారంతటి మేధావిని, జన్మతః వైరాగ్యం మూర్తీభవించిన వ్యక్తిని, తపఃసంపన్నుడైన గురువుల్ని మూఢజనులు తర్కానికి దింపింది. ఆయన మేధాశక్తిని పూర్తిగా గ్రహించకుండ తన గమ్యాన్ని పూర్తిగా అందుకోనీకుండా 32 సంవత్సరాల వయస్సులోనే ప్రజానీకం శంకరాచార్యుల వారిని పోగొట్టుకుంది. ఇలాంటి ఘటనల్ని విన్నాక, రాను రాను దేహం, మనస్సు రెండూ దుర్బలంగా మారే ఈ కలికాలంలో తత్త్వాన్ని తెలుసుకోవడం సాధ్యమా? అనే సంశయం వస్తుంది కదూ ? నిజం! అయితే వీటన్నింటికి భయపడనవసరం లేదు. ఆనాడు, ఈనాడు, ఏనాడైనా బలం, బలహీనత, శాంతి, క్రాంతి, మోహం – విరక్తి, సత్యం–అసత్యం ఈ ద్వంద్వాలు, వాటి పోరాటాలు మనకు లభిస్తూనే



ఉంటాయి. త్రేతాయుగంలోనే, ధర్మకాలంలోనే రావణుడున్నాడు. అతని లోకకంట కత్వం పెరగడం వల్ల సత్యశాంతిస్థాపనకై రాములవారు అవతరించారు. అలాగే ద్వాపరయుగాంతంలోనూ దుర్యోధనుడు లాంటి దుష్టవ్యక్తి ఉన్నాడనే శ్రీకృష్ణుడు గీతోపదేశం చేశాడు. మార్గదర్శనం అలనాటి వ్యక్తులకే కాదు, ఈనాటి వ్యక్తులకు కూడ లభించినట్లే కదా ? ఈ సత్యాసత్యాల సంఘర్షణలో చివరికి శాశ్వత సత్యమే జయిస్తుంది. నశ్వర వస్తువులు జయించవు ! ఇక్కడ ఈ 'నశ్వర' అనే శబ్దం గురించి వికల్పాలు పొందడం వద్దు. 'జగత్తే నశ్వరం' అనే పూర్వీకులు చెప్పారన్న విషయం మదిలో మెదలుతుంది. నిజం. ప్రవక్తలైన పెద్దలు పలికిన మాటలు ఆయాకాలపు సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని చెప్పినవే. అలనాటి సమాజపు అల్లకల్లోలాలు, అంధవిశ్వాసాల్ని మనం గమనిస్తేనే ఆ మాటల ఉద్దేశ్యం మనకు తేటతెల్లమౌతుంది. ఆలోచించలేని, మూఢ విశ్వాసాల వ్యక్తులకు ఇది బోధపడదు. రాజకుమారుడై జన్మించి, యౌవనంలోనే విరాగిగా మారి, అరణ్యాల్లో సంచరించి, తపస్సులో తాను చవిచూచిన అనుభవ మార్గాన్ని ప్రకటించి, ప్రచారం చేసిన మహాపురుషుడు బుద్ధుడు! అతని బోధనల్ని అర్థం చేసుకోక కేవలం కర్మమోహపు స్థితిలో ఉండిపోయిన ఆనాటి ప్రజలకు. సత్యపు జాగృతిని కల్గించేందుకు "ఈ మోహం వద్దు. ఈ స్థూలం శాశ్వతం కాదు. నాశనం కల్గినది. దీనికంతా కారణమైన ఆత్మ చైతన్యమే సత్యం. దాన్ని గ్రహించాలి" అని ఉపదేశించారు. అంతేకాని ఈ జగత్తే అసత్యం అని భావం కాదు. అదే నిజమైతే ఆ అబద్ధాల సంతలో –నువ్వు నేనూ ఆ సత్యాన్ని గ్రహించడమెలా సాధ్యం ? ఎలా ? ఆలోచించండి. అక్కడ మళ్ళీ మళ్ళీ ఆయన చెప్పినమాట "అబద్ధమే" అయిన పక్షంలో అది శుష్కమైన రాద్ధాంతం.

"అబద్ధం అబద్ధమని అన్నవాళ్ళంతా అదృశ్యులై నశించారు కదయ్యా! సత్యంలోంచే వచ్చి స్వచ్ఛందంగా నిలిచి అప్పటి నుండి నిరంతరం జగత్తు విరాజిల్లుతోంది చూడవయ్యా" అన్నపుడు – కేవలం బాహ్యంలోనికి వ్యాప్తమై, అంటుకునే మనోవృత్తిని ఖండించి, ఆ రకమైన అంతర్ముఖత్వం గురించి హెచ్చరించారనే అంశాన్ని గ్రహిద్దాం. ఎందుకంటే ఆధ్యాత్మిక జీవనానికి శుద్ధమానవత్వమే పునాది. ఆయా సమయాల్లో కల్గే కల్గడానికి అవకాశమున్న కేవల వాదమోహం కాదు. ఇక్కడ మనం 'No ism is complete and end by itself. The very true essence way of through thorough practice only is the way for perfection. Prophets must be diagnised only in their way of originality of the universal truth' అనే విషయాన్ని మరువరాదు. (ఏవాదమూ, సిద్ధాంతమూ కూడ పరిపూర్ణము కాదు. నిరంతరం అభ్యాసం చేయడం యొక్క సారాంశమే పరిపూర్ణత్వం. విశ్వజనీన సత్యవిషయంలో ప్రవక్తలు సత్యానికి ఎంత దగ్గరలో ఉన్నారనే అంశాన్ని మాత్రమే పరిశీలించాలి). భారతదేశంలో కలియుగం నడుస్తోంది. వాదాల్నే గుడ్డిగా అనుకరిస్తూ వెళ్ళడం ఈ కలిలోనే సాధ్యం. భారతదేశంలో తత్త్వచింతన బుద్ధుడి నుంచే ప్రారంభమైంది – అని భావిద్దాం. అందరికీ తెలిసినట్లుగా అతడు భోగభాగ్యాల జీవితంలో తలమునకలై అన్నీ మరచిపోయి ఉండాల్సిన వ్యక్తి.

అలాకాకుండా విరాగియై అన్నిటినీ వదలి విచార స్వాతంత్ర్యంలో విశ్వసత్యాన్ని అనుభవించి అందరి సొత్తయి విరాజిల్లాడు. అయినా ఏమిటి పాపం! తర్వాత ఏం జరిగిందో మీకు తెలుసుకదా ! అతని మతాన్ని అనుసరించినవాళ్ళే అతనికి 'నాస్తికుడు' అనే బిరుదును అందించారు.



జిజ్ఞాసువు తన బాధను ఎవరితో చెప్పుకోవాలి ? ఈ ధర్మాల్ని చేతులెత్తి ఘోషించే వేళలో ఒక అస్పృశ్యుడు కూర్చున్నాడట ! శిష్యులూ ఉన్నారట! ఎవరో వచ్చి దేవుణ్ణి నీవు చూశావా ? అని అంటే దానికి ఉత్తరం మౌనమట ! దేవుడు ఉన్నాడా ? లేడా ? అనే ప్రశ్నకూ బదులు మౌనమట! ఎదురు చూసిన వాళ్ళు కాకుల్లా అరవడం మానేస్తారా ? ఆశబ్దం ఏదో ఒక రకంగా మీ చెవుల్లో చేరి సామర్థ్యాన్ని పొంది ఉండవచ్చు! ఆ కుటిల వ్యక్తుల అరుపు సూక్తిగా మారే పక్షంలో మన ఆలోచనలు చాలా నీచమైనవనే భావించాలి. ఆ శిష్యులు అడిగేవేళ, ఏర్పడిన సుభాషితాలు మీకెందుకు జ్ఞాపకానికి రాకూడదు ? ఏమేమి ఉండాలో అన్నీ ఉన్నాయి. వాటినన్నింటిని అనుభవించే సత్యమార్గం ఒకటి నాకు తెలుసు. లోకకల్యాణం కోసం దాన్ని అందరికీ ఇవ్వగలను. వీటన్నింటినీ జాగ్రత్తగా ఆలోచించజాలని జనులు దొరికినంత మట్టితో భవనాన్ని కట్టిపోతే అది వాళ్ళ సొంత ఇల్లు మాత్రమే ! పడిపోయినట్టే ! చాలా కొద్ది రోజుల్లో అపభ్రంశాల ప్రచారంతో అప్పటి ప్రజలు సత్యానికి చాలా దూరంలో ఉండిపోయారు. అందుకే మేధావులైన శంకరుల ఆలోచనా సరళి సకారణమైందిగా ఉండి ఉండాలి. వారి తర్వాత కూడ 'యద్ దృష్టం తన్నష్టం' అనేది కేవల చిత్తపు అధోగతికి చెందిన దృష్టికి అంటని కానుకల విషయంలో అన్వయిస్తుంది. శుద్ధ మనస్సుతో శుద్ధతత్త్వాన్ని పొంది, అక్కడి దార్శనిక దృశ్యాలు తపోగమ్యమైన ఆనందానుభవాలనే అంశాన్ని గ్రహించలేనివారు సాధనా విహీనులుగా మారి 'ఏముంది ? అంతా బ్రహ్మమే. మనం నిశ్చయంగా ఉంటే చాలు. ఇదంతా నశ్వరం –మొదలైన అనావశ్యక విషయాల్నే తత్త్వవాక్యాల్లో చేర్చుతూ పోయినట్లల్లా, రామానుజాచార్యుల అగాధ పరిశోధన బయటికి వెలువడితే ఆశ్చర్య

పడనవసరం లేదు. వాళ్ళ మాటల్లో చెప్పాలంటే – ప్రకృతి ద్వారా సత్యాన్ని గ్రహిస్తూ ఆ పరమాత్మ దర్శనాన్ని పొందాలనే భావన సరైనది ఎందుకు కాదు? మున్ముందు కాలం గడచినట్లంతా కర్మ పరాఙ్ముఖత్వం తాండవిస్తే కాలగర్భం యొక్క సహజత్వం మధ్వాచార్యులను ముందుకుసాగించింది. అక్కడ సాధ్యమైనంతగా ప్రకృతిని, దాని సత్యత్వాన్ని విభజించి ఇచ్చేవేళలో సహజంగా కన్పించే "వాయుజీవోత్తమ" సిద్ధాంతం వంట బట్టింది. శుద్ధమైన అర్థంలో కర్మ ప్రాధాన్యం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. ఇక్కడ మొత్తానికి జిజ్ఞాసువులమైన మనం తెలుసుకోవాల్సిందేమిటంటే – వారందరిలోని సాధనల ఏకత్వాన్ని మాత్రమే ! దాన్ని సమన్వయ దృష్టితో చూసేవేళ అంతటా నిర్వివాదంగానే గోచరిస్తుంది. అయితేనేం? అంతా ఎలాగోలా నడుస్తూనే వస్తోంది. దాంట్లోనూ దాసమార్గపు వైశిష్ట్యం కనుమరుగై మానవుని ఔదాసీన్యమే ప్రధానంగా నిలిచింది. ఇలాంటి ఔదాసీన్యమే కాయకానికి ప్రాధాన్యం అందించిన శరణపథంలోనూ కన్పిస్తుంది. దీనికంతా ఎవరు బాధ్యులు ? సాధనారహితమైన తర్కబుద్ధియే దీనికంతా కారణం అని నొక్కి వక్కాణించక తప్పదు. ఛీ! గడిచిన చర్చలా ? ఎంతదాకా మనం నచ్చచెప్పగలం? గడచిన ఇతిహాసానికి సమాధానం కూడా ఎందుకు కావాలి ? అందుకే మీ ముందు మనవి చేస్తున్నా, మనమంతా "ప్రాథమిక మానవ ఆలోచనల"కు ఎందుకు రాకూడదు ? అంటే భూతపూజకన్న మనిషి తన మూల భూతసమస్యలేమిటి ? అనే విషయాన్ని గురించి ఆలోచిస్తే అతడు ఆధ్యాత్మిక జీవనానికి అతి సమీపంలో ఉంటాడు. మిత్రులారా! 'నేను' ఈ కన్పించే 'ప్రకృతి' – వీటి 'నడుమ ఉండే సంబంధం' వీటిలో రెండింటికి ఏదైనా వైశిష్ట్యముందా ?" అది మన అనుభవం కావాలంటే స్థానం ఏది ? అని ఆలోచించి, దాన్ని అనుభవం ఉన్న వారి



నుండి పొంది సాగిపోయేవేళ ఈ ఐదు ఆలోచనలతో ప్రారంభించబడిన జీవితం ఆ సాధనారూపకాలైన పంచప్రాణాల మార్గంలో నడిస్తే అదే దివ్యమైన ఆధ్యాత్మిక జీవితం.

కొన్ని శతాబ్దాల నుండి వైరాగ్యపు సరళిలో ప్రజలు జీవన సౌందర్యపు సత్యత్వాన్ని 'మిధ్యగా' మార్చినారు. ఆ విచారధార ఆధ్యాత్మిక జీవనంపై ఒక నిర్లక్ష్యాన్ని కల్గించింది. నిజం ! అలాగే కేవలం భౌతికజీవనానికి, కామపూరితమైన బ్రతుకునే ఆలింగనం చేసుకున్న ఇప్పటి మనుషులు నవనాగరికతలో మనం ముందుకు సాగుతున్నామనే ఒక ఠీవిని పొందింది. ఇది ఒక దురదృష్టకరమైన ఘటన.

అందుకే ఇక్కడ మొట్టమొదట అందరికీ నమ్మకాన్ని అందించాలి. నాయనా ! నీవు ఆస్వాదించే సౌందర్యపు సత్యత్వాన్ని నిందించటం ఆధ్యాత్మికత యొక్క లక్ష్యం కాదు.

వేదాంతం మీకు వేద్యం కావడానికి, దాన్ని ఆస్వాదించడానికి అవకాశం ఉంది. వేద్యం కాదగిన దాన్ని అనుభవానికి తెచ్చే సాధనాన్ని అందించి, గమ్యస్థానమైన ఆనందాన్ని అందించే వేళ – అంతమనేది ముఖ్యమైన సత్యస్వరూపాన్ని పొందింది. ఆ వేదాంత శబ్దపు భావన! అన్నా ! ఇకనైనా నీకు అవసరం లేదా ? అలాంటప్పుడు ఏ తండ్రి అయినా వద్దు అని ఎందుకంటాడు ? సమస్య, సాధన రెండింటినీ అతని ముందు ఉంచుదాం. 'దారుఢ్యం కల్గిన బలోపేత కాయ' మిది! యువకుని మాంసఖండం ఎలా ఎగురుతుందని ! ఎందుకు వదులుతాడు. చెవులు రిక్కించి విను ! ఇది వేదాంతపు పిలుపు నీకు! ఆ కాయం నిష్క్రమించిందెందుకు ! తెలుసా ! కీర్తి గుడిని కట్టి, స్ఫూర్తి శంఖం

ఊదినాను. ఆహా! నిజానికి ఉత్సాహం ఎలా చిమ్ముతుంది. అయితే ఇది జరిగే వేళ వ్రతనియమాల క్రమంలో ... పరమాత్ముని పూజించేందుకు ఒకటుంది చూడు ! అన్న వేళ భయం లేదు. నిరాశ ఆవరించకుంటే సౌందర్యానుభవం తప్పకుంటే వ్రతాలు, నియమాలు ఇవేవీ దెయ్యాలుగా అనిపించవు. కర్మభ్రష్టులు కాకండి అనే అంశాన్నే తెలిపేవేళ చివరకు మీరు మీరు బ్రతికినారనే అర్థం స్ఫురిస్తూనే "దేహోదేవాలయః ప్రోక్తః జీవోదేవః సనాతనః" అంటే – చివరకు మీకు అర్థమయ్యే జీవుణ్ణయినా కనీసం దేవుడిగా భావించండి. దానికాశ్రయమైన మీదేహమే దేవాలయమని గ్రహించి ముందుకు సాగండి. ఇదంతా మన ప్రాచీనుల మాట. ఇలా అన్నంత మాత్రాన మా వాళ్ళ నమ్మకమొక్కటే చాలదు. ఆధ్యాత్మిక విషయంలో అనుభవం కావాలి. అనుభవం వల్లనే ఆనందం. అది సాధన లేకుండా ఎలా సాధ్యమౌతుంది ? అందుకనే, జీవవిద్యాసాధన చాలా అవసరం. అంటే – ఆత్మదర్శన ప్రాప్తి ! దానికి మహర్షులు బ్రహ్మజ్ఞాని లక్షణాల్ని వర్ణించేవేళ – 'ఆత్మరతః, ఆత్మక్రీడః' అంటూ 'బ్రహ్మ విద్యావరిష్ఠః ' ఎవరు? అని అడిగితే స్పష్టంగా 'ఆత్మరతః ఆత్మక్రీడః క్రియావాన్" అని బదులు ఇచ్చారు. ఉద్ఘోషించారు. వారు మాకు ఆదర్శపురుషులు! ఆచార్య పురుషులు. ఇపుడు చూడండి తత్వవేత్తలమైన మాతడాఖా! ఆధునికుడైన ఏ వ్యక్తి మమ్మల్ని నిరాకరించగల్గుతాడు ? నపుంసకత్వానికి వేదాంతంలో చోటేలేదు. మన ఆధ్యాత్మిక జీవితం ధీరపురుషుల సొత్తు ! దీనికి చరిత్రలో సాక్ష్యాలెన్నో ఉన్నాయి. సకల భోగభాగ్యాలతో తులతూగుతూ సమర్థమైన రాజ్యపాలనను సాగిస్తూనే ఆస్థానాన్ని బ్రహ్మజిజ్ఞాసాకేంద్రంగా మార్చి ఆత్మరతుడై, ఆత్మక్రీడుడై, క్రియావంతుడై జీవించిన జనక మహారాజు మొదలైన వాళ్ళను స్మరించి, ఉండిపోతే ఇంకేమీ వద్దని అనిపిస్తుంది.



అపుడు సామరస్య జీవనం సంపూర్ణమౌతుంది. పరమాత్మ పూర్ణుడు కదా? అన్నపుడు దీన్నంతా సంపాదించింది మేమూ – మీరేనా ? అలాంటపుడు దీన్ని నిరాకరించే స్వాతంత్ర్యం ఎవరికుంది? 'ఓం పూర్ణాయ నమః' అని పలికే మనమే కాంతికి ప్రతిబంబమైన ఈ ప్రపంచాన్ని నిందిస్తే నడుస్తుందా? అతని నుంచి వెలువడిందన్నపుడు – ఇది చెత్త చెదారం కాదు. అతని ద్వారా రూపుదిద్దుకున్న రమ్యత్వం అని అర్థం. అందుకే, "సృష్టిసర్వం, సత్య సర్వం సంపూజనీయం" అని అంటాను. ఆధ్యాత్మిక సాధకుడు తన జీవిత ప్రయాణంలో రెండు నిత్యాలతో సంప్రీతుడౌతాడు. ఈ రెండు నిత్యాలంటే ఏమిటి ? ఔను లోపలికి వెళ్ళగల్గితే తెలుస్తుంది. రసమయజగత్తు రాగప్రాధాన్యంలో ఆనందమయ సత్యపూర్ణత్వ ప్రధానంగా ఇలా సాగుతూ ఆనందాన్ని మనం అనుభవించిన వేళ – ఒకటి అప్రధాన నిత్యం. రెండోది మహానిత్యం. ఈ వైశిష్ట్యం అనుభవైక గమ్యం.

ఒక పరిపక్వ దృష్టితో చూస్తే సాధనారహిత గ్రంథ విశాలతను తెలుసుకోలేని జ్ఞానపు గుడ్డితనంతో వేదాంతం నెపంతో జీవితమే ఒక రాద్ధాంతమయింది కదూ ? ఈ విమర్శనాత్మక జ్ఞానపు వెలుగులో సంకుచిత భావాల్ని ఛేదించి మానవ ధర్మాన్ని విశ్వవ్యాప్తమయ్యే స్థాయిలో గ్రహించడం సాధ్యంకాదా ? అది అవసరం కాదా ? విశ్వమానవ సౌభ్రాతృత్వం సాధ్యం కావాలంటే – అది ఎలా ? దాన్ని ఏ దృష్టితో చూడాలి ? "తనలాగే వేరేవాళ్ళు ! వారిలో నీతో సమానంగా చూడు" అని ఓ కవి అన్నాడు. దీని భావం ఏమి ? నీలో కొరతలు, అపభ్రంశాలు ఉంటే – అవే వేరేవాళ్ళలోనూ ఉన్నాయని భావమా ? ఎన్నటికీ కాదు. ఇదే భావం వచ్చేట్లుగా "నిన్ను వేరే వాళ్ళు ఎలా గౌరవించాలని భావిస్తావో, నీవు కూడా వేరేవాళ్ళను అలాగే చూడు" అని ఏసుక్రీస్తు చెప్పాడు. ఎవరేని

కానివ్వండి ! తన అందచందాలు, పరిశుభ్రత, శాంతి, సుఖం ఇవన్నీ వద్దని భావిస్తాడా? ఇక్కడ ఆ అనుభవం కల్గిన వారి మాటల రహస్యమేమిటి? “జగత్తును ఒక అద్దంలా ఉంచుకో” అని జ్ఞానులు చెబుతారు. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకునే వేళ తన వేషం, ఆభరణాలు, ముఖభంగిమల్ని సరిదిద్దుకోవడం సాధ్యమౌతుంది. అద్దంలో దుమ్ము ధూళి పేరుకుని, ప్రతిబింబం స్పష్టంగా కనిపించకుంటే – దాన్ని పరిశుభ్రం చేసుకోవడం సుసాధ్యం. అంతేకాదు చాలా అవసరం కూడా. గుణోత్కర్షను గమనించే మనిషి వేరే వాళ్ళ లోని ఉత్తమ గుణాల్ని తాను అలవరచుకుంటాడు.

విశ్లేషణతో, విమర్శతో తనలోని సత్యగుణాలు వేరే వాళ్ళలో వికసించలేదని తెలిశాక వారిని సరిదిద్దడం చాలా అవసరం. ఈ శుద్ధమైన సంయమబద్ధత, నియమబద్ధతల్ని స్థిరీకరించడంలో జరిగే ప్రయత్నపు నేపథ్యమే ‘తనలాగే పరుల’న్నమాట ఉద్దేశం. దీని ద్వారానే విశ్వమానవ సౌభ్రాతృత్వం సాధ్యం. ఇది స్థూల విమర్శ మాత్రమే ! ఇక్కడ సాధకుడు జగత్తునే అనుభవ పాఠశాలగా భావిస్తాడు. అతను గమనిస్తాడు. ప్రతి ఒక్క కదలికను “క్ష కిరణదృష్టి”తో పరికిస్తాడు. సృష్టిలోని ఇతర వస్తువుల రహస్యాల్ని తెలుసుకునేందుకు దోహదం చేసే నేత్రాన్ని అతడు పొందుతాడు. అపుడు మేం అతణ్ణి ‘కవి’ అని అంటాం. అదలా ఉండనీ ! ఇక మానవత్వంలో మూగగానే విరజిమ్మ గల్గిన ఈ భావవీచికలన్నీ ఏమిటి ? ఇవన్నీ మాకు ఉపదేశాన్ని అందిస్తాయి. ఇలాగే 'Faciology' పరిశోధన ప్రారంభం. దానికి ఆనుకునే 'Psychology' ఉంటుంది. ఒక అంశాన్ని తెలుసుకునేందుకు బయలుదేరితే – అన్నిటినీ గ్రహించగల్గే సుందరత సృష్టిలోని సహజభాగమై గోచరిస్తుంది. అందరూ ఈ పాఠశాలలోని



విద్యార్థులు కావాలి. ఒక మామూలు ఉపాధ్యాయుడు తరగతికి ఏ ఒక్క విద్యార్థి గైరుహాజరు కారాదని భావిస్తాడు. అలాంటప్పుడు సర్వసౌందర్యాధిపతి అయిన స్వామి తన సంతానంలో ఎవరినీ మినహాయించడు. అదే ఆయన వాంఛ. అతడు దానికి సహకరిస్తూనే ఉన్నాడు. రసాన్ని మరిగించే వేళలో అనేక మిశ్రమాల పొగ విషపూరితమై వెలువడినట్లు మనకు గోచరించే విషకషాయాలు, ఆటంకాలు ఆరాధనకు అడ్డుగా ఉండజాలవు. అందువల్లనే ప్రయత్నవాదానికి, పౌరుషవాదానికి ప్రాధాన్యపు స్థానం లభిస్తుందే తప్ప, సోమరితనం, విధివాదం, నైరాశ్యవాదం లాంటి ఇప్పటివాదాలకు అవకాశమే లేదు. ఇక్కడ మనం తలచుకోవాల్సిం దేమిటంటే – మన సంస్కృతి పౌరుషవాదం పునాదిపై నిర్మించబడింది. “ఓ వేదాంతులారా ! అనే ఒక కుత్సిత వాదానికి ఖడ్గమో అన్నట్లుగా శుద్ధమైన, పరిపూర్ణరీతిలో వెలువడిన ఆసందేశముంది ! మన భారత దేశపు ఆర్ష సంస్కృతి ఏమంటుందో తెలుసా ? “ధీరాస్తేషాం సుఖం శాశ్వతం నేతరేషాం” చూడండి ఎంత చక్కటి సందేశం !

ఔను. ఇలాంటి పునాదిపైననే సమాజం నిర్మించబడింది. అందుకే ధర్మమే కవచం అనే ధ్వని వినిపిస్తోంది. అయితేనేం ? Man is a social animal అంటూ సులభంగా మనం చెప్పవచ్చు. అయితే జంతువు కాదని తెలుసుకుంటే ఇలా జరుగుతుంది. There in we have to say man is the obejct of the sweetness of the creation అని అంటే ఎంత చక్కగా ఉంటుంది. అలా అయితేనే మహర్షుల భవిష్యత్ దృష్టి అర్థమౌతుంది. సమాజం అంటే ఏమిటో నిజంగా గ్రహిస్తే మనం సమాజాన్ని నిందించడం తగ్గిపోతుంది. ఇక్కడ దానికి కవచమైన ధర్మం ఏది ? దాని రూపం. వేషభూషణాలేమి? వీటన్నిటిని మనం ముందుగా

అర్థం చేసుకోవాలి. ఇది లేకుండడం వల్లనే ధర్మవిషయంలో ఎన్నో దుర్ఘటనలు సమాజంలో జరుగుతున్నాయి. ధర్మానికి రెండు శరీరాలు ! ఫలాలు కూడా రెండు. పక్షాతీతశరీరం; పక్షాతీతమైన సేవ ! లేదా సహజమనండి! ధర్మమనేది చాలా పెద్దవిషయం కావడంతో ఇలా పొదుపుకథలా మారితే క్షమించండి ! దానికి వేషధారణ ఒక స్వభావం కాదా? మీ ఆలోచనల్లో స్పష్టతనే ఒక కానుకగా మీరు అర్పిస్తే, దాని నుండి ఫలితం రానే వస్తుంది.

ఆ రెండు శరీరాలని అన్నాం కదా ? "ధారణాత్ ధర్మః". నిరంతరం తన లోపలి తత్త్వాన్ని ఏదైతే ధరించిందో అదే ధర్మం యొక్క లోపలి శరీరం! అప్రయత్నంగా ఈ కార్యం జరుగుతుంటే అదే ధర్మపు అంతః శరీరం. ఇది మానవులందరి సొత్తు కాదు. మొత్తం సృష్టికి సంబంధించిన సొమ్ము. దాన్ని గ్రహించి అనుభవించే చైతన్యాన్ని పుణికి పుచ్చుకోవడం వల్ల ఇది మానవధర్మం అనిపించు కుంది. అదే విశ్వమానవధర్మం ! దాన్ని ప్రయత్నపూర్వకంగా తెలుసుకుని అనుభవించే దిశలో సాగుతూ, దాని ఫలితమైన ఆనందాన్ని అనుభవించి, కాలానుగుణంగా సర్వదేశాల్లోనూ ప్రవక్తలు పంచుతూనే వచ్చారు. ఇది ధర్మం యొక్క అంతఃశరీరం ! అందుకే మానవులందరూ పాటించదగిన విశ్వమానవ ధర్మం అది!

ఇక దాని బాహ్య శరీరమేమిటి ? అది అందరికీ తెలిసిందే కదా! ఎందుకు తెలియదు ! మనమంతా ప్రవర్తించుచున్నది బాహ్య శరీరంతోనే! మన బుద్ధి దాన్ని మాత్రమే ధర్మమని భావించి బద్ధమై ఉండడం వల్లనే ఈ సంకటం కల్గింది ! స్థూలదేహానికి దేశపు స్థూలంలో భాషయొక్క స్థూలవస్తువు విజ్ఞానానికి అనుగుణంగా, భావన యొక్క స్థూలత్వానికి



తగినట్లుగా, ఆచార వ్యవహారాలు, ప్రవర్తన, వ్రతనియమాల రూపురేఖలు వేషభాషలు మున్నగు వైవిధ్యం మనం పలికే ధర్మం యొక్క బాహ్యశరీరం. దీని ప్రయోజనం దేశకాలబద్ధ మైనది. వివిధ నియమబద్ధం. ప్రకృతిలోని మార్పులనన్నింటినీ అంగీకరించక తప్పదనేటంత వైవిధ్యం. నిజమైన ధర్మాన్ని గ్రహించి అంటే తత్త్వపుస్థాయిలో అనే అంశాన్ని మనం జ్ఞాపకంలో పెట్టుకోవాలి. మానవజీవనపు గమ్యస్థానాన్ని చేరుకోవడంలో స్వానుభవమే పరమశ్రేష్ఠమనేదే ప్రమాణం ! అబ్బబ్బా ! ఇక్కడో పెద్ద సంశయం మమ్మల్ని వదులుతుందా ? అదీ కాకుండా మనందరి శక్తి వినియోగింపబడడం అక్కడే ! శాస్త్రప్రమాణముంది ! ఇక్కడ శాస్త్రం అంటే ఏమిటి ? మళ్ళీ వివేచించాల్సి వచ్చింది కదా ! నిజమైన సాధకుడు ఇపుడు చెప్పినట్లుగా ధర్మపు లోపలి శరీరమనే దివ్యవిద్యా సాధనా శస్త్రంతో సంశయాలనన్నింటినీ ఛేదించుకుంటూ, శోధించుకుంటూ పోయేవేళ మనోమయత్వం విజ్ఞానమయం అయ్యేవేళ అన్నిరకాల అద్భుతానుభవాలు లోకకళ్యాణాన్ని కోరి శబ్దరూపంగా వెలువడితే – అది నిజంగా శాస్త్రమే! తత్త్వ జిజ్ఞాసువులకు ఇదే శాస్త్రం ! ఉపనిషత్తు ! భగవద్గీత ! ఇవన్నీ ఆ స్థాయికి చెందిన నిజమైన శాస్త్రాలు. అయితేనేం ? అక్కడ గందరగోళం తప్పిందా ! అయితే ఆ గందరగోళం మనదే ! శాస్త్రాలది కాదు. అవి రహస్యాన్ని లక్ష్యంగా చేయబోతున్న మహతీవీణలు ! అక్కడ మనం చేస్తున్నది మాత్రం దాడి ! గందరగోళాలే ! దీనికి కారణం సహనం లేకపోవడం ఆలోచించే శక్తిలేకపోవడం. ఆధ్యాత్మికమైన పిపాస నీలో లేకపోవడం !

శుద్ధంగా మనం నిశ్చయించినట్లుగా అనుభవం ఉన్న వ్యక్తి యొక్క అనుభవ వ్యాపకత్వమే శాస్త్రమని, అందులో చెప్పబడిన శుద్ధమైన సాధనను

వదిలిపెట్టి ఆ మహామంత్రాల్ని కేవలం శబ్దకోశం ఆధారంగా అర్థం చేసుకోగలమా ? అది ఆ వ్యాఖ్యానం ఒక జాలంగా అల్లుకుంటుంది. “అన్నాద్ భవంతి భూతాని” అనే వేళ “అన్నం లోంచి భూతం పుడుతుంది” అని చెబితే ఆ అన్నం, గోధుమలు, కొర్రలు మొదలైన ధాన్యాలతో తయారైంది మాత్రమే అయితే, సృష్టికే మూలకారణాలైన భూతాలు మీ అన్నంలోంచి పుట్టడం సాధ్యమా ? అన్న ప్రశ్న కల్గుతుంది. అక్కడ ‘అన్నం’ అంటే ఏమిటి ? ‘అశనగతః ప్రాణః ఓం’ అనేదే సూత్రం కదా ! మామూలుగా అశనంతో పాటు ప్రాణుడున్నాడు. “ప్రాణుడు అశనధారి అయి ఉన్నాడు” అనే అంశం గోచరిస్తుంది. ఇలా చెప్పబడిన ఈ రోజు మీ అశనం అదైతే తిని తిని త్రేన్చే వాళ్ళు చస్తున్నారెందుకు ? చూడండి! ఇలా పరిశోధన ప్రారంభమైనట్లయితే ఆధ్యాత్మిక పిపాస యొక్క జ్ఞానం సార్థకమౌతుంది. అన్నపుడు ఏదో వచ్చి ఉండాలి ? అదేమై ఉంటుంది? అదేమై  ఉండాలి ? అని శోధించడం ప్రారంభిస్తాడు. ఇలాంటి వ్యక్తికి శాస్త్రాభ్యాసం అటంకం కాజాలదు. ఇక్కడ కొంచెం ఆలోచిద్దాం ! ఆ మహానుభావులు దేన్ని అశనం అని అన్నారు ? ఇక్కడ ‘వాయుజీవోత్తమ’ అనే వాక్యం కూడా గమనించదగిందే! జీవునికి ఉత్తముడైన వాడు వాయువు. నోటిని, ముక్కును మూసివేసి ఉంచితే ఓ మనిషి ఎంతసేపు బ్రతుకుతాడు? దీనివల్ల తెలిసేదేమిటి? ప్రాణం దేహంలో ఉన్నప్పుడు వాయువు యొక్క ఆధారంపై నడుస్తోందని అర్థం కదా ? ఇదిలా ఉన్నపుడు జీవంలేని ఓ దేహానికి గాలిని ఎక్కిస్తే ప్రాణం వస్తుందా ? ఎన్నటికీ సాధ్యంకాదు కదా? భూగర్భంపై పడేముందు శిశువు తల్లి గర్భంలో కోశంతో కప్పబడిన వేళ– బయటి వాయువుతో నిమిత్తం లేకుండా ప్రాణాలతో ఉండలేదా? ఇక్కడ భౌతికశాస్త్రజ్ఞుల మాటను మనం మరచిపోయేట్లు లేదు. గాలిలో



ఆమ్లజని లేకుంటే అలాంటి కలుషితమైన గాలిని పీల్చిన వేళ – మనకు అనారోగ్యం కల్గుతుంది. కొన్నిసార్లు ప్రాణాలు కూడా పోతాయి. ఈ ప్రాణవాయువునే (Oxygen) ప్రాణాధార మన్నపుడు గర్భంలోని శిశువుకు ఆ అశనం ఎలా లభిస్తుంది. ఇక్కడ స్ఫురిస్తుంది. బాహ్యావాయు సంపర్కం లేకుండానే మన దేహంలో తనంతటతానే నిండుకొని ఉన్న వాయువు యొక్క ఘర్షణ. (గతాగతి) ఇది సహజంగా ఉండేదే – ఎక్కడ ? ఈ ప్రాణుడి అశనం – శక్తిసారం ఉత్పన్నమౌతుంది. అదే ఆమ్లజని. అది తయారుకాబడి, దాని ఆధారంగా శిశు శరీరంలో ప్రాణాన్ని అందించింది. ఇలా సహజమైన ఈ క్రమం మనకు అర్థమేకాకుండ తప్పిపోయింది ? దీనికి సృష్టి యొక్క స్థూలసంపర్కం కూడా కారణం. స్వయంకృతాపరాధం కూడాను ! తల్లిగర్భంలోంచి బయటికి వచ్చి నేలపై పడే వేళ లోపల ఉండే ప్రాణాధారమైన వాయువు విశాల ప్రపంచంలోని మహాచైతన్యమైన వాయువు చేత ఆకర్షింపబడింది. స్వజాతి కావడంతో ఇది సుసాధ్యమైంది. ఎపుడైతే లోపలి గాలి ఓసారి బయటికి వచ్చిందో, మళ్ళీ బయటి దాన్ని లోపలికి చేర్చుకోవాల్సి ఉండేది. ఇలా, వాయువు బహిర్ వ్యాపకత్వాన్ని పొందిన వేళలో బ్రహ్మచర్యంలో ఉన్న దృష్టి, మనస్సులు దాంతో బహిర్ముఖమై మొత్తం ప్రపంచమంతటా వ్యాపించాయి. తర్వాత, ఆహారాది దోషాలతో పుట్టిన వాత, పిత్త, కఫాది దోషాల వల్ల ఆ ప్రాణవాయువు యొక్క నిజమైన నాభి నుండి బ్రహ్మరంధ్రం దాకా ఉన్న ప్రయాణమార్గం దుర్గమంగా తయారైంది. వ్యాపకత్వం పెచ్చు పెరిగి, మనస్సు బలహీనమై, ఆ అంతర్ముఖత్వం బ్రహ్మచర్యం అసాధ్యమైపోతూ పూర్తిగా విస్మరించి, కేవలం బయటి వాయుమండలం ఆధారంగా నిలబడి శ్వాస ప్రశ్వాసల్లో బాహ్య వాయువులోని మాలిన్యాలు లోపలికి వస్తాయి. అలాగే బయటికి

వదిలేవేళ – ప్రతిసారి శుద్ధప్రాణుని అశనాంశాన్ని కొంచెంకొంచెంగా పోగొట్టుకుంటూ ఆ నష్టాన్ని భర్తీ చేసేందుకు ఉత్పత్తి మార్గాన్ని మరిచిపోవడంవల్ల మళ్ళీ ఆ మార్గం తెలియకపోవడం వల్ల చివరికి చావు ముంచుకు వస్తుంది. ఇక్కడ చావు అంటే ఏమిటో ఆలోచించాల్సి ఉంది.

'చనిపోయింది' అంటారు కదా ! ఆ 'సత్' అంటే ఏమిటి ? మనలో పరమాత్మ అందించిన ఈశ్వరాంశమే ఆ 'సత్'. ఇక్కడ –

**"ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి**

**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా"** అనే భగవద్గీతా వాణిని మనం సరిగ్గా అర్థం చేసుకుంటేనే ఈశ్వరాంశమంటే ఏమిటి ? అనేది దొరుకుతుంది. చనిపోయిన వ్యక్తి ఎదమీద చేయి పెట్టండి. అక్కడ గుండె దడలేదు. ఇక్కడ దడ దడ ఉందా ? ఆ దడదడ కొట్టుకోవడం ఈ దేహయంత్రంలో ఆడే చైతన్యం ఉండేంతదాకా ఈ దేహయంత్రం ఆడుతుంది. హృదయాన్ని తన కేంద్రంగా మార్చుకుని, దేహంలో ఆటలాడుతూ ఆడించే ఆ చైతన్యం బయటికి వెళ్ళిపోతే మన ఆటలన్నీ నిలచిపోతాయి. అపుడే అయ్యో ప్రాణం పోయింది. 'సత్' పోయింది. గాలినాయనా ! నిరంతరం వదులుతా ! అనే హాహాకారం విన్పిస్తుంది కదూ! ఇది తమాషా కాదు. ముఖ్యంగా పిల్లలు దీన్ని గ్రహించాలి. వాళ్ళే కదా రేపటి ఋషి సంతాన సామ్రాజ్యపు జీవజ్యోతులు! అదలా ఉండనీ! ఇక్కడ 'ఈశ్వర' శబ్దం ప్రాణాన్ని ఆధారం చేసుకుని ఉండే ఆ వాయు మహాశయునికే వాడబడిందని అర్థమౌతోంది. అందుకే ఉపనిషత్కారులు "నమస్తే వాయో! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి" అన్నారు. అంతమాత్రాన్న మనం నోటితో "వాయు దేవా ! నమస్కారం" అంటే ఏమౌతుంది ? దేహంలో అతణ్ణి – ఆ వాయువును గతాగతిలో ఉంచి **అశనోత్పత్తి గావించి, ప్రాణునికి అందించి, అక్కడ ప్రాణుణ్ణి మున్ముందు జీవుడు, ఆత్మ – మొదలైన అంశాలుగా తెలుసుకోవడం సాధ్యమౌతుంది.** ఇది కేవలం నోటిమాటలతో సాధ్యమయ్యేది కాదు. దాన్నే ప్రాచీనులు బ్రహ్మ విద్య, యోగ విద్య మొదలైన పేర్లతో వర్ణించారు. అది ప్రత్యక్ష గురువు నుండే ఉపదేశింపబడాలని కూడ తెలియజేశారు కదా ? ఇలా మనం విశ్లేషణ చేసే వేళ – తత్త్వవివేచన ఎలా ఉందో చూడండి. దీనివల్ల సాధారణంగా, ధర్మగ్రంథాల్ని, తత్త్వ గ్రంథాల్ని ఎలా చదవాలో తెలుసుకోవాలని తెలుస్తుంది కదూ! నవ్వులాట కైనా సరే ! విమర్శ అనేదిలేకుంటే, ధర్మానికి బాహ్య శరీరం అయిన ఆచార విచారాల్ని కూడ ఎలా తెలుసుకోగల్గుతాం? దీనికో నిదర్శనం ఒక నిష్ఠావంతుడైన మహమ్మదీయుణ్ణి ఓ ప్రశ్న అడిగా ! మీలో సహజమైన స్నానపద్ధతి ఎందుకు లేదు ?' అని అతడు అన్నాడు. "శుక్రవారం నమాజు చేసేందుకు చాలా ముఖ్యమైన దినం. ఆ రోజు మాత్రం తప్పనిసరిగా స్నానం చేయాలనే నియమం ఉంది. నీళ్ళు వ్యర్థంగా ఖర్చు చేయరాదు. అలా చేస్తే పాపం వస్తుందని మా ఖురాన్‌లో రాశారు" అన్నాడు. పాపం ! దీనికి ధర్మగ్రంథం ఎలా బాధ్యత వహిస్తుంది ? అరబ్ దేశపు ఎడారుల్లో నీరు దొరకదు. త్రాగడానికి మాత్రం దొరికితే చాలు. ఎలాగో బ్రతకవచ్చు. జలక్రీడ పాపం అని చెప్పి ఉండవచ్చు.



తుంగభద్రాతీరంలో నివసించే ఇతనికి ఆ నిర్ణయం వర్తిస్తుందా? అనే ఆలోచన అక్కరలేదా ? ఇదో పెద్దకారణమని కాదు. ఇలాంటి ఆలోచనాశక్తి యొక్క దోషం వల్లనే అన్ని ధర్మాల, మతాల తత్త్వచింతనలో పొరపాట్లు దొర్లేందుకు కారణమైంది. విభిన్నమైన విప్లవాలు, గందరగోళాలు

అన్ని మతాల్లో, అన్ని కాలాల్లోనూ కన్పిస్తాయి. అధికమైన తత్త్వసాధనానుభవం కొరవడి, బుద్ధిస్థాయినే భక్తియని భావిస్తూ పోయేవేళ ఆయా ఉపాస్యదైవాల విగ్రహాలపై దృఢ నిష్ఠ లేకుండా, ఉగ్రులైన కొందరి కబంధ హస్తాల్లో చిక్కుకుని కొందరు సాహిత్యంతో దానికో రాజకీయరూపురేఖల్ని సృష్టించి జనాల్ని రెచ్చగొట్టే మాటలు ఎన్ని పలకడం లేదీ సమాజంలో !

**"హరుడు మేలో హరిమేలో, హరిహర భక్తులే సాక్షి"** అని ఒక వ్యక్తి అన్నాడు. మరో వ్యక్తి తానే చెప్పిన "దేవుడొక్కడు. నామాట అనేకం" అనే వాక్యాన్ని విస్మరించి–

**"నారాయణ గీరాయణ అనేవాళ్ళ నేనెరుగను.**
**నిన్ను వదలి అన్యుల కొలిచేవాళ్ళ ముక్కుల్ని**
**చీల్చి చెండాడే దాకా నా కోపం చల్లారదయ్యా!"**

అనే ఆవేశంతో పలికాడు. ఇలాంటి దురంతాలు బోలెడన్ని మనకు గోచరిస్తాయి. సౌభ్రాతృత్వం, సౌభ్రాతృత్వమనే మాటను పదే పదే వల్లించే క్రైస్తవ మత ప్రచారకులు కూడా ఉన్నారు. వీళ్ళేమైనా తక్కువ రాద్ధాంతం చేశారా ? వాళ్ళ దగ్గర ఉండే సత్యమేమిటి ? మళ్ళీ మళ్ళీ "మీ రాముడు దేవుడుకాదు. అతని భార్యను రావణుడు అపహరించాడు. మనిషిని దేవుడని పూజిస్తున్నారు" ఇలాంటి ఉద్రేకపూరితమైన వాక్యాల్ని అంటారు. నా చిన్నతనంలో జరిగిన ఘటన! ఒక ఫాదర్ అరుస్తూంటే "మీ దేవుడెవరు?" అని ప్రశ్నించా పాపం ! అతనికి నిజంగా ఆ విషయం తెలియదు. అతనిలో తన ధర్మానికి సంబంధించిన అభ్యాసం కూడ ఏపాటిది ? మిషన్ వాళ్ళు అందించే డబ్బుకు తగినట్లుగా మతం మార్పిడి చేసేందుకు అతని నైపుణ్యం పనికివస్తుంది. 'బె బె బె అంటూనే 'జీసస్' అన్నాడు.



రక్తం మరుగుతోంది. వెంటనే మళ్లీ అడిగా... అయ్యా ! తన చావును సొంతగా పొందజాలని వ్యక్తిని, తల నుండి పాదాలదాకా మేకులు కొట్టబడిన వ్యక్తిని మీరు దేవుడని పిలిచినట్లయితే – ఆదర్శపురుషుడు శ్రీరాముడు దేవుడెందుకు కాదు ? అపుడేం చేస్తాడు? పలాయన మంత్రం పఠించాడు. అందువల్ల దీన్ని ఎవరూ గంభీరంగా తీసుకోవద్దు. "ఏసు" అంటే నాకేం అగౌరవం అనే భావన లేదు. దుష్టుడైన ఫాదర్‌కు నేనిచ్చిన ఉత్తరం మాత్రమే అది ! ఇది ఒక ఆలాపమౌతుంది! మొత్తానికి జిజ్ఞాసువులంతా ఇలాంటి చిక్కుముడుల్ని విడదీసి, విషయమోహాలకు దూరంగా ఉంటూ సత్యశోధన చేయాలనేదే నా ప్రార్థన. పాత, కొత్తల మేలు కలయికతో ఆనందం రావాలి. ఆ ఆనందాన్ని అందించే అభ్యాసాన్ని మనం చేపట్టాలి.

మనందరం తత్త్వాకాంక్షులమంతే ! అందుకే విశ్వవాణి అందించే సలహా అద్భుతంగా ఉంటుంది కదూ !

**"ఊరిదారి తెలియని వారిని దారి తెలియక తిరిగే వారిని దారి ఏదని అడగడం ఎందుకు ? దారి చెప్పలేదని నిందించడం ఎందుకు? ఆక్షణమే అంతా వదలకుండా జ్ఞానమే కాని చెడుమాటలతో మనిషిని దుఃఖపరచడం ఎందుకు ?**

అందుకే మనమంతా కుబుసం తీసిన పాములం అవుదాం! వేరేవాళ్ళను కరవడానికి కాదు ! అంధ సంప్రదాయాల, ఆచార విచారాల భారం సత్యదూరమే అయితే – ఎంత కావాలో అంతమటుకు మాత్రమే తీసి నిలిచిపోదాం ! అంటే అపుడు మన లక్ష్యమార్గం సులభమౌతుంది. చక్కగా తెలిసికొని స్వాతంత్ర్యంలో తత్త్వస్వాతంత్ర్యాన్ని పొందుదాం ! మనకు

విశ్వంలో ఇదివరకే పుట్టి, కనుమరుగైన మతప్రవక్తల రహస్యమేమిటో తేటతెల్లమౌతుంది. అలాగే కొంచెం బైబిల్ గురించి ఆలోచిద్దాం. మహాపురుషుడు "ఏసుప్రభువు" నిరూపించిన తత్వవాక్యాలు ముత్యాల్లాంటివి. అవి మాత్రమే తత్త్వ బద్ధమైనవి. "మీ కళ్ళు ఒకటికానీ, అపుడు మీ శరీర మంతా కాంతివంతం ఔతుంది" ఇదేమిటి ? ఇది మన కనుబొమల మధ్యలో ఉంచే దృష్టికాదా ? "ద్వారం తెరచుకుంటుంది. చూడు కన్పిస్తుంది. అడుగు ఇస్తుంది" దీని అర్థం ఏమిటి ? మీలోని వాయువుతో బ్రహ్మరంధ్రానికి ద్వారం, జ్ఞానదృష్టి తెరచుకుంటుంది. ఇలాంటి బైబిల్ బోధ ఎవరికి వద్దని అనిపిస్తుంది. అయితే సహిష్ణుతతో చదివే వాళ్ళెవరు ? అలాగే ఖురాన్ ఏం చెబుతుందో తెలుసుకుందాం. "పై స్థానంలో నిలబడి పిలు ! ఆ శబ్దం దేవలోకానికి చేరుతుంది. "ఇక్కడ పై స్థానం అంటే ఏమిటి ? బయట స్థానం కాదు; వాళ్ళలా వర్ణించింది మనదేహంలోనిపై భాగం. అంటే మీ బ్రహ్మస్థానం అనండి ! బ్రహ్మరంధ్ర మనండి. అదే మీ యోగవిద్య. అక్కడ గమ్యస్థానం కావడంతో భిన్నాభిప్రాయానికి తావెక్కడిది ? ఆలోచించండి. ఇలా విమర్శాత్మక దృష్టితో చూశాక, **వీరశైవుల షట్‌స్థలాలే మీ యోగశాస్త్రంలోని షట్‌చక్రాలు.** బుద్ధుని ఆర్యాష్టాంగం, జైనుల్లోని జన అష్టాంగాలే మీ అష్టాంగ యుక్త యోగం.

ఇలా ఆత్మదర్శనం కోసం ఏకైక సాధనమైన తత్వసాధన గురించి జగత్తులోని జ్ఞానులంతా చెప్పింది ఒకటే అనిపిస్తుంది. ధర్మపు బాహ్య శరీరం మాత్రం వైవిధ్యంలో ఉండవచ్చు. దాన్ని పక్కకు నెట్టి తత్వజిజ్ఞాసువులైన వ్యక్తులు వేరే మార్గం లేకుండా ఆ విద్యనే సమాశ్రయించి సాధించడం తప్ప వేరే దారి లేదు. ఇది కూడ అనుభవం ఉన్న వాళ్ళ



మాట ! "స్వర్గానికి వెళ్ళే దారి చాలా ఇరుకు. కార్యం అతికఠినం. ఆ మార్గంలో పయనించే వాళ్ళు చాలా కొద్ది మంది మాత్రమే" అనే బైబిల్ వాక్యానికి, తత్వసాధనా మార్గం కత్తిమీద సామువంటిదని అర్థం. మోక్షానికి అదే ఏకైక మార్గం ! అని కఠోపనిషత్తు చెబుతుంది. ఈ రెండు వాక్యాలకు పెద్దగా వ్యత్యాసమేమీ లేదు. ఆ అనుభవజ్ఞుల మాటలు ఆదేశాలు మనకు అనుసరణ యోగ్యం కాదని సంశయం కల్గితే – దాని ఫలితం "సంశయాత్మా వినశ్యతి" అనే శ్రీ కృష్ణుని గీతావాక్యమే! దీనికెవరు బాధ్యులు?

ఇలాంటి బ్రహ్మవిద్య ఎవరి నుంచి లభించినా, స్వీకరించి, దాన్ని భక్తితో సాధిస్తూ సాగితేనే జ్ఞానం సంప్రాప్తిస్తుంది. ఇక్కడ జాతులు, మతాలు, మార్గాల సంఘర్షణ అనవసరం. అందుకేనేమో ప్రాచీనకాలంలో శుకుడు మొదలైన వాళ్ళు జనుల దగ్గరికే వచ్చారు. అదలా ఉండనీ "ఆత్మదేకులం? జీవునిదేకులం ? తత్వ పంచేంద్రియాల కులమేదయ్యా ?" అని కనకదాసు మమ్మల్ని హెచ్చరించాడు. సత్యజిజ్ఞాసువులు ఆ రోజు అదే చెప్పారు. ఈ రోజూ అదే చెబుతున్నారు. ఆ జ్ఞానం లేని భ్రాంతియుతులైన జనులు జ్ఞానుల వాక్యాలకు కువ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఇది సహజమే కదా! వాళ్ళ కుంది జవాబు

**"కనకదాసుణ్ణి కదిలించవద్దు కదిలించి చిక్కులో పడిపోవద్దు"** ఈ మాట కనకదాసు విషయంలోనే కాదు, అనుభవం కల్గిన జ్ఞానులందరికీ అన్వయిస్తుంది.

చివరిగా, మనం అన్ని మతాలను ఒక విహంగ దృష్టితో చూసి, సమన్వయ పరచుకుని ఏ నిర్ణయానికి వచ్చాం ?" మనందరి శరీరాల్లో ఉండే ప్రాణస్వరూపం ఒక్కటే ! అన్నపుడు, అతనికి లభించాల్సిన మోక్షమూ

ఒక్కటే ! అలాగే ఆ మోక్షప్రాప్తికి ఉండే సాధనం కూడా ఒక్కటే ! అనేకం కాదు. ఇక్కడ 'ఇంకా చాలా మార్గాలున్నాయనే వారికి ఇంతే చెప్పాలి.

"నాయనా ! ఉదయించే సూర్యుణ్ణి చూడాలంటే పూర్వాభిముఖంగా ఉండాల్సిందే. అలాకాదని నీవు పైకి ముఖం చేసుకుని నిలబడితే, మధ్యాహ్నపు మార్తాండుణ్ణి చూడగలవా ? తలపగిలేను. చావు కల్గేను. పశ్చిమాభిముఖంగా నిలబడితే అస్తమించే సూర్యుణ్ణి చూడగలవు. అంతేకాని ఉదయ సూర్యుని దర్శనానందాన్ని పొందలేవు". మోక్షసాధన విషయంలో కూడా ఇలాగే! అని గ్రహించాలి.

ప్రాచీనకాలంలో వారికి తత్వసాధనకు సంబంధించిన చర్చ ఇంత కష్టమనిపించేది కాదు. కారణం ఏమిటి ? జ్ఞాననేత్రాన్ని పొందేందుకు ఉపకరించే 'ఉపనయన' సంస్కారాన్ని బాల్యంలోనే అందించి, గురుకులాలకు పంపించే వాళ్ళు. అక్కడ తన బ్రహ్మవిద్యాసాధన చేస్తూ ప్రాపంచిక జీవనానికి కావలసిన వేరే విద్యలను అభ్యసించి యోగ్యుడనిపించుకునే అర్హతను పొంది బయటికి వచ్చేవాళ్ళు. సంసారి కావడం కన్న మొదలే దేశసంచారం చేసి ప్రాపంచి కానుభవం పొందాల్సి ఉన్నది. అంటే వారికి కర్మ, తత్వం రెండు సులభంగా లభ్యమయ్యేవి. ఇపుడు ఏమేమో అయిందని నిట్టూర్పు విడవడమే కర్తవ్యమని భావించకుండా మళ్ళీ జాగృతుల మౌదాం. అంతేకాదు. ఆ సంస్కృతిని అలవరచుకుందాం. అయ్యో! మా వల్ల ఔతుందా ? అనే దైన్యం అవసరం లేదు.

**"నేను బాలుడనయ్యా! బాల్యమున్నది నాలోన నాదు లక్ష్యమ్ము పెద్దది నా అడుగు మాత్రం చిన్నది"** అనే విశ్వవాణి పరమసత్యం. అయినా తరువాతి పంక్తులైన



**"ఆటంకాలను అధిగమించి అందలాలను అందుకొన్నవేళ జీవితమే ధన్యం దేవ దేవా!"**

అనే విశ్వవాణి కూడా పరమసత్యం. ఇదే మన భావన. సిద్ధయోగుల కృపను పొంది, ఉపదేశాన్ని గడించి, సాధిస్తూ చాలా కాలం బ్రతికి బట్టకట్టండి.

**"రోగార్జనపు బాధ రవ్వంత రాకుండ నిన్ను చూడక మునుపు నేను చనిపోకుండ కనికరింపుము దేవదేవా"** అన్న విశ్వవాణి ప్రకారం భువి నుండి బ్రహ్మలోకం దాకా మన ప్రయాణం సాగాలి. లక్ష్యాన్ని మనం అందుకోగల్గాలి. ఆత్మదర్శనం కావాలి. దానికి పరమాత్మ కృప ఉండాలి.

ఈ లక్ష్యాన్ని అందుకోవడంలో నా బంధువుల్లో, పిన్నలు, పెద్దలు అందరూ నాకు సద్బుద్ధిని ప్రసాదింతురుగాక ! పరమాత్మ కూడ సద్బుద్ధిని అందించుగాక ! మానవజాతిలోని అంధకారాన్ని నిర్మూలించి, దివ్యజ్ఞానాన్ని దయచేయాలని పరమాత్మను ప్రార్థిస్తూ అంజలి ఘటిస్తున్నా.

**"విశ్వమనే ప్రణతిలో జీవనజ్యోతులు వెలుగుతున్నాయి. ఆత్మ ప్రకాశంలో నీకు నేనిచ్చిన దంతా స్వీకరించి తృప్తుడవు కమ్ము దేవదేవా"** అని మనం అందరం ఆత్మనివేదన చేద్దాం

**ఓం శాంతిః శాంతిః శాంతిః ఓం**

❋❋❋

## ౨. ధర్మసభ ఉద్ఘాటన

ఇది 'ధర్మసభ' – ధర్మం అంటూనే ఎవరికి భయంకరంగా కన్పించరాదు. ఔద్ధత్యం, ఔదాసీన్యం రాకూడదు. ముక్తహృదయంతో, స్వరూపవికాసం కోసం, తప్పక అనుసరించాల్సిన సరళసుందర మార్గం. ఇది మానవ మార్గం అనే స్పష్టమైన ఆలోచన రానీ !

దేవుణ్ణి చూపించేందుకు సరైన ప్రదేశానికి తీసుకువెళ్ళేందుకు "స్వరూపం" అనేది నిరంతరం అనుసరించే సూటిమార్గం. ఊర్ధ్వలోక గమనం కల్గిన జీవనానికి దారి 'ధర్మం'. ఈ రకమైన ఆలోచన రావాలి. దీన్నే మునులు, ప్రవక్తలు, ఆచార్యులు, శరణులు, దాసులు విశ్లేషించి వివరించారని గ్రహించు. ఆ ఏకైక సన్మార్గంలో నడుస్తూ మీ ముందు చెప్పదలచుకున్నా. "ధర్మం" ఇది విశ్వమానవ ధర్మం అని...

మనిషి జ్ఞానంతో తృప్తుడు కాజాలడు. చింతనం యొక్క ఒక్కొక్క కోణం, ఆచారం యొక్క ఏకపక్షీయ వ్యాప్తి – ఇవి మానవుడి సమగ్రమైన పూర్ణతకు పనికిరావు. సమతౌల్యం లేని ఆచార విచారాలు, విప్లవాలు చాలా అపాయకరమైనవి. మనిషి పూర్ణ జీవనానుభవాన్ని పొందాలి. ఈ దిశలో ఆదికాలం నుండి పురోగమిస్తూ వచ్చాం. 'తాను' ధరించిన – అంటే "స్వరూపాన్ని ధరించిన 'ధర్మ' మార్గంలోనే వెళ్లాలి. అలా వెళ్లగల్గినపుడే లక్ష్యాన్ని అందుకోగల్గుతాడు. ఈ జిజ్ఞాస ప్రారంభమయ్యాక, పూర్ణ జీవనా కాంక్షి దేనికి ప్రాధాన్యం ఇస్తాడు? వ్యక్తమా ? అవ్యక్తమా ? అనే ప్రశ్న ఉదయిస్తుంది కదూ! ఈ విషయంలో ఒక్కోదాన్ని గురించి చాలా



గందరగోళముంది. ఇక్కడ కొంచెం లోపలికి ప్రవేశిస్తే దాని పొడవు, వెడల్పు తెలుస్తుంది. ధర్మానికి రెండు శరీరాలు. ఒకటి బాహ్యాచార వ్యాప్తి. ఇంకొకటి అంతరాచార స్థితి. బాహ్యాచార వ్యాప్తి అనేది తరతరాలుగా, కాలానుగుణంగా, దేశానుగుణంగా మారుతూనే వచ్చింది. అదే ప్రగతి అని మన చరిత్ర చాటి చెబుతోంది కదూ !ఇదే చారిత్రాత్మకంగా మనకు తెలుస్తున్న విభిన్నమతాల ఆలోచనా ధోరణి. ఇక్కడ ఓ వచనం అందిస్తున్నా.

**"ఏ వాదం కూడా తనకుతానే అంతిమం కాదు! అన్ని వాదాల సారమెరిగిన తత్త్వమొకటే ముఖ్యమైన గురి ! ఆ తత్త్వ పథాన్ని చూడవయ్యా!"** అంటుంది విశ్వవాణి. కన్పించే విశ్వం, కన్పించని అదృశ్యశక్తి – వీటిని గురించి ఆలోచిస్తే – విజ్ఞానమయకోశం సాధన ద్వారా లభిస్తుందనీ, విహారంవల్ల లభించే ప్రసాద రూపమైన ప్రజ్ఞ ప్రకాశించగా, నిజమైన జ్ఞానం లభిస్తుందనీ భావం. వ్యక్తం (కన్పించే జగత్తు) అనేది అవ్యక్తం ఆధారంగానే రూపుదిద్దుకుంది. చలనవలనంలో చిక్కుకుని సుందరంగా అభివ్యక్తమౌతోంది. ఈ వ్యక్తద్వారమే "తాను" అనబడే అవ్యక్తప్రవేశానికి వాకిలి. ఆ వ్యక్తం అంటే అన్నిరకాల రూపాలతో కన్పించే సంపత్తు. ఈ అవ్యక్తం అంటే – సకల సంపదల లోపల ఉండే సూత్రం. ఈ రెండింటి కలయిక చాలా అవసరం. ఆ స్థితిలో స్థితమై, చలితమై అంటే స్థిరంగానూ చలనాత్మకంగానూ ఉంటూ ప్రవహించి అనంతంగా పడుగుపేకల్లా అల్లుకుపోయిన ఆ "ఆనందమే మనిషితనం". మొత్తానికి వ్యక్త అవ్యక్తానుభవాల ఆనందానికి కారణం ఆ పరమాత్మ. ఇలాంటి ఒక మహావర్తులం (వృత్తం) ఉంది. "పూర్ణజీవనానికి ప్రాధాన్యమున్న

"ప్రసాదం"గా చూడండి. ఇలాంటి ఒక దివ్యజీవనం లభించాలంటే మనలోని సమస్త శక్తియుక్తుల సమన్వయం జరగాలి. అవన్నీ కలసి పోవడమే యోగం. అలా కాకుండా దేన్నో గురించి భక్తి ప్రదర్శించడం. దేన్ని గురించో ఆలోచించడం పొట్ట నింపుకునేందుకు చేసే స్థూలకర్మ వీటన్నిటికి "యోగం" అనే శబ్దాన్ని తగిలించి చెప్పడం తప్పు.

అలా అయితే ఏమిటి ? ''యోగం'', ''ఆనందం'' ఇవి సంప్రాప్తించాలంటే శరీరం, మనస్సు, ప్రాధాన్యం – వీటి సమన్వయ స్థితికి "సూత్రధారి అయిన ప్రాణుడే" సహకారి. అతణ్ణి ఆశ్రయించి, సాధిస్తూ శాంతిగా సాగిపోతేనే సాధ్యం! ఇదే సర్వమానవ కల్యాణకారి ధర్మం అనేది అనుభవజ్ఞుల అభిప్రాయం. ఈ అమృతవిద్యను పొంది, సరళసుందర జీవితం గడుపుతూ అందరిలోనూ ఉండే "ఆనందాన్ని" పొందాలి.

జ్ఞానక్రియల సామాన్యమైన, సమానమై సమన్వయంతో సర్వశక్తియుక్తులందించే సూత్రధారి అయిన ప్రాణుని ఆశ్రయించి, సాధకుడై లభించే 'యోగం' ద్వారా పొందే ఆనంద'మే తానై, వ్యక్తావ్యక్త కారణుడైన పరమాత్మకు సర్వసమర్పణ ద్వారా ముడుపును చెల్లించడమే పూర్ణజీవనం.

**శుభం, భద్రం, శివం ఓం శాంతిః అచ్యుతార్పణమస్తు.**



# 3. మనస్సు

**అన్నదమ్ములారా ! అక్క చెల్లెళ్ళారా !**

ఈ రోజు నాకో సులువైన పని చెప్పారు. విషయమనేది చాల ఘనమైనది. అత్యవసరం. తెలుసుకోవాల్సిన విషయం కూడా. అపుడే అనుకున్నాం ! అన్నిటికీ కారణమైన ఆ మనస్సు మనలో ఒక ప్రధానమైన అవస్థలో ఉంది. మనస్సు యొక్క మార్గం, చలనం, గమ్యస్థానాల్ని తెలుసుకోగల్గిన ఒక పద్ధతి ద్వారా ప్రాకృతిక రూపాన్ని గ్రహించి మనుష్యులు సంతోషించారు. ఇది సాధ్యం కాకున్నా అలా అయిందని చెబుతూ వచ్చాం. నిజంగా మనుష్యత్వాన్ని సంపాదించ గోరే వారు మొట్టమొదట ఆ మనస్సును, దాని యొక్క వివిధ రూపురేఖల గురించి తెలుసుకుని అంటే అనుభవించి ముందుకు సాగాలి. అపుడే మనుష్యత్వం సార్థకమౌతుంది. నిజంగా చెప్పాలంటే – ఇది మనలో మనం చేసే ఒక పరిశోధన అని చెప్పవచ్చు. దీని ఆవశ్యకత గురించి, గొప్పతనం గురించి భగవాన్ దత్తాత్రేయులు సుందరంగా సెలవిచ్చారు.

**"మనోతీతం మనస్సర్వం మనోవైవిశ్వతోముఖం**
**మనోవై గగనాకారం నమనః పరమార్థతః"**

ఇది అతీతమైనది. ఇది సర్వస్వం. విశ్వతోముఖం. గగనాకారంగా విశాలంగా వ్యాపించింది. ఈ మనస్సును వదిలివేస్తే పరమార్థం సాధ్యం కాదు.

ఈ రోజు చాలా మటుకు 'గీతాసందేశం' గురించి మాట్లాడాలనే సూచన ఉన్నది. అయితే ఇక్కడ సమాజం ముఖ్యమైనవారు ఆ విషయాన్ని

అనేక వ్యాఖ్యలద్వారా తెలుసుకునే అవకాశం ఉండవచ్చు. సాధ్యమైనంతవరకు మనం ఆ దిశలో శ్రమించి, నిర్దిష్ట సందేశం కోసం వీరిక్తై ఎదురు చూడవచ్చు. ఈ 'abstract subject' అంటే – నా మాటల్లో ఘనమైన విషయాలని చెప్పగలను. జటిలమని చెప్పలేను. ఈ మనస్సు గురించే మాట్లాడాలన్న నిర్ణయం ముందుకు వచ్చింది.

దత్తాత్రేయులే అంత గొప్పగా వర్ణించాక మనకు దాన్ని తెలుసుకోవడం సాధ్యమా ? ఈ ప్రశ్నతో ఆగిపోవాల్సిన అవసరం లేదు. అది విశాలమైందని అంటే – తెలుసుకోజాలని విషయమని కాదు. తెలుసుకోదగిందనే అర్థం. అందుకే నేను దీన్ని ఒక సులభమైన పనిగా వర్ణించాను. అందులో నా సరాగ ప్రవృత్తి ఒక పటిష్టమైన ఆధారాన్ని అందించింది. దాన్నే శ్రీ దత్తస్వామి మాటల్లో వివరిస్తా.

**గురుప్రజ్ఞా ప్రసాదేన**
**మూర్ఖో వా యది పండితః**
**యస్తు సంబుధ్యతే తత్త్వం**
**విరక్తో భవసాగరాత్.**

సద్గురువు యొక్క ప్రజ్ఞ అనే ప్రసాదం ఎవరికి లభిస్తుందో అలాంటి వ్యక్తికి తత్త్వం బోధపడుతుంది. అతడు భవసాగరం నుండి విముక్తుడౌతాడు. అలాంటి జ్ఞానం పొంది నేనెందుకు నలుగురికి పంచరాదు ? తెలుసుకుంటే పోయే వ్యక్తికి, దాంతో ఆట ఆడడం నిజంగా సులభమౌతుంది. అంతేకాదు. సుందరం కూడా !

మనస్సు అందరిలో నిండి ఉంది. ఇది సంకుచితము కాదు. ఇది పెద్ద ఆకారం కల్గినది. ఆకార, వికారాలతో వ్యవహరించగల్గే ఒక చైతన్యమని



ప్రస్తుతానికి గ్రహించుదాం. దీనికి ఓ ఆకృతిని అందించడం సాధ్యమా? సీసాలో పెట్టిన నీటిని చూద్దాం. ఆకారాన్ని మనం ఇచ్చామా ? దానికే ఉందా ?రెండూ నిజాలే. ఆశ్రయ స్థానాన్ని అనుసరించి, వస్తువుతో కలసిపోయే శక్తి దాని ఆకారం. అంటే ఒక నిర్దిష్టమైన ఆకృతి. మాకు అర్థమయ్యే ఒక జడపదార్థపు ఆకృతిని దానికి అందించి, మనం ఇచ్చిన ఆకారమని భావిస్తాం. ఈ పోలిక ఇక్కడికే ఆగిపోదు. ఆది మూలమైనదాన్ని, దాని ఘనతను ఇలాంటి సంపర్కంలో మనం గ్రహించడం సుసాధ్యం. చూడండి. పంచభూతాలతో తయారైన పాత్ర – దాంట్లోని చైతన్యం, ఆ చేతన యొక్క వివిధత్వం – ఈ అన్నిటికీ, వ్యక్తానికి, అవ్యక్తానికి మూలమైనది చైతన్యం – దాని పూర్ణమైన స్వరూపాన్ని ఒక పోలిక ద్వారా తెలుసుకునేందుకు అవకాశముంది. దీనికోసం అనేక వివరాలవసర మౌతాయి. అదలా ఉండనీ ! ముఖ్య విషయానికి వద్దాం. సూక్ష్మంగా తెలుసుకుంటూ పోయినట్లయితే ఏదో ఒక జడపదార్థంలోని నైసర్గికమైన స్వభావాన్ని గమనించాలి. అపుడు ఆ వస్తువు మనకు అర్థమౌతుంది. రాయి ఇసుకగా మారుతుంది. మట్టి చెదలుగా మారుతుంది. ఇలా సూక్ష్మంగా తత్వానికి కావలసిందిదే!

**"స్థూలపు లోతే సూక్ష్మం. జడం యొక్క చైతన్యమే జాగృతి. ఘటంలోనే ఆకాశం అణిగి ఉంది. రహస్యాన్ని గ్రహించి ఘటశుద్ధి కల్గి ఉండే వాడే కష్టమైన విషయాలను అవగాహన చేసుకోగల్గుతాడు" అని విశ్వవాణి చాటుతోంది.**

దేన్ని గురించో తర్కవితర్కం చేసి తలచెడగొట్టుకునేందుకు ఇదేమీ రాజకీయపు విషయం కాదు. సందేహాలు వద్దు. ఎక్కణ్ణుంచి మొదలు పెట్టామో అక్కణ్ణుంచి మన లక్ష్యాన్ని చేరేదాకా శాంతంగా ఉంటే మాత్రం

విషయాలు తేటతెల్లమౌతాయి. తమాషాగా చెబుతుంటారు చూడండి. వేదాంతం ఎలా ఉండాలో తెలుసా ?

అది తలలో ఉంది. నోటికి వస్తుంది. పొట్టలో ఉంది అని చెబుతుంటారు. మొట్టమొదట వేదాంతం అనేది జిజ్ఞాసువుల నెత్తికెక్కాలి. మన తలకాయ కాస్త స్వచ్ఛంగా ఉండాలి. ఆ దిశలో పయనించే వాళ్ళ నెత్తి కెక్కితే అది వాళ్ళకు అర్థం అయినట్లే ! అంటే అది స్పష్టమైన రీతిలో అర్థం అయిందన్నమాట ! ఇక మరోవిషయం. ఆ భావం అనుభావమై, స్వయంభావమై, స్వభావంగా మారితే మాత్రం ఆ వేదాంతం స్థారకమౌతుంది. ఇక పొట్ట విషయానికి వస్తే – మలజీవన స్థితి కన్పిస్తుంది. వేదాంతపు సంబరంలోనో, లేదా పుణ్యతిథి మొదలైన భ్రమల్లోనో బాగా తిని, త్రేన్చి ఆయా అనుభవజీవుల విషయంలో మాట్లాడుతూ, పొట్ట సవరించుకుంటూ ఎక్కడో పడి ఉన్నంత మాత్రాన అది వేదాంతం వచ్చినట్లు కాదు. ఉండే బుద్ధి కూడ బంజరు భూమిలా మారినట్లే ! అలా కాకూడదనే విషయం మరువకండి. దీనికోసం ముఖ్యంగా జిజ్ఞాసువుల కుతూహలం, వక్తల అనుభవపూర్ణమైన విచక్షణాశక్తి – ఈ రెండింటి కలయిక చాలా అవసరం. వాక్కు, దానికి సాధనమైన నాలుక ఈ విషయంలో అసమంజసాలు కాకుండడం వల్ల ఒక ఉదాహరణ మీకు ఇస్తున్నాను. నా మాటల్లో అది ఒక సహజరీతి – సాధారణరీతి. అంటే అది సహజసిద్ధం. సరళసుందరమైన రీతిలో మన అనుభవాల్ని వివరించే పద్ధతి అంటాను. నా ప్రభువులు నాకర్థమయ్యే రీతిలో నాకు దయచేసిన, నాలుకకు సంబంధించిన మూడు రకాల ఉపయోగాలివి–

1. దేవత్వం – పితృత్వం – మాతృత్వం – ఈస్థితి గర్భితం.



2. మంత్రి – మిత్రుడు – పత్ని – ఈ స్థితి గర్భితం.
3. ఆసురీత్వం – లోభిత్వం – సర్వవ్యభిచారి.

ఇవేమిటి ? మొదటిది. మాత్సర్యం లేకుండా దేవాత్మ సంబంధంతో, కొడుకు బాగోగులు చూసే తండ్రిలా, మమతలు కురిపించే తల్లిలా దాని మాటలు ఉంటాయి. నాలుకకు ఆధిభూత శబ్దం ఆకాశతత్వం నుండి వచ్చే శబ్దం. అక్కడికి చేరాక ఘర్షణకు గురై ఆత్మ యొక్క ఒక నిర్దిష్ట స్థితికి సంబంధించిన ఆలోచనల ఔన్నత్యాన్ని స్మరించి మాట్లాడితేనే నాలుక యొక్క ఉపయోగం మనకు పూర్తిగా లభించినట్లవుతుంది. జీవనగతికి అంగీకరించదగిన వాక్కుకు, అనుభవ పూరిత ప్రవర్తనకు అయినంత వరకు శుద్ధ సంయోగాన్నే, అందించి, మధ్యలో కల్గే గర్వాన్ని వదలి, ఆ వాక్కు, ప్రవర్తనల్ని కలుపుతూ మాట్లాడాలి.

ఇది నిజమైన అనుభవపు మాట. దీనికే వేదాంతానుభవపు వాణి అంటారు. ఇది వచ్చే వేళలోనే తల నిండా అనుభవాన్ని అందించి, రసంగా క్రిందికి దిగి, హృదయమంతా నిండి, నోటిలోంచి బయటికి వస్తుంది. నిజంగా అందరి హృదయాలు నిండిపోతాయి. ఇది ప్రప్రథమమైన ఉపయోగం.

రెండోది – రాజుకు మంత్రిలా, సాధకునికి మిత్రుడిలా, సంసారంలో భర్తకు తగ్గ భార్యలా నాలుక మనకు ఉపయోగపడాలి. తమ బంధువులతో జిజ్ఞాసువులకు అత్యవసరమైన కర్మాసక్తి ప్రధానమైన వాక్యాల్ని అందించాలి. వారి కర్తవ్య వ్యవస్థను తెలుసుకోవడం, దానికి తగ్గ ప్రోత్సాహం ఇవ్వడం. దానికి సంబంధించిన తన అనుభవాల్ని అందించడం.

ఇక మూడోది. ఒకే మాటలో చెబుతాను. "వేశ్యవద్దకు పోవు వ్యక్తి శూలానికి ఎక్కించబడినట్లు నాలుక యొక్క నీచత్వం నిలువకుంటే చావే గతి చూడు". వేరే విషయాల్లో అంటే కర్మమోక్షాలు కాకుండా వేరే విషయాల్లో నాలుక యొక్క దురుపయోగం జరిగితే – దానిలక్ష్యం మరణం.

ఉత్తమమైన నాలుకను మనం దురుపయోగం చేయరాదు. కేవలం మాట్లాడ్డానికే కాదు ఈ నాలుక ఉండేది! మాటమౌనమై, మనస్సు మోక్షమార్గానికి వెళ్లే వేళలోనూ, అక్కడ సోమపానం, అమృతపాన స్థితులు ఉంటాయి. ఆస్థితిలోనూ దీని సహకారం చాలా అవసరం. ఇది అనుభవైక వేద్యం. నిరంతరం జాగరూకత కల్గనీ! లేకుంటే గురువు కోపం ఉండనే ఉంది. దాని ఉపయోగం, వారి ఆదేశం అనుగుణంగానే బాల్యం నుంచి నా జీవితంలో కొనసాగుతోంది. జన్మ సంస్కారం, గురుకవచం, వచనాలు ఇవన్నీ నన్ను ఆ రీతిలో నడిపించాయి.

ఇపుడు విషయం'విషయం' అనే దౌర్బల్యం విజృంభిస్తే – అది దౌర్భాగ్యమనిపించింది. ఈ మాటలు అంటే – నా మాటలు మాత్రమే కాదు. ఆ మాటల్ని మోస్తూ నిలిచి ఉన్న ఘనీభూత శక్తులు (Not only the words but also the weight and value) ఇవన్నీ – మీ విషయం దానికి సంబంధించిన వివిధ ప్రయోగాలు – వాటికి తగిన ఫలం – వీటన్నిటి జ్ఞానం మీకు పరమావశ్యకం. అంటే ఇక్కడ మీకేమర్థమౌతోంది ? ఏం తెలియాలి తెలుసా ? ఆ మనస్సు శుద్ధమైన రీతిలో ఉండి, శాంతంగా ఉన్నవేళ దాని గమనం (పరుగు). అదే వాక్కుగా మారితే – దాని ప్రభావం ఎలా ఉంటుంది ? దాని వల్ల జరిగే కల్యాణమేమిటి ? లోకకల్యాణ మేది ? లేకుంటే ఎంతో హాని ! ఇపుడు ఈ విషయం మీకు బోధపడినట్లే !



అంటే ఏమిటి ? వాగింద్రియంలో చిక్కుకున్న మనస్సు ఏ ఏ అంశాల్ని అలవరచుకోవాలి ? ఏ రీతిలో సదుపయోగం జరిగితే మనస్సులో ఒక భాగం విశ్వంలోని అఖండ మనస్సులతో కలిసి ఉపకరించినట్లవుతుంది? అనే అంశాన్ని సోదాహరణంగా మనం తెలుసుకున్నట్లయింది కదూ ! object of it in one aspect hereby concluded and thus we can come to the very subject and it's various objects కదా!

ఆరోహణ, అవరోహణ అనే రెండు క్రమాల్ని మనం వింటూ వచ్చాం కదా ! ఆ అవరోహణం కేవలం జ్ఞానులు – జ్ఞానులు మాత్రమే కలిసిన వేళ ! వారి నిర్ణయము చాలనిపించి, ఆలోచన స్వల్పంగా ఉండడం వల్ల ఆక్రమం సరిపోతుంది. మాకు, మీకు ఆరోహణ క్రమమే ఉత్తమం. అంతేకాదు. అదే కావాలి !

మనస్సు మనిషిలో మాత్రమే ఉంది. వేరే చోట లేదనడం వాడుక. అయితే అనుభవజ్ఞుల నిర్ణయం, వారి జీవన నిర్మాణాన్ని పరిశీలిస్తే అలా అనిపించదు. అంతటా, జీవులందరిలో సుప్తస్థితిలోనో, అప్రధానంగా, లేదా ప్రధానంగా ఉండనే ఉంది. పశువృత్తిలో పక్షి, జింక మొదలైన వాటిలో తాత్వికంగా 'మనస్సు' ఉండదు. అయితే ఒక సూక్ష్మరూపంలో ఉండనే ఉంది. ప్రాచీన మున్యాశ్రమాలలో వీటి ఆట – పాటల్ని మనం చూడగలం. ఇప్పటికీ మా గురువుగారు కుటీరం నుండి ఒక్కోసారి దూరంగా వెళ్ళి కొన్ని గంటలు కాలం గడపటాన్ని వెంటబడి గమనించిన మనకు సమీపంలో పక్షులు ఆనందంతో అరుస్తున్నాయనే అంశం బోధపడుతుంది. తరచూ ఆయన చెప్పేవారు – "నాయనా ! ఈ మానవుల చపలతతో ఆడడం కన్న ఆ పక్షులతో సహజీవనం ఉత్తమం". సామాన్యంగా

కుక్క మొదలైన జంతువుల్ని పోషించి, గుఱ్ఱం, గోవుల్నికట్టి, వాటితో సంపర్కం పెంచుకొన్న వాళ్ళకు తెలిసే ఉంటుంది. అవి కేవలం స్థూలమైన ఇంద్రియాల ప్రచోదనతో మాత్రమే ప్రవర్తించడం లేదు. కొన్ని కొన్ని విషయాల్ని తర్కబద్ధంగా అర్థం చేసుకునేంతశక్తి వాటిలో ఉంది. This is possible to be understood provided the observatery sense of ours is awakened. మనలో మంచి పరిపక్వత లేకపోవడంవల్ల విశాలమైన దాని స్వరూపాన్ని తెలుసుకోవడం అసాధ్యమౌతుంది.

ఇక్కడ మనస్సుకు ప్రాధాన్యం మనిషిలో మాత్రమే ఎందుకు? ఉత్తమగతికి చేరుకోవడం లేదా అధః పతనం పొందడం ఈ రెండింటికీ ఇదే కారణం. **మనం విశ్వవాణిని విందాం. "మనలో నిలిచిన నేను, నీవనే రెండు విషయాల్ని వేరు చేసి, గగనతలంలో ఒక దానిని, పాతాళంలో ఒక దాన్ని పంపించి, ఎక్కడెక్కడో తిరుగుతూండే మనసు యొక్క ఆకారం బృహదాకారం చూడు"** అనే అంశాన్ని గమనించండి. మన వ్యావహారిక, ఆంతరంగిక వ్యవస్థకు అదే కారణం. మనుష్యునిలో ఆలోచనలు, విచక్షణ, నిశ్చయం – ఈ శక్తులు చాలా స్పష్టంగా ఉండడం వల్ల మనం మనః ప్రధాన వ్యక్తులమనే అంశాన్ని అంగీకరించవచ్చు.

తొట్టతొలుతగా, మనస్సు, మనేంద్రియం అని రెండు రకాలుగా సులభంగా గ్రహించబడుతుంది. వికల్పం, సుకల్పం, సంకల్పాలు వీటి గతులు– అంటే మనస్సు యొక్క నీడలు. దేహంలోని సర్వేంద్రియాల ద్వారా బయటికి వ్యాపింపబడి కర్తవ్యాల్లో ఆసక్తి పొందిన వేళ మనేంద్రియ ప్రాబల్యముంటుంది. అపుడు మనకు తెలిసినంత మటుకు విభాగించుకున్న మంచికర్మ, లేదా కుకర్మలకు అంటినవేళలో కూడ స్థూలంగా కార్యప్రవృత్తం



కాని వేళ ఆలోచనల రాజ్యంలోనూ ఆయా ప్రేరణల వల్ల సుకల్పం లేదా వికల్పస్థితిని అది పొందుతుంది అనే అంశాన్ని మనం గమనించవచ్చు. ఈ సంకల్ప వికల్పాల చేష్టలు నిశ్చేష్టితమై సామాన్యంగా చెప్పాలంటే – ఏదో ఒక దాన్ని గురించి లోపల లేదా బయట లేదా లోపల మాత్రమే ఉన్నపుడు అది సంకల్పం అనిపించుకుంటుంది.

ఇపుడు మొట్టమొదటిదిగా కన్పించే శరీరం ఉంది. దీనిద్వారా అన్ని ఇంద్రియాల ద్వారా కార్యం చేయించే ఆ కార్యఫలాల్ని అందించి ఆనందింపజేసే ఒక కల్పం (మనసు) ఉంటుందని గ్రహించాం కదా! ఆ కల్పమే మనేంద్రియ మని తెలుసుకోవాలి. కొన్నిసార్లు ఈ మనేంద్రియ కార్యకలాపాలు లేకపోవడం మనకు గోచరిస్తుంది. గాఢనిద్రలో ఆ స్థితి ఉంటుంది కదా! అపుడు ఈ మనస్సనే ఇంద్రియపు కార్యకలాపాలు ఆగిపోయినా దేహంలో ఒక చైతన్యం పనిచేస్తూనే ఉంది. ఆ చైతన్యమే ఈ మనస్సనే ఇంద్రియానికి ఆధారభూతమైందని అర్థమవుతుంది కదా ! ఆ చైతన్యాన్ని తెలుసుకుని, ఆశ్రయించి సాగితేనే ఈ మనేంద్రియపు ఊర్ధ్వస్థితులైన మనస్సు, మనస్తత్వం, మనసా వీటిని గ్రహించడం జరుగుతుంది.

దేహాకృతికి అంటుకున్న ఈ మనస్సు తనంతట తానే సాగగల్గుతుందా ? అలా సాగితే గతి ఏమిటి ? పైన సుకల్ప, వికల్పాలతో అది ఊర్ధ్వ స్థానాన్ని పొందుతుందని పైన చెప్పబడింది. అంటే 'It is not unmouldable and it can be moulded' అని అర్థం.

అంటే దాన్ని మలచాలి. తీర్థయాత్రకని మనం ఎంతో దూరం సముద్రం దాకా వెళ్ళుతాం. స్నానం కోసమే పోయినా మనకు అక్కడ భయం వేస్తుంది. తీర్థయాత్ర అంటే వెంటనే సంసిద్ధులమౌతాం. అయితే

అక్కడి వస్తువుల గురించి విజ్ఞానం, వాటి సంపర్కాలు వీటి పరిణామం మనపై లేదు. అదే చూడండి ! అక్కడ ఆడుకునే బెస్తవాళ్ళ కుర్రవాళ్ళు చాలా దూరం దాకా సముద్రంతోనే సరసమాడుతారు. నీటిలో ఈదే చేపను చేతిలో పట్టుకుని తెస్తారు. అవి మనకు భయంకరమైన అలలు. అయితేనేం ? వాళ్ళకు మాత్రం జలకాలాటల తావులు. ఇదేమి మహిమో? అదేం కాదు. ఆ సంస్కారంతో అక్కడి వాతావరణానికి అలవాటుపడ్డ మనేంద్రియం వాళ్ళను అలా నిర్భయుల్నిగా మారుస్తుంది. వాతావరణం, స్నేహితుల స్వభావం, చేసే పనిపై ఉండే ప్రేమ, వీటివల్ల దానికి ప్రగతి ప్రాప్తిస్తుంది. అందుకే సత్సంగాన్ని బాగా పొగడుతారు. ఇపుడు చాలా మంది మనేంద్రియపు ఆటలోనే ఉంటారు. చెవి, కన్ను మొదలైన ఇంద్రియాల ఆకర్షణకు లోనైన మనలో నిగ్రహం అనేదే లేదు. ఇప్పటి తరం పిల్లల్లో జరిగే కర్తవ్య ప్రేరణ ప్రతీకారాలు. కేవలం మనేంద్రియానికి మాత్రమే సంబంధించినవి. ఇక్కడ మనం గమనించాల్సిందేమిటి ? ప్రజ్ఞా ప్రధానమైన నిజమైన ప్రగతిని మనస్సు సాధించాలంటే ఎలా ? చూద్దాం. దేహేంద్రియాల ఆకర్షణకు మనస్సనే ఇంద్రియం లోబడకుండా ఉండాలి. అలా చేయడం సాధ్యమా ? దీని రహస్యం ఖచ్చితంగా అనుభవానికి రావాలంటే కనీసం 30 సంవత్సరాలు కావాలి. నిజంగా ఈ మార్గంలో పయనించేవాడికి అంత సమయం అవసరం అని మా గురువుగారు చెప్పి ఉన్నారు. సుదీర్ఘమైన ఆయుర్దాయానికే ఈ మాట. అతడు అన్నింటినీ గ్రహించానని చెప్పినంత మాత్రాన అది బ్రతుకు కోసమే అని అర్థం కాదు. In my words, knowledge for knowledge's sake is a great down fall. For the fruit of life ! When knowledge turns into experience is the only noble way for the goal of



Man! ఈ అర్థంలో ఏదో ఒక ప్రయోగశాలలో ఈ అంశం బాగా మథించబడాలి. సాధారణంగా ఈ మార్గంలో మనోవైజ్ఞానిక రహస్యాల్ని వెంబడించి, వెలికి తీసే పని నా బాల్యం నుండి చేస్తూనే ఉన్నా. పుస్తకం ద్వారా దేన్నీ చూడలేని నేను మస్తకంతో అంతటినీ తెలుసుకుంటూ వచ్చిన వేళ – స్థూలసూక్ష్మాలలో, అరణ్యంలో, నగరాల్లో రకరకాల పాఠాల్ని ప్రకృతి పాఠశాలలో నేర్చుకోవాల్సి వచ్చింది.రాను రాను ఈ 2–3 సంవత్సరాల అవధిలో కొనసాగించిన ఆహారవిహారాల సంయమంతో అత్యధికంగా అర్థమౌతూ వచ్చింది. చికిత్సే బాగా పెరిగిపోతూ వచ్చింది. ఇపుడు ఒక ఆలోచనా వర్గం ప్రకారం యోచిద్దాం. ఇంద్రియాలు ఏమేమి అడుగుతాయో వాటికోసం తగినంతగా మనేంద్రియం ప్రేరణ ఎంత మటుకు ఉంది ? మనస్సు ఇంద్రియాత్మకమై ఏ కార్యంలో నిమగ్నమౌతుంది? అది కేవలం మనేంద్రియ ప్రేరణయా ? లేక స్వప్రేరణయా ? అది బాహ్య సంపర్కాల వల్ల కల్గిందా ? లేక అంతః ప్రేరణయా ? అంతఃప్రేరణే అయి ఉంటే – అంతస్తత్పరతయే కావాల్సి ఉన్నా, అది సుకల్పమా? వికల్పమా ? ఈ రకంగా విమర్శించుకోవాలి. అంతఃప్రేరణ ఉండి, మంచి ఆలోచనలు ఉంటే – అయినంత వరకు మనోవైజ్ఞానికాంశాల్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అనిపిస్తుంది. ఇలాంటి వాతావరణ ముంటే – నిగ్రహం మనలో కల్గితే – అది ప్రగతి లక్షణమే! అది వికల్పమయంగా ఉంటే when it hunts after passionable wants, దాన్ని సంతృప్తి పరచకుండా నిగ్రహించడమే ఉత్తమం. దాని కోసం ప్రయత్నించాలి. చూడండి ! తీపి తినాలనే ఆశపుడుతుంది. మనం ఆ ఆశను శాంతింప జేసేందుకు మితిమీరితింటే సంతోషానికి బదులుగా సంతాపమే మనకు మిగలుతుంది. అడిగినట్లల్లా

ఇస్తూ పోతే మళ్ళీ మళ్ళీ అవే ఆశలు రేకెత్తవా ? వాటిని మనం పెంచినట్లే ఔతుంది. తృప్తి ఈ మార్గంలో కల్గడం అసాధ్యం అనే చెప్పాలి.

Contentment should be one's own effort of controlling. వికల్పాల పరుగుకు అవకాశం ఇవ్వకుంటే – సుకల్పాల పరుగు సుసాధ్యమౌతుంది. అలాంటి సుకల్పం, అందులోని స్వస్థమైన విజ్ఞానం లభించి, పరిశుద్ధులు కావాలంటే, మనస్సు దాని యొక్క ప్రేరణలు తెలియాలంటే, ఆహార విహారాల నియమం, విషయా విషయాల సత్యానుసంధానం చాలా అవసరం. మీ శ్రమ కొంచెం తగ్గుతుందా ? ఘనీభూతమైన వస్తువు కొంత రసమయం కానీ ! అందుకే ఆహార నియమాలు లేకుంటే –

**"ఏదినమైన ఏమరుపాటు కల్గినా గింజలో, కారణమున, కానుకలోనా అన్ని లీలలోనూ చోద్యాలు ! విచిత్రాలు మిత్రమా ! సులువుగా మహాజాలాన్ని విస్తరించే మనస్సు యొక్క మహాకారాన్ని చూడవోయి"**

అని అంటాను. ఏదో ఒక రీతిలో పొంచి ఉండే ఆ వికల్పశక్తి మనం స్వీకరించే క్షుద్రాహారం ద్వారా లోపలికి ప్రవేశించి, ఇంద్రియాల ప్రచోదనకు దోహదం చేస్తుంది. దేహం పెరిగినట్లలా మనలోని మనస్సు కూడా ఎదుగుతుంది. వ్యాపకత్వాన్ని, స్థితిని పొందుతుంది. శిశువు పాలతో పోషింపబడే వేళలో – మాతృస్తనాలకే పరిమితమైన అభివృద్ధి వ్యాపకత్వాలు ఉంటాయి. దానికి సర్వేంద్రియాల చలనం కన్పిస్తున్నా అక్కడ చాపల్యం లేదు. ఎలా నీళ్ళు, ఆహారం వేస్తూ వచ్చామో, అనేక రసాలు లోపలికి చేరి, శరీరంతోపాటు మనస్సు కూడా క్రమంగా ఎదుగుతూవస్తుంది. ఆనంద క్రీడల వల్ల మొండి ప్రవర్తనలు, ప్రేమచిహ్నాల వల్ల సంకుచిత



వాంఛలు, విశ్వాసద్రోహాలు, నిందా స్తుతుల మోహాలు – ఇలా దురాచారాల దాకా శరీరం, మనస్సు రెండూ ఎదిగి నిలుచున్నాయి. దీనివల్ల మనకే తెలుస్తుంది ? దేహం – మనస్సు ఈ రెండింటికి చాలా దగ్గరి సంబంధముంది కదూ ? మీరు చెప్పే సామెత అర్థం కూడా ఇదే కదూ? 'A sound mind is a sound body'. సుమారు 30 సంవత్సరాల దాకా శారీరకమైన పెరుగుదల ఉండడం వల్ల ఆహారం తగినంత మోతాదులో అవసరం. అయితే నిజమైన ఎదుగుదల – మానవత్వపు ప్రగతి కావాలంటే ఆహార విజ్ఞానం మనకు తెలిసి ఉండాలి. పోషించేవారికీ, పోషించబడే వారికి ఇరువురికీ ఇది అవసరం. గోకులం లోని మొరటు వాళ్ళను శ్రీకృష్ణ భగవానుడు బాల్యంలోనే ఎలా పోషించుకుంటూ వచ్చాడు! ఆ 'పిల్లలు' అన్నపుడు మనకు అతని చేష్టలొకటే జ్ఞాపకానికి వస్తే ప్రయోజనం లేదు. ఆహార విహారాల్ని గ్రహించాలి. ఆ ఆహార విజ్ఞానం గురించి తెలిసిన మీరంతా బాగా విశ్లేషణ చేసేందుకు అవకాశం ఉంది. అందులోనూ మనోగతిని తెలుసుకోవాలన్న వేళ అనుభవదృష్టితో పరికిస్తే ఒక్కో జాతికి చెందిన ధాన్యంపై నెలల తరబడి చర్చ కొనసాగింది. అదలా ఉండనీ ! రసాలంటే – తీపి, పులుపు – వీటిని దూరంగా ఉంచాలి. తర్వాత కారం, ఉప్పు, అంటే విషం. అంటే ఇవేవీ తినరాదని కాదు. సంయమం పాటించాలని భావం. పాకశాస్త్ర ప్రావీణ్యం సంపాదించుకోవాలనే వ్యక్తులు తెలుసుకోవాల్సిన అంశాలివి ! పెద్ద కాకరకాయని ఇంటికి తెస్తాం. అది జన్మతః విషపూరితంగా ఉంటుంది., అయితే దాన్ని తింటాం అనే విషయం మనకు తెలుసు. హృదయానికి మంచిది. క్రిముల్ని నాశనం చేస్తుంది. పైత్యరసాన్ని క్రమబద్ధం చేస్తుందనే అంశాలు తెలియరాదా ? ఆ జ్ఞానం లేకుంటే – దాన్ని తురిమి, పిండి,

రసాన్ని వడపోసి, నిస్సారమైన పిప్పికి పులుపు, బెల్లం అధికంగా చేరిస్తే అది ఒక తీపి ముద్దగా మారిపోతుంది. సహజమైన గుణాల్ని మనం పొందలేం. పైగా లేనిపోని వికారాల్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుంది. సారాయి తాగితే 'మత్తు' కల్గిందనే చాలా మంది వ్యక్తులు రాత్రి పుల్లటి మజ్జిగ లేనిదే భోజనాన్ని ముగించరు. మొత్తానికి ఈ దేహం ఆహారంపై ఆధారపడి ఉంది. సాత్విక, రాజస, తామస గుణాల విచక్షణతో ఇది పోషింపబడాలి.

ఇది సాధారణమైన విభజన. ప్రత్యక్ష తత్వంలోకి దిగితే – అతడు మూడింటిలో మూడు గుణాల్ని విభజించుకుంటూ పోతాడు.

ఇక మనం ఒక రకమైన తాత్విక చింతనకు వద్దాం. సుకల్పం, వికల్పం సంకల్పాల్ని చూసేశాం. మనస్సు తన తత్వాన్ని, స్వభావాన్ని ఎలా తెలుసుకుంటుంది ? బయట స్నేహం ఎలా పెల్లుబికిపోతుందో చూశారుగా ! అలాగే లోపల్నే ఆటలాడుకునే మనస్సు యొక్క మిత్రుడొకడున్నాడు. అతని సహాయం వల్ల దీని ప్రగతి సుసాధ్యం. కొంచెం గమనించండి. ఏదో ఒక ఆలోచనలో నిమగ్నులై మీరు కూర్చున్నవేళ లేదా ఏకాంతంలో ధ్యానానికి కూర్చున్న వేళలో – ఆ మౌనచింతనంలోనూ మనస్సుతో ఓ శక్తి కలిసి మెలిసి తిరుగుతుంది. మీ ధ్యానపు సుకల్పం స్వతంత్రమైనది కాదు. ఎందుకంటే దీనికి విజయ, పరాజయాలు ఉన్నాయి. లోపలి ఆలోచనలతో పాటు క్రిందపైన జరిగే తాళం, లయ, అదే ప్రాణస్పందన ! అవి రెండూ చేరితేనే. తత్‌సంకల్ప స్థితి కల్గితేనే మనస్సు గ్రహించి చైతన్యాన్ని పొందగల్గుతుంది. అన్ని వైపులా ఉండే మనస్తత్వం, దేహంలో ఉండే మనఃశక్తుల మధ్య ఒక Intermediary force ఉంది. దాన్ని గ్రహిస్తే మనస్సును గ్రహించడం సులభం. అపుడు అన్ని వైపులా



వ్యాపించిన concentrated thought waves లను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఈ ఏకాంత ధ్యానం ప్రాధాన్యాన్ని, మహిమను గ్రహించాలని పెద్దలన్నారు. హృదయం నుండి శంఖం, భ్రూమధ్యాల ద్వారా బ్రహ్మలోకం వైపుకు మనస్సును ఏకాగ్రం చేయమన్నారు. వికల్పాలు పోయి సుకల్పం కలగాలంటే సాకారమైన ఉపాసన చేయాలి. బయట, లోపలా ఇష్టదేవతామూర్తులనే ధ్యానిస్తూ సాధనలు కొనసాగాయి. అదే 'భక్తి' అని చెప్పబడింది. భక్తికి చెందిన విగ్రహాలు, వాటి ఉపాసనలో నిష్ఠగా ఉండాలని పెద్దలన్నారు. సాధారణంగా చిత్రాన్ని చూస్తూ చూస్తూ పోతే కళ నుండి కృష్ణుని దాకా మన దృష్టి సాగుతుంది. అక్కడ కళ. ఆ వ్యక్తిత్వాన్ని రూపొందించగల్గడంతో మనస్సు అక్కడ ఆయా ఇతి హాసాల గురించి చక్కగా ఆలోచిస్తుంది. అలా ఏకాంతంలో కూర్చుంటే – క్రమంగా ఆలోచనలే నిలిచిపోతాయి. ఒక్కోసారి ఏకాగ్రత కూడ కల్గుతుంది. అపుడు మనః ప్రాణాల మిలనం జరుగుతుంది. అదే సమాధి అని చెప్పారు. విద్యానుభవం ఉన్నవాళ్ళు మాత్రమే నిజమైన సమాధిస్థితిని పొందగల్గుతారు. Bhaktas tumble down on yoga అనో consciously or unconscioulsy they get that concentration అనో చెప్పవచ్చు. ఈ స్థితికి ఆధారమైన చైతన్యం ఏది అనేది స్పష్టమైంది కదూ! ఈ విషయాన్నే శోధిస్తూ ఆ మార్గంలో ముందుకు వెళ్ళాలి. 'పరిశోధన' అంటే – మనం వెదికినంతనే రహస్యం తెలుస్తుందనే అర్థం కాదు.

అనుభవమున్న గురువు నుండి ప్రాణపతి యొక్క నిజమైన వాహనం ఏమిటి ? ఆ మార్గం ఏది ? ఈ విషయంలో ఉపదేశం పొందాలి. అదే

అనుభవ మార్గం. అపుడు మనస్సు తన పూర్ణస్థితిని గ్రహించి, మనోమయ జ్ఞానాన్ని పొందుతుంది. ఆ మహావిద్యలో నిరంతరంగా ముందుకు వెళ్ళితే చిచ్ఛక్తి కాంతిలో మనస్సు పొందే స్థితి – ప్రజ్ఞాస్థితి.

ఇలాంటి స్థితిని అకుంఠితంగా పొందాలి. కొందరు దీన్ని అమనస్కస్థితి అనీ, లయ అనీ, మనోనాశమనీ చెబుతారు. ఇవన్నీ చాలా వివాదాస్పద విషయాలు. ఏదో క్రింది తరం ఆకాంక్షల్ని గురించి ఆలోచిస్తూ అవి లేకున్నంత మాత్రాన ఆ మనస్సే లేదని చెప్పడం అనధికార వాక్యం.

ఇది వరకే చెప్పినట్లు మనోమయ స్థితిని గ్రహించి, దాంట్లోని శక్తి విజ్ఞానమయ కోశాన్ని అనుభవిస్తుంది. ఆంతరంగిక, బాహ్య విజ్ఞానాలు ఆస్థితిలో బోధపడతాయి. దాని కన్న ముందుండేది ఆధ్యాత్మికానుభవానికి గమ్యస్థానమైన ఆత్మ. అదే 'పరమాత్మ' అని చెబుదాం. ఇక్కడ అనవసర వాగ్వాదాలు చేయరాదు. దివ్యత్వాన్ని మాటల్లో వర్ణించలేం. అది జిజ్ఞాసువులకు అవసరం కూడా కాదు. వారికి సాధనయే ప్రధానం. ఆ మహామనస్సును గ్రహించాలంటే అఖండమైన మనస్సు ఖండఖండాలయ్యే స్థితి కన్పిస్తుంది. అందుకే ఈ అయోమయం పోవాలంటే ఇదే మార్గం.

> **"పైకిపోతే మహాలోకం జారిపోతే మాయాలోకం గురితప్పక, భ్రమలు విడిచి గురువుగారి వైపు వెడలి పవమాన పవిత్రతను పొంది లక్ష్యాన్ని సాధించుటే మార్గమయ్యా ! మనస్సు పరమాత్మలో లయమయ్యే స్థితి ఇదే చూడు!" (విశ్వవాణి)**

ఇపుడు మనం పొందిన జ్ఞానపు వెలుగులో అవరోహణక్రమంలో సింహావలోకనం చేద్దాం ! ఆదిభూతంతో పాటు వచ్చిన ఆ దివ్య చైతన్యం



మనస్సు ద్వారా భూగర్భానికి వచ్చాక, 'మనస్సై', మనేంద్రియ రూపం ధరించి, బహిర్ముఖమై బయటికి వచ్చి, ప్రకృతికి అంటుకుని, మళ్ళీ తన మూలస్థితిని పొందేందుకు, తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంది. ఆ జ్ఞానాన్నే 'బ్రహ్మవిద్య' అనండి! యోగ విద్య అనండి ! ఆ బలంతోనే దీన్ని సాధించాలి.

ఇది తెలిస్తే చాలదు. అలా విశిష్టరూపమైన మనస్సు పూర్ణపుష్టిని పొంది, సాధనాబద్ధంగా, ప్రాణచైతన్య బద్ధముగా సాగేవేళ దేహం శుక్లం – ఇవన్నీ శుద్ధమై మనస్తత్వాన్ని తెలుసుకుని ముందుకు సాగాలి. అలా సాగితే మన ఆర్ష సంస్కృతి బిడ్డలం అనిపించుకుంటాం. మన సంతతి కూడ శుద్ధ మౌతుంది. ఇలాంటి శ్రేయస్సును ఆ దేముడు మీ కందించనీ ! సర్వులకు శుభం జరగనీ !

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# 4. కర్మ సిద్ధాంతం

**ఆత్మ బంధువులారా !**

ఈ రోజు మీ అందరి ఉత్సాహం నన్ను కర్మపై ఉపన్యాసం చేసేట్లు చేసింది. కర్మ గురించి మాట్లాడాలని అడిగినపుడు 'తాత్త్వికంగా ఆలోచించాలా ?' లేక వ్యావహారికంగా చెబితే చాలా?" అని సహజంగానే అడిగాను. వారు కర్మనిర్దిష్టతను వివరించాలనీ, తాత్త్వికచింతన ఆవశ్యకతల గురించి విడమరచి చెప్పాలని అన్నారు. ఇపుడు అయినంత తాత్త్వికంగా దాన్ని గురించి వివేచిద్దాం.

ఇది సహజంగానే పెద్ద విషయం. ఆద్యంత రహితమైన సత్యానికి అందించే ఘనతను దీనికి అందించాలి. అయితేనేం ? మన కాళ్ళలో ఎంత శక్తి ఉందో గ్రహించి తదనుగుణంగా వివేచన చేయాలి. సాధారణంగా సృష్టిలో – ఈ సృష్టి అంటే మానవుడు భౌతికంగా చూసి, విమర్శింపదగిన జగత్తు అని మాత్రమే భావించాలి. అన్ని జీవరాశులూ ఏదో ఒకరూపంలో స్థూలరూపంగా మనం 'కర్తవ్యం' అనే దాన్ని కర్మబద్ధంగా చేస్తూ ప్రతిక్షణం సాగిపోతూన్నాయనే అంశాన్ని గమనించాం. దీని కన్నముందు మీకు చెప్పాల్సిందేమిటంటే 'కర్మ' అనే శబ్దాన్ని కవి ధ్వనింపజేస్తూ వెళ్ళే రీతిలో గ్రహిస్తేనే అది మనకు అర్థం ఔతుంది. ఆయా స్థితుల కనుగుణంగా ధ్వనిని గ్రహిస్తూ కర్మ యొక్క స్థూలరూపం నుండి ఆత్యంతిక సత్యం దాకా ఉండే కర్మ యొక్క ప్రాధాన్యాన్ని గ్రహించడం సాధ్యమనే అంశాన్ని మనం జాగృతులమై గ్రహించాలి.

ఆ కర్మగురించి కవిచెప్పే మాటల్ని బట్టి అతని స్వభావాన్ని బేరీజు వేయవచ్చు అనే అంశాన్ని దత్తాత్రేయుల వారిలా సెలవిచ్చారు.



**అప్రమత్తో గంభీరాత్మా ధృతిమాన్ జితషడ్గుణః**
**అమానీ మానదః కల్పోమైత్రః కారుణికః కవిః**

నిరంతరం అప్రమత్తుడై, గంభీరుడై, ధీరుడై, షడ్గుణాలను జయించి, అభిమానరహితుడై, ఇతరులను గౌరవించే స్నేహశీలి, పరమదయామూర్తి కవి అని దీని అర్థం. ఒక రకంగా ఇందులో స్థితప్రజ్ఞుడి లక్షణాలు వర్ణించబడ్డాయి. సరే ! కారుణికుని కర్మ మనకేమిస్తుందో చూద్దాం. మనం సూర్యుణ్ణి దైవంగా భావిస్తాం. భౌతిక విజ్ఞాన నిపుణులు కూడ సూర్యుడొక శక్తిగోళమని అంగీకరిస్తారు. ఆ సూర్యుని గురించి కొంత తెలుసుకుందాం. కవి అతణ్ణి "కర్మగురువు" అని అన్నాడు. మన మందరం నిర్ణయించుకున్నట్లుగా, అందరిచే నిర్ణయింపబడినట్లుగా ప్రపంచం నడిచేందుకు అవసరమైన పంచభూతాల మిశ్రణకు, దానితో పాటు జీవుల మనిపించుకున్న మనందరికీ తేజస్సును అందించే దాత సూర్యుడే కదా!

అక్కడ మనం చూడాల్సిందేమిటి ? కర్మ నియమాల కూర్పుకు సంబంధించిన ఒక శుద్ధమైన వ్యవస్థ. ఋతుధర్మానుగుణంగా నియమపథంలో అతని కర్మదక్షత, అతని నిరంతరమైన ప్రయాణం, తీక్ష్ణత, ప్రశాంతతలు – ఇవన్నీ ఎంత వ్యవస్థితమైన రీతిలో సాగిపోతున్నాయి కదూ ! ఈ వ్యవస్థను రవి మనకు నిస్వార్థంగా అందిస్తున్నాడు. ఎంత ఖచ్చితంగా ఉంటాడు సూర్యుడు ! త్యాగులమని విర్రవీగేవాళ్ళకు సూర్యుడే ఒక గుణపాఠం ఎందుకు కాకూడదు ?

ఇకపోతే, మానవులమైన మనకు సృష్టి కేవలం జడమే కాదు. ఆ సృష్టి నియమాల కనుగుణంగా, నిరంతరం అప్రమత్తతో మనం నిత్యం కల్యాణపథంలో పయనించాల్సి ఉంది. అలాంటప్పుడు, ఆయామం, కాలం

కర్మల నిష్ణాత పక్వత్వాన్ని గ్రహించి సాగకుంటే అదెలా సాధ్యం ? మనం కేవలజడమే లేదంటాం. మనం అంటే భారతీయులం ! స్వభావానికి సరిపోని జడవాదపు భీతి మాత్రం లేదు కదూ ! అదొక ప్రగతిలా కనిపించి ఉండవచ్చు. మీరేమో ఆ డార్విన్ సిద్ధాంతమని అంటారు కదా! దాన్నే వికాసం అంటున్నారు. సృష్టిలోని జడత్వం క్రమంగా ప్రగతిని పొందుతూ ఏదో ఒక రూపంలో మనుష్యరూపాన్ని ధరించిందని అనడం తర్కబద్ధమూ కాదు. తథ్యమంటూ కానే కాదు. ఇది కేవలం, మనస్సు ఆకారోపేతమై, అసంబద్ధమైన, కాల్పనికమైన కొలమానంతో సృష్టి రహస్యాల్నే కొలవడానికి చేసిన సాహసమనిపిస్తుంది. అది ఒక సిద్ధాంత మార్గం కావచ్చు లేదా ఆ ఆలోచనా సరళికి ఒక అడ్డుకట్ట వేయాలని కాదు. తన ఆలోచనాశక్తి నిరంతరం సాగుతూ ఉన్నవేళ కల్గిన ఒక భావం మాత్రమే. చూడండి. దీన్నే అంగీకరించి కొనసాగే పక్షంలో తనంతటతానే జరిగే ఒక ప్రగతి జటిలత్వానికి మన కర్మోత్సాహం, సాహసాలెందుకు అనే నీరసమైన వాదం ఏర్పడుతుంది కదా ? అలాంటి వేళలో సృష్టిరసమయం అనే జ్ఞానం మనకు ఎన్నడు కలిగేది? అందుకే, అది అంత సులభంకాదు. మన ఆర్ష పరంపరకు చెందిన ద్రష్టలు శతాబ్దాల తపోమయ జీవనంతో గమ్యస్థానాన్ని చేరడంలో అనుభవరీతిలో తెలుసుకోగల్గిన అఖండ సృష్టి రహస్యం. ఖండరూప రహస్యాల్ని బహురమ్యంగా విశ్లేషించే వేళ "ఇదిసురసాధిపతి యొక్క నైపుణ్య కారణంగా కొనసాగుతూ వస్తోంది. అలాంటప్పుడు అది, కర్మ తనకు ఆనందం కలుగజేస్తుందని అన్నారు. ఇలా సుందరంగా దీన్ని 'కర్మ' అందాం. ఆనంద స్పందనలు పొంగే రీతిలో 'ఆత్యంతిక (మిక్కిలి శ్రేష్ఠమైన) కర్మ' అంటున్నాను.



కర్మ అనేది క్షణాల జడత్వాన్ని సహించని అఖండ పరిపుష్ట స్థితి. అందువల్ల దాన్ని తెలుసుకునే మనం కూడా విచికిత్సా బుద్ధితో కుతూహలంతో, కౌశలంతో, ఆరోగ్యంతో ఉంటేనే అది సాధ్యం ఔతుందని మరోసారి విన్నవించుకోవాల్సి ఉంది. ఎందుకంటే – దాన్ని గురించి వివేచిస్తూ పోయే వేళ విభిన్నస్థితుల స్థాయిలో హెచ్చుతగ్గులు కన్పించవచ్చు. మనం అలాగే కావాలి. అంతకన్న వేరే ఉపాయం లేదు. మనం కర్మలో చిక్కుకుని కొట్టుమిట్లాడుతున్నామని అంటే – దాన్ని నేనంగీకరించను. దీనికి మా గురువుగారి అనుమతి లభించదు. అందువల్ల తప్పక తెలుసుకోదగిన కర్మ గురించిన స్థూలవ్యాఖ్య గురించి ఆలోచిద్దాం. ఏదో ఒక తత్వచింతనకోసం అడుగులో అడుగువేసుకుంటూ ఎక్కడగ్గ మిద్దెపైకి ఎగిరిపోయే నియమం మనిషికి లేదనే అంశాన్ని ఎరుగని మూఢుల మౌతున్నాం మనం ! కర్మగురించి నిర్లక్ష్యం తగదు. మనం ఈ సుందర దేహాన్ని ధరించి వచ్చాం. మీకంతా తెలిసిందే ! తాత్వికులు నిర్ణయించిందే ! వైజ్ఞానికులు అంగీకరించిందే ! పంచభూతాలు, ఆరోగ్యంతో చైతన్యం కలగలసి, కర్మబద్ధమై ప్రేరక కౌశలంతో విశ్వభూగర్భమైంది. అక్కడ నిర్దిష్టమైన రీతిలో ఈ దేహం తయారైంది. ముఖ్యమైన ఆత్మలే కర్మబద్ధంగా రూపుదాల్చుతున్నాయి. మనం దేహధారులం. కర్మనాకు వద్దంటే – లేదా అది చెడ్డదంటే ఎలా? త్యాజ్యం, త్యాగం – ఇలాంటి పెద్ద పెద్ద శబ్దాల్ని వాడడం దేనికి? ఈ కర్మ భ్రష్టతకు అర్థం ఏమిటి ? ఇది ఒక మోహావృతమైన అజ్ఞానం అనే దాన్ని ఎవరు వదిలేశారు ?

ఇక్కడ ఓ చిన్న ఉదాహరణ తీసుకుందాం. రథం అనండి. బండి అనండి. లేదా కాలానికి తగినట్లు కారు అనండి. దీన్ని వాడేవేళలో అందులోని ఉపకరణాల పరిపుష్టత ఉండి, అది పనిచేయకున్నా, లోపాల్ని

సవరించైనా మనం దాన్ని నడిపిస్తాం. క్రమంగా అది పనికి రాకుండా పోతే "దీన్ని నాశనం చేయండి" అనే స్థితికి వెళతాం. అంటే ఏమిటి ? జడమైన వస్తువుల నుండి మనం పరిపూర్ణమైన కర్తవ్యాన్ని ఆపేక్షిస్తున్నాం. జడాలకన్న శ్రేష్ఠుడైన మానవుడు సర్వేంద్రియాలతో పరిపుష్టంగా ఉన్నాడు కదా ! ఆయా సన్నివేశాల కనుగుణంగా దేహ కర్మల్లో నిమగ్నం కాకుంటే ఎలా ? కర్మ యొక్క అభ్యంతర విషయాల్లోకి మనం ఇంకా పోలేదు. మానవత్వపు పరిపుష్టత అంటే – శుద్ధమైన శారీరక పరిపుష్టతే !

ఇక్కడ మనం 'పరోపకారార్థ మిదం శరీరం" అనే మాటను ఎంత చక్కగా మలచుకోవాలనే అంశాన్ని గురించి ఆలోచిద్దాం. ఒక మఠాధీశుడు వచ్చాడు. 'శిష్యా' అన్నాడు.

ఈ సూక్తినే తనకు ఉపయోగకరంగా మార్చుకున్నాడు. "చూడు. డబ్బును వ్యర్థం చేయవద్దు. కనీసం మూడు నెలల జీతాన్నయినా అందించు సమారాధన కోసం" అని అడిగాడు. ఇదీ ఓ రకంగా పరోపకారమే కదా? అని మీరు తర్కించుకోవచ్చు. 'పరోపకారార్థ మిదం శరీరం' అనే మాటను దురుపయోగం చేయడం ఇదేనని నేనంటున్నా. పెద్దల మాట మోక్షాపేక్షతో వెలువడింది. కర్మయొక్క నిజమైన అర్థాన్ని చెప్పడానికి వెలువడింది. అందుకే 'కాయానికి కైవల్యాన్నందించే దేహకర్మనే చేయండి' అన్నారు. మన శరీరాన్ని వేరేవాళ్ళ కోసం ఉపయోగించటం – ఇది పరోపకారర్థా మిదం శరీరం' అనే మాటకు నిజమైన అర్థం.

ఇక్కడ కర్మ ఎలాంటిది ? ఉత్కృష్టమైనది అనే అంశం అందరికీ తెలిసి ఉండాల్సింది. గతానుగతికంగా వేరేవాళ్ళపై ఆధారపడే జీవితం వల్ల ఆ అంశాన్నే మరచిపోయాం. అలాగే గ్రామం, దేశం, విశ్వం – ఒక



రకంగా అధఃపతనాన్ని పొందుతోంది. విశ్వజనీనమైన కర్మ పరిపుష్టతనే మనం చూడడం లేదు. ఇక లోపలి కర్మయొక్క రమ్యత్వాన్ని గ్రహించేదెప్పుడు? చూడండి. దేహం మనకుంది. అదెలాగైనా సరే, దేహధారణ చేసే ఆశ మనకుంది. అదెలా జరుగుతుంది. పదే పదే 'అన్నమయకోశ, అన్నమయమిదం' అనే పెద్ద పెద్దమాటల్ని మనం వాడదలుస్తాం.

ఆ మంత్రాలనిజమైన అర్థం ఏదైనా, దేహానికి మాత్రం అన్నం కావాల్సిందే. అతడు తనంతట తాను బ్రతకాలంటే అతడన్నమే కావాలి. ఇదెందుకు అర్థం కారాదు. ఇక్కడ అందరి చేతికి నాగలి అందించి పొలంలోకి దింపడమే వీరి పని. కొడవలి, నాగలి, ఇవే వీళ్ళకు కర్మగా గోచరిస్తున్నాయని భావించవచ్చు. తప్పేమీ లేదు. రెండవదో, మూడవదో అయిన కోరిక. అకస్మాత్తుగా లేకున్నా ఉన్నంతలో కల్గే అపేక్ష అని తెలిసిన ఒక బట్ట ఉంది. దాని ప్రాముఖ్యాన్ని గురించి చెప్పండి. ఆ ప్రాధాన్యం కోసం చరఖాను, మగ్గాన్ని సర్వస్వంగా భావించి పొందే అవకాశం ఎంతోమందికి లభించి ఉన్నది కదూ ? ఆహారం చాలా అవసరం. దేహధారణకు ప్రప్రథమంగా ఉండాల్సింది. అలాంటి ఆహారానికి సంబంధించిన వ్యవసాయం వద్దు అని భావించడం దేనికి ?

ఇక్కడ ఓ పెద్ద సందేహం కలుగవచ్చు. బౌద్ధిక జీవితానికి ఒక విలువ అవసరం లేదా ? ఒక సామాజిక ఆదేశానికి ఇది ఆటంకమా ? అనిపించవచ్చు. అలా కానేకాదు. సామాజిక ఆదేశాల మాధుర్యం వ్యవసాయాభివృద్ధి వల్ల కల్గిన ప్రయోజనాల్లో ఉంటుందని నేనంటాను. ఇది అనుభవైక వేద్యం. ఇక్కడ మీరే దాన్ని చేయాలి.

ప్రాచీనాశ్రమజీవితపు చరిత్ర మనకు అలాంటి ఆదర్శాన్నే అందిస్తుంది. నిరంతరం ఇక్కడ నిలిచిన నా జగమెరుగని జీవితాన్నే లాగించుకుని, గుహజీవనాలూ కొనసాగించి, వెలుగుల్ని చూసిన ఈ జీవం లోకకల్యాణపు మహాకాంక్షతో ఎగిరేవేళ 'అయ్యో! ఇక్కడికి కాదు' అన్నట్లు నా ప్రభువు అచ్యుతుల వారు ఆశ్రమాన్ని స్థాపించి, అక్కడ కర్మబద్ధ జీవనాన్ని కొంతమేరకు ఏర్పరచారు. ఈ అంశాన్ని పుస్తకపు వాక్యాలతో తెలుసుకోకుండా ప్రత్యక్షంగా చూడవచ్చు. ఒక ఉదాహరణ ఉంది. అది నాదే ! ఇది ఆత్మప్రశంస కాదనుకోండి ! మన మిత్రులంతా కర్మ ప్రకాశాన్ని చూడనీ ! చూసి ప్రత్యక్షంగా రంగంలోకి దిగాలన్నదే నా మహాభిలాష.

ఒక రోజు సాయంసంధ్యాసమయంలో నేను మరుసటి రోజున పెందరాళే హోస్‌పేటకు వెళ్ళాలని గురువులు ఆదేశించారు. ఏదో పనిమీద అక్కడికి పయనం. నేను అక్కడ చేయాల్సిన పని గురించి వివరించారు. ప్రాతఃకాలకృత్యాల్ని ముగించుకొని నేను వెళ్ళేందుకు ఆయన అనుమతిని కోరాను. వారు మిరియాల మొక్కల మధ్య ఉన్నారు. నేను లోపలికి దూరి కొన్నింటిని తుంచసాగాను. త్రుంచడం చేస్తూనే ప్రభువులు నాకన్ని విషయాల్నీ వివరించారు. 5-6 నిమిషాలు పనిచేస్తూనే అన్నీ విని బయటికి వచ్చి అడుగువేశాను. 'విజయాంధ్రా!' అని పిలిచారు. మళ్లీ వెళ్ళి మిరియాలతోట వెలుపలే నిలబడి 'స్వామీ' అన్నా, హోస్‌పేటలో ఉత్తరాలు చూసి, అవసరమనిపించిన వాటికి అక్కడే ఉత్తరాలు రాసి, తిరిగి వచ్చేవేళ తేవాల్సిన సామానుల గురించి వివరించారు. అక్కడికి 4-5 నిమిషాలు గడిచాయి. "ఇక నాకు సెలవా?" అంటూ బయలుదేరా. అయితేనేం ! అపుడు నాకు మరువరాని పాఠం లభించింది. "చూడు. నేను నీకు



చెప్పాల్సిన మాటలు ఇంకా పూర్తికాలేదు. నీవు కేవలం నామాటల్ని విన్నావంతే! ఆ నాలుగైదు నిమిషాలు నువ్వేం చేశావు ? అదే లోపలికి వచ్చి, మొదట్లోలా నాతో కలసి ఆ నాలుగైదు నిమిషాలు మిరియాల్ని తుంచి ఉంటే ? ఒక వరస పూర్తయ్యేది. చేతులు, కనులు, కాళ్ళు – ఈ మూడూ పనిచేయాల్సి ఉన్నది. ఆ కోతకు తగినట్లుగా మనస్సు అనే ఇంద్రియం కూడ పనిచేసి ఉండాల్సింది. అంటే ఏమిటి ? ఇంద్రియాలనన్నింటినీ సమానమైన పనిలో నిమగ్నం చేసినట్లయింది. ఇదే కర్మరహస్యం. ఏ ఇంద్రియము కూడా వేగంగా చనిపోక, శుద్ధకర్మపథంలో సాగి, అంతఃసూక్ష్మకర్మకు లేదా ముక్తికి దోహదపడుతుంది" అన్నారు. ఇలా చెప్పేటప్పుడు కూడ వారు పనిచేస్తూనే ఉన్నారు. ఇక్కడ ఏ బుద్ధి వికాసానికి కొదవ ఉంది ? ఇక్కడ భౌతికమైన, ఆధ్యాత్మికమైన పూర్ణత్వానికి కొరత ఎక్కడుంది? ఇది పరమపూజ్యమైన కర్మ ! ఇది పూజ్యమైన కర్మ కౌశలం! ఇలాంటి గొప్ప కర్మనిష్ఠలు చిన్నవిగా అప్రధానమైనవిగా అనిపించవచ్చు. అయితే అది మనదేశ దౌర్భాగ్యం. మానవజాతికిది అధఃపతనం.

అందువల్ల ఈ సస్యజీవితపు సాహచర్యం స్థూలానికి మాత్రమే పరిమితం కాదు. సుఖకరమైనది ఆహారమొక్కటే కాదు. వాటి ప్రయోజనాలు, కళలు – వీటిని అనుభవంలో చూడగల్గాలి. సస్యజీవితానికి ప్రాకృతికంగా ఉత్పత్తిఅయ్యే లోపలి ఆహారాన్ని స్వీకరించడం వల్ల దాని కొక నైసర్గికమైన శాంతి కల్గుతుంది. దాంతో మన తనువు, మనస్సులు ఏకమైతే – ఆ సంబంధములో 'Waves of green are grand fruits supplied us food for waves of thoughts" అని అంటాను. ఇక్కడ కవి సుందరోద్యానవనాల అందాన్ని కవితలో వర్ణిస్తాడు. అక్కడ కూడ భావ

స్వాతంత్ర్యం. వస్తు పరావలంబనం. ఈ దోషం కన్న, శారీరక శ్రమతో తవ్వి, పాతిపెట్టి, పోషించి, లతగా, మొక్కగా, చెట్టుగా పుష్పించి ఫలించిన వేళ మనకు ఆనందం కల్గుతుంది. కవి అపుడు కళాద్రష్ట అవుతాడు. ఇక్కడ ద్రష్ట అంటే దేన్నో చూసేవాడనో చూసిందాన్ని నోటికి వచ్చినట్లు చెప్పేవాడనో అని అర్థంకాదని నొక్కి వక్కాణిస్తున్నాను. అలా చెబితే ద్రష్ట అనే శబ్దాన్ని అపార్థం చేసుకున్నట్లే ! వాస్తవికమైన విజ్ఞానాన్ని శ్రమతో స్వానుభవంలో గ్రహించి గమ్యస్థానమైన శుద్ధానందందాక పయనించిన వాడే 'ద్రష్ట' అని చెప్పవచ్చు. జనాభాలో అనేకులు బౌద్ధికమైన కర్మల్లో, మానసిక కర్మల్లో నిమగ్నులై ఉండడాన్ని మనం చూస్తున్నాం. నిజంగా మనకు శుభం కల్గాలంటే – బౌద్ధిక స్పర్థతో వృత్తుల్ని చేపట్టే అలవాటు తగ్గాలి. అలాంటి పనుల్లో ఉండేవాళ్ళకు కూడా కొంత మేరకైనా శారీరక శ్రమ చాలా అవసరం. యంత్రాలు, పరిశ్రమల్లో పనిచేసేవారికి కూడా దేహేంద్రియాల పని తగినంత ఉంటుంది. అయినా శుద్ధమైన శారీరక శ్రమ చాలా అవసరం.

శరీర పోషణ అందించే వ్యవసాయం చాలా అవసరం. అంటే స్వావలంబి జీవనపు పరమార్థం సత్యాన్ని అలవరచుకుని ఉంటుందన్నమాట. మొత్తానికి ఎలాంటి మేధావికైనా రోజుకు కనీసం రెండు గంటల శారీరకశ్రమ అవసరం. అపుడే సర్వేంద్రియాల కర్మ పరిపూర్ణమౌతుంది. చివరికి స్థూలంగా చేసే నిద్రను కూడా ఓ రకమైన శాంతిగా భావించి, దాన్ని పొందేందుకు తగినంత శ్రమ జీవితంలో చాలా అవసరం అనే అంశం అర్థమౌతుంది కదూ ? కొందరు తిని. కూర్చుని నిద్రపోయేవాళ్ళున్నారుగా అని అనవచ్చు. అలాంటి వాళ్ళకు వచ్చేది నిద్రకాదు. నిద్రకు చక్కని అర్థం ఉంది. దాన్ని ఇక్కడ వర్ణించడం సాధ్యం కాదు. స్వచ్ఛమైన రీతిలో పరాజయాన్నంతా చక్కబరచుకొని,



క్రొత్తబలాన్ని పొందేందుకు పనికివచ్చే విశ్రాంతి కేంద్రమే నిద్ర అనే అంశాన్ని గ్రహిస్తే చాలు. ఇలాంటి నిద్ర కూడా వారికి లేదు. కర్మభ్రష్టులకు లభించదు. దాన్ని కేవలం మరణాసన్న వేళలో మహాకాలుడి ఆహ్వానం అని మాత్రమే చెప్పవచ్చు. అది కొంచెం చేదుగా ఉంటుంది. దాన్ని భరించాల్సిందే.

ఈనాటి విషయమే 'కర్మ'. అందువల్ల ఆ శబ్దం యొక్క వివిధార్థాలే వాడుకోవడం తప్ప వేరే మార్గమే లేదు. కర్మతోనే శరీరం. శరీరం వల్ల కర్మ. కర్మతోనే కైవల్యం ! ఇలాంటి మహాకారం కల్గిన కర్మను శాంతంగా విచారణ చేసి, గ్రహించి, అనుభవించాలి. ఆ అనుభవం కూడ స్థూల సూక్ష్మ రూపాల్ని పొందితేనే దీని నిజతత్వం మనకు గోచరిస్తుంది. అందుకే 'కర్మ అపరిహార్యం' అన్నారు. ఇప్పటిదాకా కర్మను వివేచిస్తూ దాని స్వరూపాన్ని గ్రహించాం. ఇక దాని లోపలి స్వరూపాన్ని తెలుసుకుందాం.

కర్మ యొక్క అభ్యంతర స్వరూపంలో క్రింది అంశాలన్నీ వస్తాయి.

1) దేహప్రధానకర్మ 2) మనేంద్రియ దేహమిశ్రిత కర్మ 3) మనేంద్రియ విచార ప్రధాన కర్మ 4) మనేంద్రియ విజ్ఞానకర్మ 5) మనోవిజ్ఞాన కర్మ – ఇవన్నీ మనస్సులోని స్థూలాంశకర్మలు అని వివేచిస్తూ సాగుతున్నా, ఇవి స్థూలానికి సూక్ష్మాంశాలు, సూక్ష్మానికి స్థూలాంశాలు. నా అనుభవంలో చెప్పాలంటే నిజమైన జిజ్ఞాసువు వీటన్నింటిలో ప్రవేశించి – ఆ ప్రయోగశాలలో తనను తాను పరీక్షించుకోక తప్పదు. అలా చేయకుంటే పరిహారాలు దొరకవు.

మొదటిదైన దేహప్రాధాన్య కర్మ గురించి బాగా వివరించాను. రెండోదేమిటి ? మీరంతా 'కర్మ'గా భావిస్తూ వచ్చిన పూజలు, పునస్కారాలు, యాత్రలు, ప్రదక్షిణలు, వ్రతాలు, నియమాలు మొదలైనవి.

ఇక్కడ మనస్సు, దేహాల అప్రధానం, ప్రాధాన్యం రెండు కలగలిసిన కర్మ కనిపిస్తుంది. అందువల్ల చెప్పుకోదగిన స్థాయిలో మనేంద్రియానికి పురోగతి లభిస్తుంది.

3) ఇలా చింతన చేస్తూ కొనసాగాలి. చింతనశక్తి పెరగాలి. అలా పెరిగితేనే ఒకదాని కొకటి పూరకాలవుతాయి. మనేంద్రియ విచార ప్రధానకర్మ ఒంటపట్టినవేళలో ఆయా పూజా పునస్కారాలు, ఉపాసనలకు సంబంధించిన పురాణమో, ఇతిహాసమో, సాహిత్యమో వీటి శ్రవణాదులు పెరుగుతాయి. అలా ప్రగతి కన్పించిన కొద్దీ సొంత విమర్శనశక్తి కొంచెం కొంచెం పెరుగుతూ పోతుంది.

4) ఇకపై, ఈ పునాదులపై కొనసాగిన కర్మ స్థితి విజ్ఞానమయ మౌతుంది. ఇక్కడ విజ్ఞానం అంటే ఏమిటి ? అనేది అప్రస్తుతం. అయినా తాను గ్రహించిన, ప్రయోగించుకున్న వివిధ విషయాలు, వస్తువుల గురించి కూలంకషంగా ఆలోచించదలుస్తాడు. పూర్తిగా సంతృప్తిగా, చేస్తున్నానో లేదో అని ఆలోచిస్తాడు. ఒక వేళ సంతృప్తి లభించకుంటే – ఆ వస్తువులో, విషయంలోనూ ఉండే కారణాలు, వాటిపై తానుంచిన నమ్మకం వీటి గురించి ఆలోచిస్తాడు. ఇక్కడ మనేంద్రియ ప్రాధాన్యకర్మలలోని చాపల్యం నిశ్చలతను కోరుకుంటుంది. దీన్ని మాత్రమే ఇక్కడ విజ్ఞానమని భావిద్దాం. We call it here as the development of descretion of things perceivable through sense organs and also the matters found and unfound. (దీన్నే మనం ఇంద్రియ గోచరమైన విషయాల వివేచనాశక్తి పెరగడం అంటాం. ఇంద్రియాల ద్వారా మనకు గోచరమయ్యే అంశాలు, గోచరం కాని అంశాలు – రెంటిని విశ్లేషిస్తాం.)



5) ఈ రీతిలో ముందుకు కొనసాగుతూ ఇదివరకే మీకు మనవి చేసిన స్థూల కర్మాంశాన్ని తగినంత మేరకు కరగించుకొని ఉంటాం. దీని లక్షణమూ చెప్పాలా ? ఈ స్థితిలో ఉండిపోయిన వేళ – అయినంతలో ఏకాంతమే ప్రేమ.

> **“నిజానంత స్థైర్యమే శంకుశిలగా స్వచ్ఛందంగా ఏకాంతవాసానికి వెడలి విభిన్న లోకాల చింతల్ని కావాలని మరచిపోయిన వేళ – ఆచారం, జ్ఞానం – వీటి అనుభవ సౌధంలో శాంతి వస్త్రాలపై, స్వానంద పీఠంలో చిత్తమును స్థాపింప అదే సంయమసిద్ధి చూడు. (విశ్వవాణి)**

ఇలా అతని నిరంతర ప్రయాణం సాగుతుంది. ఇక్కడ అతని విజ్ఞానం తన సొంత స్థైర్యంతో విమర్శరంగంలో వైవిధ్యమయ సౌధాలను నిర్మించి ఉంటుంది. ఇక్కడ ఎలాంటి స్థూలప్రయోగం కన్పించకున్నా ఆ మనోవిజ్ఞానం అన్ని రకాల స్థూల సూక్ష్మాల ఆంతరిక విషయాలను బయటికి లాగుతుంది. అంతేకాదు ! లోపలికి ప్రవేశించినప్పుడే వాటి రహస్యాలు మనకు కరతలామలకాలవుతాయి. ఇది సృష్టిలో శ్రేష్ఠుడైన మానవుడు పొందే దేవోన్ముఖమైన దివ్యతాపూర్ణమైన స్థితి – మనోమయస్థితిలో సూక్ష్మకర్మ అని చెప్పవచ్చు. The Sacredness of the seriousness of mental manifestation in human life that which supports for the beauty transformation of divinity in practical field of his self should be really diagnised as Mano - Vijnana Karma i.e. mental science in true sense of it's own.

ఇది వరకే వర్ణించబడ్డ దివ్యమనోవిజ్ఞానమనే స్థితి మానవ ప్రపంచానికి లభించాలని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను. అపుడే అది మానవునికి పూర్ణత్వాన్నందించే దివ్యజీవనమౌతుందని విశ్వసిస్తున్నాను.

ఇక మీకు 'కర్మ' ఉన్నట్లే కదా ! ఇక ఇంకా లోపలికి వెళ్ళాలి. శుద్ధంగా చక్కబెట్టే ప్రయోగం కోసం పెట్టుకున్న కర్మ. ఆధ్యాత్మికానుభవం ప్రకారం అక్కడ కూడ కర్మ అనిపించుకునే ఆ పరిశుద్ధత యొక్క రహస్యమేమిటి ? దాన్ని తెలుసుకుంటేనే కర్మను పూర్తిగా గ్రహించినట్లు ! ఆధ్యాత్మిక క్షేత్రంలో అధి దైవికం దాకా చేసే పరిశోధనలో అది సిద్ధించాలంటే అవసరమైన కర్మ ఏమిటో నేర్చుకుందాం. వినడం, నేర్చుకోవడం ఇలాంటి మోహాలకు దూరమైనది ఇది. దీన్ని నిజంగా నేర్చుకుంటేనే రహస్యానుభవం కల్గుతుంది. దీనికి 'గురూపదేశ'మే మూలం.

అందరికీ కల్గే సందేహం మీలో కూడా కన్పిస్తోంది. అదేమిటి? 'సన్యాస' మా ? కర్మసన్యాసమా ? అబ్బబ్బా ! ఈ విషయం తెలిసిన వ్యక్తి శబ్దార్థం, స్థూలార్థాల వెలకు లభిస్తాడా ? అలాంటి వారే కరువై ఆధ్యాత్మికానుభవం తగ్గింది. కర్మభ్రష్టత తాండవిస్తోంది. సరే ! సత్యదర్శనం చేద్దాం. 'సర్వసంగపరిత్యాగః ఇతి సన్యాసః' ఇది తెలిస్తేనే రహస్యం తెలిసినట్లు ! 'సఖ్య ఇశ్నాతుః ఇతి సన్యాసీ".

మొదటిదాన్ని స్థూలార్థానికి భంగం కలగని రీతిలో జనులు అర్థం చేసుకున్నారు. కర్మ స్వారస్యం (సుకుమారత) గురించి విశ్వవాణి ఇలా అంటుంది.

**"కర్మతో ఉండడమే జనన మరణాల నుంచి విముక్తుల మయ్యేందుకే కదా! రహస్యమును తెలుసుకొనక ముందే**



**శరీరమును త్యజించుట సాధ్యమే ? భాగమును వదిలిపెట్ట త్యాగము కాదా ?" కర్మను పూర్తిగా చేయుటయే కర్మత్యాగము మిత్రమా ?"**

ఇలా గ్రహించాలి. ఆ శుద్ధ తత్వరహస్యాన్ని గ్రహించి భౌతిక కర్మను పూర్తి చేస్తే స్థూలకర్మ త్యాగమనే ప్రక్రియ సహజంగా ఏర్పడుతుంది. అపుడు ఇక్కడ త్యజించే ఆశ, మోహాలకు అవకాశం లేదు. చేసే ప్రేరణకూ ఆస్కారం లేదు. ఇది ఒక శుద్ధమైన అనుభవైక వేద్యమైన స్థితి.

తర్వాత అంతర్ముఖుడై అంతఃకర్మ ప్రేమమయ జీవనం గడిపేవాడే సన్యాసి ! అందుకే 'ఆత్మసఖ్యః ఇశ్నాతుః ఇతి సన్యాసీ' ఆ దివ్యజీవి ఆ రహస్య కర్మ నుండి విముక్తుడౌతాడా ? అంతేకాదు. లోకకల్యాణం కోసం బద్ధకంకణులైన బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠులైన వారు కూడ బహిర్ముఖంగా క్రియావంతులై స్థూలకర్మల్ని ప్రేమతో చేస్తూ చేయిస్తూ ఆదర్శవంతులై కన్పిస్తారు. అలాంటి వారినే మనం 'కారణజన్ములు' అంటాము.

కొంచెం వెనక్కి వచ్చి మొదలు పెడదాం. ఎక్కడికి రావాలో తెలుసా? ప్రస్తుతానికి మనం ఆ మనస్సనే మహారాజుగారి ఆవరణలో పడి తటపటాయిస్తున్నాం. అక్కడ నుంచే 'మనోవిజ్ఞానకర్మ'ను మనం ప్రారంభించాలి. విజ్ఞానం లేనివారైనా, విజ్ఞానం ఉన్నవాళ్ళయినా ఏకాంతంలో ఏర్పడిన ధ్యానస్థితిలో ఉన్నాసరే ఒక స్థితి గోచరించాలి. నిజమైన ఏకాగ్రతను పొందేందుకు అదే ఒక మార్గం. ఆ మార్గం లేదా దాని కల్పన ఛాయామాత్రంగానే గోచరిస్తూ ఉంటుంది. ఆ ఏకాంతంలో అది 'సూక్ష్మకర్మ'. కైవల్యాన్ని పొందే దాకా ఉండే కర్మ. దీని కోసం ఉపదేశం పొందాలి. గురువును ఆశ్రయించాలి. ఉపనయనం జరగాలి. ఆ కర్మరహస్యం మనలోకి దిగాలి. అపుడే ఆ ''సూక్ష్మకర్మ''

ప్రారంభమౌతుంది. ఆ రోజు శుద్ధమైన 'జీవకర్మ' 'మోక్షకర్మ'లకు శాంతిపాఠం ! అపుడు మనోవిజ్ఞానం ఆత్మజ్ఞానాన్ని పొంది, ప్రాణస్పందనతో చేరి సూక్ష్మకర్మలో మిక్కిలి ఆసక్తి కలుగుతుంది. అందుకే దీన్ని నేర్చుకోవాలన్నారు. ఇది కేవలం వింటే వస్తుందా ? అయితే నేర్చుకునేదాకా నేర్చుకోవాల్సిందే. అందుకే మరి! జిజ్ఞాసువు, గురువు వీటి స్నేహం అపుడే సార్థకమౌతుంది.

ఇలాంటి కర్మప్రగతి వికాసక్రమాన్ని వద్దనడం సాధ్యమా ? మార్గం తెలుసుకున్నాక, అందులో సాగుతూ అక్కడ జరిగే పరిణామాలు, సర్వభూతాల ఆంతర్యం, చైతన్యాల సూక్ష్మాంశాల సంగమం – ఇవన్నీ ఆ స్థితిలో రహస్యంగా జరిగే కర్మలే ! చూడండి. ఇదెంత మృదువైనది ! ఇదంతా విడమరచి చెప్పాల్సి వచ్చింది. దీనికి కారణమేమి ? మన దేశంలో శుష్కరాద్ధాంతం చేసే వాళ్ళే వేదాంతులై పోయి, గుణకర్మల సుందర వ్యవస్థను గ్రహించక, కర్మ అనే అంశానికి కువ్యాఖ్యానాలు చేశారు. పరమార్థ రూపకర్మను తెలుసుకోక, వేరేవాళ్ళను తెలుసుకోకుండా చేశారు. అందుకే ఇదంతా వివరించాల్సి వచ్చింది. నిజానికి ఆ బ్రహ్మకర్మలో సాగేవేళ బ్రహ్మేంద్రియాల స్థూలకర్మ కూడా ఏకమై, సూక్ష్మచైతన్యం కర్మలో నిలచిపోతుంది. అపుడు అక్కడ స్థూల సూక్ష్మ విజ్ఞాన విశేషం ఉంది. దాన్నంతా ఇక్కడ విడమరచి చెప్పడం కుదరదు. ఈ రోజు చర్చించిన విషయానికి తగినంత మోతాదులోనే చింతన చేస్తే ఇంతదాకా వచ్చింది.

మొత్తానికి ఆ మనఃప్రాణాలు రెండూ కలిసి తీవ్రంగా ప్రయాణం కొనసాగించేవేళ దానికి లభించే ఆహార విహార వ్యవస్థలన్నీ భస్మీపటలం అయిపోతాయి. అపుడే చైతన్యశక్తి ప్రకాశిస్తుంది. అది మనలో శ్రేష్ఠమైన



వీర్యాన్ని కల్గిస్తుంది. ఇదంతా కర్మకాదా ? దీనికోసం చేసే పయనం కర్మకాదా ? ఈ పరిణామాలతో ప్రయాణం ముందుకు సాగుతుంది. స్వానుభవానికి తగిన రీతిలో అక్కడ మనిషి, వస్తువుల బాహ్యాభ్యంతర విజ్ఞానాన్ని గ్రహిస్తాడు. అక్కడ నుండి పైకి వెళ్లాలి. దాన్నే 'జీవాత్మల సంయోగం' అనండి. ఆ స్థితిలోనే ఉండిపోతాడు. అక్కడ ఆ పరిణామమే కర్మ ! మధురమైన కర్మ ! ఆనందానుభవమనే లక్ష్యం అపుడు నెరవేరుతుంది.

ఇంతవరకూ బాగా శాంతంగా సహకరించారు. మనిషి వైకల్యం బారిన పడి చెడి పోరాదు. కర్మ ప్రాధాన్యం ఎలాంటిది ? అది క్రమక్రమంగా ప్రగతి చెంది, ఆ కర్మ ఉత్కృష్టస్థితిని పొంది కైవల్యం దాకా ఎలా సాగుతుంది ? అది ఎక్కడ శృతం (కాచబడిన) మరియు ఎక్కడ స్థితం అనే అంశాన్ని విన్నాం ! తపస్సు యొక్క తత్త్వ ఫలాను భవం కల్గిన వ్యక్తి ఎలాంటి స్థితిని పొందుతాడనే అంశాన్ని ఇది వరకే గ్రహించాం.

చివరిగా, అద్వితీయానందరూపుడైన పరమాత్ముని నిత్యత్వపు గర్భంలో అణిగి ఉండే సకల భవ్యతాశక్తి, ఆత్మానందం ఇవన్నీ పరిణామంలో 'కర్మస్వానంతస్థితి' అని అనిపించుకుంటాయని మీకు విన్నవించుకో దలచాను. "నమోకర్మణే అఖండానందరూపిణే నమః అచ్యుతానంత పరమాత్మనే నమః" అంటూ ఈ రోజు ఉపన్యాసాన్ని ప్రభువులకు సమర్పిస్తూ స్వీకరించమని ప్రార్థిస్తున్నా.

**సర్వార్పణమస్తు**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# 5. భారతీయ సంస్కృతి

ఈనాటి ఉపన్యాస విషయం 'భారతీయ సంస్కృతి' 'Life wants' ఇలా ప్రకటించినట్లు గమనించాను. సంతోషం. తత్త్వవిచారం గురించి మాట్లాడేవేళ జాతి, మతం, మార్గం, దేశం, భాష, లింగం – మొదలైన వాటికి ఏ మాత్రమూ ప్రాధాన్యముండదు. అది అన్నింటికీ అతీతమైనది. విభిన్న దేశాల ప్రజలు తమ తమ దేశాల్లో జన్మించి, నిష్క్రమించిన మహాపురుషుల, తత్త్వజ్ఞుల విషయంలో గర్వపడడం, తమదేశ సంస్కృతి యొక్క వైశిష్ట్యాన్ని గొప్పగా చాటుకోవడం సహజమే ! 'భారతీయ సంస్కృతి వైశిష్టమే వేరు ! విశ్వంలో ఒక్కొక్క దేశం ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క విషయంలో ప్రగతిని పొందడంతో మనదేశం అనాదికాలం నుండి 'తత్త్వపీఠం' అని అనిపించుకుంది. ఈ మాటల్లో పరమసత్యం లేకపోలేదు. మనదేశంలో అనేక తాత్త్వికులు పుట్టి, గతించారు. ఇక ముందు కూడ జన్మించవచ్చు. అయితే మరి ఇప్పటి మాట ఏమిటి? నాగరికత పేరిట మనం సాగించే ప్రయాణం ఎలాంటి దుర్ఘటనకు దారితీస్తోంది ! ఇచ్ఛామరణం పొందినవాళ్ళు, చిరంజీవులూ పుట్టిన మనదేశంలో అల్పాయుష్కులు అధికం కావడానికి కారణమేమి ? శాంతి, సంయమాల మాతృభూమి అనిపించుకున్న ఈ భారతదేశంలో ధైర్యరాహిత్యం, నియమాల ఉల్లంఘనం, క్షణభంగురత్వం – ఇవన్నీ పెరగడానికి గల కారణమేమిటి? ఇదంతా గమనిస్తే అధఃపతనానికి చిహ్నంకాక, ప్రగతిని సూచించే లక్షణమా? ఈ అధఃపతనమే నాగరికత అయితే అలాంటి నాగరిక జీవనం అన్ని విధాలుగా త్యజించతగినదే కదా !



అరణ్యవాసులనిపించుకున్నా పర్వాలేదు. ఆ అరణ్యజీవనమే దివ్యజీవనం.

ఇలాంటి వికృతికి మూలకారణం – శతాబ్దాలుగా మనదేశంలో నిజమైన తత్త్వరహస్యం చేజారిపోవడమే ! లోతుగా ఆలోచించే ప్రతివ్యక్తికీ ఈ అంశం తెలుస్తుంది. ఇక మనం ఎక్కడ పొరపాటుపడ్డాం ? అనే అంశాన్ని గురించి ఆలోచిద్దాం.

మానవజీవన గమ్యం, జీవితపు అవసరాలు, ఆపేక్షలు – ఇలా విభజించుకుని చూస్తే అర్థం అవుతుంది.

కర్తవ్యం కోసమే జన్మించాం. కర్తవ్యం లేకుంటే ఆ నిత్యగర్భపు అఖండానందానుభవం లోనే ఉండిపోయి ఉండవచ్చు. కర్తవ్యం కోసమే దేహధారణ అన్నాక ఆ దేహం పోషించబడాలి కదా ! తన పోషణ కోసం, పరోపకారం కోసం ఈ స్థూలశరీరం శ్రమించాల్సిందే! ఇతరులపై ఆధారపడడాన్ని త్యజించాలి. మన ప్రాచీనులైన తత్త్వజ్ఞులెవరూ పరావలంబులుగా ఉండేవారు కాదు. ఋషులంతా తమ ఆశ్రమాల్లో పాడిపెంపకం, వ్యవసాయం – లాంటి స్థూలమైన కర్మలు చేస్తూ శిష్యులకు బ్రహ్మవిద్యాదానం చేసేవాళ్లు. కృష్ణభగవానుడు, జనకుడు మొదలైన మహాపురుషుల ఆదర్శం లోకవిదితమే కదా ! కళల ద్వారా దేహపోషణ చేసే సంప్రదాయం వచ్చిన రోజు నుండే తత్త్వరహస్యాలు చేజారిపోయాయి. పరమాత్మ మనకు ఇచ్చిన ప్రజ్ఞ ద్వారా శాంతినాశ్రయించి, సర్వేంద్రియ నిగ్రహంతో శాశ్వతానందం పొందాలి. ఈ విషయంలో వేరేవాళ్ళను హెచ్చరించి లోకకల్యాణం కావించాలి.

బాగా ఆలోచించండి ! విమర్శ అంటే నాస్తికత కాదు. అలా ఎవరికీ భయపడనవసరం లేదు. ఆస్తికులకు, చాలామంది తపస్వులకు కూడ ఈ అపవాదును అందించింది అలగా జనాంగం. చరిత్రను పరిశీలిస్తే 'చార్వాకం' అనే ఒక పంథా కన్పిస్తుంది. వాళ్ళ ఆలోచనాసరళిని పరిశీలిస్తే వాళ్ళు నాస్తికులని చెప్పడానికి వీల్లేదు. సంక్రమణ కాలంలో – ఇప్పటి సంధికాలంలో చార్వాకులంటే – విమర్శనాత్మకంగా ఆలోచించేవాళ్ళు పైకి లేస్తారు. అలాంటి వాళ్ళ సంశయాల నివారణ జరగలేదు. నిర్దిష్టసాధనా మార్గం తెలియదు. సత్యాకాంక్ష ఉంది. కాని సరైన మార్గదర్శనం లేదు. గుడ్డిగా సంప్రదాయాల్ని అనుసరించే విచార శూన్యులను చూశాక, 'ఇదంతా అబద్ధం' అని అంటారు కొందరు. అది వారి తప్పుకాదు. తత్త్వాన్ని తెలుసుకోకుండా తత్వవేత్తల్లా నటించిన డాంబికుల తప్పు.

నాస్తికులు వాళ్ళు కాదు; వీళ్ళు. వీళ్ల నాస్తికులు మాత్రమే కాదు. మంచి ఆలోచనలున్న వాళ్ళను కూడా నాస్తికులుగా మార్చటానికి మూలం వీరే ! ఇదే దృష్టితో బుద్ధుడు, మహావీరుడు – వీళ్ళ మార్గానుసారుల మోక్షకాముకులై, కైవల్యకాములై తపస్సు నాచరించిన సిద్ధమూర్తులు, జిన అష్టాంగంతో సమ్యక్ జ్ఞానాన్ని పొందిన ప్రాజ్ఞులూ ఉన్నారు. వీళ్ళందరూ నాస్తికులేనా ? సమస్త రాజభోగాలను త్యజించి, ఆత్మానందాన్ని, శాశ్వతానందాన్ని పొందేందుకు అరణ్య సంచారిగా మారి, తపస్సు చేసి, స్వానుభవాన్నే ఉపదేశించిన బుద్ధుని మాటల ఆంతర్యాన్ని గ్రహించకుండా అతణ్ణి నాస్తికులుగా వర్ణించేవాళ్ళంతా ఆస్తికులై పోతారా ? వాళ్ళంతా ఆతురతతో ఏదో ఒకటి చెప్పేవాళ్ళు. ఆతురత ఉన్నవాళ్ళకు తత్త్వం ఎప్పుడూ ఆమడదూరంలో ఉంటుంది.



ముగ్గురు ఆచార్యుల్లో వారిని నాస్తికులని ఎవరూ అని యుండరు. వాళ్ళ అనుయాయులు అలా పిలిచి ఉండవచ్చు. అది నాకు తెలియదు. నా జీవితంలో గ్రంథవ్యాసంగానికి అధికమైన అవకాశం లభించలేదు. ఇపుడు అదే మంగళదాయకమని అన్పిస్తోంది. అరణ్యవాసియై, మహాపురుషులైన అచ్యుతయోగి గారి చరణాల రజోకణాన్నై 16 సంవత్సరాలు జీవించాను. ఈ జీవనం మీకు దివ్య మనిపిస్తే అది నా గురువుగారి గొప్పతనం. ఆయన సంసర్గం, కృపవల్ల ఇదంతా జరిగింది. ఇలా జరగకుండా అందరిలాగే నేనూ పదవుల కోసం ప్రాకులాడి ఉంటే ఒట్టి పుస్తకాల పురుగుగా ఉండిపోయేవాణ్ణేమో ! అదలా ఉండనీ !

బుద్ధుడు దేవుని గురించి చెప్పనే లేదు. అంత మాత్రాన ఆయన నాస్తికుడు కాదు. దేవుణ్ణి దేవుణ్ణి గానే తెలుసుకోవాలన్న వ్యక్తి బుద్ధుడు. అతడు బోధించిన ఆర్యాష్టాంగ మార్గం మీ అష్టాంగ యోగమే కాని వేరు కాదు. 'దేవుడు ఉన్నాడా ? లేడా ?" అనే ఈ ప్రశ్నలకు అతడి జవాబు మౌనం. కారణం ? ఉపాధిమయమైన ఈ బహిర్ముఖస్థితిలో ఆ దేవుని మాటెందుకు ? సర్వోపాధులకు అతీతుడు. ఆ నిర్వాణం కోసం సాధించండి ! ఆనందాన్ననుభవించండి. అక్కడ ఉండేదంతా స్వానుభవగమ్యం. ఇది అతని బోధన.

పరమాత్మ ఆనందారాధ్యుడు. ఆనందపు తదుపరి స్థితిని వర్ణించనవసరం లేదు. అతడు వదిలినంత మాత్రాన నాస్తికుడెలా అవుతాడు? మీ ఉపనిషత్తుల ఉపదేశాన్ని బుద్ధుడి బోధనలతో పోల్చి సామ్యాన్ని కూలంకషంగా పరిశీలించండి. గ్రంథాల్ని చదివేవేళలో కూడ స్వతంత్రమైన ఆలోచనాత్మక దృష్టి అవసరం.

ఆ దృష్టితో చూస్తే శ్రీమతి రాయ్స్ డేవిడ్స్ రాసిన Buddhism గ్రంథం ప్రశంసనీయం. ఆమె 37 సంవత్సరాలు చేసిన తపః ఫలితం అది.

తత్వస్థాపన మనేది చాలా కష్టసాధ్యం. మనుధర్మచక్రవర్తి రాజదండాన్ని, ధర్మదండాన్ని రెండింటినీ ధరించడం వల్ల అతనికి స్థాపన సుసాధ్యమైంది. తొలుత భయంతోనైనా అందులోని సుఖం అనుభవానికి రాగా, భక్తి జనించి, చివరకు ఆధర్మం, నియమాలపై ప్రేమ పుదుతుంది. అజ్ఞానవిజృంభణకు అవకాశం అందించడం స్వాతంత్ర్యం కాదు. అదికుతంత్రం. నియమాలకు బద్ధుడై సాగిపోవడమే నిజమైన స్వాతంత్ర్యం! ప్రకృతిలో సూర్యుణ్ణి పరికించండి ! ఋతువుల్ని చూడండి ! అంతా నియమబద్ధం ! సర్వతంత్రస్వతంత్రుడైన ఆ సృష్టికర్త - స్వామిసంకల్పం కూడ నియమ విరుద్ధమైంది కానే కాదు. తమ తమ అంతఃకరణ మోహాల్ని మరచి, అధికారం చేపట్టిన క్షాత్రపురుషుల పరిపాలనలో భారతదేశంలో అంతా సక్రమంగా ఉన్నది. రాజులు స్వేచ్ఛాచారలంపటులు ! బ్రాహ్మణులు స్వార్థపు ఆషాడభూతులు - అయిన రోజున మిగిలిన వ్యక్తులంతా మోసగాళ్ళు! అవిధేయులై నాస్తికులయ్యారు. ఇందులో ఆశ్చర్యమేముంది? మన శిరస్సు, బాహుబలం నైతిక అధఃపతనం వల్ల క్రుంగిపోయాక, కుయుక్తులు, మౌఢ్యాల ఫలితం తెలిసిందే ! అందుకే భారతంలోని పురుషుదు వికృతుడైనాడు. అందువల్లనే క్రమంగా రాజకీయమైన ఆందోళనలు - చెలరేగి ధార్మికమైన కీచులాటలు ఏర్పడ్డాయి. ఈ ధార్మికమైన గందరగోళంలో రకరకాల అవస్థాంతరాలు ఏర్పడి సుల్తానుల రాజ్యంలో దుష్టుల ఆగడాలు మితిమీరాక ఆచరణలో పెట్టబడిన హిందూస్త్రీల బాల్యవివాహం, విధవాకేశ ఖండనం లాంటి అపభ్రంశాలు ఈనాటికి



మతంలోని నియమాలని భావిస్తూ అంధానుకరణలు చేయడం జరిగింది! ఆ నాటికి అవి అవసరం అయి ఉండవచ్చు. ఆ మోహంలో ఉన్నవాళ్ళు ఇప్పటికీ వాటినే పాటించనీ ! అవన్నీ బాహ్యాచారాలు. అవి వేషాలు మాత్రమే ! దివ్యజీవనమైన ఆధ్యాత్మికానుభవానికి వీటి అవసరం లేదు.

ఆధ్మాత్యికజీవితం అవసరమా ? అనే ప్రశ్నకు ఇక్కడ అవకాశం లేదు. అందరూ సాంసారికమైన కష్టసుఖాల్ని అనుభవించి ఒక సూక్ష్మమైన అవ్యక్తానందం ఉందనే అంశాన్ని గ్రహించారు. ఆనందం ఎవరికి అక్కరలేదు ? దాని కోసమే జగత్తులో ప్రతి ఒక్కరూ తటపటాయిస్తున్నారు. దేనినో ఆశ్రయించి, కృంగిపోయి, మిగతా చోట్ల లభించే సంతోషం క్షణికం అని గ్రహించి నైరాశ్యంలోకి కూరుకు పోతున్నారు. అయినా కోరిక మాసిపోదు. ఊరకే ఉండనివ్వదు. దేని స్థూలంలో ఆశ్రయం పొందకనే తనలో తాను ఆనందం పొందేందుకు సాధ్యమైతే, దాని కోసం ప్రతి ఒక్కరికీ తగిన సాధనముంటే ఇక ఆ ఆనందం ఎవరికి వద్దనిపిస్తుంది ?

అలాంటి ఆనందం ఉంది. దానికి తగిన సాధన కూడా ఉంది. అనుభవజ్ఞులు కాకున్నా ఏదో కాస్త చదువుకున్న చాలామందికి ఈ విషయం తెలుసు. దీని కోసం ఎందుకు ప్రయత్నం జరగలేదు ? దీనికి విద్యారణ్యుల వారు చెబుతారు. "లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసనలు కారణం" అంటారు. దివ్యజీవనప్రాప్తికి బోలెడన్ని మాటలెందుకు ? "ఉత్తిష్ఠత ! జాగ్రత ! ప్రాప్యవరాన్ని బోధత" ఈ మూడుమాటలే చాలు. సామ్రాజ్యాన్ని స్థాపించిన విద్యారణ్యులంతటి మహానుభావులే లోకవాసనవల్ల బాగా బాధపడ్డారన్నాక కీర్తికాంక్షతో రాజకీయాల్లోకి దూరేవాళ్ళ స్థితి ఎలా ఉంటుంది ? లోకవాసన కళ్యాణకరమే ! ఎవరికి?

సత్యస్థాపకునికి ! ఎప్పుడు ? సత్యస్వానుభవానంతరం. వేరేవాళ్ళకు చెబుతున్నా, "మాటలు వద్దు" నేను పలుకుతున్నా మీరు చూస్తున్నారు ! అయితే నేను మాట్లాడుతూనే తెలుసుకుంటున్నాను. ఎలా ? మీ ఊహకు అందదు ! వేరే వాళ్ళ ముఖకవళికలు, అంగవిన్యాసాలు, మనోభావతరంగాలు వాయు తరంగాల్లో మిళితమై వచ్చి తాకగా ఆ ఈశ్వరచైతన్యంతో తెలుసుకుంటున్నాను. మీ సంశయాలు వచ్చి నా తలను స్పర్శిస్తాయి. ప్రజ్ఞను మేల్కొలిపి విషయాన్ని బయటికి తెస్తాయి. అక్కడక్కడ పుట్టే వినూతన సమస్యలకు ప్రజ్ఞాతీవ్రత ఉద్దీప్తమై సత్యగర్భంలోకి మునిగి సమాధానాన్ని అందిస్తుంది. అది శోధన ! అలాంటి శోధకులే వ్యాసపీఠం అధిరోహించి ఉపన్యాసాలు చేయాలి. ఇది మా గురువాక్యం ! వ్యాసపీఠంలోనూ అతడు విద్యార్థి అయితేనే తత్త్వవేత్త! ఆ స్థానం గర్వప్రదర్శన కోసం ఉండేది కాదు.

ఆధ్యాత్మిక జీవనం ఎవరికి కావాలి ? ఎవరికి అక్కరలేదు ? అందరికీ కావాలి. ఎవరికీ వద్దు అని అనిపించరాదు. అయితే ఈ రోజుల్లో జరిగిందేమిటి ? వద్దు – వద్దే వద్దు అనే స్థితి కన్పిస్తోంది? ఎందుకు ? కేవలం పాండిత్యమనే అహంకారంతో, శాంతిలేని, సాధనారహితులైన వ్యక్తుల మాటల్లో సత్యం బయటికి రాజాలదు. సత్యమనేది అనుభవ గమ్యం. ఆ అనుభవానికి అనువాదమే మాట. తత్వవేత్తల మాటే సత్యపునీడ అన్నవేళలో పుస్తక పాండిత్యం ఉన్న అనుభవహీనుని వచనం. అలాంటి మాటను నేర్చుకున్న వాచాలురు అవ్యక్తరాక్షసులు. ప్రాచీనకాలంలో శారీరక బలం అధికంగా ఉన్న వ్యక్తరాక్షసులు తపస్వులకు, సాత్విక జీవులకు స్థూలంలో ఇబ్బందుల్ని కల్పించేవాళ్ళు. ఇపుడు శారీరక బలం తక్కువ ! మనోదారుఢ్యం లేని



మోహాంధులు మేధస్సును దుర్వినియోగం చేసి స్వానందంకోసం శ్రమించకుండా జిహ్వాచాపల్యంతో చదువుతూ, చెబుతూ కాలక్షేపం చేశారు. దాని ఫలితంగా మనకు తత్త్వం దక్కనే లేదు. వీళ్ళ జీవనంలోని అపభ్రంశత్వం వేరే వాళ్లల్లో కూడా తత్త్వం పట్ల అసహ్యాన్ని కల్గించింది. అందువల్ల ఈ అవ్యక్తరాక్షసుల కారణంగా ఎంతోమంది సత్యాకాంక్షుల ఉత్సాహం చచ్చిపోయింది. ఇపుడు ఈ సంక్రమణ కాలంలో తత్వం గురించిన జిజ్ఞాస అంతటా తాండవం చేస్తుంటే నిజమైన తత్వజ్ఞులు వచ్చి హెచ్చరించినా వినిపించుకోనంతటి మత్తు మనలో పెరిగింది. వెనుకటిరోజుల్లో జ్ఞానులు చెప్పిన "కలౌ వేదాంతినో ఫాల్గునోయువా" అనే వాక్యం జ్ఞాపకానికి వస్తోంది. వేరే విధి లేదు. వారి వారి కర్తవ్యాన్ని ఆయా జనులు చేయాల్సిందే.

భక్తి భావుకత తనంతట తాను ఉండిపోనీ ! ఆధ్యాత్మిక జీవనం కోసం దాన్ని అందరిపై రుద్దడం వద్దు. అది అవసరమూ లేదు. నానారూపాలు, అవతారాల కథలూ ఇవన్నీ అంతే ! ఈ వైజ్ఞానిక యుగంలో తత్త్వపు రుచిని చూపించేందుకు ఇవన్నీ ఏ రకంగానూ ఉపయోగపడవు. Quilon నగరంలో జరిగిన blood rains కు (1949) ఏదో ఒక కాల్పనిక కారణం చెబితే విజ్ఞానవేత్తలు అంగీకరిస్తారా ? కారణాన్ని శోధించాలి ! దానివల్ల ఎవరికీ హాని కలుగదు. సత్యానికి శోధకుడే సమీపంలో ఉంటాడు.

'అంతా అబద్ధం' అనే మాట తత్త్వజీవనం విషయంలో అసహ్యం పుట్టేందుకు బలమైన కారణం. సత్యాన్ని మరుగుపరచే ప్రతిదీ నశ్వరం – క్షణికం అన్నారేకాని వేరే రకంగా కాదు. కన్పించే సౌకర్యాల్ని, సౌందర్యాల్ని తిరస్కరిస్తే ఎలా ? తాను ఉండే జగత్తునే, తాను ఆశ్రయించిన శరీరాన్నే

అసత్యం అంటే విజ్ఞానవేత్తలు అంగీకరిస్తారా? దివ్యజీవనానికి భౌతిక విషయాలు అప్రధానమైనా – భౌతికపూర్ణతే ఆధ్యాత్మికానికి సరైన పోషణ.

దివ్యజీవనానికి సుఖం అక్కరలేదని కాదు. ధర్మబద్ధమైన రీతిలో చేసే భోగం నింద్యం కాదు. అలాంటి సాధనలో సాగేవేళ – ఓ వైపు జగత్సేవ నడుస్తుంది. మరోవైపు ఆత్మానుభవం కల్గుతుంది. పని పూర్తవుతూ వస్తూనే ఏది, ఎక్కడ, ఎలా విముక్తిని పొందుతుందో పొందనీ ! అనుభవంలో ఉత్తమసుఖం దొరికిన వేళ హీనమైన దాన్ని ఎవడైనా వదలివేస్తాడు ! ఖర్జూరం ఇస్తే చింతపండును వదలివేయడా? ఏమీ ఇవ్వకుండా మాటల్లోనే స్వర్గం చూపిస్తే వినే వ్యక్తి తన చేతిలో ఉండే దాన్నెలా వదులుకుంటాడు ? ఎందుకు వదలి పెట్టాలి? బాహ్యంగా దురాచారులై కన్పిస్తూ, కారణాంతరాల వల్ల అలా ఉంటూ, లోలోపల సత్యం కోసం, శాశ్వతానందం కోసం అవ్యక్తమైన తపన అందరిలో ఉండనే ఉంది. ఈ జగత్తులో నిష్ప్రయోజకమైన వస్తువే లేదు. ఈ విషయాన్ని ఏదో ఒక రోజు మానవుడు తెలుసుకోకుండా ఉండలేడు ! 'పూర్ణమదః' అన్న ఉపనిషత్‌కారులే 'పూర్ణమిదం' అన్నారు. అది మహాపూర్ణం. ఇది గౌణపూర్ణం. ఆ మహాపూర్ణాన్ని గ్రహించాక, ఇదంతా అప్రధానం అనిపిస్తుంది. అది అక్కడ మాత్రమే ! ఆపూర్ణం నుంచే మనం ఈ పూర్ణంలోకి వచ్చాం. దీన్ని పూజించి, గ్రహిస్తేనే ఆ పూర్ణత్వపు గొప్పతనం మనకు తెలుస్తుంది. ఇదే జగత్‌పూజలోని రహస్యం. "సృష్టి ఎందుకు జరిగింది?" ఈ ప్రశ్నను దురాత్ములు వేస్తారు. దానికి జవాబు దొరకదు. దొరకరాదు. అఖండ సృష్టిలో నీ కున్న కర్తవ్యాన్ని గ్రహించు. ఆచరించు ! తర్వాతి విషయం వేరే ! అవసరమైతే దేహంలో ఉండవచ్చు. లేదా వదలి వెళ్ళిపోవచ్చు. అలా వేలకొలది సంవత్సరాల నుండి వచ్చి, పోయిన



సిద్ధపురుషులెందరో ఉన్నారు. చూపించగల్గుతాం అనేది గర్వంతో చెప్పే మాట కాదు. నిజం! ఎందుకున్నారు ? ఇంకా తెలుసుకునేందుకు ! పూర్ణంగా గ్రహించాననే వ్యక్తి ఎవరు ? పరబ్రహ్మ చైతన్యం ఒక ముత్యాలరాశి. మన చైతన్యం ఒక పావు. మన యోగ్యతకు తగినంత మాత్రమే మన ప్రజ్ఞాసంపద. 'నేను తెలుసుకున్నాను' అనేది అబద్ధం! తెలుసుకుంటున్నాను – ఇది నిజం. "ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః" యోగమార్గంలో సాగే వ్యక్తి ప్రయత్నంతో పాపాల్ని (స్థూల, సూక్ష్మ) కడుగుకొని శుద్ధుడౌతాడు. "అనేక జన్మ సంసిద్ధస్తతో యాతి పరాంగతిం" అనేక జన్మల సంసిద్ధితో పరమగతిని పొందుతాడు. ఇది శ్రీకృష్ణుని వాక్కు. మొత్తానికి చాపల్యాలను సంతృప్తి పరచుకోవడం పూర్ణతకాదు. భౌతిక జీవనపరిపూర్ణతే భవ్యజీవనానికి పునాది అంటాను. ఎందుకు ? భౌతికంలోకి వచ్చిన జీవుని పూర్ణతే మనలక్ష్యం అయినవేళ భౌతిక జీవనం తిరస్కృతం కాదు.

ఇక సాధన విషయానికి వద్దాం. రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణ చేస్తే సంతానప్రాప్తి ఔతుందనేది మూఢవిశ్వాసం కాదు. ఆ వృక్షపు దివ్యతరంగాలతో నిండిన గాలిని సేవించడం వల్ల గర్భకోశ దోషాల నివారణ సాధ్యమనేది విజ్ఞాన శాస్త్రవేత్తలకు తెలుసు. అయినా నెమ్మదిగా కొన్ని రోజుల పాటు ఇలా చేస్తూ పోవాలి. ప్రదక్షిణం చేస్తూ బొడ్డు దగ్గర ముట్టి చూసుకుంటే పని అవుతుందా ? సాధకుడు కూడా ఆధ్యాత్మిక మార్గంలో అనావశ్యకమైన ఆతురతను త్యజించాలి. దేహంలోని మట్టితత్త్వం వెళ్ళి, సమత్వానికి చేరుకుని, చిన్మయత్వం ప్రాప్తించేందుకు దీర్ఘకాలం అవసరం లేదా ? మనసు బేజారు చేసుకుంటే సరిపోతుందా ? అందుకే శాంతియుతంగా సాధన చేయడమే శరణ్యం.

సాధనాస్థితిని పొందే ముందు మనస్సులో ఈ కోలాహలం కల్గుతుంది. ఒక గర్భవాసపు సాధనతో జీవికి ఆనందం కల్గుతుంది. దీనికి సిద్ధి నుండి కల్గే ఆనందస్థితి దాకా తీసుకువెళ్ళే సామర్థ్యముంది. సాధనల్లో ఏది శ్రేష్ఠమనేది ఒక ప్రశ్న. సాధనలు అనడం తప్పు. ఆధ్యాత్మిక జీవనంలో మోక్షాలు లేవు. శాంతులు లేవు ! ఆ శాంతికోసం, ఆ ఆనందం కోసం, మోక్షం కోసం ఉండే సాధన కూడా ఒక్కటే !

ఇంద్రియాలు అనేకాలు. వాటి ఆకర్షణలో చిక్కుకున్న మనస్సు చేసే కల్పన లనేకం. అలా ఇంద్రియాలతో, కల్పనలతో, సాగుతూ దాన్నే ఆధ్యాత్మికసాధనగా భావించిన ఘటన లనేకం. వీటికి, మోక్షానికి ఎలాంటి సంబంధం లేదు. అలాంటి సంబంధం కల్గదు. అలాంటి వారి కోసమే "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" అని చెప్పాడు భగవంతుడు. సుకల్ప, వికల్పాలు, వాటికి తగుల్కొన్న సదాచార దురాచారాలకు స్వర్గనరకాది లోకాలు, కష్టసుఖాలు లభిస్తాయే కాని అన్నిటికీ అతీతమైన మోక్షం లభించదు. యుగయుగానికి సాధన మారుతుంది. మరి మోక్షం కూడా మారాలిగా! ప్రజల దేహ ప్రమాణాలు, బలం, మనోదారుఢ్యం ఇవన్నీ వైవిధ్యమయంగా ఉన్నంతమాత్రాన లోపలిస్థితి, విభిన్న భాగాల స్థానాలు లేకుండా పోతాయా ? అలాగే తత్త్వమనేది ఏదో ఒక దేశానికి, భాషకు, మతానికి, లింగానికి పరిమితం కాదు ! జాతి బెడద అనే కోతి మూకల కోసం కాదు.

ఇక్కడ నేను జాతి సంకరానికి కంకణం కట్టుకున్నానని కాదు. స్త్రీపాకమనే నియమం, పరపాకమనే నియమాలు ఇవన్నీఉన్నాయి. ఉండాలి కూడా ! ఇదివరకు ఈ నియమాలుండేవి. దీనికి ఆడంబరం కారణం కాదు. శుద్ధప్రకృతికి అశుద్ధమైన సంపర్కం కుదరదు. ఇది దేహం, మనస్సు,



ఈ రెండింటి విజ్ఞానానికి సంబంధించిందే ! అలా వైజ్ఞానికంగా ఏర్పాటైన నియమాలవి ! గర్వంతో ఏర్పరచిన నియమాలు కావు.

**'విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణేగవి హస్తిని**
**శుని చైవశ్వపాకే చ పండితాః సమదర్శినః'**

అని గీతావాక్యం. కుక్కకు శిష్యునికి చెప్పినట్లుగా తపోమార్గం చూపించాలనేది దీని అర్థమా ? కాదు. సమదర్శి ఎవరు ? ఏ ప్రాణికి, ఏ సమయంలో ఏది అవసరమో తెలుసుకుని, ఆ ఆవశ్యకతకు ద్రోహం చేయని రీతిలో వర్తించే వ్యక్తి. అతడే పండితుడు. జ్ఞాని. వినయశీలి. సత్యదృష్టిలో లోకులకు అతని ప్రవర్తన పక్షపాతమని అనిపిస్తే అది వాళ్ళ అజ్ఞానం వల్లనే !

ఇదంతా ఆలోచిస్తే ఈనాడు తత్త్వవేత్తల ముసుగుల్లో కన్పించే వాళ్ళంతా కపటనాటకం చేసేవారని అనిపించదా ? అలాంటి వారి అడుగులకు మడుగులొత్తుతూ వచ్చిన అంధాచరణలు వర్జనీయా లనిపించదే? మన తరువాతి తరాలకు కూడ ఈ కపట నాటకం చేసే వారే ఆదర్శవ్యక్తులు కావడానికి అవకాశం కల్పించవచ్చా ? తత్త్వవేత్త అయిన వ్యక్తి నిరంతరం దేవుని గురించి మాట్లాడలేదు. విద్య గురించి పదే పదే మాట్లాడవచ్చు.

ముఖ్యంగా ఆధ్యాత్మిక జ్ఞానానికి కావాల్సింది అంతర్ముఖత్వం. మనకు ఇవ్వబడింది మనస్సు ఒక్కటే కాదు. సహాయకంగా బ్రహ్మేంద్రియాలూ ఉన్నాయి. బహిర్ముఖమైన మనస్సుకు అంతర్ముఖత్వం ఎలా అవసరమో, అలాగే శ్రవణం, దృష్టి, ఘ్రాణం, రుచి ఈ శక్తులకూ అంతర్ముఖత్వం కావాలి. వీటన్నింటికీ అక్కడ తృప్తి లభించాలి. అపుడే

దీని బాహ్యచాపల్యం తగ్గిపోయి, చంచలత్వం నశిస్తుంది. ఇక తదుపరి కల్గేదే ఆత్మానుభవం.

ఈ అంతర్ముఖత్వం సాధ్యం కాదనేది అబద్ధం. మనకు తెలియనంత మాత్రాన అది ఎవరికీ అసాధ్యమైనది కాజాలదు. తెలుసుకునేందుకు ఆకలి అవసరం. అన్వేషణ కావాలి. మార్గదర్శకులు దొరుకుతారు. దాన్ని వదలి 'అహం బ్రహ్మాస్మి' మొదలైన వాక్యాల్ని నేర్చుకుని గబ్బు నోటితో అరిస్తే ప్రయోజనం లేదు. అలా ఎక్కడ జరగదు. మందు పేరును మళ్ళీ మళ్ళీ చెబితే రోగం నశిస్తుందా? ఇదీ అలాగే ! studying everything through everything ఇది ఈ నాటి స్థూలవిజ్ఞానుల పద్ధతి. studying everything in one thing ఇది ఆ జీవవిద్యలో ముందుకు సాగి తద్వారా ఆత్మనూ, సమస్తాన్నీ తెలుసుకునే క్రమం ! Studying one thing through everything. This is possible as the result to all. దీన్నే "ఏకోవశీ సర్వభూతాంతరాత్మా" అని అన్నారు. ఆ ఒక్కదాన్నే జ్ఞానులు వివిధ రీతుల్లో వర్ణించారు. 'ఏకంసద్ విప్రా బహుధా వదంతి" ఒక్కటే అయిన 'సత్తునే విశేష ప్రజ్ఞావంతాః విప్రా' వేరే వేరే విషయాలు కాదు. రకరకాలుగా వర్ణించారు.

సుఖాపేక్ష అనేది ప్రతి జీవికీ స్వాభావికం. (Enjoyment is common want of human beings). సుఖాన్ని సత్యంగా, దుఃఖాన్ని అసత్యంగా స్వానందాన్ని స్వతంత్రంగా, పరావలంబనలో లభించే క్షణిక సుఖాన్ని నశ్వరం, బంధం మొదలగు పదాలతో వర్ణిస్తూ వచ్చారు. బ్రహ్మేంద్రియాలు బాహ్యంలో సుఖాన్ని అపేక్షించడం సహజం. వీటికి అంతర్ముఖత్వం లభించి, అక్కడ శాశ్వత సుఖం లభ్యమైనప్పుడే బాహ్య సుఖాపేక్ష తగ్గిపోతుంది. ఆ అంతర్ముఖత్వానికి ప్రయత్నించక క్షణికమైన



విషయాలలో లీనమైపోతే చివరకు మరణం సమీపించిన వేళలో కలిగే ఆందోళనను దాసులవారు ఇలా చక్కగ వర్ణించారు.

**"జంట భార్యలతో పారిపోయేవేళ గోడపడిపోయి బట్టబయలైంది. ఇల్లు దొరకలేదు, ఇంటి గురుతు దొరకలేదు?"** ఇది వారి సత్యసాహిత్యం, నిత్య సాహిత్యం. **'జారత్వపు పాపాలను కడిగేందుకు గోపీజనజారా ! అంటే చాలదా !** వంటి సాహస వాక్యాలు సాధకులకు వద్దు. తమాషాకు చెబుతూంటే క్షమించవచ్చు. సిద్ధపురుషులు, జ్ఞానులు విషయం ప్రక్కన పెట్టండి. సాధకులకు బాహ్య, అభ్యంతర సుఖానుభవాలు రెండూ కావాలి.

**'గుడిలోకి వచ్చిన ఇబ్బంది పెడతారు.**

**గుహలోకి దూరిన కూటికే గతిలేదు'** అనే విశ్వవాణి సంయమ పూర్ణ జీవితాన్నే బోధిస్తుంది. అలా కాకుండా మనస్సులోని సుకల్ప, వికల్పాల వెంటబడిపోతే, అది జీవాత్మల సంబంధాన్ని గగనతలంలో ఒకటి, పాతాళంలో ఒకటిగా మారుస్తుంది. ఎక్కడెక్కడో భ్రమింపజేస్తుంది' అనే మాట నిజం. సుకల్ప వికల్పాల బారి నుండి తప్పించుకుని కటిబద్ధులై సాగితే మనస్సు యొక్క శుద్ధసత్యస్థితి లభిస్తుంది. ఈ స్థితి రావాలంటే ఒక ఆధారం కావాలి. అదేది ? దేని వల్ల మనం ఉన్నామో, ఏది ఉన్నపుడు మనం అంతా చేస్తామో, ఆ ప్రాణుడే ఆధారం ! ఆ ప్రాణుడు ఈ దేహంలో ఎలా ఉన్నాడు ? 'అశనగతః ప్రాణః' అశనాధారిగా ఉన్నాడు. అశనమంటే కూడు కాదు. అలా ఉండి ఉంటే – రోజూ భోజనం చేసే వాళ్ళు చావాల్సిన అవసరం లేకున్నది. తనలోని ప్రాణవాయువును మథించినపుడు పుట్టే ఒక శుద్ధాంశమే అశనం. అదే ప్రాణునికి ఆహారం. ఆ అశనం కోసం ఆ ప్రాణవిద్యే, ఆ ప్రాణయజ్ఞమే కావాలి. అదే జీవవిద్య. ఆత్మను, బ్రహ్మను తెలియపరిచే బ్రహ్మవిద్య. అమృతవిద్య.

"ఆత్మ దేహంలో మొదట ప్రాణాన్ని సృష్టించుకుని, తదుపరి సర్వాన్ని సృజించుకుని, ఆ ప్రాణుని ద్వారా అన్నింటినీ నియంత్రిస్తాడు" అని ఉపనిషత్కారుల వాక్యం. 'సత్తు' ఒక్కటే అయినా దానికి విభిన్న స్థానాలున్నాయి. ఆయా స్థానాల్లో విభిన్నస్థితులూ ఉంటాయి. కొన్ని అర్థమౌతాయి. కొన్ని అర్థం కావు. అయితే కొన్నిటిని అనుభవంతో తెలుసుకోగలం. 'understandable and un-understandable eternities in us"అని అంటాను. మొట్టమొదటివి ప్రాణం మరియు మనస్సులు. ఇంద్రియాలన్నింటికీ చైతన్యాన్ని అందిస్తూ నిరంతరం చైతన్యవంతంగా ఉంచే చైతన్యమే ప్రాణం. రెండోది మనస్సు. ఈ రెండింటి కలయికే సూక్ష్మ సంకల్పం; దానికి కావలసిన శ్రద్ధే భక్తి, ఆ జీవుని కర్మే కర్మ. అదే స్వరూపకర్మ. మర్మాన్ని అనుభవంతో గ్రహించడమే జ్ఞానం. అదే ప్రజ్ఞానం బ్రహ్మస్థితి. అన్నింటి విజ్ఞాన వైశిష్ట్య జ్ఞానం అలవడే స్థితి అక్కడే! తర్వాతి స్థితిలో దాన్ని వివరించే సామర్థ్యం కల్గుతుంది.

"దివ్యే బ్రహ్మపురే హ్యేష వ్యోమ్న్యాత్మా చ ప్రతిష్ఠితః" ఆ ఆత్మదర్శనం! అది ఎవరికి ? "మనోమయః ప్రాణశరీరనేతా ప్రతిష్ఠితోన్నే హృదయం సన్నిధాయ" మనోమయుడై శరీరమంతా సంచరిస్తూ హృదయంలో అధిష్ఠానమైన ప్రాణుని గ్రహించినవాడు ధన్యుడు. "తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరాః, ఆనందరూపమమృతం యద్విభాతి" విజ్ఞానాన్ని గ్రహించి – విద్యాభ్యాసంలో ముందుకు సాగే ధీరునికి ఆనందమే రూపమై అమృతత్వం లభిస్తుంది. అక్కడే ఆత్మదర్శనం. ఆ స్థానమే బ్రహ్మపురి – బ్రహ్మస్థానం. దేహంలో బ్రహ్మరంధ్రమనే స్థానం.

ఆధ్యాత్మికసాధనకు ధర్మబద్ధత అవసరం కాదా ? అనేది ప్రశ్న. ఇక్కడ ధర్మం అంటే ఏమిటి ? అనే అంశాన్ని గ్రహించాలి. అది లేకుంటే



సాధ్యం కాదు. Dharmapatha for gamyasthana and Sarvarpana for salvation" అంటూ ఒకే వాక్యంలో తత్త్వబోధను ముగించవచ్చు. తెలుసుకోగల్గిన బుద్ధిమంతులకు ధర్మానికి రెండు శరీరాలని తెలుస్తుంది. బయటి శరీరం. లోపలి శరీరం. సామాన్యంగా జాతిధర్మం, శిష్యధర్మం, గురుధర్మం, పతి, పత్ని, పితృ, పుత్ర, బంధు మిత్రాది ధర్మాలన్నీ ఆధర్మపు బాహ్యశరీరంలోని భాగాలే ! ఇవన్నీ లౌకికవ్యవహారానికి చాలా అవసరం. వీటితో మాత్రమే ధర్మం పరిపూర్ణం కాదు. అంటే ఆ ఆనందపు లక్ష్యం లభించదు. అందుకే ధర్మంలోని అభ్యంతర విషయాల్ని తప్పక తెలుసుకోవాల్సిందే !

జీవం దేన్ని ఎల్లప్పుడు ధరిస్తుందో అదే ధర్మం. అది ధరించిన ఆ ప్రాణచైతన్యాన్ని ఆశ్రయించి దాన్ని తెలుసుకోవాలి. ఆ స్వధర్మంలో చనిపోతే శ్రేయస్కరం. దాన్ని తెలుసుకోకుండా బయటి దాన్ని నమ్మి, ఆధారపడితే భయానకమే ! "పరధర్మో భయావహః" అని చెప్పడం జీవితంలో అభ్యంతర ధర్మాన్ని గ్రహించాలని చెప్పేందుకే ! వర్ణ ధర్మాల కోసం ఇలా చెప్పలేదు. అలాగైతే దాన్ని బోధించిన శ్రీకృష్ణుడు క్షత్రియ వర్ణం నుండి వచ్చాడు. అన్ని వర్ణాల కార్యకర్తగా మనకు లభించేవాడా ? సారథి పనిచేశాడు. మోసానికి మోసం చేసి వైశ్యబుద్ధిని చూపాడు. చక్రాన్ని ధరించిన క్షాత్రంతోనే గీతలాంటి దివ్యసందేశంతో బ్రహ్మవిద్యనే బోధించాడు. మరి కృష్ణునికి ధర్మభ్రష్టత అనే ఆరోపం సరిపోతుందా ? అతడు దేవుడిగా కూడా కన్పించాడంటే ధర్మపు లోపలి అంశాల్ని తెలుసుకోవాలిగాని, దాని బాహ్యశరీర పరిశీలన మాత్రమే చేయరాదు. కృష్ణుని ప్రతివాక్యమూ ఆధిభౌతికం, ఆధ్యాత్మికం. ఆధి దైవికంగా ఉండడం వల్ల అలనాడు అర్జునునికి, ఈనాడు అందరికీ ఉపదేశాత్మకంగా

ఉండిపోయింది. అర్జునుడు అజ్ఞాని కాడు. వివిధశాస్త్ర పరిచయం లేని మూఢుడు కాడు. అధీరుడు కాడు. అలాంటి యోగ్యుడు కావడం వల్లనే శ్రీకృష్ణుడు అతనికి భగవద్గీతోపదేశం చేశాడు. కృష్ణుడు యోగీశ్వరుడనీ, కృష్ణప్రణీతమైన గీత యోగశాస్త్రమనీ, అందులోని ప్రతి అధ్యాయమూ యోగం గురించి చెబుతూ వచ్చింది. మన అందరి అజ్ఞానం కొద్దీ గీతను ఆచరణలో పెట్టడం లేదు. ఈనాడు చదవడానికి మాత్రమే పరిమితమైంది. ఈ విషయాన్ని గమనించిన సాధకుడంటాడు.

**"ఆది నుండి ఆగమించిన జీవుడు తన ప్రాణములను స్థిరముగా స్థాపించి మరల తమోగుణావళి అధికమై పొరలి, పొరలి గీతగీసిన గీతనంతా దాటివేసె అతడు ఆవేదనలు కలుగు ఆర్తుడయ్యె శ్మశానమందున అంధ సంప్రదాయము లను ఆచరించు జనులకు బంధమోచనమ్మనునది ఏ రోజున జరుగునో"** అంటూ కనికరం చూపిస్తాడు.

'సత్యసాహిత్యం, అనుభవజ్ఞుల మాటలన్నీ మానవుణ్ణి హెచ్చరిస్తుంది. "నమస్తే వాయో! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి" అని ఉపనిషత్తు ఘోషిస్తోంది ! "తపస్విభ్యోధికోయోగీ, తస్మాద్యోగీ భవార్జున" అని కృష్ణ భగవానుడాదేశిస్తాడు. ఇక్కడ తపస్సు వేరు. యోగవిద్య వేరు అని అర్థం కాదు. జీవాత్మ సంయోగమే యోగం. అది జరిగేంతదాకా విద్యలో సాగుతూ తపించే వ్యక్తి తపస్వి. అతని విద్యాభ్యాసమే ప్రాణజపం ! జీవాత్మ సంయోగం అయిన వేళ అతడు 'యోగి' అనిపించుకుంటాడు.

**'నాలోన నీవున్న కనులు కాంచగలేవు నిన్నెట నేనింక వెతకాలి స్వామి ! స్తనములకు చేర్చినను దూడ క్షీరము ద్రాగ కున్న నింకెవరు పాలను పోసి పెంచెదరు ?"**



అంటుంది విశ్వవాణి. ఇంత విస్తృతంగా సజీవమైన సాహిత్యమున్నా ప్రత్యక్షసాధనలో నిలిచిన వాళ్ళు కొన్ని శతాబ్దాల నుండి కన్పించక చాలా రాద్ధాంతమైంది. ఆ బ్రహ్మవిద్యను తెలుసుకున్న వ్యక్తి నుండే మనకు ఉపదేశింపబడాలి. చదివి, విని, అభ్యాసం చేస్తే అది రాదు. అందుకే 'నగురోరధికం' అనే వాక్యం వచ్చింది. ఆ జీవవిద్య, ఆదివిద్య, నిత్యగర్భంలోంచి – ఆ హిరణ్యగర్భ పరమాత్మ నుంచి పరంపరా గతంగా వచ్చింది. ఇక మున్ముందు కూడా ఇలాగే జరుగుతుంది. అందుకే కృష్ణుడు గీతలో నానుండి సూర్యునికి, అతని నుండి యమునికి ఈవిద్య వెళ్ళిందని వివరించాడు.

ఇది మన భారత సంస్కృతి యొక్క వైశిష్ట్యం. ఆ బ్రహ్మవిద్య! ఈనాడే ముంది ? మనవాళ్ళు దాన్ని జారవిడిచి మాటలతోనే కోటలు దాటుతున్నారు. మిగతా లౌకిక విద్యలన్నింటిలో విదేశీయులు మనకన్న చాలామందున్నారు. అపరవిద్య కోసం శ్రమించక, 'పరావిద్య' కోసం జ్ఞానాన్ని పొందక తపించే మిమ్మల్ని చూసి విదేశీయులు ఏమంటున్నారో తెలుసా ? "Indians always speak about philosophy, due to sense weakness" ఒక జర్మన్ తత్త్వవేత్త అన్నమాట ఇది !

అందువల్ల 'ఇకచాలు' అనాలి. మనం ! 'ఉత్తిష్ఠత ! జాగ్రత! ప్రాప్యవరాన్ని బోధత! లేవండి ! జాగృతులు కండి ! భూతపూజ వద్దు ! జరిగినదానికి బాధపడడం వద్దు. తెలిసిన వాళ్ళ నుండి ఉపదేశం పొందండి. ప్రాణుణ్ణి మనః ప్రాధాన్యతతో సమ్మిళితం గావించు. ఆ గురువుగారి మార్గదర్శనంలో శ్రద్ధాయుత రీతిలో సాధన చేస్తూ ముందుకు సాగిపో! మున్ముందు ఏమేముందో మీరే గ్రహించ గల్గుతారు. ఇదంతా తెలుసుకునేందుకే సుమా ! అయితే వ్యర్థ ప్రలాపాల ద్వారా కాదు.

అనుభవంతో గ్రహించాలి. No sectarian thesis is complete and end by itself. జాతి, మతం, మార్గం – వీటిని స్థాపించిన వాళ్ళు సత్యాన్ని పూర్తిగా తెలుసుకున్న వాళ్ళు కారు. దాంట్లోని ఒక్కో విషయాన్ని గ్రహించినవాళ్ళు మాత్రమే ! చూసిందాన్నంతా చెప్పేందుకు అనుభవజ్ఞునికి అనుమతి లేదు. అతడు తాను నడిచిన మార్గం – తాను నేర్చిన విద్య గురించే చెబుతాడు! అలాంటి మాటలే ఉపనిషత్తు, శాస్త్రం మొదలైనవి. ఇవి పరమసత్యాలు. ఎవరికి ? అందులో చెప్పిన సాధనలను ఆవలంబించే వారికి ! దాసులకు సులభ మార్గాలు; వేరే వాళ్ళకు అసత్యపథాలు.

స్థూలంగా చేసే పూజలన్నీ నాస్తికులైన శూద్రుల్లో ఒక నమ్మకాన్ని పుట్టించేందుకే ! వేదాల్లోని అనేకమైన పూజలు, ఆచరణలు అలాంటివే ! స్నానం చేయమని చెప్పాల్సిందెవరికి ? శుచిత్వం అంటే తెలియని శూద్రునికి! అయితే ఉపనిషద్వాక్యాల విషయం అత్యున్నతం ! అది ఆధ్యాత్మిక జీవితానికి చాలా అవసరం ! అదే భారతీయ సంస్కృతి విశ్వసంస్కృతికి కూడా అదే పఠనీయం ! మా నాన్న అబద్ధం చెప్పినా దాన్ని నేను ఖండిస్తా. గర్వంతో కాదు. ఆత్మప్రతిష్ఠ కోసం కాదు. సత్యం కోసం ! ఈ అఖండ విశ్వంలో నేను చెప్పే విషయం తప్పని సిద్ధాంతీకరించే వాళ్ళుంటే రావచ్చు. సిద్ధాంతీ కరించనివ్వండి. నేను తలవంచుతా. సత్యం కాకున్నా అదే కావాలనే మూర్ఖత్వం నాకవసరం లేదు. ఇది ఎవరికీ శ్రేయస్కరం కూడా కాదు. నా సిద్ధాంతాన్ని తప్పని నిరూపించడం సాధ్యం కాకపోతే – దాన్ని స్వీకరించండి ! సాధించండి ! ఆనందం లభిస్తుంది ! ఈ మాట అనుభవంతో చెబుతున్నా.

ఈ అనుభవపు విద్య ఒక్కటే ముక్తికి సాధనం. మిగతావన్నీ కువిద్యలు ! దుర్విద్యలు !



ఇది నాగురువుగారి మాట! ఉపనిషత్కారుల బాట ! కృష్ణుని గీతగా భావించండి ! ఆది నుండి దీన్నే బ్రహ్మవిద్య, జీవవిద్య, అమృతవిద్య, ప్రాణవిద్య మున్నగు శబ్దాలతో దీన్ని పిలుస్తూ వచ్చాం. ద్వాపరాంతంలో కృష్ణుడు చివరకు 'ప్రాణాయామం' చేయండనడం గోచరిస్తుంది. దీన్ని విన్నంతనే చాలా మంది భయపడతారు. ఎందుకు? దీన్ని చేసిన వారంతా రోగం, బుద్ధి, భ్రమణం, ప్రమాదాలు – వీటికి బలైపోయారు. అయితే వాళ్ళు చేసింది కృష్ణుడు చెప్పిన 'ప్రాణాయామం' కాదు ! గురువు నాశ్రయించక ఊహకొద్దీ ముక్కుతో చేసే కోతి చేష్ట మాత్రమే ! అది ప్రాణాయామం కాదు. ప్రాణహింస! అలాగైతే మరి ప్రాణాయామం ఏది ?

మన ప్రాణుడు ఉండేది మన దేహంలోపల ! బయట కాదు. అతనికి ఆయామం అందించాల్సింది దేహంలోపలే కాని బయట కాదు. తల్లి గర్భంలో శిశువుకు ఇది సహజ క్రియ. అయితే నేలపై పడినంతనే బయటి గాలితో సంయోగం, ఆహారాది దోషాలు, కఫాది వికారాల వల్ల శిశువు ఆక్రియను పూర్తిగా మరచిపోయింది. దాన్నే గురువు ప్రత్యక్షంగా చూపించాలి. అదే ఉపదేశం. నోటిలోని శబ్దం నిశ్శబ్దమై, స్వశబ్దమై, ఊర్ధ్వముఖంగా బయలుదేరాక నాదబ్రహ్మ యొక్క జ్ఞానం కల్గుతుంది.

దీనివల్లనే ఆయువు వృద్ధికావడం సాధ్యం. ఎందుకు ? దొంగల్లా బ్రతికేందుకు కాదు. ఆ 'పరాంగతిం' అనే లక్ష్యాన్ని అందుకునేందుకు. తత్త్వాల విషయంలో ఈ నలుగురితో చర్చించి, తెలియజేయడం సులభం. ప్రయోజనకరం కూడా. ఎవరికి ! 1) అన్ని శాస్త్రాల్ని కూలంకషంగా అభ్యసించిన వ్యక్తికి 2) మహానాస్తికునికి 3) విశ్వాన్ని పరిపాలించగల్గిన వ్యక్తికి (Dictator of the universe or at least a nation) 4) కేవలం

ఆర్తునికి.  మొదటి ముగ్గురికి తెలియజేస్తే మన పని సులభం. తత్త్వస్థాపన సులభం ! చివరికి వ్యక్తికి చెబితే – వైయక్తిక కల్యాణం జరుగుతుంది.

చాలా మాట్లాడాను ! నిజం ! వాగ్దోషమూ ఒక దోషమే ! అయితే నాలుక తల్లిగా, భార్యగా, వేశ్యగా ప్రవర్తిస్తుంది. చివరిది కాకూడదు. వ్యవహారంలో రెండవదిగా మారి తగిన సలహాలందిస్తూ ఆత్మవిషయంలో హెచ్చరించే జననిగా మారితే ఆ వాక్‌దోషాలన్నీ తొలగిపోతాయి. ముఖ్యమైన దాన్ని చూసే వేళలో మాత్రం ఈ మూడింటిని నియంత్రించాల్సిందే !

ఏకైకమైన ఆ ప్రాణాయామమార్గంలో సాగేందుకు, భవిష్యత్తులో మునిసంతాన సామ్రాజ్యపు సత్ప్రజలుగా మారేందుకు ప్రాణవిద్యను ఆశ్రయించండి ! సాధించండి ! సుఖాన్ని పొందండి !

**ఓం శాంతిః శాంతిః శాంతిః**



# ౬. జీవితం

"నేను ప్రవచన చాపల్యం ఉన్నవాణ్ణి కాదు" అని వశిష్ఠులు భరతునికి చెప్పారట ! నాకు కూడ నా ఉపన్యాసం విని పొగడాలి, విమర్శించాలనే కోరిక లేకున్నది. ఉండకూడదని ఆ దేవుణ్ణి ప్రార్థించే వాళ్ళల్లో నేనూ ఒకణ్ణి !

'నన్ను పొగడి పొగడి బంగారు శూలమునకు గుచ్చిరయ్యా" అనే శరణ్యుల వాక్యం సత్యానికి ఎంత సన్నిహితం ? ప్రజ్ఞావంతునికి పొగడడం వల్ల గర్వం ఎందుకు కలగాలి ?  ఈ ప్రశ్నను పక్కన పెట్టండి ! రాజసాది అహంకారాలు లేకుంటే సత్వగర్భంలోనే ఉండిపోవచ్చు. కేవలం సత్వగుణ ప్రధానంగా ఎవరైనా ఉంటే వాళ్ళకు నమస్కారం. మాట్లాడే వ్యక్తి మోహితుడుకాకున్నా అరసికుడు మాత్రం కాకూడదు. సభలో పండితులుండాలి. అతని ప్రౌఢిమ సదుపయోగం అయ్యేందుకు ఆస్తికులు, భక్తులు కావాలి ! సత్యాన్ని గ్రహించి అనుసరించేందుకు ! విమర్శకులు కావాలి. చికిత్సాత్మకబుద్ధితో మార్మికమైన మాటలు గూఢార్థాన్ని వివరించగల్గే పనికోసం ! చార్వాకులు అంటే సత్యవ్యతిరేకులు కూడా కావాలి. వీళ్ళంతా ఉంటేనే వక్త ప్రతిభకు ఒరిపిడి రాయి ఉన్నట్లు ! అలా అన్ని రకాల వారికి ప్రేమమయరీతిలో మాట్లాడి సత్యాన్ని తెలియబరచడమే సత్యాకాంక్షి కర్తవ్యం. అతడే నిజమైన వాగ్మి. **"ఆత్మతోనే పుట్టి విశ్వాత్మతో కలసి ఉపకరించి పరమాత్మ పాదాల పడి పుష్పమైతే అదే వాక్యమన్నా !"** అంటుంది విశ్వవాణి. అలాంటిదే 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్' అనే వాక్యం. మాటలో మాధుర్యం (సత్యసౌందర్యం) లేకుంటే  తత్త్వం లాంటి గహనమైన విషయం నీరసమని అనిపించదా? అలాంటి అంశాన్ని

చూశాకే ఒక విదేశీయుడు. "What is philosophy ? Blind man searching a black cat in a dark room" అని అన్నాడట. (వేదాంతం అంటే ఒక గుడ్డివాడు చీకట్లో ఒక నల్లపిల్లిని వెదకడం లాంటిదట).

స్థూలంగా 'జీవితం' అందరికీ తెలిసిందే అయినా దాన్ని విశిష్టమైన రీతిలో చూద్దాం. "జీవితం" అంటే ఏమిటి ? ఎలాంటిది? ఎవరికి ?

జీవితం కావ్యమయం. అక్కడ వైవిధ్యం ఉంది. అందం, అసహ్యం, ఆశ్చర్యాలతో కూడినది. అద్భుతమైనదిగా కన్పిస్తుంది. అర్థంకాని రీతిలో అది తోస్తుంది.

'జీవితం, చరాచరాలకన్నింటికీ ఉంది. అయితే దాన్ని అర్థం చేసుకోవాల్సింది మానవులు. 'జీవితం' ప్రవాహోపేతం. ఆ నదికి ఇరువైపులా వైవిధ్యమయ వాతావరణం ఉంది. నది వద్ద ఏమేముంది? నీటిలో తనువు ఉంది. తీరంలో వేడిమి ! మళ్ళీ నీటిలో చేపల సయ్యాట! పక్షుల కలకలం. చూడటానికి పైన స్ఫటిక నిర్మలజలం. మడుగు అడుగు మొసళ్ళు తిమింగలాలు ఉన్నాయి. లోతుగా మునిగితే ముత్యములు లభించవచ్చు. నది నీరు వేడిమి వల్ల వేడి పాత్రతో శరీరం కన్పించినా వాస్తవం అలా లేదు. శబ్దాల నేపథ్యంలోని భావాన్ని గ్రహిస్తే అదే భాష! అలాగే జీవితం.

జీవితం ఖచ్చితంగా ఒకే రకంగా లేదా ? నదీతీరంలో ఒక వైపు నగరపు గందరగోళం, వెలుగులున్నాయి. మరోవైపు రమ్యవన ప్రశాంతత! జీవితంలోనూ సౌందర్యం, రమ్యతలను అన్నిచోట్లా సమానంగా దర్శిస్తూ సాగాలి. అదే జీవన వైశిష్ట్యం.



జీవితానికి అనేక ముఖాలున్నాయి. Materealism యాంత్రిక జీవితం – అంటే స్థూలకర్మబద్ధతతో కూడిన క్రమశిక్షణాత్మక జీవనం, బౌద్ధికజీవనం, ఆధ్యాత్మిక జీవనం. ఇలా చివర్లో చెప్పిన ఆధ్యాత్మిక జీవనానికి లక్ష్యమొకటే ! ఫలం లేదు. Teachers degree is student's aim; pass in class is fruit ! ఇలా అందరూ నమ్మిన విధంగా బ్రహ్మానందమే జీవితలక్ష్యం అయినా మానవమనస్సు యొక్క క్రమపరిపక్వత, ప్రజ్ఞోజ్వలత్వ, సత్యాచరణం – ఇవన్నీ సత్యప్రయాణంలోని దశలని చెప్పాలి. ప్రగతి చిహ్నాలని అనాలి. జీవితాన్ని నిర్మించుకోవాలని భావించే సత్యసౌందర్య ప్రేమికులకు అవి ఫలాలు – ప్రసాదాలు ! ఆ పక్వతకు జీవితంలో అవసరమైన అనేక ఫలాల్లో ఆనందపు అపరావతారం లాంటిది సాహిత్యం.

'సాహిత్యం' ఏమిటి ? కవి కానుక ! కవి ఎవరు ? భూత భవిష్యద్వర్తమానాల్లోని అంశాల్ని సమదృష్టితో వీక్షించి, జనజీవనంలోని అపభ్రంశత్వ నివారణకై, పక్వతకై, సౌందర్యానికి, సరళతకు, సర్వాంగపరిపుష్టికి అవసరమైన అంశాన్ని, దేశకాలాలకు తగిన రీతిలో ఆ తరానికి తెలిసే విధంగా – వారి మాటల్లో అందించే వ్యక్తి కవి ! అతని కానుకే కావ్యం ! కథ కావ్యం కాదు. చరిత్రే కావ్యం కాదు. కథల్లో, చరిత్రల్లో ఆయా వ్యక్తుల నిదర్శనం వల్ల జీవితపు విధి నిషేధాల్ని నీదిగా మార్చుకోవాల్సిన ఆదర్శాన్ని చిత్రిస్తాడు కవి. ఎవరితో ఏ మాటలు పలికిస్తే బాగుంటుంది ? అక్కడే కవి వైశిష్ట్యముంటుంది. 'త్యాగము' కావ్యంలో రామలక్ష్మణులు, సీత – ఈ ముగ్గురూ నివసించే చిత్రకూటంలో ఎవరితో ఏమంటాడు కవి? రాముణ్ణి 'యజమాను' డంటాడు. ఇక్కడ స్థూలంలోనూ స్వామియే! సూక్ష్మంలోనూ అంతే ! అతడు పరమాత్మ అవతారం కావడం

వల్ల! సీతకు 'భక్తి' అంటాడు. ఆమెలో సుకల్పవికల్పాల సంఘర్షణయే లేని భక్తి ప్రాధాన్యం ఉండడం వల్ల' లక్ష్మణుని విషయంలో ఏమనాలి? 'వైరాగ్యం' అంటాడు. భక్తి, వైరాగ్యము, యజమాని – ఈ మూడింటి త్రిపుటియే చిత్రకూటం అంటాడు. ఇది దార్శనిక కావ్యం ! జీవితంలో ఆధ్యాత్మికోన్నతికి సహాయపడేది దర్శనం ! కావ్యమయమైన దర్శనాన్ని అందించే వేళ జీవితంలో ఆశ్చర్యం ఎలా మొదలౌతుంది ? అనే అంశాన్నిక్కడ గమనించండి!

చిత్రకూటాన్ని కవి ఒక సేతువుగా వర్ణించాడు. నిజానికి అది ఒక సేతువే ! భోగజీవన పరమావధి, త్యాగజీవనారంభాలకు సేతువు. ఆత్మానంద, లోకకల్యాణాల్ని కలిపే సేతువు. అదే ఈ చిత్రకూటం ! చిత్రకూట చారిత్రక ప్రాధాన్యం, ప్రాకృతిక సౌందర్యాలు కవిని ఆకర్షించడం సహజమే ! అతడు దాన్ని వర్ణించటం కూడ సహజం! అయితే కవి ఏమంటాడు? సత్యం స్వయం ప్రకాశమానం! చూడగల్గేవాడికి తప్పక కన్పిస్తుంది. అలాగే సత్యం యొక్క లోపలి సౌందర్యం ! ఆ సత్యసౌందర్యంతో సమ్మిళితమైతే అతని ద్వారా అది బయటికి వస్తుంది. అపుడు అతడు కవి ! ఇలా కావ్యం కవిని సృష్టిస్తుంది ! 'జీవనఝరిలో పారే మనిషిని కవిగామలచేందుకు పిలిచిన స్థానమిది ! చిత్రకూటం' అంటాడు కవి !

జీవితాన్ని తెలుసుకోవడం ఎవరికి సాధ్యం ? లక్ష్మణుని లాంటి వ్యక్తికి సాధ్యం. అతని వైశిష్ట్యం ఏమి ? కవినే అడగండి "వైరాగ్యసామ్రాజ్ఞి ఊర్మిళాపతి అనాసక్తి సంపత్ సాధకుడు". ఊర్మిళ తపస్సు నైరాశ్యం కాదు. మహత్వాకాంక్షకు ! అన్నప్పుడు విరాగమంటే విశేషరాగం అనే అర్థం. అలాంటి ఊర్మిళాపతి జీవితంలో ఇంకో అడుగు ముందుకు వేశాడా?



"అనాసక్తి సంపత్ సాధకుడు". అనాసక్తి సామాన్యులకు లక్ష్యమే లేని జీవితం అనిపించవచ్చు. అలా కాదు. జీవనం ప్రవృత్తితో ప్రారంభమై, ఆసక్తితోపెరిగి, అనాసక్తిలో నిలిచిపోతుంది. ఆ స్థితిలో నిలిచేవేళ నైరాశ్యం, కొరత, అశాంతి ఇవేవీ ఉండవు. అంతా నాదే! నాదంతా సత్యం కోసమే! నాదంతా సత్యం కోసమే ! అనే తృప్తి ఉంటుంది. ప్రయత్నమే అతని పుణ్యం. ఫలం అందరికోసం ! కావ్యంలో లక్ష్మణుడు ఒక కుటీరాన్ని నిర్మిస్తాడు. దానిపై ఒక జెండాను ఉంచుతాడు. ఇక్కడ కవిగారి దార్శనికతను గమనించండి. "తపఃసంపన్నులైన సాధకులు సాధించి, శోధించి సత్యమును తత్త్వమును సాంఖ్యమని పలికినట్లు సంయోగపురరాజే సాకేతపుర మహారాజు" అని ఇలా లక్ష్మణుని భావాన్ని వర్ణించే నెపంతో దర్శన శాస్త్రాన్ని మనకు అందిస్తాడు కవి ! జీవాత్మల సంయోగపురం (బ్రహ్మపురం, బ్రహ్మస్థానం)లో ఉండే స్వామియే, పరమాత్మే ప్రభువు శ్రీరామచంద్రుడని భావం. ఆ పతాకం ఇక్కడ పరమాత్మ ఉన్నాడనే దానికి సంకేతం. అలాగే శోధించిన తత్త్వరహస్యాలకు సంకేతం. సాంఖ్యశాస్త్రమనేది ఎంత సత్యం ! కవి, కాలం, కర్మల సంయోగం, సౌందర్య వర్ణన, ఉత్తమత్వం, దుష్టత్వం – వీటి మధ్య జరిగే సంఘర్షణ, సృష్టిలోని సహజత వీటిని వర్ణిస్తాడు. అలాగే సంధికాలం ! పగటిపూట కూడా సంధికాలం! ఉత్తీర్ణుడయ్యేందుకు నిష్ఠ చాలా అవసరం అని అంటాడు కవి.

"స్వాహాసంగీతముతో సాగిపోవు నదీజలములలో తమ ఆనందబాష్పాలతోనే అర్ఘ్యమును అందించు కల్యాణకాముకులైన మునుల కర్మనిష్ఠయే పరమాదర్శ"మని కవి పేర్కొన్నాడు.

వేదాంతి అయిన కవి జీవనాదర్శాలను తన కళాకౌశలంతో, ఉత్ప్రేక్షాది అలంకారాలను ప్రయోగించటం ద్వారా వర్ణించగల్గుతాడు. చిత్రకూటం లక్ష్మణునిచే నిర్మితమైన పర్ణ కుటీరం.

"ఓ వృక్షరాజమా ! శ్రీరామచంద్రునికి, సీతమ్మగారికి చామరమై, ఆకులే ఛత్రమై, పక్షిగణాల కంతా తానే ఆశ్రయమై, పుణ్యములు పెంచే ఫలములై జీవన భాగ్యం త్యాగమొక్కటే అనే సందేశము నిచ్చుచున్నదా అన్నట్లు నిలచి ఉన్నావు" అంటాడు కవి. కల్పన కుకల్పనకారాదు. ఉత్ప్రేక్ష ఉల్బణంకారాదు. అలా చిత్రించడం సహజకళ. ఇది దర్శనానికి అలంకారమే కాని అపవాదం కాదు'. ఆ కావ్యంలో కవి మున్ముందు పక్షి ద్వారా రామాయణ కథను ముగిస్తాడు. ఆ పక్షి తన సంతానంలోని ఆతురతను చూసి చెప్పే మాటల్లో దివ్యదర్శన శాస్త్రం దర్శనమిస్తుంది. చూడండి ! "అహంకారంతో కూడుకున్న దృష్టియే తమస్సు – అజ్ఞానం" అన్నిటా వ్యాపించిన మహత్తును తెలుసుకోవడమే తపస్సు ! తనలో తానే ఆనందాన్ని అనుభవించడం ఆత్మానందం ! తాను సర్వశ్రేష్ఠుడని విర్రవీగే మానవుడికి ఇది ఒక గుణపాఠం కాదా ? అదే పక్షి తన క్రితం జన్మ కథను చెబుతూ తన పతియైన ఋషి వైరాగ్యాన్ని ఎంత చక్కగా వర్ణించిందో! "విరాగమే తనకు రాగముగా" ఇక్కడ మనస్సును ఎలా మార్చుకోవాలనే అంశం బోధపడదా ? 'మోహం అంటే వాంతివచ్చే' ఇక్కడ సుఖోపభోగదూషితుడు కాదు. నేపథ్యపు మోహం' "రాయితో కలసి సమాధి స్తంభీభూతమయ్యె". సమాధి అంటే ఏమిటి ? సమాధి రెండు రకాలు. యోగంలో అంతర్ముఖత కల్గే సమాధి. జ్ఞానుల వ్యవహారంలో బహిర్ముఖత్వం, ధీశక్తి సమానంగా ఉండడమే సమాధి !



మున్ముందు ఋషికి పరమాత్మ ప్రత్యక్షమైనపుడు ఋషి యొక్క ఏకాంత ప్రార్థనను విని స్వామి అంటాడు. "విశ్వకుటుంబీ ! ఛ ! ఛ! నీకెక్కడిది ఏకాంత మోక్షం. దాన్ని తెప్పించడం సాధ్యమా! గజం తరచు శరీరంలోకి వచ్చి నవ్వనీ ! మొదలైన మాటలతో జగత్పూజకు అతణ్ణి ప్రేరేపిస్తాడు. ఇక్కడ ఆ కవి రసస్వామ్యం గోచరిస్తుంది. వైరాగ్యం నుండి ఒక్కసారిగా రసపూర్ణత్వానికి వెళతాడు. అతడే ద్రష్ట! ఇక్కడ జగత్తులో (కావ్యంలో) దాన్ని (సత్యాన్ని) అర్థం అయ్యేట్లు చేసేవాళ్ళే ద్రష్టలు.

కావ్యం ఉండేది కళాకౌశల్యాన్ని ప్రదర్శించడానికే కాదు. కర్తవ్య బోధన కూడా చేయాలి. అల్లాంటిదే దర్శన కావ్యం ! ఉపనిషత్కారులు 120 సంవత్సరాల దాకా ధర్మ, కర్మబద్ధమైన జీవితాన్ని బోధించారు. కర్మభ్రష్టత్వాన్ని కాదు ! ఇక్కడ 'ధర్మం' అన్నపుడు 'స్వధర్మం' అనేది వస్తుంది కదా ! జీవితపు స్వధర్మం ఏమిటి ? తనలో తాను నిమగ్నం కావడం! అదే స్వానందస్థితి ! పరధర్మం అంటే బహిర్ముఖమైన ఇంద్రియాల దాస్యం భయానకమైనది. కవి అంటాడు. రహస్యాన్ని తెలుసుకుని సాగాలి. జీవితం దుఃఖమయం కాదు. 'బ్రతుకు శోకము కాదు వెలుగు'. సంసారసాగరం నుండి తపస్సు అనే నావ తరింపజేస్తుంది. అపుడు మన లక్ష్యమైన దివ్యత్వాన్ని మనం అందుకుంటాం. బ్రతుకు సార్థకమౌతుంది.

నడక కుంటుతూ ఉన్నా సరిగ్గానే ఉంటుంది. చేసేది కూలిపని అయినా చింతించకు ! నీ లక్ష్యం మాత్రం ఒక్కటే కావాలి ! చేపట్టిన కార్యాన్ని సాధించే తీరాలి.

జీవితం ఎలా ఉన్నది ? ఎలా ఉండాలి ? అనే అంశాల్ని చక్కగా వివరించే కారుణ్యమూర్తి, కారణజన్ముడే కవి ! అందుకే పొంది వచ్చినవాడు

కావలె' అనే మాట నిజం. పొందింది ఇది వరకు శ్రమించిన దాని ఫలమే; అంటే తన పూర్వజన్మల సంస్కారమే! ఇది నిజమే అయినా, భగవంతుని అనుగ్రహం దొరికితేనే మన బ్రతుకు సార్థకమౌతుంది.

వ్యావహారికజీవనం మొదటలో అపూర్ణంగా కనిపించినా తత్త్వాన్ని ఆశ్రయించాక ఘనీభూతరసపూర్ణమై, అకుంఠితంగా సాగి, ఆనందాన్ని సమీపించడంలో పూర్ణత్వం ! గాలి వస్తువుల రసాంశాల్ని మోసుకుని వచ్చినట్లే ఆ జీవనం ! ఇది 'పృథివ్యాం పుణ్య గంధోస్మి' అనే మాటల్లోని సత్యాన్ని గ్రహించిన సాధకులకు అర్థమౌతుంది.

జీవితంలో నవ్వాలి. నవ్వి, నవ్వించే కళ అవసరం. మనిషిని తీర్చిదిద్దేందుకు నవ్వులాట అవసరం. అయితే వేరేవాళ్ళను నొప్పించేందుకు నవ్వడం తగదు. 'సుఖదుఃఖే సమేకృత్వా' దీని కోసం తత్త్వవేత్త ప్రయత్నిస్తాడు. అయినంత మాత్రాన నిరాశావాదులు, నపుంసకులు – అని తత్త్వవేత్తల్ని నిందించడం అనవసరం. వాళ్ళు ధీరపురుషులు ! ప్రారబ్ధం కొద్దీ వారికి అనేక సంకటాల స్థితి వచ్చింది. లోలోపల వాళ్ళల్లో పూర్ణశాంతి ఉంటుంది! ఇది గర్వంతో చెప్పే మాట కాదు. తన యోగ్యతను కప్పి పుచ్చుకుని, ప్రజలకు తన నుండి కల్గే ఉపయోగాల్ని దూరం చేయడం కూడా పాపమే! అది వినయం కాదు' 'విద్యా వినయ సంపన్నే' ! అనే మాట తత్త్వవేత్తకు వర్తిస్తుంది.

ఎంత తెలుసుకున్నా తెలుసుకోవాల్సింది ఇంకా కొంత జగత్తులో ఉండనే ఉంది. నాలోని చైతన్యం విశ్వాత్మ చైతన్యంలో ఎంత ? చాలా చిన్నది. ఎంత తెలుసుకోగల్గుతుంది ? నాకు ఈ చిన్న శరీరంలోని కళ్ళు, తల, వెన్నెముకలే కన్పించవు. అలాంటివేళ సృష్టిని, అందులో ఉండే



అపార చైతన్యాలను తెలుసుకునేది ఎంతమంది ? జీవితంలో తొలుత నేర్చుకోవాల్సింది వినయం! ఇది నపుంసకత్వానికి ప్రతీక కాదు. జ్ఞానాన్ని నింపేందుకు ! అనాసక్తి అధీరులకు సాధ్యం కాదు. ధీరుడే అనాసక్తి సాధకుడౌతాడు.

జీవితాన్ని పరిపూర్ణం చేసుకునేందుకు గురువు యొక్క మార్గదర్శనం అక్కరలేదనేది అబద్ధం ! మార్గదర్శకుడైన గురువు చాలా అవసరం ! శిష్యుడు కావడానికి కావలసిందేమిటి? వైరాగ్యం ! personal experience of my own life is enough for that ! స్థూలంగా చూస్తే నేను విద్యావంతుణ్ణి కాదు. వయోవృద్ధుణ్ణి కూడ కాను. ఇలా ఉండగా, 'తత్త్వం' లాంటి గంభీరమైన విషయంలో ఆబాలవృద్ధులు, స్త్రీపురుషజాతి మతలింగదేశభేదాలన్నింటినీ విస్మరించి, ఏకీభవించి, ప్రశంసించి, అనుసరించేందుకు ఉత్సాహం చూపడంలో ఆంతర్యమేమి ? కొందరు ఇది నా జన్మసంస్కారమని చెప్పవచ్చు. అదేమైనా నేనెరుగుదును. అదంతా ఆ యుగపురుషుని మహిమ. తనచేతిలో నన్నొక కీలుబొమ్మగా మార్చి ఆడుకుంటున్నాడు!

అతన్ని (యోగి అచ్యుతులవారిని) గ్రహించడం చాలా కష్టం యోగపూర్ణుడైన వ్యక్తిని అతని వ్యవహారంద్వారా తెలుసుకోగోరడం బాలబుద్ధి. దానికి అవసరమైన దృష్టి కోణమే వేరు. దానికి భక్తి ముఖ్యం. స్థైర్యం అవసరం. వికల్పాలకు లోనైన మనస్సులు ప్రజలవి. ఆయనను వాళ్ళెలా తెలుసుకుంటారు ? ఆ సాహసం వద్దు. నన్ను తెలుసుకోండి. అంటే – 'నా ప్రభువుగారి గొప్పదనం ఏమిటో తెలుస్తుంది'. ఇది ఒక రాయిగా ఉన్నది. ఇపుడు ఒక సుందరమైన విగ్రహం. ఆ రాతికి మీ

నొసటిని కొట్టుకుంటున్న మీరు ఈ విగ్రహ సౌందర్యానికి, సౌష్ఠవానికి వశీభూతులౌతున్నారు. దాన్ని చెక్కిన శిల్పిని విస్మరించారు. ఈ విగ్రహానికి దొరికే వ్యక్తావ్యక్త గౌరవాలన్నీ ఆ మహాశిల్పికే దక్కాలి. నా ప్రయత్నం వైరాగ్యం. దాని ఫలం అనాసక్తి. యోగం అతని కృప. ఆ నా ప్రభువు, యోగి అచ్యుతుల కృపా కటాక్షం ! విశ్వమానవ జీవనాన్ని సర్వాంగ సుందరంగావించేందుకు వచ్చిన మహాశిల్పి ! అతణ్ణి ఆశ్రయించి నా జీవితం రూపుదిద్దుకుంటోంది. అందుకే ఆ యోగి ప్రసాదించిన ఆ దివ్యయోగ విద్యనే ఆశ్రయించి, జీవన పూర్ణత్వాన్ని పొందండి. అదే శరణ్యం. అది లేని జీవితం సంఘర్షణే ! నవ్వుతూ కాలం గడుపుదాం. విశ్వపూజను ఆచరిద్దాం !

**"విశ్వమనే ప్రణతిలో బ్రతుకు దివ్వెలు వెలుగుతున్నవి**
**ఆత్మ ప్రకాశమున పరమాత్మ ! నీకు అంకితం స్వీకరించి**
**సంతృప్తుడవు కమ్ము దేవ దేవా"**



# 7. తత్వ సాహిత్యం

**ఓ జిజ్ఞాసు బంధువులారా !**

మానవజీవితమే సమస్యాపూర్ణం. అలలు, అలలుగా సమస్యలు చుట్టుముట్టినపుడే మనలో ప్రజ్ఞ మేల్కొని ప్రగతివశమైన మానవత్వపు బోధకల్గుతుంది. సంశయానికి, సమస్యకూ ఉండే భేదాన్ని మనం ఇక్కడ గమనించాలి. అదా ? ఇదా ? అనే డోలాయమానస్థితే సంశయం. ఇది మనలో వేళ్ళు పాతుకుపోరాదు. విచారమథనం ద్వారా సందేహాలు పటాపంచలు కావాలి. సమస్య అలా కాదు. పూర్ణత్వం పొందేదాకా ఒక దాని తర్వాత ఒకటిగా ఆలోచనలు, పరిశోధనలు, అనుభూతుల్ని పొందుతూ, తృప్తికర సిద్ధాంతాలను ఆవిష్కరిస్తూ సాగడమే సాధకుని అభివృద్ధిశీల జీవన వైశిష్ట్యం.

ఈరోజు నా ఉపన్యాసం కావాలని కోరుకున్నారు. సరే ! ఉపన్యాసం అంటే బోధించడం కాదు. తన హృదయపుటావేదనను ప్రజల ముందుంచి అయినంతవరకూ సమాధానాన్ని తెలుసుకుంటూ పోవడం. ఇక్కడ పరస్పరం ఇచ్చి పుచ్చుకునే సంబంధం ఉంది. మీకు ఆశ్చర్యమనిపించవచ్చు. మాటలు ఆగేంతదాకా మౌనంగా కూర్చున్న మన వల్ల ఇతనికి ఒరిగేదేమిటి ? అన్న ప్రశ్న ఉదయించ వచ్చు. అయితే అలా కాదు. నా సిద్ధాంతాలను ఏకరువు పెట్టేవేళలో మీ నోరు మౌనంగా ఉన్నా మీ మనస్సు మాత్రం మౌనంగా ఉండదు. అది మనలో ప్రతి విషయానికి సంబంధించి సంశయం, సమస్య, కుతూహలం – వీటిని రేకెత్తిస్తూనే ఉంటుంది. ఉపన్యాసం చేసే వ్యక్తి విశాలమనస్కుడై నిత్య విద్యార్థియై కొంచెం ప్రగతి

సాధించినవాడై, "నా విచార ధార ! నా సిద్ధాంతప్రతిపాదన" అనే గర్వభావాన్ని ప్రదర్శించక, "నేను తత్త్వం తెలుసుకోవడానికే బ్రతుకుతున్నా. విశ్వవ్యాప్తమైన మనస్సు నాలో ఉండే తన అంశంలో తత్త్వజ్ఞానాన్ని అన్ని వైపుల నుండి ప్రతిబింబింపజేయనీ" అని వినయంతో సాగాలి. అపుడు ఆ ఆట నిరాటంకంగా కొనసాగుతుంది. అపుడు ఏం జరుగుతుందో తెలుసా ? శ్రోతల మనస్సులలోని సంశయాలన్నీ ఇతని మనోదర్పణంలో ప్రతిబింబించి, ప్రగతి చెందిన అతని మనస్సు అందరి సమస్యలను పరిష్కరించగల్గే తత్త్వరహస్యాలను శోధించి, తన జ్ఞాన భాండాగారాన్ని పరిపుష్టం చేస్తుంది. విషయాన్ని వాగింద్రియం ద్వారా ప్రకటించి, అందరికీ తృప్తిని అందిస్తుంది. ఇది ఉపన్యాసం. ఇలాంటి అవకాశం దొరకడం సంతోషప్రదమే కదా! ఇంకా తెలుసుకునేందుకు అవకాశం ఉంది. మానవుడు జీవిత పర్యంతమూ విద్యార్థియే ! నాకన్నీ తెలుసుఅనడంలో నష్టముంది. అక్కడితో అతని జ్ఞానపిపాస అంతరిస్తుంది. ఇక తెలుసుకునే ప్రయత్నమూ ఉండదు. తెలుసుకోవడమూ ఉండదు. ఎంత తెలుసుకున్నా ''నేనింకా తెలుసుకోలేదు'' అనే జ్ఞానానికి అవకాశం ఉంది. తెలుసుకోవాల్సిన విషయమూ ఉంది.

సృష్టి పరిపూర్ణం ! ఇక కోరాల్సిందేమీ లేదు. కోరికలు నెరవేరేందుకు ఏమేం కావాలో అన్నీ నిండుగా ఉన్నాయి. దాగి ఉన్న వాటిని వెదికి, వాడుకోవడం మనిషి కర్తవ్యం. ఇక్కడే అతని పరిశోధన మొదలు. ఇక్కడ విశ్వామిత్ర సృష్టి లాంటి ఆక్షేపాలు కల్గవచ్చు కదా? దున్నపోతు, మిర్చి – ఇవన్నీ ఇంతకు ముందు లేవని కాదు. వాటిని ప్రప్రథమంగా కనుక్కొని ఉపయోగించడం నేర్చిన వ్యక్తి విశ్వామిత్రుడు. ఆయన శోధించాడే కాని సృష్టించలేదు. (He researched them : did not create)



మన దేహారోగ్యానికి ఆరురుచులు అవసరం. అందుకని కృత్రిమంగా వాటిని తయారు చేస్తున్నాం. ఇది అవైజ్ఞానికం. ఇది వైజ్ఞానిక యుగమని విర్రవీగుతున్నాం ! ఆ షడ్రుచులు నైసర్గికంగా ధాన్యాల్లో ఉన్నాయి. దీన్ని మన ఋషులు గ్రహించి ఉన్నారు. అందుకే వారికి సహజశాంతి కల్గేది. ఇపుడు వస్తువులోని ధాతువుల శక్తుల్ని ఒక వికోపపు స్థాయికి తెచ్చి, వాడడం అలవాటైంది. దీనివల్ల మనస్సు బాగా చపలంగా మారింది.

ఇక్కడ ప్రస్తుతం జగచ్చక్రం ప్రగతిపరంగా ఉందా ? లేక స్తబ్ధంగా ఉందా ? అనేదే ఒక కోలాహలం. (Rotation whether dynamic or Static) ఇది ఒక సమస్యే కాదు. చరిత్ర చెబుతుంది. అనుభవంలోనూ తెలుస్తుంది. జగచ్చక్రం ప్రగతిలో ఉందని. కొన్ని చోట్ల భౌతిక జీవన శ్రద్ధ. సామర్థ్యాలలో ప్రగతి, మరి కొన్ని చోట్ల ఆస్తికత్వం, లోకాంతరాల చింతనం ఇత్యాది భావజీవనపు ప్రగతి. గత కొన్ని శతాబ్దాల క్రిందట ఈనాటి ఉన్నత విచార విప్లవం కనిపించేది కాదు. వైచారిక విప్లవం ప్రగతికి సంకేతం. దీన్ని నాస్తికత్వం, ధర్మనాశం అని దూషించేవాళ్ళూ ఉన్నారు. ఆశ్రయించిన వాళ్ళను, ఆలింగనం చేసుకున్న వాళ్ళను రక్షించే సామర్థ్యం కల్గిందే ధర్మం. ఆ ధర్మం నశించేది కాదు. అదలా ఉండనీ ! ఇక్కడ జిజ్ఞాసువులు అర్థం చేసుకోవాలి. More thinkers are not philosophers అని ఎందుకన్నారు ?

**"నమేధయా న బహునా శ్రుతేన**

**నాయమాత్మా బలహీనేన లభ్యః'** ఇలా వర్ణింపబడిన తత్త్వం, సోమరిపోతులు, బలహీనులైన వ్యక్తులు "Lazy man's brain is devil's workshop" అన్నట్లు ఎల్లపుడు ఆలోచనల్లో మునిగిపోయినంత మాత్రాన

తత్త్వజ్ఞులు కాలేరు. కాజాలరు. దేశ, కాల, లింగ, జాతి వయోభేదాలు లేకుండా అందరికీ సామాన్యంగా సాధనతోనే అనుభవవేద్యమయ్యేది తత్త్వం. అలాగైతే తత్త్వానికి శాస్త్రాభ్యాసం అక్కరలేదా ? (Study of Philosophy). సాధనే కావాలన్నాక విద్యాభ్యాసపు ప్రయోజనమేమిటి? అవిద్యావంతునికి ప్రాశస్త్యమా? అన్న ప్రశ్నలు సహజంగానే ఉద్భవిస్తాయి. అలా ఎన్నటికీ కాదు. పండితునికి అన్ని చోట్లా ఆదరం లభిస్తుంది. స్థానముంది. అయితే ఎవరు పండితుడు ? విద్య ఏది ? శాస్త్రమైన గీత ఏం చెబుతోంది?

**'విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవిహస్తిని**
**శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః'**

ఇక్కడ ఎలాంటి వినయం కావాలి ? వస్తుతత్త్వజ్ఞానం పొందేందుకు ఆటంకప్రాయమైన 'నాకు తెలుసు' అనే గర్వాన్ని దూరంగా వదిలివేసే వినయం, కుక్క నుండి ఏనుగు దాకా అన్నింటిలో ఉంటూ ఆడి, ఆడించే "ఏకో వశీ సర్వభూతాంతరాత్మ" అని వర్ణింపబడిన ఆ చైతన్యపు ఏకత్వాన్ని ఏలా దర్శించాలో తెలుసుకున్నవాడే బ్రాహ్మణుడు. అలాంటి జ్ఞానానికి సాధనమైన ఆ విద్య ఏది ?

జనకుడు, వాల్మీకి – వీరంతా అలాంటి విద్యను పొందారు. సమదర్శనం కలవారు. కాదు అంటే పిలుచుకొని వచ్చిన అవధూత స్థితి కలవారు కాదు. క్రౌంచ మిథునంలో ఒకటి వ్యాధుని బాణానికి బలై క్రిందికి పొరలినపుడు వాల్మీకి మొదలైన వాళ్ళ హృదయంలో కరుణరసం ఉప్పొంగింది. రామాయణమనే సత్యకావ్యాన్ని ఆ మహాకవి రచించాడు. ఇది అతని సమదర్శిత్వపు గొప్పతనం. జనకుడు రాజదండాన్ని, ధర్మదండాన్ని



ధరించి పరిపాలించిన రాజయోగి. సమదర్శనుడు. ఆయాదేహాలలోని చైతన్యపు స్థితిగతుల్ని గ్రహించి దానికి తగిన రీతిలో ప్రవర్తించిన జ్ఞానులు. ఎంతో మంది జ్ఞానుల పేరు తెలియకుండా పోయింది. సిద్ధపురుషులు కూడ చాలా మంది ఉన్నారు. ఒక్క కపిలుని పేరును మాత్రం విన్నాం. కారణజన్ములైన కొంతమంది విభూతులకు మాత్రమే సమాజానికి మార్గదర్శులయ్యే అవకాశం దొరికి, వారి పేర్లు మాత్రం నిలుస్తాయి. 'కీర్తి' కవిత్వంలో తేలడమే తేలడం, మునగడమే మునగడం అన్నట్లుగా జగత్తులో కొందరు మిగిలారు. అంటే కీర్తి రాని జ్ఞానులకు కూడ ఎలాంటి కొరతలేదు.

'జగము నెరుగని వాని ఎద సుందరభూమి' అది అతని నిశ్చలత్వానికి మరింత సహాయం చేస్తుంది. ఆనందానుభవానికి అనుకూలమే!

సిద్ధపురుషులు, ఆనందం ఇవన్నీ అబద్ధం అనడం అజ్ఞానం. మనకు తెలియని విషయాలెన్నో ! విశ్వంలోనే కాదు. మనలో కూడా ! తత్త్వజ్ఞులు చెప్పే 'నేతి నేతి' అంటే ఏమీ లేదని కాదు. ఇంతేకాదని అర్థం ! వారి మాటలకు సరైన అర్థం తెలుసుకునేందుకు "పూర్ణమదః పూర్ణమిదం" అనే మాటతో సమన్వయం చేసుకునే వినయం, విచారశక్తులు అవసరం. ఈ "నేతి నేతి" రెండు పూర్ణాలకు అన్వయిస్తుంది. అక్కడే దాని సార్థక్యం'. ఇలాంటి పూర్ణమైన విశ్వంలో అన్నింటినీ గ్రహించడం సాధ్యమా ? స్థూలంలో ఒక్కో దాన్ని తెలుసుకోవడమే కష్టం. ఇక బ్రహ్మత్వజ్ఞానం గురించి వేరే చెప్పాలా? ఇదంతా వారికెలా సాధ్యమైంది ? Studying everything through everything సాధ్యం కాదు. అన్నింటినీ

తెలుసుకునే విద్య ఒకటుంది. దాన్నాశ్రయించి, దానికి తగిన వినయంతో సాగితే సాధ్యం.

ఆ విద్యను గురించి తత్వజ్ఞులు వివిధరకాలుగా వర్ణించారు. అవే తత్త్వశాస్త్రాలు. అయితేనేం ? తెలుసుకునేందుకు వినయం లేకపోవడం వల్ల సంతతి తప్పుదారిని పట్టుకుంది. అనుభవజ్ఞుల మాటలలోని ఆంతర్యాన్ని తెలుసుకునే శ్రద్ధ కావాలి. మనలో ఉండే భ్రాంతుల్ని వారి మాటల ఆధారంతో సమర్థించుకోవడం వినయం అవుతుందా ? అలాగైతే, వాళ్ళ విద్య మనకు ఎలా సంప్రాప్తిస్తుంది?

చూడండి ! "అశనగతః ప్రాణః ఓం" ఇది బ్రహ్మసూత్ర వాణి. టీకాకారులు ఇక్కడ చేసేది ఏమిటి ? విష్ణువు సర్వశబ్దవాచ్యుడు. అలాగే ప్రాణశబ్దవాచ్యుడు కూడా ! ఇలా ఎలాగెలాగో చెప్పి విష్ణువు సర్వోత్తమత్వాన్ని సాధించే ప్రయత్నం చేస్తారు. ఇక్కడ జరిగిందేమిటి? సర్వోత్తమత్వం మన మాట ఆధారంగా కల్గడం లేదు. ఇతని ప్రయత్నం కొండపైకి రాయి నెక్కించినట్లే ! సర్వాన్ని తెలిపే ఆ విద్య గురించి చెప్పిన ఆ మాటను తాను అర్థం చేసుకుని విద్యాప్రాప్తికి ప్రయత్నించడం వదలిపెట్టి, విశ్వమానవ మార్గదర్శకాలైన వేదవ్యాసుల బ్రహ్మసూత్రాన్ని ఒక sectarian thesis గా చేసే అపరాధం ఒకటి. 'ప్రాణ' శబ్దం వ్యర్థంకాదు. జగత్తులోని లీలలన్నింటికి ప్రాణమే ముఖ్యం. ఇది అందరికీ తెలిసిందే ! ప్రాణం సర్వవ్యాపి. మాలోనూ ఉన్నాడు. అతడు వృద్ధి చెందేందుకు 'అశనం' అవసరం. 'ఓం' అని నోటితో చెప్పడం కాదు. అది ప్రాణుడు విరమించే స్థితి. అంత దాకా ప్రాణుడు అశనాధారిగా సాగితే ముందు ఉపనిషత్తులో చెప్పబడిన "అహమన్నాదో అహమన్నాదో అహమన్నాదః, ఆ – ఊ – ఆ– ఊ – ఇతి కామరూప్యను సంచరన్" అనే మాట అనుభవంలోకి



వస్తుంది. మొదట అశనమంటే ఏమిటనే దాన్నే తెలుసుకోకుండా "ఆ – ఊ – ఆ–ఊ" అని అరిచినంత మాత్రాన ఆకాశగాములు కాగల్గుతారా? అది, అశనాధారిగా వృద్ధి చెందిన ప్రాణుడు తన మూలస్థానాన్ని చేరు పయనంలో పుట్టే ఒక శబ్దం. ఆ విద్యలో సాగుతూ అనుభవం పొందే సాధకునికి ఆ మంత్రం వినడమూ శ్రేయస్కరం.

"అన్నం బహుకుర్వీథ – అన్నం బ్రహ్మేతి వ్యజానాత్ అన్నం న నిందయేత్" మొదలైన అంశాలు చెప్పారు. దీని ప్రాధాన్యాన్ని మనం గమనించాలి. అయితే పరిణామమేమిటి ? 'అన్నం బహుకుర్వీథ" ఈనాడు grow more food campaign వారి ప్రచారం చేసినట్లుంది. స్థూలంగా కావలసిన ఆహారాన్ని పండించడం తప్పనికాదు. మంత్రపు పరమార్థాన్ని గ్రహించలేదని భావం. 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్". ఇపుడు మనం తినే అన్నపురాశిని కుంకుమ మొదలైన వాటితో పూజించి నాట్యమాడే భ్రమాత్మకు కలాపం జరిగింది. అన్నం పండించడం కాదు. చేయడం Literally also these people failed.

వీరి అన్నపు అర్థమే వేరు. విద్యలో ఉండే వ్యక్తికి దీని అర్థం తెలుస్తుంది. అతడు శబ్దకోశాన్ని తిరగవేయడం అవసరం లేదు. అతని స్థాయి మనోమయం నుండి విజ్ఞానమయం అయ్యేవేళ – అర్థకోశంలో ప్రతి విషయం, శబ్దం యొక్క సమాధానాన్ని పొందుతాడు.

ఉపనిషత్కారులు విద్య గురించి చెప్పారు. విద్య, అవిద్య అని రెండు రకాలు. దీన్నే పరావిద్య, అపరావిద్య అని అన్నారు.

దానికి తగిన విద్య ఉండి బ్రహ్మత్వాన్ని తెలుసుకునే ఆకాంక్షతో సాగుదామంటే – అతనికి అనుభవైకవేద్యమైన అనుభవజ్ఞుల వాణి –

సాహిత్యం మనకు అర్థమౌతుందే తప్ప స్థూలమైన అక్షరాభ్యాస పాండిత్యంతో ఆ వాఙ్మయం అర్థం కాదు. చూడండి. "ఈశా వాస్య మిదం సర్వం" అనే వాక్యానికి పరమాత్మ సర్వవ్యాపి అని ఆతురతతో అర్థం చెబితే సరిపోదు. 'తేన త్యక్తేన భుంజీథా' అనే వాక్యంలో "ఈశుడు" శబ్దం దేవుని గురించి చెప్పబడింది కాదనేది స్పష్టం. దేని ఆధారం లేకుంటే మిగతా భూత చైతన్యాలు మిగిలి ఉండజాలవో ఆ సూత్రాత్మకే 'ఈశుడు' 'ఈశ్వరుడు' అన్నారు. వైవిధ్యంలో ఏకత్వాన్ని గ్రహించి అనుభవించడం తత్త్వం – బ్రహ్మవిద్యలో సాగి, బ్రహ్మత్వాన్ని పొంది తత్త్వాన్ని గ్రహించాలి. ఇక్కడ 'బ్రహ్మత్వం' శబ్దానికి అపార్థాలు చెప్పడం తగదు. The concentrated state of all power in its originality (అన్ని శక్తులు తమ నైజస్థితిలో కేంద్రీకృతమై ఉండే స్థితి) అని గ్రహించాలి. ఆది నుండి గమనిస్తే బ్రహ్మత్వాన్ని పొందిన వారనేకులు కన్పిస్తారు. అయితే తత్త్వాన్ని గ్రహించి, విశ్లేషించే తత్వజ్ఞులు యాజ్ఞవల్క్యుడు మొదలైన వాళ్ళు కొందరే ! జగత్తులో తత్త్వస్థాపకులై నిలిచిన వాళ్ళు శ్రీకృష్ణుని లాంటివాళ్ళు ఒకరిద్దరు మాత్రమే!

దేవుణ్ణి ప్రతిమాటలో ఉపయోగించడం తత్త్వజ్ఞులలో లభించదు. ఆర్యుల కాలం నాటి వేదమంత్రాలు మర్మగర్భితాలే! ఆర్యుడు అంటే పూజ్యుడు అని అర్థం. అనార్యుడంటే అపూజ్యుడు. ఋగ్వేద మంత్రాల వల్ల వీళ్ళు గాలి, నీరు, అగ్ని మొదలైన వాటిని పూజించే వాళ్ళు – ఇలాంటి విమర్శలున్నాయి. చూద్దాం. "అగ్ని మీళే పురోహితం" ఎక్కడ ఏ అగ్ని ? ఏ పురం ? స్థూలపురం, స్థూలాగ్నుల సంబంధం, ప్రయోజనం, ప్రమాదాలు అందరికీ తెలిసినవే! దీన్ని చెప్పడానికి ఆర్యుడే కావాలా ? అది వేదం అని గౌరవింపబడేంత గొప్పదనం అందులో ఏముంది ? అంటే అంతరార్థం వేరే ఉంది అని తెలుస్తుంది. ఈ దేహాన్ని నవద్వారాలున్న



పురం మొదలైన వర్ణనల్ని వినలేదా ? దేహమే పురం. దీనికి హితాన్ని అందించే అగ్ని ఏది ? ప్రాణాగ్ని. అంటే వైశ్వానరాగ్ని. వైశ్వానరోపాసన ప్రాణునికి వేణుధ్వానస్థితి ప్రాప్తించే దాకా ! వెదురుగొట్టంతో బయటి మంటల్ని ఊదేవారికి ఇదంతా ఎలా అర్థమౌతుంది ?

అయితే ప్రాణవిద్యను అభ్యసించే విద్యార్థికి రెండు నెలల్లో అనుభవంలోకి వస్తుంది. ప్రాణపు గతాగతిలో మొదట వేడిపుడుతుంది. దానివల్ల ఆహారాదుల కల్మషాలు నశించి దేహానికి మంచి శక్తి వస్తుందని తత్త్వజ్ఞుడు తన యంత్రం (దేహం)లో చూసిన శబ్దాన్నే లోక కల్యాణంకోసం బయటికి వదిలితే అదే మంత్రం. ఆ విద్య లేకుండ మంత్రం అర్థం కాదు. విద్యా ప్రాప్తికి గురువేకావాలి.

అందుకే "ముకుంద భక్త్యై గురుభక్తిజాయై" అని చెప్పారు. అయితే మాట మాటకూ మనం దేవుణ్ణి వాడుకున్నాక, అచింత్యుడు, అప్రమేయుడైన ఆ దేవుడు ఏమయ్యాడు. వీళ్ళు నోళ్ళల్లో ? దగ్గరికి రావడం, నిర్లక్ష్యానికి గురికావడం సహజం. చనువు కొద్దీ నిందించడం కూడ రూఢి. ఇలా నిందాస్తుతులు సంభవిస్తాయి. "జారతనపు పాపముల కెల్ల గోపీజనజారు డంటే చాలదా ?" మొదలైన మాటలు ఏదో ఒకరకమైన కాల్పనిక మనః శాంతికి పనికివస్తాయే తప్ప తత్త్వవాక్యాల్లో వీటికి స్థానం లేదు. ఈ మాటల్లోనే సాధకుడు కాలం వెళ్ళబుచ్చితే చివరికి పురందరదాసులే చెప్పినట్లుగా

**"జోడు భార్యలతో లేచిపోయేవేళ**

**గోడపడి బట్టబయలవుతుంది కదా!** అనే ప్రలాపమే గతి. అది వారి నిజమైన సాహిత్యం బాధ.

తత్త్వజ్ఞులు పరమాత్మని గురించి అధికంగా మాట్లాడరు. అచింత్యుడు, అగమ్యుడు, అవాఙ్మానస గోచరుడు, తపస్సుకూ పరమాత్మ దొరకడని అంటారు. అలాగైతే తపస్సు యొక్క లక్ష్యం ఏమిటి? స్వస్వరూపానుభవం, దాని ఆనందం లభించటమే కష్టం. 120 సంవత్సరాల దాకా ధర్మబద్ధంగా నడిచిన వ్యక్తికి మనుష్యత్వ ప్రాప్తి సాధ్యమని అన్నారు. అక్కడితో కాలచక్రపు ఒక సూక్ష్మమైన అనుభవం కల్గినట్లే ! బ్రహ్మవిద్యతో ఆత్మానుభవం కల్గి మనుష్యత్వ ప్రాప్తి సాధ్యం. సాధన ముఖ్యం.

కేవలం సాహిత్యం వెంటబడితే ప్రయోజనం లేదు. సాహిత్యం అనాది. నిశ్చయంగా ఇంతేకాలమన్న పరిమితి దానికి లేదు. ఎప్పటినుంచో పెరుగుతూ వచ్చింది. పెరుగుతూనే ఉంది. ఇంకా పెరుగుతూనే పోతుంది. నిర్మాతల పేరు కొన్ని చోట్ల తెలియలేదు. ముండక, మాండూక్యాది ఉపనిషత్తులు ఉన్నాయి. విషయం ముఖ్యం. పేరు కాదు. అది అలా ఉండనీ !

ఇక్కడింకా వేదాలు, ఉపనిషత్తులు, జ్ఞానకాండ, కర్మకాండ మొదలైన వాటి తపనలు వేరే ! కర్మ అజ్ఞానులకు, జ్ఞానార్జనకు దానితో సంబంధం లేదనీ, జ్ఞానం ప్రాపంచిక ఆసక్తి వదలిపెట్టిన వాళ్ళకే ! మనకెందుకు అనే వాదాలు ఉన్నాయి. అలా కాదు. కర్మ వివిధ దశల్లో ఉంది. అలా తెలిసినవారితో బోధించబడింది కూడ ! సమాజం సాఫీగా సాగేందుకు అవసరమైన వర్ణాల ధర్మకర్మలు, వైయక్తిక జీవనపు వేర్వేరు స్థితులకు అన్వయించే ఆశ్రమధర్మకర్మలూ ఇవి సర్వవిదితాలే! జ్ఞానపూర్వ కర్మమే ఆవశ్యకమైన కర్మ ! అదే నిత్యకర్మ ! జ్ఞానోత్తర నిర్లిప్త కర్మ. (లోకకల్యాణకారి కర్మ) ఇదంతా ఉంది. వేదోక్తమైన అగ్నిపూజ మొదలైనవి జ్ఞానార్జనకు



చాలా అవసరం. దాని తర్వాతి స్థితి అయితే తత్త్వం గురించి వేదాంతాలనబడే ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి.

దేహపోషణకు అవసరమైన స్థూలకర్మ అందరికీ తెలిసిందీ ! అది ఆచరింపబడుతూనే ఉంది. జ్ఞానం కోసం నిర్దేశింపబడి, బోధించబడిన కర్మ గురించి తప్పుడు అభిప్రాయాలు పెచ్చు పెరగడం వల్ల వాటి గురించి కొంచెం చర్చిద్దాం. "స్వస్తి న ఇంద్రో వృద్ధ శ్రవాః" ఇక్కడ వేరేలోకంలోని ఇంద్రుని గురించి చెప్పబడలేదు. దేహంలోంచి బయటకి వచ్చినపుడు ఇంద్రియం (Semen) అనేదే దేహంలో తన స్థానంలో ఉన్నపుడు 'ఇంద్రుడు' అని పిలువబడుతుంది. శుక్లం ప్రాణాగ్నిలో పుటం పెట్టబడి, ఓజస్సుగా, తేజస్సుగా, వీర్యంగా, అమృతంగా మారే రహస్యాన్ని యోగులు ఎరుగుదురు. అందుకే ఆ ప్రాణాగ్ని పూజే వేదంలోని "అగ్నిమీళే పురోహితం" మొదలైన మంత్రాల్లో వర్ణించబడింది. కర్మకాండను ఉపనిషత్తులు ఖండించవు. జీవన వృక్షంలో కర్మకాండంపై జ్ఞానశాఖలు (విశ్వతోముఖంగా) వృద్ధి చెంది, పెరిగి, ఆనందఫలపరిణామం. కర్మ, జ్ఞానాల సమన్వయంలో జీవనరథం సాగాలి.

స్థూలసూక్ష్మాల ఆచరణతో బ్రహ్మత్వాన్ననుభవించాలని బోధించేదే తత్త్వమార్గం. భక్తి కర్మల సమ్మేళనమే భగవద్గీత. భగవద్గీతపై రచింపబడిన వ్యాఖ్యానాలను చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది. 700 శ్లోకాల భగవద్గీతకు ఎన్నో వేలపుటల కొద్దీసాగే అసంఖ్యాకమైన వ్యాఖ్యానాలు. ఇంకా వినూత్న దృష్టికోణంలో రాసే అవకాశముంది. తెలుసుకునే సామర్థ్యం వచ్చినట్లల్లా అత్యధికమైన అంశాలు స్ఫురించి రాస్తారు. అయితే ఈ వ్యాఖ్యానాలేవీ పూర్ణమని అనిపించవు. అయితే గీత మాత్రం పూర్ణంగా ఉంది. గొప్పగా

ఉంది. గీత బోధించేది బ్రహ్మవిద్య, యోగవిద్య, అమృతవిద్య. తెలుసుకునే వాళ్ళకు తెలుస్తుంది.

గీతను యోగశాస్త్రమని అన్నారు. 'యోగ' శబ్దం 'యుజ్' ధాతువు నుండి పుట్టిందని వ్యాకరణ శాస్త్రవేత్తలంటారు. సంయోగం. ఏ రెంటిని కలపాలి ? జీవాత్మల సంయోగం కావాలి. ఆత్మానుభవానికి అనేది జిజ్ఞాసువులందరికీ తెలిసిన అంశం. దానికి అవసరమైన కర్మ, భక్తి – వీటిని గీతలో కృష్ణపరమాత్ముడు బోధించాడు. సమన్వయానికి అవసరమైన విచారం, విమర్శ ఇవేవీ లేకుండా భక్తి అంటే మూఢనమ్మకం, కర్మ అంటే స్థూలకర్మ అనే వాదం ఉంది. 'యోగః కర్మసు కౌశలం' అనే వాక్యాన్ని తమ మాటను సమర్థించు కునేందుకు వాడతారు. ఏ(ప్రాణ మనోమిలనపుడు ప్రయాణం చిత్ ప్రభలోని బ్రహ్మస్థానంలో లక్ష్యప్రాప్తికి ఆవశ్యకమైన కర్మ కౌశల్యానికి 'యోగం' అనే చోట కృష్ణుడు మనకు ఒక తత్త్వజ్ఞుడుగా కన్పిస్తాడు.

There is perfect materialism in manifestation. (మోక్షసాధనలో ఒక పరిశుద్ధమైన యాంత్రికత్వపు తంత్రం ఉంది). అయితే ఆ కౌశల్యాన్ని సంపాదిస్తే యోగి కావడం సాధ్యమౌతుంది.

దర్శన సాహిత్యాన్ని కేవలం చదవడం వల్ల లాభం లేదు. ఆచరణ ముఖ్యం. కేవలం చదవడం వల్ల తెలిసిందంతా చదవడం, చదివిందంతా చెప్పడం ఇంతే ! కొందరు జగత్తులో పూర్వం నుండి పశ్చిమానికి వెళ్ళి వేదాంతం గురించి బోధించారని చరిత్ర చెబుతుంది. అయితే వీళ్ళెవరూ manifestation కు అవసరమైన నిర్దిష్టమార్గాన్ని చూపించినట్లు కన్పించడం లేదు. వీళ్ళు చెప్పిన దాన్ని కేవలం శ్రవణానికి మాత్రమే పరిమితం



చేసుకుని, వీళ్ళలా కర్మనిరసనం పొందకుండ, తమ వైశిష్ట్యాన్ని కాపాడుకుంటూ రావడం వల్లనే పాశ్చాత్యులు తమ భౌతిక జీవనంలోనైనా ప్రగతిని సాధించారు. అలా కాకుండా అపార్థం చేసుకుని మన వాళ్ళలా "గంధద్వారాన్ దురాధర్షాం నిత్య పుష్టాం కరిషిణీం" అనే మంత్రంలో చెప్పినట్లుగా, దేహంలోని పృథ్వినుండి (క్రిందిభాగం) దేవలోకానికి (పైభాగం) ముఖ్య ప్రాణుడు మోసుకుని వచ్చే పవిత్ర గంధపు ద్వారాన్ని ప్రతి నిత్యం పరిపుష్టంగావించాలి. ప్రాణాగ్ని వేడిమిని తగిలించి, దీన్ని యోగంలో పుటం పెట్టాలి. ప్రాణాగ్నిలో పుటం పెట్టబడి, పవిత్రమైన దధీచి వెన్నెముక, ఇంద్రుని వజ్రాయుధం – వీటి కథ మనదేశంలో అందరికి తెలిసిందే ! ప్రాణం యొక్క గతాగతిలో ఆహారదోషాలన్నీ భస్మమై శుద్ధమైన సారం, అశనం (సూక్ష్మాంశం) ఎలా సుగంధయుక్తంగా ముందుకు సాగుతుంది ? అనే అంశం యోగవిద్యలో కొన్ని నెలలు అనుభవం ఉన్న విద్యార్థులకూ తెలుస్తుంది. అందుకే "పృథివ్యాం పుణ్య గంధోస్మి" అని అన్నాడు గీతాచార్యుడు. ఈ విషయం గ్రహించకుండా దేహానికంతా చెట్టుముక్కల్ని చూర్ణం చేసి అంటించుకునే ఆచరణ మనలో వచ్చింది. తత్త్వవాక్యాల భాష, శైలి ఏదైతే నేమి ? "పద్యమో గద్యమో అనుభవసారమైన మాట పాఠకుల అజ్ఞానతమస్సును అంతరింపజేయును" అని ఒక కవి చిలుక నోటితో చెప్పించాడు. అలాంటి మాట చాలా మనోహరంగా ఉంటుంది.

దేవుడు కావాలనే తీవ్రమైన ఆకాంక్ష కల్గిన వేళలో జిజ్ఞాసువు సంప్రదాయాలను ఓసారి పరికించాల్సిందే ! తరతరాల నుండి ఆచరించుకుంటూ వచ్చిన వారికి లభించిన అంశాల్ని గమనించండి. వాళ్ళు తమ తప్పు ఎక్కడుందో తెలుసుకుని, లక్ష్యప్రాప్తికి అవసరమైన

సాధనను చేసి, పొందాల్సి ఉంది. అంతేకాక 'నల్గురిలా నేను' అంటే అంధ్యైనైవ నీయమానా యథాంధా" అన్న అర్థమే.

ధర్మజీవనానికి నాల్గుముఖాలు. 'శాంతి, సానుభూతి, విశాలత, ప్రేమ.'

తల (బుద్ధిశక్తి) పెరగాల్సిందే ! తలకు తగినంత పరిపక్వత కావాలి. ఆధారభూతమైన దేహం బలహీనంకారాదు. హృదయంతో పాటు దేహం తగినంత పెరగాలి. అపుడే తత్త్వానుభవం లభిస్తుంది.

అవ్యక్తమైన సత్యం ముఖ్యం. అదృష్టం ప్రధానం అనే మాటలూ విన్పిస్తున్నాయి. వ్యక్తంలోనే అవ్యక్తం ఉందో, ఆ అవ్యక్తమనేది వేరే ఉంటుందో ? అవ్యక్తం వ్యక్తాన్ని ఆశ్రయించి ఉంది. వేరుగా ఉంటే అది వ్యక్తమై పోతుంది. అపుడు వ్యక్త సత్యాన్ని అంగీకరించడమే తపస్వి యొక్క లక్షణం.

చూడండి ! దేహం పంచభూతాత్మకం అంటారు. ఇక్కడ భూతాల సమష్ఠిని, విషమష్ఠితులను తెలుసుకునేవేళ (combination of elements) నాల్గు భూతాల అంశం సూత్రాత్మతో చేరిపోయి ఉంటుంది. అది విడివడి వెళ్ళాక అంతా మళ్ళీ వేర్వేరై ప్రకృతిలోని తమ తమ స్థూలభూతాల్లో కలుస్తాయి. కట్టి వేసిన గుర్రం ఊడ్చుకుని వెళ్ళే వేళలో కాలు, గూటం, దానికి అంటుకున్న మట్టి ఇవన్నీ పోతాయి. అలాగే ఆత్మ నిష్క్రమించేవేళ సూత్రాత్మ, మనస్సు, భౌతికశక్తి ఇవన్నీ పోతాయి.

మహాభూతమే వెళ్ళిపోయాక నాల్గు భూతాలుండి ప్రయోజనం లేదు. బ్రహ్మేంద్రియాల కేంద్రీకరణం జరిగే స్థానంలో విరమించే స్థితి బ్రహ్మత్వానుభవం. ఆ అనుభవం కావాలంటే వాయు చైతన్యం ద్వారానే



సాధ్యం. ఈ అంశాన్ని చెప్పేందుకు ఉపనిషత్తుల్లో ఒక అందమైన కథ ఉల్లేఖించబడింది. ఆత్మ దేహంలో తన కర్తవ్యాన్ని కొనసాగించుకునేందుకు ఎవరు ముఖ్యమని ఆలోచించి, ఎవరుంటే తానుండడం సాధ్యమో, అలాంటి ప్రాణాన్ని దేహంలో ప్రవేశింపజేసి, తర్వాత తాను ప్రవేశించాడట ! సర్వేంద్రియాలకు అతడు ఆధారమై, ఆటముగిశాక, అతడు దేహాన్ని త్యజించేవేళ తానూ వదిలి వెళ్ళతాడనే ఉండాలి.

తత్త్వసాధనా మార్గం గ్రహించడం చాలా సులభం. దీనికి శాస్త్ర పాండిత్యమే కావాలనే నియమం లేదు. విచారశక్తి జాగృతం కావాలి. చూసి చూసి అలసిపోతే కన్నులు మూసుకుంటాయి. చెవి శబ్దం వినదు. ఆవులింత వస్తుంది ? ఎందుకు ? ఇంద్రియాలకు మనం విశ్రాంతి నివ్వకుండా పదే పదే attachment నే అందిస్తాం. చదివి చదివి అలసిపోతే సినిమా చూస్తాం. తత్త్వవాక్యాలు విని జటిలమనిపిస్తే సంగీతం వింటాం. ఇలా బాగా అలసిన ఇంద్రియాలు అంతర్ముఖం అయ్యేందుకు ప్రయత్నిస్తాయి. సుషుప్తిలో పడి ఉండడానికి కాదు. (to act not to be dull there) కన్నులోపల దేన్నో చూడాలనుకుంటుంది. చెవిలోపలి ప్రాణనాదాన్నే వినగోరుతుంది. ప్రాణవాయువు పైకి వెళ్ళేందుకు ప్రయత్నిస్తుంది. ఎందుకు ? దేహేంద్రియాలకన్నింటికి చైతన్యం అందించే సారసంగ్రహం పైనుంది. దాన్ని వైద్యశాస్త్రవేత్తలూ ఎరుగుదురు. బ్రహ్మేంద్రియాల సహకారంతో ఆమూలస్థానాన్ని తాకి, శక్తినందుకుని ప్రాణుడు దేహేంద్రియాలకన్నింటికీ పంచుతాడు. అక్కడ ఆ ప్రాణమనస్సుల మిలనం జరిగి మనస్సుకు శాంతి, ఉత్సాహం లభిస్తాయి. నిజమైన ఆ విశ్రాంతి ఏమిటి ? దానికి కావాల్సినపుడంతా పొందవచ్చునే అంశాన్ని తెలుసుకోవడమే జ్ఞానం. గ్రహించి అనుభవించడమే యోగానందానుభవం.

ఆ ఆనందానుభావి 'నేను పూర్ణుడను' అని పరవశిస్తాడు. ఈ 'పూర్ణుడు' ఎక్కడ నుంచి వచ్చాడు? అనేదొక ప్రశ్న. మహాపూర్ణుడి నుంచి అతడు వచ్చాడు. ఆ మహాపూర్ణ పరమాత్మ ఆనందారాధ్యపరమాత్మ. అతణ్ణి మత్తయిన పంచభూతాత్మక మైన ఇంద్రియాలద్వారా తెలుసుకోవడం సాధ్యంకాదు. సర్వాలంకృతుడైన మురళీకృష్ణుడు చింతనం చేసుకొనేందుకు సరిపోతాడు. వేదవర్ణితకృష్ణుడి గురించి చింతించడానికి సాధనం ఏది ? ఆ వేదకృష్ణుడే భారత కృష్ణుడు. అతడు చెప్పినట్లే – "విద్యావినయ సంపన్నే" "విద్యానాం బ్రహ్మవిద్యోస్మి" అనే వాక్యాల అనుగుణంగా ఆ బ్రహ్మ విద్య ద్వారానే అతణ్ణి గురించి చింతించాలి. సృష్టి, స్థితిలయాలకు కూడ కారణమైనది ఆ బ్రహ్మ విద్యవల్లనే. జాగ్రత్, స్వప్న, సుషుప్తుల్ని దాటి, ఆ తురీయ తురీయాతీత స్థితుల అనుభవం ద్వారా ఆ ఆత్మానుభవం, పరమాత్మకృప లభ్యమౌతాయి.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**



## 8. సాధన

**ఆత్మీయులారా !**

ఈ రోజు మీరంతా చేరి మీ ఆలోచనలతరంగాలతో ఒక నిర్దిష్ట రూపాన్ని గ్రహించిదలచినట్లుంది. ఇపుడే పరిచయం గావించిన మీ కార్యదర్శులు 'సాధన' అనే విషయంపై మాట్లాడాలని కోరారు. మాట్లాడతారనీ మీకు చెప్పారు. నిజానికి ఇది నాకూ చాలా సంతోషాన్ని కల్గించింది. అభ్యాసి అయిన నేను జిజ్ఞాసువులైన మీ ముందు 'సాధన' అనే ఒక నిర్దిష్టమైన ఏకైక మానవ సత్పథం గురించి ఉపన్యాసం చేయాల్సిన ఒక అవకాశం దొరికినందుకు హర్షిస్తున్నాను. ఇది నిజంగా ఒక మహాసేవ. అందులోనూ అన్ని చోట్ల కోలాహలం చెలరేగింది. జడమైన ఒక చోట తాండవిస్తోంది. వారి గురించి బాధపడాలా ? అయ్యో ! దానికన్న అధికమైన తాపం వేరొకచోటికి వెళ్ళాక, అంటే ఆధ్యాత్మికమైన ఈవిషయాలు వైకల్యవ్యాప్తిని పొంది మమ్మల్ని ఆలోచనల చిట్టడవిలో వదిలి, ఇహలోకజీవనంపై ఒక విధమైన జుగుప్స కల్గుతోంది. అంతర్ముఖమైన ఆ పరమార్థపథంలో వ్యర్థమైన కాల్పనికమైన గొడవల్ని చూస్తున్నాం! కదూ!

ఈ మాట ఒక్కరిదే కాదు. సత్యావిర్భావం మనలో ఎలా ఉన్నది? సనాతనులు, ఆది మహర్షులు పురాతనకాలంలో ఎలా దర్శించి, అనుష్ఠానం చేశారు ? అనే అంశం ఇప్పటి ఏ విప్లవానికి అంతుపట్టనిది. కొన్ని దశాబ్దాల, శతాబ్దాల నుండి వచ్చిన అంధానుకరణం చాలా దుఃఖాన్ని కల్గించేదని అర్థమౌతోంది. ఆ జ్ఞానానికి తగిన మంచిమార్గం దొరకడం

లేదు. ఈ అంశం జాగృతులైన అందరూ చెబుతూ వస్తున్నదే ! ఏదేమైనా, మనిషి ప్రగతిపథంలో నిరంతరం పనిచేస్తుంటాడు. అనవసరంగా ప్రమాదాలకు దొరికిపోయే రకం కాదు.

అందుకే పై దృష్టికోణంలో జాగృతుడైన ఈ జీవి పెద్ద సాహసం వల్ల పొందిన తృప్తి ఈ మహాగురువు కృప. మరోసారి మా గురువుగారిని ప్రార్థిస్తున్నా. అతడే ఇచ్చింది ఇదంతా ! అతని మార్గదర్శనంలోనే నడిచే ఈ సాధనపు మహిమను అందరూ గ్రహించనీ!

చూచి ఎవరూ గమనించడం కాదు. గమనిస్తూనే ఉన్నాం. మొత్తం సృష్టంతా ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారమే సాగుతోంది. ఒక దానితో పొందిక కోసం, ఇంకోదాని ఆగమనం కోసం – ముందుకు సాగేవేళ మరోమార్గాన్ని అవలంబిస్తాం. ఓ ఉపాయాన్ని స్వీకరిస్తాం. ఆ ఉపాయానికి, ఆ ఉపకరణానికే 'సాధన' అని పేరు. ఈ సౌందర్య వ్యాప్తినే అనంతరూపాల్లో విస్తారంగా వైవిధ్యంతో, కన్పిస్తూనే ఉంది. అయితే దీని వాస్తవికత ఏమిటి? దీన్ని ఏ దిక్కులో ఎలా అర్థం చేసుకోవాలి ? గ్రహించాలి ? ఇది కాలాతీతం, దేశాతీతం. భాష, జాతి – వీటి భేదం దీనికి లేదు. ఇందు విశ్వమానవీయం అనే అంశాన్ని జిజ్ఞాసువులు గ్రహించాలి.

ఒక అర్థంలో ఏదీ సాధన లేకుండా కన్పించనే కన్పించదు. రాత్రింబగళ్ళు ఒక మార్గంలో సాగి దినమనే సాధనను చూస్తున్నాయి. రోజుల సాధన వారాల సాధనగా, వారాల సాధన పక్షాలుగా, మాసాల సాధన సంవత్సరాల సాధనగా మారి కాలపరిమితికి సరిపోతున్నాయి. ఇది ఒక రూపానికి సంబంధించిన నియమం.

ఇకపోతే సకలజీవరాసులు తమ ఆకలి దప్పుల నివారణకోసం, సంతృప్తిని పొందడం కోసం నిరంతరం పయనం సాగిస్తున్నాయి. ఇక్కడ



మనకు కన్పించేదేమిటి ? వివిధ జీవరాశుల శ్రమ అంతా విభిన్న అంగాంగాలతోనే జరుగుతుంది.

ఈ అన్ని అవయవాల ప్రయత్నానికి ప్రేరణ ఏది ? లోపలి ఆశలు, ఆకాంక్షలే ! తనలోని ఆశలు, ఆకాంక్షలు నెరవేరాకే ఈ జీవరాశులు సంతోషాన్ని, సంతృప్తిని, నిశ్చలతను పొందుతాయి. వైరాగ్యంతో దర్శించిన తర్వాత, వాటి ఉనికికి లోపలి చైతన్యమే మూలకారణం అనే అంశం కొంచెం విమర్శిస్తే – పరిశీలిస్తే గోచరిస్తుంది.

అలా ఉన్నప్పుడు ఈ 'సాధన' గురించిన ప్రత్యేక వ్యాఖ్య ఎందుకు? దీని అవసరం ఉందా ? తనంతట తానే నడిచే ప్రక్రియకు వేరే లక్ష్యం ఏది ? ఉంది కదా! దీన్ని చాలా సూక్ష్మంగా మనం విశ్లేషించుకోవాలి. దీన్ని చక్కగా విశ్లేషించుకుని, పెంచుకుని, జీవింప జేసుకుని, వెలిగించుకుని వచ్చేవాడే మనిషి ! ఈ మనిషి ఎప్పటి నుంచో ఈ విశ్వవైచిత్ర్యానికి ఆశ్చర్యపడ్డాడు. దీని రీతి నీతుల గురించి ఆలోచించాడు. అంతేకాదు ! దీని లక్ష్యాన్ని గమనించేందుకు చాలా ప్రయత్నం చేశాడు. పాపం ! దాన్నంతా దర్శించాడు. ఈ దుర్భరగతిపైన, దురంతాల, ఆఘాతాల నడుమ కూడా ఒక రకమైన స్వామ్యాన్ని, ఆమోదాన్ని కనుకున్నాడు. ఎన్నో సంకటాలను అనుభవించాడు. అయినా మనిషి వెనుకంజవేయలేదు. అతడు ప్రగతికి సంబంధించిన ఊతకర్రను వదలుకోలేదు. నిరంతరంగా విప్లవ సమరం సాగించి, ఆ కోలాహలంలో కూడా ఆనందాన్ని, అందాన్ని దర్శించాడు. గర్వించాడు. అలాగే స్థూలవిజ్ఞానపు భోగపరమావధి ఎన్నోసార్లు చక్రగతిని పొందింది. సామాజిక సంస్కరణలు ఎన్నోసార్లు తిరిగి తిరిగి కష్టాలనందించి, మళ్లీ సంతోషాన్ని కూడా అందించాయి.

ఎన్నెన్నో అభిప్రాయాలు, వివేక సమ్మతంగానే వెలువడినా సాంక్రామికంగా, సంతోషంగా అందించినట్లే అందించి క్రాంతికి అవకాశం కల్పించాయి. అవిచ్ఛిన్నంగా విప్లవాలు వెలువడి కనుమరుగైనాయి. కనుమరుగౌతున్నాయి. అయినా 'నమేధయా' మేధస్సుకు అవతల ఉండే ఆత్మస్వరూపాన్ని కల్గిన మనిషి ఉండేవాడు. ఉన్నాడు. ఉంటాడు.

అందుకే నిరంతరం ఇతడు మాత్రం అన్ని జీవరాశుల కన్న భిన్నంగా, విశిష్టంగా, విభిన్నంగా ఆలోచించాల్సి ఉంది. ఆలోచిస్తున్నాడు. ఈ మనిషి సామాన్యంగా త్రివిధ గుప్తగామి. జ్ఞానం, గర్వం, అజ్ఞానం. అజ్ఞానం కొద్ది అపరాధం చేస్తాడు. చేసుకుంటాడు. గర్వంతో విర్రవీగుతాడు. అకృత్యాలనే చేస్తూ, వాటినే పెంచి, స్థాపించే ప్రయత్నం చేస్తాడు. జ్ఞానంతో చూస్తాడు. అత్యున్నతశక్తిని, ఆహ్వానిస్తాడు. ఆవిర్భవిస్తాడు ! అందిస్తాడు! ఇది మనిషి గురించి సామాన్య వివేచన. "అజ్ఞానం". దీన్ని గురించి విశ్లేషించేవేళ, అది గర్వజన్యం కాని వేళలో, చేసిన తప్పును గ్రహించి, సంతాపం చెంది మళ్ళీ దాన్ని చేయకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాడు. జ్ఞానానికి వినమ్రుడై పోతాడు. వినయ విధేయతల్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తాడు. వీటన్నిటి కన్న వ్యతిరిక్తంగా, ఎవరికీ తలవంచక, మారక, హఠంతో మొండిపట్టుదలనే ప్రదర్శిస్తాడు. గర్వంతో వేరేవాళ్ళకు ఉపద్రవం కల్గిస్తాడు. వీడికి వేరే గతిలేదు. అందుకే, సత్పురుషులు అంటారు. "జ్ఞానసూర్యునితో అజ్ఞానాన్ని నశింపజేసుకుని గర్వాన్ని బ్రద్దలు చేయండి! ఆ గర్వప్రయోగానికి ఉపయోగించే సమస్త శక్తుల్ని నిర్వీర్యం చేయండి. దాని ద్వారా స్థిరంగా ఉండడం సాధించండి ! శుద్ధ జ్ఞానంలో విహరిస్తే, అపుడు మనిషి నిజంగానే 'నమేధయా' ఉండే తన నిజస్వరూపాన్ని దర్శిస్తాడు. "నహిజ్ఞానేన సదృశం" అని గీతాచార్యులు శలవిచ్చారు.



ఈ దిశలో వికసిస్తూనే ఉన్నాడు. అయితే చాలాచోట్ల సంచరించినట్లనిపిస్తుంది. 'సాధన' దీని విశ్లేషణ, అవలంబన – ఇవన్నీ సర్వాంగీణంగా కన్పించడం లేదు. జగత్తు యొక్క ఉనికిలో బహుముఖంగా, అనేక రీతుల్లో ప్రకృతి సేవకుడుగా, స్నేహితుడుగా, స్వామిగా జీవించాలి. నిజంగా జీవితాన్ని వికసింప జేసుకోవాలంటే – వీటన్నింటికి నిరంతర సాధన అవసరం. వికాసంతో పాటు, ప్రకృతిసేవ, స్నేహం, స్వామ్యం – వీటితో జీవితంలో ఆత్మానందం పొందితేనే ఈ వికాసం సార్థకం.

ఔను ! తిరగాలి మరి ! తిరుగుతూనే ఉండాలి. బృహదాకారంగా, విస్తృతంగా వ్యాపించిన ఈ జీవనం ఒక కొలిక్కి రావాలంటే ఎక్కడెక్కడో తిరగాలి. తిరిగి తిరిగి, విసిగి వేసారి, అలసి సొలసి పోవాలి. వివిధ కష్టాల్ని అవలోకించి మన పాలిట దక్కిన దాన్నే ఆలింగనం చేసుకోవాలి. సంతోషాల్ని, సంతాపాల్ని అనుభవించనిదే జీవితానుభూతి ఎలా కల్గుతుంది? అయ్యా! మొత్తం బ్రతుకు 'కావాలి ! కావాలి! కావాలి!' అనే ఆశల కారడవిలా ఉంది. అక్కడక్కడ వ్యక్తి సుఖం, సమాజ సుఖం, రాష్ట్ర ఖ్యాతి – అనే నందనవనాలు ఉన్నాయి. అలాంటి వేళ – తిరుగాడకుంటే ఈ మహాప్రయాణం ఎలా ముగుస్తుంది ?

నిజంగానే మనకు కావాల్సిన సుఖ సంపదల్ని పొందాలి ! బాగా శ్రీమంతులు కావాలి. మంచిని అనుభవించాలి. బాగా అనుభవించాలి. ఈ భౌతిక జీవితంలోని సర్వాంగసుందరమైన వ్యవస్థను దర్శించాలి. ఇది మానవుని ఆరాటం. ఇది న్యాయసమ్మతం ! అయితే ఆరాటం జననంలో ఎలా ఉన్నది ? జననం నుండి ఎలా పెరిగింది ? అది ఏఏ సహవాసాల

వల్ల, సహాయాల వల్ల పెరుగుతూ వచ్చి ఇప్పటి ఈ బృహదాకారాన్ని పొందింది ? సృష్టి అనే ఈ రమ్య ప్రాంగణంలో – భోగమనే సమరాంగణంలోనే తృప్తి ఉందా ? ఈ భోగమనే సంగ్రామ ప్రాంగణమే మన చరమ లక్ష్యమా ? ఆ భోగాంగణాన్ని భవ్యం గావించే ప్రకృతి రమ్యాంగణంలో ఆరాధన సౌందర్యం ద్వారా జరగాలి. తన ప్రకృతి, విశ్వప్రకృతి, అవ్యక్త ప్రకృతి – ఈ మూడు ప్రకృతుల పరాస్థితి – దాని వ్యాప్తి ఏమి ? ఎలా ? దేని ద్వారా ? దీని ద్వారా లోపలికి ప్రవేశిస్తే. ఆ పరాస్థితి ! అక్కడ ఆనందం, ఆనందారాధ్యుడైన పరమాత్మ యొక్క కారుణ్యమే! అది ఆవిర్భవిస్తే, అదే ప్రవహించి మనిషి ఏమౌతాడు ? 'మనుష్యత్వం' ఎలా ఉంటుంది ? ఈ ఆలోచనలు ప్రవేశించాకే, వాటి గురించిన జిజ్ఞాస అతనిలో పెరుగుతుంది. అపుడు దాని కోసం నడుము కట్టేవాడే 'అధికారి'.

అపుడు సాధన గురించి విమర్శించాలి. మనిషి మనిషిగా జీవించి దివ్యత్వాన్ని అనుభవించేందుకు ఇది ఆవశ్యకం. ఇలాంటి వివేచన, ఇలాంటి పురోగతి, సాధనా నిర్ణయం సాధనా ప్రగతి, బ్రాహ్మీప్రజ్ఞ, ఆనందానుభవం – ఇవే 'ఆధ్యాత్మికం' అంటే ! ఆత్మతో సంబంధం, ఆత్మతో మధురస్నేహం, ఆత్మ విశ్రాంతి, ఆనందానుభవం, సర్వార్పణం – ఇవన్నీ లేకుండా జీవితం పూర్ణమెలా ఔతుంది ? ఈ దిశలో శ్రమించి, ఈ జ్ఞానం కలిగి, విశ్వమంతా ప్రతిబింబిస్తే అపుడు జగత్తులో మానవజీవనం సఫలమౌతుంది.

మన కళ్లు, మన చేయి, మన కాలు, శరీరం, మోహం, ప్రేమ – ఇవి కోరుకునే కోరికలనన్నింటినీ తీర్చుకునేందుకు మనం పెనగులాడడం లేదా ? ఆ 'మనం' ఉంది కదా ! దాని నిజస్వరూపం ఆ 'నేను' 'మనం' అనే అస్తిత్వం. వీటన్నింటిని కోరడం కానీ, దొరికాక అనుభవించడం



కానీ, దొరకనపుడు దుఃఖించడం కానీ – వీటిలో దేన్ని ఆ 'అస్తిత్వం' సూత్రంగా ధరించింది ? ఏ ఉపాయం ద్వారా వీటన్నింటి భోగాన్ని కానీ – త్యాగ, వైరాగ్యాన్ని కాని పొందుతుంది ? ఈ విషయంలో చింతన కొనసాగి, దాని ప్రకారంగా సాగిపోతూ నిర్ణయం కన్పించకనో, దాని కోసం నిరీక్షించకనో, చూసిం దాన్నంతా అనుభవించే చాపల్యంతోనో ! అందరన్నట్లు కాలగతివల్లనో ! మొత్తానికి ఏవేవో బుద్బుదాలే లేచి నాట్యం చేశాయి. ఇంకా చేస్తున్నాయి! అంతా అసత్యం! ఒకే సత్యం యొక్క విభిన్నరూపాలు! ఏమో ? చేసేది, చేయించేది ఒక్కటే! ఇలా ఏదో ఒక నీరసమైన, నిర్వీర్య స్థితి వచ్చేట్లు కన్పిస్తున్నాయి. ఇలా ఉండగా విశ్వంలో భారతదేశం లేదా ఏదో ఒక దేశానికి చెందిన వేదాంత వాద ధోరణిని విమర్శించే ప్రయత్నం కాదు. మొత్తానికి 'సాధన' అనేది ఆత్మానుభవం అనే అర్థంలో పరమాత్మ కారుణ్యానికి పాత్రులమయ్యే స్థితిలో నిర్దిష్టరూపాన్ని చూడలేకుండడమే మానవుని అధోగమనానికి దారితీస్తుంది! ఈ రోజుల్లో ఏమతం వాళ్ళలోనూ, ఏ ఆలోచనల వాళ్ళల్లోనూ, ఏ మార్గం వాళ్ళలోనూ ఆ దివ్య 'సాధన' కన్పించడం లేదు. అన్నపుడు సంప్రదాయబద్ధంగా వచ్చిన సాధనాపరంపర కుంఠితమైనట్లే కదా !

వాతావరణానికి అనుగుణంగా వస్త్రధారణ, రుచికి తగినతిండి, అభిరుచికి తగిన క్రీడలు – ఇవి విభిన్నంగా ఉండవచ్చు. సమాజం, వివాహాది కార్యక్రమాలు, భాషకు తగిన సాహిత్యం ఆయా, విషయాలకు తగిన కృషి – విభిన్నం కావచ్చు. అయినంతమాత్రాన ఇంద్రియసమూహం సమానంగా ఉంటూ ఆయా కేంద్ర చైతన్యం నుండి సమానంగా ఉండే విశ్వమానవత్వాన్ని కోరుకునే ఆత్యంతిక ఆనందానుభవం, నిత్యసత్య దర్శనా కాంక్ష – ఇవి ఎలా వేర్వేరుగా ఉంటాయి'. ఆ శాంతిని, ఆ ఆనందాన్ని

అనుభవించేందుకు మనిషి ఏ రకంగా సాధన చేయాలి ? ఈ ఏకసూత్రపు చింతనం వద్దా ? కావాలి ? ఆ చింతననే ఆదికాలపు మునులు, ప్రవక్తలు చేశారు. అయితే ఇప్పటి జీవుల స్థితి మాత్రం జడంగా ఉంది. నీరసమైన అంధానుకరణ విద్యగా మారింది. మూర్ఖ సంప్రదాయంగా మిగిలింది. ఇలా చెప్పక తప్పడం లేదు. ఈనాటి సాధనా రహితులైన మనుషుల్ని తలచుకుంటే చాలా బాధవేస్తుంది. శోధకుడు, సాధకుడు, ద్రష్ట చెప్పే మాటలు కొంచెం చేదుగా ఉన్నా సహించాల్సిందే కదా ! నేను జాగృతులైన వ్యక్తుల సమాజంలో ఉన్నా. అందువల్ల నాకావిశ్వాసం ఉంది.

ఈ రకంగా విశ్లేషించుకుంటూ ఉండే జీవనాన్ని సరళంగా, సుందరంగా మార్చుకోవాలి. మనకు అనుకూలమయ్యే రీతిలో బాహ్య సామాజిక జీవనాన్ని సరిదిద్దుకోవాలి. ఆచారాల్ని పాటించాలి. తాను నొవ్వక, ఇతరులను నొప్పించక చాలాకాలం జీవించగల్గేట్లు సుగుణసంపత్తును పొందాలి. అన్ని రకాల పరిస్థితులలో శాంతినందించేది! జీవితపు నిమ్నోన్నతాలలో సంయమాన్ని సాధించడంలో సహకరించేది అంతర్ముఖ జీవితం' అందులో వివిధ వ్యాప్తుల్ని, స్థిరత్వాన్ని, ఆమోదాన్ని, ఆనందాన్ని అనుభవించాలి. ఆ దివ్యజీవనాన్ని అహేతుకమైన, అవ్యభిచారిణియైన భక్తితో పరమాత్మునికి కానుకగా సమర్పించాలి. ఇదే పూర్ణజీవనం. అలా కాకుండా మనం, మీరు చాలా చోట్ల చూస్తున్నట్లుగా ఏదో ఒక ముఖం వైపుకు పయనించడం జరుగుతుంది. ఆనందపు పూర్ణగోళాన్ని తెలుసుకోక, ఏదో ఒక చోట నిమగ్నమౌతున్నాం! కేవల భౌతిక యాంత్రిక జీవనం ! మనస్సులోని చాపల్యం కొద్ది ఏవేవో కన్పించని విషయాల స్మరణల నెపంతో విచారహీనంగా, అవైజ్ఞానికంగా, నీరసంగా జీవితం గడుపుతున్నాం. ఇవి పూర్ణ జీవన లక్షణాలెలా అవుతాయి ?



అంతర్ముఖ సత్యప్రాప్తి కోసం 'తపోజీవనం' కావాలి. బాహ్యజీవితంతో పొందిక కుదుర్చుకోవాలి ! దానికై శుద్ధ స్థూల కర్మలు చేయాలి. రసజీవనం నడపాలి ! వీటిని ప్రాధాన్యం అప్రాధాన్యం – వీటికి అనుగుణంగా సమాన ప్రమాణంలో కలపాలి. అపుడు ప్రగతి సాధిస్తాం. పక్వఫలాన్ని అనుభవిస్తాం. ఇది 'సమాజీకరణం' చెందితే ఆ పూర్ణ జీవనం సార్థకమౌతుంది.

ఇలాంటి సర్వాంగీణ పరిపూర్ణ జీవితాన్ని వికాసజీవితాన్ని మహాత్ములు ఎప్పుడో అనుభవించి, మనకు నిరూపించారు. దీనికోసం నియమబద్ధమైన సాధనం ఇది అని సవిస్తారంగా, శాసిస్తూ 'నేతరేషాం' అని చెప్పారు. ఆ మార్గంలో నడిచిన జనులు అప్పట్లోనే "తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరాః" అన్నట్లు సర్వతోముఖ చైతన్యాన్ని పొందారు. జీవించి, జీవింపచేసి, వెలుగును చూపి, ఆ వెలుగులో పయనించి ఆనందధామాన్ని చేరుకున్నారు. అత్యున్నత సంస్కృతిని ప్రసాదించారు. ఆ గర్వంతోనే ఆయా దేశాలు తమ సంప్రదాయమే సర్వోత్కృష్టమని భావించడం జరిగింది. ఈ రీతిలో జీవించే వేళ తప్పనిసరిగా మానవజీవనం "ఆధ్యాత్మికం" కావాలి.

దాని కోసం ఏం చేసేవాళ్ళు ? ఏ దివ్యస్థిర నిశ్చిత సత్య సహజ పథాన్ని అనుసరించే వాళ్ళు? ఆ మార్గాన్నే ఈ తరం వారంతా విశ్లేషించుకోవాలి. కేవలం పుస్తకాల ద్వారానే ఆ మార్గం గ్రహించరాదు. పుస్తకం మస్తకం లోంచి వచ్చింది. అందుకే ఆ బుద్ధి, మేధస్సు ఉండే వ్యక్తులను ఆశ్రయించాలి. ఆ సాధన ఎలాంటిది ? అనే అంశాన్ని ప్రతి ఒక్కరూ బాగా ఆలోచించి, ఓ నిర్ణయానికి రావాలి. అలా సత్యదర్శనం చేసిన ఋషులు, మునులు వివరించిన సాహిత్యమే మన ముందు

దర్శనశాస్త్రంగా నిలచింది. అది వ్యాపించేవేళ ఏర్పడిన బాహ్యరూపరేఖా విన్యాసాలే మన సమాజసాహిత్యం! అది పూర్ణంగా ప్రచలితమై, ప్రకాశయుతంగా అనుకరింపబడి, ఆదర్శకథనంగా మారింది. అదే కావ్యసంపద. ఆ దివ్యమార్గాన్ని గురుముఖతః తెలుసుకోవాలి. ఆ పరమగురువులు మనల్ని కరుణించాలి.

ఆ సాహిత్యం మనకు విపులంగా, అఖండంగా లభిస్తోంది. అయితే అందులోని మాటల్ని చదివాం. ప్రవచనంలో విన్నాం. వాటిని తు.చ. తప్పకుండా అనుసరించటమనే దెక్కడ ? ఆధ్యాత్మిక అంశాలు ఆచరణలో లేవనే చెప్పాలి. ఇది ఉబుసుపోక అన్నమాట కాదు. ఆ తపోమార్గం కోసం బాల్యం నుండి పరితపించి, గురి లభించక తిరగడం వల్లనే ! 'కర్మ' అంటే – చాలామంది పూజలు చేస్తారు. 'జ్ఞానం' అంటే ప్రవచనాదులు. 'భక్తి' అంటే వాద్యాలు వాయిస్తూ భజన చేయడం – ఇవే కన్పిస్తాయి. కన్పించాయి. కన్పిస్తున్నాయి. ఇలా విమర్శిస్తున్నానని దయచేసి ఎవరూ బాధపడకండి. ఇది ఋషి మార్గానికి తగదు. సాధన కోసం పిచ్చిగా, తీవ్రాకాంక్షతో ప్రయత్నించి చెప్పిందల్లా చేశాం మనం ! అవేవి ఆత్యంతికమైన ఉపాయాలు కావు. ఆ ఋషుల దివ్యతపస్సు కాదు ! అనే ఆంతరికమైన భావన నిరంతరం ఉండేదే! అయినా జీవించి, సంస్కారబద్ధమైన ధైర్యంతో ఎదురుచూస్తూ ముందుకు వెళ్ళాను. చివరకు అనేక సిద్ధులు, తపస్వులు మన వెనుక ఉన్నారనే ధైర్యంతో అడవిలో దేహత్యాగం దాకా సాధన చేయాలనే నిర్ణయానికి వచ్చా ! ఎవరిని చూసినా పరిహసించక, మూర్తి పూజ, మాలాజపం, తాళాలతో భజన – ఇవన్నీ చేశా. వ్యక్తి, జాతి, సంప్రదాయం – వీటిపై ద్వేషం ఏ మాత్రమూ లేదు. తత్త్వం కోసం విశ్లేషించే వేళ అన్ని అంశాల్ని వివరించాల్సి ఉంటుంది.



ఈ అనుకరణలన్నీ మనస్సును మెత్తబడేటట్లు చేసి, నియంత్రించేందుకు కొంతమటుకు ఉపకరించే తరుణోపాయాలని తాటస్థ్యభావనతో అంగీకరిద్దాం. క్రమానుగతమైన జిజ్ఞాస, దానికై ప్రయత్నం పెరగకుంటే ? ఈ బాహ్యోపకరణాలే శాశ్వతంగా నిలచిపోతే? ఇది సాధనా మార్గంకాజాలదు. కాలబద్ధం, దేశబద్ధం కాని మనుష్యత్వపు శుద్ధ సహజ పథ వికసిత శక్తి లక్షణం !

ఇంద్రియాలతో శోభించే దేహం ఉంది. దాంట్లో దివ్యత్వముంది. అందులోని అంతర్ బహిర్వ్యాప్తుల సుఖానందాల్ని అనుభవించాలి. ఇదే కదానిజమైన తత్త్వజీవనపు పరిధి ! ఈబాహ్యోపకరణాలు, బాహ్యాచారాలు మన లక్ష్యసిద్ధికి ఎలా ఉపకరిస్తాయి ? ఇవి సహకారమే అందించలేవు. ఇక సాధనలుగా మారడం ఎప్పుడు ? 'మనం' 'మన' దేహంలో దేని ఆధారంతో నిలచి ఉన్నాం ? ఈ దేహంతో మనం దేని ఆధారంతో సుఖదుఃకాల్ని అనుభవిస్తున్నాం ? ఇదే ముఖ్య ప్రశ్న. లోపలి నుండి బయటికి వచ్చిన దారే లోపలికి వెళ్ళే దారి. జీవి బహిర్ముఖుడయ్యే ముందు ప్రథమభూస్పర్శలో – అపుడే పుట్టిన బిడ్డలో సర్వేంద్రియాల కదలికలు శక్తి నివృత్తి పథంలో సాగి బ్రహ్మేంద్రియాల కూడలిలో అంతర్ముఖంగా ఉండడాన్ని తెలుసుకుంటుంది కదా ? క్రమానుగతికంగా ఇంద్రియ వృత్తులన్నీ తమ సారధి యొక్క సహాయంతో అంటే అంతర్ముఖస్థితిలో – ఆత్మ దేని సహాయంతో విశ్రాంతిని పొందునో ఆ ముఖ్య ప్రాణుని ద్వారానే బహిర్ముఖంగా ప్రవృత్త మౌతుంది. అన్నపుడు ప్రతి ఒక్క వ్యక్తి ఆలోచించాలి ! మనలో సత్యం ఎలా ఉంది ? ఎలా గోచరిస్తోంది?

సాధారణంగా ఒక జీవి ఉనికిని గుర్తించేందుకు, అతడు బ్రతికి ఉన్నాడా ? చచ్చాడా ? అనే అంశాన్ని గమనించేందుకు మనం శ్వాసనే కదా చూసేది ! మొదటి మనకు తెలిసే సత్యమే ఇది ! 'ఏకోవశీ సర్వ భూతాంతరాత్మా' అన్ని చోట్లా ఆ సత్యమే వ్యాపించి ఉండడాన్ని మనం గమనించవచ్చు ! మనిషి శరీరంలో శ్వాసకు చాలా ప్రాధాన్యం ఉంది. వ్యాప్తి ఉంది. సార్థకత ఉంది. దీన్ని స్థూలంగా ఊపిరి ఆడడం అంటే సరిపోదు. మనం అనుకున్నట్లుగా జాగ్రదవస్థలో ఉంటూ ముక్కుపుటాల్లో నిరంతరం సాగే శ్వాసోచ్ఛ్వాసాలే ఊపిరాడడం. ఇంతటితో ఆగక, అన్ని అవస్థలలోనూ, ఇంతటితో ఆగక, అన్ని అవస్థలలోనూ ఎక్కడ నుండి వెలువడిందో అక్కడిదాకా అధోలోకం నుండి ఊర్ధ్వలోకం దాకా నిరంతరం సాగే ప్రయత్నం జరిగింది. అది లోపలే జరిగింది.ఆ దివ్యశక్తి పేరే 'ప్రాణం'. ఆ 'ప్రాణం' యొక్క పరిధి చాలా విస్తృతం ! సరే అది అలా ఉండనీ ! సామాన్యంగా తెలుసుకున్న సత్యం – వాడుకభాషలో 'మనస్సు' అని చెప్పాలి. అజ్ఞాతశరణుని 'విశ్వవాణి' ఇలా అంటుంది.

> **"మనలోని నేను నీవనే రెండు ఘనతలను వేరు చేసి గగన తలమున ఒకటి పాతాళమున నొకటిగా చేసి ఎచటికో ఎచటికో పరుగులిడుతూ ఉండే ఈ మనస్సు ఆకారం బృహదా కారం చూడు !"**
>
> ఈ కావ్యవాణికి జయం కలగనీ !

ఈ రెండూ మనకు అర్థంఅయ్యే సత్యాలు. ప్రాణం మరియు మనస్సు. ఆంతరికమైన అధిష్ఠానం సత్యం. దాన్నే 'ఆత్మ' మొదలైన శబ్దాలతో పిలవనీ ! పిలుద్దాం! మొత్తానికి ఆత్యంతిక ఆంతర్యప్రాప్తియే సత్యం



ఇక్కడ కొంత ఆలస్యం. మనస్సు అంగీకరించాక ఆ మనసే అన్ని విషయాల ఉపాయమనే మాట జ్ఞాపకానికి వస్తుంది కదూ! ఇది పరిపూర్ణంగా ఆలోచించని వాళ్ళ కథ! ఆ మనస్సు పనిచేయాలంటే ఆ వాయువనే మహారాజు ఉంటేనే సాధ్యం కదూ ! మనస్సులో ఉపద్రవాలన్నీ తొలగాలంటే, విశ్రాంతి ఏర్పడాలంటే ఆ వాయువు యొక్క సహాయం చాలా అవసరం. మనస్సు ఎల్లప్పుడూ జాగృతంగా ఉండదు. అది మనలో ఇంద్రియ సమేతంగా, నిరింద్రియంగా విషయాల సంకల్పక శక్తిగా మాత్రమే కన్పిస్తుంది. అది శాశ్వతంగా ఒకే రకంగా ఉండదు. విజయ పరాజయాలతో ఆడుతూ అలసిపోతుంది. ఇదెక్కడ ? మనకు కావాల్సిన అలుపెరగని శాశ్వత శాంతి ఎక్కడ ? కావలసింది ఆత్మ సామీప్యం. కోరేది ఆనందం' ! మనలో నిరంతరం అన్ని అవస్థల్లో సంచరించి ఆత్మ యొక్క దైహిక వ్యాపారానికి, ఆనందానికి ఆధారుడైన 'ప్రాణు'దే శాశ్వత సహాయకుడు కానీ ! వేరే చోట ఇది సాధ్యంకాదు.

దీన్ని గ్రహించేవేళ దేహంలో నిరంతరం హృదయమని పిలువబడే స్థానం నుండి ఊర్ధ్వ లోకగామిగా ఒక ప్రయాణం నడవడం అందరికీ తెలిసిందే ! అక్కడ ఓ మూలస్థానం ఉంది. అక్కడే దానికి విశ్రాంతి. అది జరిగితేనే బహిర్ముఖుడు అంతర్ముఖుడైనట్లు ! విడివడిన వస్తువు మళ్ళీ చేరినట్లు ! ఆ కలయికే నాభి బ్రహ్మరంధ్రాల కలయిక. యోగ సాహిత్యపు భూమి ఆకాశాల మధ్య సమగ్ర ప్రయాణం, మూలంలోకి చేరేందుకే! ఇదే 'యోగం'. ఆ యోగం గురించి తెలిపేదే 'యోగవిద్య'. ఈ విద్య లభించాలంటే 'గురూపదేశం' అవసరం. ఈ 'ఆధ్యాత్మ యోగవిద్య' ఆచరణలోకి రాదు. విభిన్న అవలంబనాలతో మనస్సును మాత్రమే వెంబడించడం వల్ల ఛిన్నాభిన్నమై పరుగులు తీసే మనస్సు ద్వారా సత్యం

ఎలా గోచరిస్తుంది ? త్రిదోషాలతో కూడిన దేహరచనలో చిక్కుకున్న 'ఆత్మ' అన్ని సంతాపాల నుండి విముక్తం కావాలంటే, ఆ దోషరహిత స్థితి ప్రాప్తించాలంటే భిన్న విషయాల్లో పరుగు తీసే చైతన్యం ఉండరాదు. క్షుద్రావలంబనలో ఉండే మనస్సు ఒక స్థితికి రాజాలదు. ఈ సంఘర్షణలో ఉన్నపుడు అజ్ఞాత శరణుని 'విశ్వవాణి' దీనికిలా సమాధానం అందించింది.

> **"పైకి వెళ్ళిన మహాలోకం! జారిపడితే మాయలోకం !**
> **గురితప్పక, భ్రమలు విడిచి పవన పావనత్వమ్ము**
> **నాశ్రయించి సాధించుటయే సాధకుని గతి ! మనస్సు**
> **పరమాత్మలో లీనమై పోవుటే సంసిద్ధి అగునయ్య !"**

త్రిదోషాల్ని నశింపజేసే ఆయుధం – ఆ దోషాలు లేని, అవస్థారహితుడైన సర్వసమప్రాణుడే ! మనస్సు ఇంద్రియాల ద్వారా, నిరీంద్రియ విషయాల ద్వారా నిరంతరం విహరిస్తూ ఉంటుంది. ఆత్మ నూతన చైతన్యాన్ని పొంది, శుద్ధమైన బుద్ధి బలం పొంది ప్రజ్ఞలో కలసి మహాజ్ఞానంగా పరిణమించాల్సి ఉంది. అందుకే మొదట మనః ప్రాణాల కలయిక జరగాలి ! కలయిక గావించి, అక్కడ నుండి పైకి వెళ్ళితే సత్యవ్యాప్తి ! వివిధ వ్యాప్తి ! సత్యస్థితి ! ఆనందప్రాప్తి. ఇది సర్వశాస్త్ర సమ్మతం. ఇది అనుభవ సమ్మతం ! త్రికాలా బాధితం! సర్వమానవీయ సంపద. ఈ సాధన మహిమతో ఏ దర్శనమూ తులతూగజాలదు. ఆదిమహర్షుల దర్శనమేమి ? వేద సత్యమేమి ? ఉపనిషద్ దర్శనమేమి? ఉన్నత గీతాబోధ ఏది ? బౌద్ధం ఏమిటి ? జైనమతం ఏమిటి ? ప్రవక్తలు చాటి చెప్పిందేమిటి? ఆ దివ్య సాధననే! ఆ మాటల్లో విడమరచి చెప్పబోను! అది నా ఉద్దేశం కాదు ! అవసరం లేదు కూడా ! "కార్యదర్శులు మాత్రం సమయం మొదలైన నియమాల్ని స్వాములవారికి విధించడం లేదు.



విషయం కోసం వారిని ఆహ్వానించాం. విస్తృతమైన ఉపన్యాసమే ఉండనీ" అని చెప్పారు కదా ! అది మీ జిజ్ఞాసను సూచిస్తుంది. అయినా అనుష్ఠానదక్షతే లేని ప్రవచన చపలుడిగా నేను నిలబడడం లేదు. సత్యం కోసం, తత్త్వం కోసం నిర్దిష్టమైన రీతిలో మాట్లాడవలసిందాన్నే విశ్లేషించుకుంటే చాలు.

ఇక, ఆ అంశాన్నే స్థిరంగా, అనుభవంలోకి వచ్చే రీతిలో చెబుతూ వచ్చినా ఇలా ఆ సాధన ఎందుకు చేజారింది అనిపించింది. అనిపిస్తుంది నిజం! అయితేనేం ? వేదాల్లో ఈ సాధన, అభ్యాసం గురించిన విస్తృతమైన వివిధానుభవాల వర్ణన లేదు ! ఎంత రమ్యంగా, ఎంత మనోజ్ఞంగా అలంకార సహితంగా వర్ణించారు. అగ్ని ప్రార్థన! వర్ణన ! ఉపయోగాలు! అతణ్ణి వర్ణించే వేళ ఏడు నాలుకలు ! అతని వివిధమైన ఉపయోగాలకు సంకేతాలు ! అతడు 'పురోహితుడు' ! అతని ద్వారానే అన్ని రకాల దర్శనాలు మున్ముందు కల్గుతాయి. ఈ విషయంలో దార్శనికంగా ఆలోచించరాదా ? ఆత్మ కల్యాణపథంలో కల్గిన స్వానుభవాల్ని వర్ణించారు. సామాజిక వ్యవహారాలకు సంబంధించిన అంశాలూ ఉన్నాయి. మనిషి అంతర్ముఖ జీవన సంపత్తుకు అవసరం అనిపిస్తే వాటి ఉపయోగం ! ఆ సూక్తాలను, ఋక్కుల్ని పఠించి భాష్యం చెప్పడం నా ఉద్దేశం కాదు. ఆ రీతే సకల దేశ వ్యాప్తమేమీ కాదు.

అగ్నినే 'గృహపతి', రోజూ వచ్చే అతిథిగా వర్ణించారు. ఆత్మ నివసించే దేహం మొదటి గృహం. దేహం నివసించే గృహం రెండో ఇల్లు. ఇల్లు ఉండే విశ్వం మూడో గృహం. ఈ సృష్టి రచనకు తేజోశక్తి తెలుసుకున్నట్లు వేడిశక్తియే అగ్ని. అందుకే అతడు గృహపతి. రోజూ అతణ్ణి పిలుస్తాం. అతని ప్రతిష్ఠ అయిన తర్వాతే మిగతా కార్యకలాపాలు.

అతడు మొదటి అతిథి ! అతణ్ణే "సహసః సుతః" అన్నారు. అంటే శక్తి నుండి పుట్టినవాడు. దీని దార్శనిక మర్మం ఏమిటి ? ఆత్మ నిరంతరం వాదించి, విహరించి, విరమించి, 'ఆనంది' కావడానికి ధరించిన ప్రాణశక్తి యొక్క గతాగతిలో మొదట పుట్టేది అగ్ని. అందుకే అతణ్ణి "సహసః సుతః" అన్నారు. సాధానానుభవం కల్గితేనే కదా జ్ఞానోదయం అవుతుంది. చూడాలి. ప్రాణాపానాల్ని గురుస్థానంలో ఉంచి ఒకే లయలో గతించే వేళ ఉత్పత్తి అయి వెలువడే జాజ్వల్యమానమైన అగ్ని సకలదోషాల్ని భస్మీపటలం చేసి వచ్చేరీతి! జ్యోతిరూపం ధరించిన వేళ వెలువడే వినూత్న కిరణాలు! ఆహా ! ఇదంతా సాధకుని సంపద !

ఇకపోతే వేదం గురించి ! "ఇతని గడ్డం ఎరుపు". భాగాలుగా, కడ్డీల్లా కన్పించే ప్రకాశరేఖల వర్ణన ఇది ! అది మళ్ళీ మళ్ళీ ఉన్నతమైన వేగంతో ప్రసరించి, ప్రకాశమానంగా కన్పించే వేళ బంగారు రంగు. విడివిడిగా కన్పించినపుడు బంగారుకడ్డీలు. ఇది ఆ జ్యోతి దర్శనమే! తెలియని వారికంతా తెలియాలి. ఆ మహానుభావుడు దేవతల్ని యజ్ఞశాలకు తీసుకుని వెళ్ళే అశ్వం – ఆధ్యాత్మిక సాహిత్యంలో ఉపనిషత్తుల్లో కన్ను, చెవి, నాలుక, నోరు మొదలైన మనిషి శరీరంలోని సంపద్ భాగాల్ని దేవతలుగా వర్ణించడం జరిగింది. ఆ దేవతలు ఆత్మ యొక్క యాగశాలకు కలసి వచ్చేట్లు అగ్ని తన జ్యోతిసాయంతో చేస్తాడు. అపుడు సర్వేంద్రియాల వృత్తులను ఏకం గావించినట్లే!

అలాగే ఇతడు "వెళ్ళిన మార్గం తప్పు" అని అన్నారు. నిజం! నిజం! అభ్యాసంలో చూడాలి. 'మనఃప్రాణాల సంగమమై, ఊర్ధ్వగతిలో పయనం సాగినవేళ ఆత్మ మూలస్థానానికి అధిరోహించిపోయినట్లే, అతి



రహస్యమార్గం 'కారుచీకటి కమ్ముకున్న దారి ! ఆ దారిలో మొదట అభ్యాస బలంతో దివ్యవిద్యను సాధించి, ఆ ప్రాణుని గతాగతిలో జన్మించిన సహసపుత్రుని సాయంతోనే అంటే తోచే దివ్యకాంతి ద్వారానే ప్రవేశించాలి. అందుకే అతడు వెళ్ళిన దారి తప్పు అన్నారు! "అగ్నిం ఈళే పురోహితం"! ఇలా ఇంకెంత సేపు వివరించాలి ? మొత్తానికి వాయువు, అగ్ని, ఇంద్రుడు, వరుణుడు ఇత్యాది దేవతల వర్ణనలు అనేకం ఉన్నాయి. ఏదేమైనా వీటన్నింటి ప్రగతి చాలా ఉన్నత స్థితిలో జరగాలి. ఆత్మ యొక్క యజ్ఞం నడవాలి. 'ఆనంది' కావాలి ! ఇది అక్కడి దార్శనిక నీతి ! అభిమాన దేవతలుండనీ! ఆ దివ్య చైతన్యాల సమీకరణం ఆత్మశక్తితో నిరంతరం నడవాలి. ఆనందానుభవం పొందాలి. అన్ని చైతన్యశక్తుల పాలకుడు, స్వామి అయిన పరమాత్మునికి సర్వార్పణ బుద్ధితో శరణు వేడితేనే – ఆ జీవం, తత్వజీవనం – పూర్ణజీవనం ఔతుంది.

ఉపనిషత్తుల్లో చాలా చోట్ల ఆనందధామాన్ని విశ్లేషణాత్మకంగా వర్ణించడం జరిగింది. ఆ ధామానికి వెళ్ళే మార్గాన్ని వర్ణించారు. హృదయపతి అయిన తాను ఎలా పైకి అధిరోహించాలి ? పునరావర్తనం లేని పరమపదం ఎలా చేరాలి ? అనే అంశాల్ని చక్కగా వర్ణించారు. అది విశ్వమానవానుభవమే ! వేరే లౌకిక ప్రయత్నాలు శాశ్వత సుఖాన్ని అందించలేవని కఠోపనిషత్ మొదలైన అన్ని ఉపనిషత్తులూ ఘోషించాయి. ఇక సాక్షాత్తు శ్రీకృష్ణుడే ఉపదేశించిన జ్ఞానపు మహోన్నత హిమశిఖరం లాంటి భగవద్గీత ఉండనే ఉంది. దాన్ని యోగశాస్త్రమని అన్నారు. జీవితం విషాదంతో ప్రారంభమైనా, చివరికి సమస్తాన్ని భగవదర్పణం చేయడంతో అంతం కావాలి – అని గీత చెబుతుంది. విషాదానికి తగిన మందును గీతాచార్యుడు అందించాడు. అదే ఆధ్యాత్మిక తత్త్వం! ఆ

దివ్యత్వానికి వైరాగ్యం, సర్వసమానత్వం – రెండూ అవసరమని అన్నాడు. కర్మ గురించి చాలా వివరాలందించాడు. ఫలం రావాలనే ఆశను వదలిపెట్టాలి. నిర్లిప్తంగా కర్మ చేయాలి అని సెలవిచ్చాడు. అర్పణబుద్ధితో చేసిన ప్రతికర్మ నిర్లిప్త కర్మే అవుతుంది. దానికి కావాల్సిన జ్ఞానం గురించి వర్ణన అందులో ఉంది. దోషరహితుడై, యోగస్థుడై కర్మఫలాశా త్యాగపూర్వకంగా కర్మచేయడమే 'కర్మసన్యాస' మని వివరించాడు పరమాత్మ. 'ధ్యానయోగం'తో ఆ స్థితి సాధ్యం ఔతుంది. స్థితప్రజ్ఞతతో నిర్లిప్తంగా కర్మ చేయడం రావాలంటే కేవలం ధ్యానస్థుడైన వ్యక్తికే అది సాధ్యం ఔతుంది. యోగి లక్షణాల్ని వివరిస్తూ 'యోగధారణ' అంటే ఏమిటో ఇలా వర్ణించాడు భగవానుడు.

**"సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్య చ**
**మూర్ధ్నా ధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణమ్"**

'సమత్వం యోగ ఉచ్యతే' అన్నట్లుగా మనస్సును, బుద్ధిని, అల్లకల్లోలం కానివ్వకుండా సమానంగా ఉంచగల్గాలి. అదే యోగం అంటే సరిపోదు! 'యోగధారణం' జరిగి నిలిచిపోవడమే సమత్వం! ఇక్కడ గీత ఇలా చెప్పాలనే నియమంలేదు. మొత్తానికి యోగి అందరికన్న శ్రేష్ఠుడు. సర్వార్పణ బుద్ధితో దేవదేవుని భక్తుడై నిలిచిన యోగి నాకు పరమ ప్రియుడు అనే అంశాన్ని మాటి మాటికి చెబుతాడు పరమాత్మ. ప్రాణాయామ పరాయణత్వం, వారి లక్షణాలు, ఓంకారపు మహిమ – వీటన్నింటినీ గీతలో పరమాత్మ వివరించాడు. ఆ మహాయోగ ప్రక్రియ జరిగే వేళలో కల్గే విషాదంలో మనుష్యులు పెంచుకోవలసిన, వదలి పెట్టవలసిన, తెలుసుకోవాల్సిన, పొందాల్సిన సర్వవిషయాల గురించి, మోక్షం గురించి గీతలో పరమాత్మ ఉపదేశించాడు. యోగస్థుడైతేనే ఇవన్నీ



సాధ్యం అని నొక్కి నొక్కి వక్కాణించాడు. 'యోగి' 'యోగ' అనే శబ్దాలను మాటి మాటికి వివరిస్తాడు. ఆ 'యోగా'న్ని పొందడం ఎలా ? సాధన అంటే ఏమిటి? వీటిని చాలా సుందరమైన రీతిలో వర్ణించాడు. సర్వస్వాన్ని దేవదేవునికి సమర్పించకపోతే, గీతలో చెప్పిన రీతిలో 'యోగస్థుడు' కాకపోతే, యోగస్థుడయ్యేందుకు కావలసిన 'దివ్యయోగవిద్య'ను పొందకపోతే, ఆ విద్యను పొంది 'సమత్వా'న్ని గ్రహించకుంటే – ఆ గీతాచార్యులు వర్ణించిన సర్వసమ్మతమైన మోక్షం ఎలా దక్కుతుంది?

ఇలా శాస్త్ర వచనాలతో ప్రతి ఒక్క అంశాన్ని విశ్లేషించే తీరాలని నియమం లేకున్నా పవిత్ర వాణిలో రహస్యాలేమిటో – తెలుసుకున్నాం మనం.

మరోసారి స్మరించుకుందాం ! ఆత్మశక్తి, ప్రాణశక్తులు నిరంతరం పయనం చేశాయి. సమాగమం కాకుండా, మిలనం కాకుండ ! ఊర్ధ్వలోక గమనంతో మూలాన్ని ముట్టకుంటే ఆనందం లభించడం సాధ్యం కాదు. ప్రతి మనిషికి అంతో, ఇంతో జ్ఞానం ఉండనే ఉంది. అన్ని ఆలోచనలు, చలన వలనాలు, పరిమితులు, గతులు, ఆ ప్రాణపు సాయంతోనే సాధ్యం! అందువల్లనే అతణ్ణి ఆశ్రయించి సాగుదాం! ఉన్నతస్థానాన్ని పొందుదాం! ఇదొక్కటే సాధన !

ఇక, ఈ విషయానికి సంబంధించిన మరి కొన్ని రీతుల్ని వివరించాలా ? 'యోగవిద్య' అనేది బాహ్యేంద్రియాలతో చేయదగింది కాదు. నీ ప్రాణం నీలోనే ఉంది ! బయట లేదు ! ముక్కు పుటాలతో లెక్కించి, ఊపిరి వదలడం, నిలిపి శ్వాసను వదలడం 'యోగవిద్య' కాదు ! వద్దునాయనా ! అన్ని ద్వారాల్ని నియంత్రించు ! సంయమించు

అన్నాక ముక్కుపుటాలు కూడా ద్వారాలే కదా ! ఆ విద్య అంతర్భూతంగానే కొనసాగాలి. దాని పరుగు నాభి మరియు బ్రహ్మరంధ్రాల నడుమ ! ప్రాణుని నుండే శబ్దం (ప్రణవం) దాంతోనే ఆ మార్గం స్వచ్ఛం కావాలి. దానికే ఉపదేశమని పేరు. గురూపదేశం లేకుండా అది మనలో వికసించదు. రాదు ! అయ్యా ! ఇలా సాహిత్యబలంతో మనకు ఇష్టం వచ్చినట్లు చేస్తే ప్రయోజనం లేదు. గురువును ఎన్నుకోకుండా, శాస్త్రంలోని వివరణను అర్థం చేసుకోకుండా, ఇష్టం వచ్చిన పనుల్ని చేస్తూ తమకు ఇష్టం వచ్చిన రీతిలో సాహిత్య రచన చేసిన 'మహానుభావులూ' ఉన్నారు. అలాంటి వారి నుండి కూడ యోగసాహిత్యం వెలువడింది. వ్యాయామాన్నే యోగమన్నారు. విచిత్ర వికారపు చేష్టలు చేస్తూ దాన్నే 'యోగ' మనే వాళ్ళూ ఉన్నారు. చాలా బాధతో చెబుతున్నా. ఇలాంటి చేష్టలు మనిషిని పెడదారి లోకి పయనింపజేస్తాయి. ఇలా విచిత్ర వ్యాయామాలు చేస్తూ, చిత్రాలు గీయించి, పుస్తకాల్ని ముద్రించినట్లయితే – అలాంటి వారి నుండి నిజమైన యోగవిద్య మనకు లభించదు. అనాది కాలం నుండి వచ్చిన తపోమార్గమే యోగవిద్య. గురువు ప్రత్యక్షంగా దాన్ని ఉపదేశించాలి. ఆ స్థానం మనకు లభించాలి. అపుడు మాటలు అవసరం లేదు. మనం ఒకరి నొకరు చూడాల్సిన అవసరం లేదు. అతడే శిష్యుని కుడి చెవిలో ప్రవేశం చేస్తాడు. అపుడు మెలకువ (జ్ఞానం) కల్గుతుంది. తర్వాత నిజమైన యోగాభ్యాసం కొనసాగుతుంది. వ్యక్తి నిష్ఠ ఆ మహావిద్య యొక్క అభ్యాసనిష్ఠ, తత్వనిష్ఠ ఈ మూడూ ఏకం కావాలి. సమన్వయంతో కలవాలి. ఈ త్రికూటం భక్తి అనే పునాదిపై ప్రతిష్ఠింపబడాలి. వైరాగ్యంతో బలపడాలి. అపుడు ఆ మహాయోగం మనుష్యత్వపు సంపదగా మనకు లభిస్తుంది.

ఇకపోతే, లయ, దృష్టి, యోగం అనే మాటలు విన్పిస్తున్నాయి. ఇవి విభిన్న క్రమాల్లో కొనసాగేవి కావు. దృష్టి యోగంలో చూపుల్ని



స్తంభింపజేస్తే గాలి నిలుస్తుంది అంటారు. ఇది కేవలం బాహ్య విషయం! నాసికారంధ్రాల్లో పారాడే ప్రాణం నిలిస్తే చాలా ? అది బహిర్ముఖంకాకుండా సహస్రారం వైపుకు పయనించాలి. అది అంత సులభమార్గం కాదు. ఐదురకాలుగా వ్యాప్తమైన ప్రాణశక్తి ఏకం కావాలి. అక్కడక్కడ వివిధ కేంద్రాల్లో ద్వారాలు మూసుకుని ఉంటాయి. చిన్న చిన్న తెరలు ఉంటాయి. దేహంలో కఫాది దోషాలు అడ్డంగా ఉండి మూలాధారం నుండి ప్రాణం పైకి పోకుండా అడ్డుకుంటాయి. ఆ ఇరుకైన దారి తెరచుకోవాలంటే నిరంతరం సంచరించే మనస్సు విముఖమై, ఒకే చోట ఏకాగ్రం కావాలంటే దానికి కారణం ఆ ప్రాణచైతన్యమే ! ఈ నేత్రాలు, ప్రవృత్తి, నివృత్తులు, మనః సంచారాలు, ఈ సర్వస్వం వీటి అస్తిత్వానికి కారణం ఆత్మ! ప్రాణచైతన్యమే!

మూసుకున్న ద్వారాల్ని తెరచి, త్రిదోషాల్ని ఛేదించుకుంటూ ఆ ప్రాణుని రౌద్రగమనం ఎలా సాగాలి? అంతరంగంలో ఎక్కడ నుండి అది ప్రారంభం కావాలి? ఆ నిజమార్గం నుండి అపానాన్ని, దాని ద్వారా నిమగ్నమైన మనస్సనే ఇంద్రియాన్ని ఊర్ధ్వముఖం గావించి, ఒక వైపు నుండి మరోవైపుకు చేర్చి, చివరకు 'లయ' గావించాలి. అంటే దివ్యమైన పయనంలో చేర్చాలి. ప్రాణ, క్షేత్ర వ్యాప్తమైన బలాలన్నింటిని చేర్చుకుని క్షేత్రజ్ఞుడైన పురుషునితో ఏకం కావాల్సి వుంది.

అక్కడ లభించే ఆనందాన్ని అనుభవించాలి. అపుడు సర్వార్పణం వల్ల పురుషోత్తముని కృపను దర్శనాన్ని పొందవచ్చు.

ఆ దివ్యయోగ మార్గంలో దేహం స్థిరంగా ఉండాలి. దృష్టి మూయబడాలి. విభక్తమై వచ్చే ప్రాణశక్తిని ఒకదానిలో లయం చేసుకుని, వివిధ లోకాల్ని దాటి "దివ్యే బ్రహ్మ పురే ప్రతిష్ఠితః" అనే స్థితికి చేరుకుని ఆనందించాలి. ఆ ఆత్మ మనోమయుడై, ప్రాణసమేతుడై, ప్రాణం ద్వారా

శరీరాన్ని నియమింపజేస్తూ 'హృదయం సన్నిధాయ' హృదయంలో విరాజిస్తుండాలి. ఈ విజ్ఞానాన్ని గ్రహించిన ధీరులు ఆనందరూపాన్ని, అమృతతత్వాన్ని పొందగల్గుతారు. అక్కడికి వెళ్ళే మార్గాన్ని వర్ణించారు.

**"ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే**
**అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్"**

ప్రణవమే ధనస్సు; ఆత్మే బాణం; బ్రహ్మ దీని లక్ష్యం. అప్రమత్తతతో గురిని కొట్టాలి. బాణంలాగా తన్మయుడు కావాలి అని ఉపనిషద్వాణి చెబుతోంది. చేయెత్తి చాటుతోంది. ఆ మార్గం సత్యం, స్థిరం, అనాది. సమగ్రమైన దివ్యసాధన అదే !

ఆ దివ్యపథంలో పయనించాలంటే - మహర్షుల తపోజీవనాన్ని పొందాలంటే - బాల్యంలో చంచలమైన నా బ్రతుకును లాగి, నాలాంటి వాడికి అఖండజ్ఞానాన్ని అందించి గుహజీవనాన్ని రుచి చూపించారు గురువుగారు. తినే ఆహారంతో పాటు జీవన విధానం దాకా నాకు శిక్షణ అందించి, తాను ఆ నైవేద్యాన్ని స్వీకరించిన గురువుగారు యోగి అచ్యుతుల స్వానందం నాలో నిరంతరం నాట్యమాడుతోంది. ఆ నాట్యంలో ఆనందించే వాడే ఈ అనన్యభక్తుడు.

ఆదివ్యమార్గం గురుకృప ద్వారానే లభించాల్సి ఉంది. ఈ దిశలో ప్రయత్నం జరగనీ ! మానవత్వ సర్వ పరిపూర్ణ రీతిలో తన ఔన్నత్యాన్ని నిరూపించుకోనీ ! ఆ దివ్యత్వం సమాజీకృతం కానీ ! విశ్వమానవులంతా దివ్యపథగాములై ఆ పరశ్రేష్ఠుని పరమకృపకు పాత్రులు కానీ ! ఆ కృప అనంత దిక్కుల్లో ప్రవహించనీ ! అందుకే ఈ పిలుపు

**ఓం సహనావవతు. శుభం, భద్రం, శివం.**

**సర్వం శ్రీ అచ్యుతార్పణమస్తు.**



# 9. మానవ పూర్ణత్వం - (భౌతికం)

**నా ప్రియమైన జిజ్ఞాసు బంధువులారా !**

మీలోని చికిత్సాబుద్ధి జాగృతమౌతోంది. ఉద్రేకాలకే పరిమితం కాకుండ మీ మనస్సు ప్రగతిని పొందుతూ విచారశక్తి విస్ఫోటనం పొందిందా ? నేను మాత్రం అలా భావించాల్సిందే ! అది నా కర్తవ్యం. నాలాగే ఇతరులను చూడాలనడమే వేదాల్లో కన్పించే మార్గం అని భావించే వాళ్ళల్లో నేనూ ఒకణ్ణి ! నేను ఎలా శోధకుడనై, సాధకుడనై సాగుతున్నానో అలాగే విశ్వబంధువులంతా సాగిరావాలనేదే నా ఆకాంక్ష. అజ్ఞానమే ఈ రోజు నన్ను అన్నింటిని త్యజించి సమర్థంగా నిలచేటట్లు చేసింది. ప్రకృతి సహకరించాలి. పరమాత్ముని కృప లభించాలి. మీ సమాజంలో శాంతిపారం శ్రేయస్సు కలగాలి ! అందుకే నేను ఈ రోజు 'మానవపూర్ణత్వం' గురించి మాట్లాడదలచాను. అందుకే మిమ్మల్ని ఈ రోజు "జిజ్ఞాసువులారా!" అని సంబోధించాను.

నిజానికి ఇది చాలా గొప్ప విషయం. నన్ను కూడా ఒక అనుభవ జిజ్ఞాసువుగానే నేను భావిస్తున్నాను. ఒక్కమాట. జిజ్ఞాసువు అయిన వ్యక్తి నిరంతరం అన్వేషిస్తాడు. అన్వేషించిన దాన్నంతా పంచిపెడతాడు. శోధించి, సాధించి, లక్ష్యాన్ని అందుకుంటాడు. దివ్యమార్గంలో అందరినీ పరీక్షిస్తాడతడు.

చూడండి. నాలోని ఈ జిజ్ఞాసుత్వం మిమ్మల్నంతా ప్రేమతో ఆహ్వానిస్తోంది ! ఆశ్రయం ఇవ్వండని కోరుతోంది. అయినంత మాత్రాన ఇది అనాథంకాదు. మీ ఆర్తిని తొలగించుకోండి అనే మాట! వినండి !

మనస్సు లగ్నం చేయండి. హృదయాన్ని నింపుకోండి. మార్గంలో నడవండనే మనవి ! ఆ దిశలో మీరు సాగిపోవడమే మీరు నా కందించే ఆశ్రయం. నేను నిరంతరం విశాల విశ్వమనే అనుభవశాలలో జ్ఞానం పొందుతూ ముందుకు సాగుతా ! అంటే. అనుభవాన్ని ఆలింగనం చేసుకుని ముందుకు సాగుతా ! అతని స్థితి యొక్క గమ్యస్థానం లోకపూర్ణత్వం ! ఆ ప్రవృత్తి పథం గమ్యస్థానం మహాపూర్ణత్వం!

మానవుడు – పూర్ణత్వం – ఇవి రెండూ చాలా గొప్ప శబ్దాలు. ఇవి రెండూ పెద్ద సమస్యలు ! ఇవి రెండు మంచి సిద్ధులు'. "సూక్ష్మత్వం లేకుంటే శాస్త్ర విషయాలు అంతుబట్టవు. అస్త్రశస్త్రాలు కాదు యుద్ధంలో గెలిచేది శస్త్రాన్ని పట్టుకున్న చేయి – గెలుస్తుంది ! అనే నా మాట వినండి! లేవండి ! మేల్కొనండి! గురుకృపను ఆశ్రయించాను. మీ ఎదుట కూడ నేను గ్రహిస్తూనే ఉన్నాను. రాసి చదవడం నాకు అలవాటు లేదు. నా అంతరంగంలో ఊర్ధ్వగమన ప్రక్రియ జరిగే వేళ నాకు స్పష్టమయ్యే అంశాలు నాలోని మానవ పూర్ణత్వానికి ప్రతీకలు ! అది శబ్దరూపం ధరించి మీ వద్దకు వచ్చిన వేళ, మిమ్మల్ని మానవ పూర్ణత్వం వైపుకు మళ్ళించే ఉపన్యాసం కావాలి.

మనిషి పూర్ణత్వాన్ని పొందాలని ధైర్యంగా సంకల్పిస్తే తప్పక పూర్ణత్వాన్ని పొందుతాడు. మనుషులమైన మన మంతా దీనికి సాక్ష్యం. "మనిషి ఎవరు ?" అని తీవ్రంగా పరిశోధన గావించి పరికిస్తే, అఖండ సృష్టిలో ఘనీభవించిన సమస్యలు ఒక ఆకారాన్ని పొంది ఒక స్థితిలో, స్థిరంగా విశాలంగా వ్యాపించడానికి వచ్చాయి అని అంటాను. 'ఇలా జరిగితేనే పూర్ణత్వం. This is manly life in life that is perfection



my brothers ! దీని అర్థం ఏమిటి ? మానవ జీవితం బాల్యంలో ప్రారంభమై పరిపక్వ స్థితికి చేరేవేళ ఆ ప్రగతి ఫలమే పూర్ణత్వం' సృష్టి అంటే ఏమిటి ? అందులోని సమస్యలేమి ? బాహ్యారూపాలేమిటి ? వీటికి మనకు మధ్య ఉండే సంబంధమేమిటి ? కంటికి కన్పించే లోకాలు, లోకాంతరాలు. ఇవన్నీ 'సృష్టి' శబ్దంలోనే అంతర్భవిస్తాయా ? ఈ భూమిగ్రహం ఇందులో నిబిడీకృతమైన ఘనీభూతరూపం, జడరూపం, ప్రాణిరూపం, మహత్తులో వ్యక్తావ్యక్తాలు, గర్భీభూతమైన మనం అంటే మనుషులు ! ఇలాంటి సూత్రాత్మక సృష్టిలో అనూచానంగా, అవ్యాహతంగా, అప్రధానం ప్రాధాన్య బాంధవ్య సంకలనం ఉంది. ఈ విశాల సృష్టిలో దాని సూత్రాలతో మనం వ్యవస్థితులమయ్యాం ! మన కర్తవ్యం నిర్ణయించబడాల్సి ఉంది. ఈ సృష్టి ఏమిటి ? దీని సూత్రమేమిటి ? దీని స్నేహమేమిటి ? దీని స్వామ్యం (అధికారం) ఏమిటి ? దీని ప్రభువు ఎవరు ? ఆ పరమాత్మ నుండి సుందరాకారాన్ని పొంది, సిద్ధుల్ని పొందాల్సి ఉంది. దీనికి నిరంతరం ప్రయత్నం జరిగాలి. మనం ఏవేవో ఆరోపించుకోవాల్సిన అవసరం ఎందుకు ? ఎవరు ఏఏ వస్తువుల్ని సృష్టించారు ? చివరికి విశ్వామిత్రాదులు తమ తీవ్రమైన తపస్సుతో కనుక్కున్న వస్తువులు మనకు ఈనాడు నిత్యజీవితంలో బాగా ఉపకరిస్తున్నాయి. 'విశ్వామిత్ర సృష్టి' అని ఏమేమో చెబుతామే! ఇక్కడ ఏం గ్రహించాలో తెలుసా ? సృష్టించిన వాళ్ళెవరూ లేరు. ఆ మహానుభావులు తమ సాధనాబలంతో అంతరంగ విజ్ఞానంలో నిలిచి విశ్వానికి సంబంధించిన విషయాల్ని పరిశోధించి మనకు అందించారు. భౌతిక విజ్ఞానపు పరిణామాలు.

ఇక్కడ ఒక్కటే విషయం చెప్పాలనుకుంటున్నా. అన్ని సత్యాల దర్శనం పొందగల్గే సాధనాత్మక జీవనమే మానవ జీవనం.

ఇప్పటి శాస్త్రవేత్తలు కనుక్కున్న అంశాలు కానీ, ప్రస్తుతం అందించే అంశాలు కానీ కొత్తవేమీ కావు. అణుశక్తుల్ని కనుక్కునేందుకు శతాబ్దాలుగా ప్రయత్నిస్తున్నా 95, 97 అనే సంఖ్యల్ని అందిస్తున్నారు. ఇక్కడ మనం వాళ్ళ పరిశోధనాత్మకశక్తిని ప్రశంసించాల్సిందే ! వాళ్ళు సృష్టికర్తలు కాదు. ప్రాచీన మహర్షులు తమలోని విజ్ఞానపు శక్తితో ఆ అణుశక్తుల సంఖ్యను నిర్ణయించారు. అవి వీటికన్న అధికం. ఈ భౌతిక విజ్ఞానపు పరిశోధన, తపస్వులకు ఎలా తెలిసింది అనే సందేహం మనకు అక్కరలేదు. విజ్ఞానం అంటే విశేషమైన జ్ఞానం అని అర్థం. ఇది బాహ్యం, అంతరం అని రెండు రకాలు ! బాహ్య ప్రయత్నంతో బాహ్యవస్తువుల విజ్ఞానాన్ని ఒక స్థితి దాకా తెలుసుకోగల్గుతాం. అయితే ఈ ప్రయత్నంతో ఆంతరంగిక విజ్ఞానాన్ని గ్రహించడం సాధ్యం కాదు. తపస్సు ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందిన తరువాత అంతర్ బహిర్ జ్ఞానాలు రెండూ అనుభవాలుగా మనకు వస్తాయి. అలాంటి వాళ్ళ నోటి నుండి వచ్చిన మాటలే మంత్రాలు. వాళ్ళే ద్రష్టలు! ఇప్పటి భౌతిక విజ్ఞానమంతా ఒక్కో రూపంలో ఇదివరలో కనుగొనబడిందే! ఇలాంటి పరిశోధనలకు మనదేశం ఒక కార్యక్షేత్రంగా ఉన్నది. అనేక కోణాల వల్ల భౌగోళికమైన మార్పులవల్ల మానవుడు కర్తవ్య భ్రష్టుడై ఆ జ్ఞానమంతా మరుగై పోయింది. ఇపుడు విదేశాల్లో భౌతిక విజ్ఞానం బాగా ప్రగతి చెందుతోంది. transformation of the production of secrecy from nation to nation, so many times is natural అని అంటాను. (దేశం నుండి దేశానికి వైజ్ఞానిక రహస్యాలు ఉత్పన్నమై, పరివర్తనం చెంది అనేకసార్లు వ్యాపించడం సహజ ప్రక్రియే).

సృష్టిలో మనిషికి సంగ్రహశక్తి సహజం. చాలా కాలం నుండి ఇది మనిషిలో కొనసాగుతూనే వస్తోంది. తెలిసి ఎన్నో అంశాల్ని సేకరిస్తాడు.



తెలియకుండా ఎన్నో విషయాల్ని సేకరిస్తాడు. ఎన్నో చైతన్యాల అవ్యక్తమహత్తు ఇది; మనిషిలో అవ్యక్తంగా ఉండే ఆ అవ్యక్త మహత్తు సేకరించుకునే వేద్యంకాని స్థితి అని అనండి. సేకరించే శక్తి చిన్నప్పటి నుండి పెరుగుతూనే ఉంది. శిశువు కిలా కిలా నవ్వుతూ కనుబొమల్ని ఎగురవేస్తాడు. చప్పట్లు కొడతాడు. ఆ శిశువులో ఎన్నో అంశాలు ప్రవేశిస్తూ ఉంటాయి. ఇదేమిటి ? అనే విమర్శ ఇక్కడ లేకున్నా వ్యాపించే మనస్సు యొక్క వ్యాపారం మాత్రం నడుస్తూనే ఉంటుంది ! మనం వనవిహారానికో, తోటకో దేన్నో ఒక దాన్ని చూడాలని వెళతాం కదా ! అపుడు మన ఆశ చూచే క్రియలోనే నిమగ్నమై ఉంటుంది. అక్కడి పుష్పాల సుగంధం మన ముక్కుపుటాల్లో చేరకుండా ఉంటుందా ? ఎన్నోసార్లు కవి, విశ్వసౌందర్యాన్ని చూసి కావ్యరూపంలో మనకు అందిస్తాడు. ఒక్కోసారి వస్తు విన్యాసంతో మాత్రమే మమేకమై పోతే – దాన్ని బయటికి వ్యక్తం చేసే వేళ తానే అందించిన దాని గొప్పతనాన్ని గ్రహించకుండా ఉండిపోతాడు. అతనికి తెలియకుండానే వెలువడిన నూత్నరహస్యాల్ని సహృదయుడైన విమర్శకుడు శోధించగల్గుతాడు. చాలాసార్లు ఏది కావాలి? ఏది అవసరం లేదు అనే అంశాల్ని లెక్కించకుండానే సేకరణ జరిగి ఉంటుంది. ఇది అభివృద్ధి శీలుని లక్షణం.

ఇక్కడ ఓ వితండవాదం ఉంది. పూర్ణం, పూర్ణం – వినిపించేవి ఈ రెండే పూర్ణాలు. అయితే ఇక్కడ ఒకే పూర్ణం రాకపోకలు చేస్తోంది. అది ఉండేది మాత్రం అలా కాదు. ఆ పూర్ణాలు తప్పక తెలుసుకోదగిన పరిస్థితిని ధరించిన పూర్ణాలు అవి ! ఆ వితండ వాదాన్ని మరచిపోయాం కదా ! పూర్ణం లోంచి వచ్చింది. పూర్ణమే వచ్చిందేమో అన్నట్లు – అనేది వితండం. ఇక్కడ మనిషి ఓ విషయాన్ని గ్రహించాలి. ఉండేది మనిషి ఒక్కడే కాదు.

విశాలమైన విశ్వంలో మనిషి కూడ ఒకడు. ఆ విశ్వం పూర్ణం అని అనిపించుకునేవేళ అందులోని పరిస్థితులెన్ని ? పూర్ణత్వాన్ని పూర్తిగా తెలుసుకోవాలి. అపుడే మనిషికి మనుష్యత్వం సార్థకం. అక్కణ్ణుంచి క్రాంతి – అక్కడ నుంచి గొప్పతనం. మహాపూర్ణత్వం ! ఇది ఎవరికి ? మహాసౌందర్య శక్తులను గ్రహించి, ఆ పూర్ణత్వకాంతుల్ని తన జ్ఞానంతో తెలుసుకుని లోకకల్యాణం జరపాలనే సాధకునికి ఉంటుంది ! పాపం ! వితండవాదానికేమి తెలుసు ! అందుకే నాయనా ! “వితండవిచ్ఛిన్నం కావాలి ! కర్మపూరితమైన దివ్యజ్ఞానమార్తాండుడు ప్రకటం కావాలి !” అని చెప్పడం జరుగుతుంది!

వీటిని సమస్యలుగానో, ప్రశ్నలుగానో చూడవచ్చు కదా? ప్రశ్నలు కల్గడం విజ్ఞాన జిజ్ఞాసనే సూచిస్తుంది. సమస్యలున్నాయనే వారికి జవాబు ఇది – సాధకులకు సమస్యలే సౌందర్యాన్ని అందిస్తాయి. ప్రశ్నలు తలెత్తుతున్నాయి అనే వారికి ఒకటే జవాబు. “నాయనా ! ప్రశ్నలు అనేవి తెలుసుకోగల్గే వారికి అనుభవాలు. కేవలం తర్కవితర్కాలు చేసినపుడు మాత్రం ప్రశ్నలు చిక్కుముడులు అని అనిపించవచ్చు”.

ఆలోచన, విమర్శ ఇవన్నీ పెరగడం అధఃపతనానికి కాదు. రోజూ పెరిగే విచారణశక్తి చక్కని విమర్శకు ఉపకరించాలి. పరిశోధన జరగాలి. ఎందుకంటే – మనం గమనించినట్లుగా సృష్టిలో ప్రతిదీ వ్యక్తంగా కన్పించడం లేదు. ఎన్నో రహస్యాలు గూఢంగా మిగిలి ఉన్నాయి. ఆలోచనే లేకుంటే – పరిశోధనే జరుగకపోతే గతి ఏమిటి? విద్యుద్దీపాలు, ఫోన్, రేడియో, రైలు, అణుశక్తి What not ? What more ?ఇవన్నీ ఆయా వ్యక్తుల వైచారిక మథనంలో, పరిశోధనలో ఉదయించిన పరిణామాలే



కదా ! ఇక్కడ మనకో చిక్కు సమస్య ఎదురౌతుంది. దీన్ని వినడం కూడ సాధకునికి పీడాకరం ! అదేమిటో తెలుసా ? భౌతిక విజ్ఞానాన్ని నిందించడం. వైజ్ఞానికమైన దుర్ఘటన అనే పెద్ద పెద్ద మాటలు ! ఈ మాటల్లో ఏమైనా సత్యముందా ? నిజంగానే ఆలోచన, సంశోధనల పరిణామాలు, ఫలితాలు ఆయా క్షేత్రాలకు హానికారకాలు కానే కావు ! అయితే వైజ్ఞానిక సూత్రాలను దురుపయోగం చేస్తే – అది సంశోధించిన వారి తప్పా ?

సమస్యల నడుమనే సుందరమైన జీవితాన్ని మనిషి నిర్మించుకోవాలి! ఆ సమస్యల సత్యాంశమే మానవ జీవన సత్యం! They are not only the theoritical problem. Really life problem for perfection are being produced with their beautiful source from the childhood అని చెప్పవచ్చా ? So, I hereby definitely say, the real problems are not to be neglected. They should be digested and treated as foot boards to mount the car of life journey. అందువల్ల మనం ఉరుకుల పరుగుల జీవనాన్ని కాసేపు ఆపి, ప్రక్కన నిలబడి మనిషి బ్రతుకులో సమస్యలు ఎలా పుడతాయి ? ఎలా పెరుగుతాయి ? వాటి అంతం ఎలా ? అనే అంశాల్ని మనం గమనించాలి. ఆలోచనాత్మకంగా దీని కోసం ప్రయత్నం చేద్దాం! వివరంగా వచ్చినా, సంక్షిప్తంగా లభించినా వాటిని స్వీకరిద్దాం !

మానవ జీవనంలో సమస్యలు వ్యక్తిగతంగా ప్రారంభమై, క్రమంగా కుటుంబ స్థాయికి, సామాజిక స్థాయికి, దేశస్థాయికి ఎదిగి చివరకు విశ్వవ్యాప్తంగా పెద్ద ఆకారాన్ని ధరించి వ్యాపిస్తాయి. సాహిత్యసమస్యలు

అన్ని చోట్ల వ్యాపిస్తాయి. సహకారాభివృద్ధికి దర్పణం (అద్దం) పడతాయి. వైయక్తిక సమస్యలు బాల్యం నుండి మధ్య వయస్సు దాకా పరిమితమౌతాయి. అందుకే మనం చాలాముందుచూపుతో జీవన పరిణామాల్ని అవగాహన చేసుకుని సుసంబద్ధంగా జీవిస్తూ జ్ఞానమార్గాన్ని అన్వేషించాలి. జీవితంలో సమస్యలే లేకుంటే వాటిని చక్కగా అవగాహన చేసుకోకుంటే, ఆదర్శమార్గంలో తన జీవన కథను అల్లుకోకుంటే తర్వాత ఉండేదంతా నిరర్థకం. ఇది అతనికి మాత్రమే కల్గే ప్రత్యక్షమైన హాని ! నిన్న మొన్నటి ఇతిహాసాల్ని పరికిస్తే నడిచే కాలపథాన్ని తిలకిస్తే చాలా బాధకల్గుతుంది. కొన్ని శతాబ్దాలుగా ఈ అంశాన్ని మనం గమనిస్తూ వస్తున్నాం. ఎన్నోసార్లు ...... Because the life with no seriousness and practical to get it's own problems solved with the aim of fruitful perfection. It is dwindling up and down entangling in various activities of the world, so many times circumstances or the nations knowingly or unknowingly supported such lives leading also by which no field is being peacefully left ! అందుకనే – వైయక్తిక జీవితం వైయక్తిక పరిపుష్టతలోంచి సమిష్టి పరిపుష్టతలోకి మారాలి. జీవితం లోని వైయక్తిక సమస్యలకు బాల్యంలో తల్లిదండ్రులు, ఆ తర్వాత సమాజంలో స్నేహితులు వీళ్ళే మూలకారణం. మన జీవితం పరిపుష్టం కావడానికి సనాతన సమాజం అద్భుతమైన పద్ధతిని మనకు అందించింది. సామాన్యంగా బాలకులకు, బాలికలకు 8 సంవత్సరాల తర్వాత జీవనం గురుకుల వాసంలోనే గడిచి పోయేది. అక్కడ దాదాపు 20 ఏళ్ళ కన్న ఎక్కువ కాలం సర్వజీవనోపకారి, ఆత్మ జాగృతికి ఉపకరించే, లోకకళ్యాణకారకమైన విద్యార్జనలోనే స్పష్టంగా



గడిచిపోయేది. ఆ గురుకుల వాసాలంటే – విశ్వవిద్యాలయాలు, విద్యానికేతనాలుగా ఉండేవికావు. అవి శుద్ధమైన ఆశ్రమాలు. అక్కడ ఉండే వరిష్ఠులు భౌతిక పూర్ణతకు మాత్రమే పొందినవారు కాదు. ఆధ్యాత్మిక పూర్ణతను కూడ పొందిన పరిపూర్ణ మానవులు. వాళ్ళు తాము తపస్వులుగా ఉంటూ తన శ్రేయస్సుతో ఆనందించే వాళ్ళుగా ఉండేవారు. సృష్టిశ్రేయాన్ని ఆకాంక్షించేవాళ్ళు. ఆ ప్రవృత్తి వాళ్ళల్లో ఉండేది. అలాంటి కర్మశీలులైన త్యాగులు తమ వ్యక్తిగత జీవితాన్ని పరిష్కరించి, నిర్మించుకునే వాళ్ళు. క్షుద్రమైన మనస్సుకు సంబంధించిన చేష్టలు వ్యక్తిగత సమస్యల ముందు పొడచూపడం సాధ్యమే కాదు ! అక్కడ నిర్మితమైన జీవనం బయటికి వచ్చే లోపల, విశ్వం ఎంత విశాలమో, తను దర్శించే శక్తి కూడా అంతే విశాలంగా ఉండేది. అక్కడితో ఆ వ్యక్తి ఆగకుండ, సమస్యల చిక్కుముడుల్ని విడదీసుకునే సామర్థ్యాన్ని పొందగల్గేవాడు. ఈ యోగ్యత పుష్కలంగా ఉండేస్థితిలో వాళ్ళ కుటుంబజీవనం మొదలయ్యేది. అలా సరళంగా సాగిపోయేది.

ఇలాంటి సుస్థితి నుండి తప్పిపోయి కొందరి తప్పుడు మార్గదర్శనంలో పడి సమాజంలోని మూఢ సంప్రదాయాల్ని పాటించే తల్లిదండ్రులు ! గ్రుడ్డిగా కొన్నింటిని అనుసరించే వాళ్ళు ! మొండి ఆచరణ ! ఇలాంటి వైయక్తిక జీవనం ఇపుడిపుడే కనిపిస్తుంది. పాపం! చావు దగ్గరపడ్డాక సమస్యలంటే ఏమిటో అర్థమయ్యేదెలా ? ఏం నిర్ణయించుకోవాలి ? దేన్ని నిర్మించుకోవాలి ? అందుకే, అలాకారాదు. ఆ మిడిమిడి జ్ఞానపు పరిధిలోంచి బయటికి వచ్చేయండి. సనాతనం కాని స్నేహశీలత్వమే లేని, కఠిన పద్ధతులు సంప్రదాయాలై మనిషి బ్రతుకునే ముంచి వేస్తున్నాయి. కిల కిల నవ్వే మన కాలేజి విద్యార్థుల్ని యువ

మిత్రుల్ని పిలుస్తాను. నిజమైన సమస్యలు ఏవి ? అనే అంశం గురించి ఆలోచించనీ ! ఇక భవిష్యత్తులోనైనా నిర్దిష్ట జీవితాన్ని నిర్మించుకోగల్గే సంతానం లభించనీ ! దాన్ని చూసే, ముందుకు నడిపించే ఫలప్రాప్తి కల్గనీ అని కోరుతున్నాను.

పిల్లల కుటుంబ జీవనం ! ఇది చాలా పెద్దది. పెద్దవాళ్ళు దయచేసి శాంతంగా ఉండండి. ఆ జీవితం ఈ రోజు కంటక ప్రాయమై పోయింది. 'సాంసారికానందం మధురమైన మకరందం' అనే నోటితోనే 'బెల్లమే కలుపని వేపరసం' లాంటిదని చెప్పాల్సి ఉంది. కుటుంబ జీవితంలో మొట్టమొదటి చిక్కు సమస్య పెళ్ళి. ఇద్దరు వ్యక్తుల స్వాతంత్ర్యం అవసరమా? ఈ సంబంధాన్ని కోరుకునే ఆ ఇద్దరి పుట్టు పూర్వోత్తరా లేమి ? వాళ్ళిద్దరూ నిర్మించుకున్న బ్రతుకు ఆధారంగా స్వాతంత్ర్యం కావాలి. నిజం ! తల్లిదండ్రుల అధికారమొక్కటే చాలా? అదొక్కటే చాలేమో! ప్రస్తుతానికి ఇది అవసరం లేదనే స్థితికి వచ్చాం. మానవ పూర్ణత్వ సోపానాల్ని అధిరోహించిన తల్లిదండ్రులైతే – వారి ఆజ్ఞలు, అధికారాలు అవసరం.

వధూవరుల స్వాతంత్ర్యపు ఔచిత్యం చాలా ప్రాచీనం. 8 ఏళ్ళకే పెళ్ళి చేయడం, వేదాల సమానతను పెంచేటట్లయితే ఆ బాధ్యత మనకు వద్దు. దీనికో విషయం చెబుతాం. 'స్వామీ ! వేదం నిత్యం. ఆ మంత్రం పరమ సత్యం. 'అష్ట వర్షాత్ భవేత్ కన్యా' అనేది ఆ మంత్రం. ఈనాడు 'అష్టే వర్షాత్ భవేత్ కన్యా' అనే స్థితికి దాపురించింది. ధర్మానికి బాహ్యావరణాలైన ఆచారాలు, విచారాలు కాలానుగుణంగా మారదగినవే! ప్రాచీన కాలంలో దేశయాత్ర కోసం గురుకులాన్ని వీడి, బయలుదేరిన యువకుణ్ణి తీసుకుని వచ్చి, కాళ్ళు కడిగి, సుశిక్షితురాలైన కన్యను తెచ్చి కన్యాదానం చేసేవాళ్ళు. తర్వాత ఆ దంపతులు సంచారానికి వెళ్ళే వాళ్ళు.



అక్కడ నుండి అతని కుటుంబ జీవితం మొదలౌతుంది. ఆ కాలంలో స్వాతంత్ర్యం కూడా ఉన్నది. తనకు తానుగా పెళ్ళాడేందుకు ముందుకు వచ్చిన దేవేంద్రుణ్ణి కూడా ధిక్కరించి నలుడే కావాలని అతనినే వరించిన స్వాతంత్ర్యం దమయంతికి దక్కింది. శివధనుర్భంగ పరీక్షతో వరుని యోగ్యతా యోగ్యతల్ని పరీక్షించి కూతురి పెళ్ళి చేసిన జనకుని ఉదాహారణ చాలదా ? తండ్రి బాధ్యతలను తెలిపేందుకు ! ఇలాంటి తండ్రి, ఇలాంటి కన్య, అలాంటి స్వతంత్రులైన వరులు ఉంటే వివాహ సమస్యలు అనేవే ఉండవు. ఈనాడు "Marriage as an institution is a failure" అనే మాట విన్పిస్తోంది కదూ ! దీనికి కారణమేమి ? అపరిచితులైన జీవులు – విభిన్న సంస్కారాలు కల్గి ఉంటారు. వారిరువురి నక్షత్రాలను గమనించి, జాతకాలను పరిశీలించి వరదక్షిణ, కన్యాశుల్కాలకు అనుగుణంగా ప్రణయజీవనాన్ని నిర్మించుకోవాలి. ఒకరి కొకరు పొందికయే లేని ఇద్దరిని ఒకటి చేసి మేళ తాళాలతో, తీపి భోజనాలతో పెళ్ళి తతంగం అయిందనిపించుకునే వాళ్ళే ఎక్కువ. ఇదెక్కడ ? ప్రణయజీవనం ఎక్కడ? ఇక్కడ నిజమైన పెళ్ళి ఎక్కడుంది ? నేనిలా అంటే మీరు భరించాల్సిందే! ఇది వివాహం కాదు భవిష్యత్తు యొక్క ఆర్తనాదం ! అది ప్రణయ పథం కాదు. ఎన్నోసార్లు ఆ మార్గం శ్మశానానికి దారి తీసింది కదూ ! ఎంతమంది చావుకు దగ్గర్లో ఉన్నారని ప్రశ్నిస్తే, వారి జీవితంలోని వేదనను మించిన మరణం వేరే ఎక్కడుంది ? వ్యక్తి జీవనపు పరిపుష్టతను కనుక్కో లేక పోవడం వల్ల వాళ్ళ ఆలోచనలే విప్లవాలుగా రూపాంతరం చెందాయి.

ఇప్పటి ఆధునిక నాగరికులకు ప్రేమకు ఆశయాలుంటాయి. ఆ ఆశయాల మరోరూపమే కామం అని తెలియదు. కామమే కైవల్యం అనే

స్థితికి చేరుకున్నారు. పాపం ! వాళ్ళకు కైవల్యం అంటే ఏం తెలుసు! ప్రేమ గురించి తెలిసింది కూడ అంతంత మాత్రమే ! "Brothers love is not blind. Love is Lotus feet for loyalty that generates the development of the universal harmony" 'ప్రేమ గ్రుడ్డిదని తెలియని జనులు ! తామసుల కామమోహం గుడ్డిది. ప్రేమ అనునది విశాల హృదయుల నడుమ స్పర్థ చూడు!" అని విశ్వవాణి చెబుతుంది. క్షణికావేశాలకు లోనై పరస్పరాకర్షితులైన వాళ్ళను చూడడం లేదా ? అడిగితే – దాంపత్య స్వాతంత్ర్యం, ప్రణయాదర్శం – అనే పెద్ద పెద్ద మాటల్ని వల్లె వేస్తాం. ఎన్నో సార్లు ప్రత్యక్షంగా చూస్తే, ఎలాంటి పోలికా కన్పించదు. అయితే మన కంఠం మాత్రం చాలా మందంగా ఉంటుంది. నాయనా ! ఇది బెల్లం కలపని వేపరసం చూడు ! 'Marriage, as an institution, is a failure; ఇదో వ్యాఖ్యానం అనండి. సమస్యను సృష్టించిన వ్యక్తుల అలవాటును, సంప్రదాయాన్ని తీర్చిదిద్దే విధానం అనండి. The system is sacred. It is the decided development of social order. Adoptability of the foolish brains of the society is the only reason for the miserly, forms as marriage' ఇది నా వాక్యం ! నా మాట.

వైయక్తిక జీవితాన్ని చక్కదిద్దుకోండి ! దాంపత్యజీవనం చక్కగా క్రమశిక్షణతో సాగనీ ! కన్ను పైకి చూస్తుందా ? చెవి ఎటు వైపు ! ఎక్కడుంది పూర్ణత్వం ? అని అడగవచ్చా ? చెవికి, కంటికి కాదు పూర్ణత్వం కావాల్సింది. వీటిని తెలుసుకో కల్గింది లోపల మనస్సు. అనుభవించగల్గినది – అన్నీ కలిసిన మానవత్వం. అది రావాలంటే ఎలా ఉండేవాడు ? ఎలా ఉన్నాడు ? ఎలా ఉండాలి ? అనే అంశాల పూర్ణజ్ఞానం



అవసరం. అందుకే మానవుని జీవన సమస్యలు, సామరస్యం వీటి గురించి చర్చించాల్సి ఉంది. ఈ దాంపత్య జీవనంలో సంతాన విజ్ఞానం చాలా అవసరం. అది తెలియకుంటే సంతానం, పోషణ కష్టం. తర్వాత కష్టాలమయం అయిపోతుంది జీవనం. దీనికి కారణం సంతాన విజ్ఞానం లేకపోవడం. అయినంత మాత్రాన మన మంతా పుస్తకాల పురుగులుగా మారాలని కాదు. సామాన్య మనిషి అయ్యేందుకు ప్రయత్నించండి. ఎందుకు? అదీ తెలీదా ? 46 కోట్ల జనం ఉండే భారతదేశం – భయంతో అదురుతుందా ? మన దృష్టి కోణం తాత్కాలిక రాజకీయాలకే పరిమితం కారాదు. ఆ 46 కోట్లలో ఒక కొడుకునో, ఒక కూతురినో ఎన్నుకుని మనకందించే దాంపత్య జీవితం సత్యాత్మకంగా ఉంటుందని ఆలోచించరాదా ? It is sin to procreate for the parents cursed by material perfection as well as manifestation అని నేనంటే చేదనిపించడం లేదా ? భరించండి. అఖండ సత్యం అంటే – మీరు అనుకున్న సౌమ్యత్వం ఒక్కటే కాదు. ఈ ఆలోచనల్ని గ్రహించి సాగేవేళ – సంతాన సమస్య ఎంత పెద్దది అనే అంశం తెలిస్తే మంచిది. కాలం ఎలాంటిదై ఉండాలి ? ఆహారం ఎలాంటిదై ఉండాలి ? సంభోగ సమయంలో మనస్సు ఎంత పరిశుద్ధంగా ఉండాలి అనే అంశాల్ని విశ్లేషించాలి. దాంపత్య జీవనంలో సంతానం అనేది ఒక లక్ష్యం మాత్రమే! అది ఇపుడు చెప్పబోయే సంతానం కోసం. ఏది లక్ష్యమో దాన్ని అందుకోబోయే వేళలో సంసారం రాను రాను విశాల మౌతుంది. భార్యాభర్తలతో ప్రారంభమైన జీవనం స్త్రీపురుషులతో కలవాలి. స్త్రీ పురుషుల అభివృద్ధికి భార్యాభర్తలిద్దరూ ప్రయత్నించాలి. స్త్రీ కాత్యాయని. ఆమె ఒక వైపు బ్రహ్మజిజ్ఞాస, బ్రహ్మోపదేశాలకై పరితపిస్తూ భర్త చేసే సేవలోని ప్రగతిని కూడ

పరిశీలిస్తుంది. తన కర్తవ్యాల్ని వివరిస్తుంది. కలసి ఉంటారు. మళ్ళీ కదలుతారు. ఆ కలయిక, ఆ సంచారం లోక కల్యాణం కోసమే అని గ్రహించినవాళ్ళు వారు ! అలాంటి వాళ్ళుంటే చాలా ? అది ఇపుడు అవసరం కాదా ? నిరంతరం ఉండాల్సింది. మానవ పూర్ణత్వం. సంతాన శాస్త్రం రాసింది వాత్స్యాయన మహర్షి అని అంటున్నారు కదా ! ఆ సంతానం కోసమే సంగమం. ఇలా చెప్పినాక, కేవలం కామదృష్టితోనే సంగమించడం జరపవచ్చా ? దాంపత్యజీవనం ఇదేనా ?

సతి,పతుల సమస్యల్ని కొంచెం కొంచెంగా విశ్లేషిద్దాం. సతికి ఎంత జ్ఞానం ఉండాలి ? పతికి ఎంత జ్ఞానం ఉండాలి ? ఇరువురికి పవిత్ర దేవాలయం ఈ దేహం. ఈ దేహం పెరగడానికి అవసరమైన పాకశాస్త్రం, సంతానం కోసం సర్వసన్నాహాలు చేసుకోవాలి. పిల్లల పెంపకం బాగా తెలుసుకోవాలి. విశ్వదేవాలయంలో పిల్లల్ని ఎలా ప్రతిష్ఠించాలో తెలుసుకోవాలి.

ఇకపోతే, పిల్లలు, తల్లిదండ్రులు – వీరందరి ఏకసూత్రధారి ధర్మం. పిల్లలు వినయ విధేయతలు కల్గి ఉండాలి. కుశలతను గ్రహించి, దానికి సహాయాన్ని అందించే తల్లిదండ్రులు అవసరం. అపుడు అతని విధేయత ప్రేమగా మారుతుంది. తండ్రి అధికారం ఆత్మీయతగా మారుతుంది. అలాకాకుండ, పెరిగే కొడుకు గురించి – అతడు మానసికంగా, శారీరకంగా ఎదుగుతూ ఉంటే తన స్వార్థం కోసం అతణ్ణి ఉపయోగిస్తే – అపుడు ఆ ధర్మం బంధనంగా మారుతుంది. దీన్ని గ్రహించి ముందుకు వెళ్ళడం పిల్లల్లో విచక్షణా జ్ఞానానికి తార్కాణం. కుటుంబ జీవనంలో బంధువులందరితో ఇలాంటి అనురాగమయ సంబంధమే ఉండాలి.



మొగుడు, పెళ్ళాం – వీరి జీవితంలో రెండు అధికారాలున్నాయి. భర్త వ్యసనలోలుడు అయితే, దుష్టుడైతే, ధర్మవిరుద్ధంగా నడుస్తూ ఉంటే? అతణ్ణి భార్య త్యజించవచ్చు. భార్య విషయంలో భర్తకు కూడ ఇలాంటి అధికారమే ఉంది. అలా కాకుండ అర్థం లేకుండా విడాకులు ఇవ్వడం జరుగరాదు. మరో విశిష్టమైన అధికారం ఇరువురిలో ఏ ఒక్కరైన వైరాగ్యం వైపుకు తిరిగితే, కాలగర్భంలో వారికి అలాంటి పిలుపు లభిస్తే – ఇరువురికి శాంతి కల్గుతుంది. కల్గకుండా కూడ అనుకోకుండ విచ్ఛేదనం జరిగిపోతుంది. ఇది జరగాల్సిందే ! దీనికి వేరే ఉపాయం లేదు. సమాధానం అంటే ఆయా వ్యక్తుల ద్వారా కలిగే లోకకల్యాణ దర్శనం. ఆత్మ కల్యాణానుభవం.

ఇలా ఒక రకంగా వైయక్తిక సమస్యల గురించి మనం మాట్లాడుతూ వచ్చాం. ఎందుకంటే సమస్యలనేవన్నీ వాళ్ళ వాళ్ళ స్థాయికి వ్యక్తిగతంగానే ప్రారంభమై, వైయక్తికంగానే ఫలాన్ని అందుకుంటాయి. మున్ముందు రాబోయే సమస్యలన్నీ సామూహికంగా కన్పించే వైయక్తిక విషయాలే ! ఇపుడు మనిషి కొంచెం జాగృతుడై బయట చూస్తున్నాడు. అంటే ఇంతకు మునుపు ఎక్కడో ఉన్నాడని కాదు. ఇది పూర్ణత్వం వాక్యం. సమస్య మరియు శాంతి – వీటి విహార క్షేత్రాలు. ఇక నేను మీకు మనవి చేసే పూర్ణత్వం అనేది ఎక్కణ్ణించో ఊడిపడేది కాదు. మనిషి మొదట నుండి ఎలా ఎలా పెంచుకుంటూ పోవాలి ? ఎలా నడుచుకుంటే ఆ పూర్ణత్వాన్ని అందుకోగల్గుతాడు? ఇలా పరిష్కరించుకుంటూ తనకంటూ ఒక నిర్దిష్టమార్గాన్ని ఏర్పరచుకుని సాగితే మాత్రం చెప్పబోయే 'పూర్ణత్వం' లభిస్తుంది.

ఇపుడు ఎక్కడున్నాడు ? నియమాల మధ్య పెరుగుతూ వచ్చిన నిత్య స్వాస్థ్యమైన విశాలత్వంలో తానూ ఒకడై పోవాలనుకునే మన మానవుడు ? అతని దృష్టి సమిష్టి జీవనాన్ని చూస్తోంది.

సామాజిక జీవితంలో మొట్టమొదట మనిషికి దైహికమైన జాతి సమాజం సన్నిహితంగా కన్పిస్తుంది. తెలివైన వ్యక్తి వీలైనంత త్వరగా వీటిని గమనించాలి. సంప్రదాయాలైనా, సనాతనాలు అనిపించుకున్న ఆచారాలైనా అవి స్నేహబద్ధమైనవా ? ఇలా అనేక ఆచార విచారాల్లో, తన లక్ష్యం నెరవేరే దాకా, రాగద్వేషాదుల్ని తన విషయంలో, తన నుండి వేరే వాళ్ళ విషయంలో కలుగకుండా చేసేవి ఏమిటి ? అవి ఎన్ని? ఈ అంశాల్ని అతడు నిర్ణయించుకోవాలి. ఇది చాలా ముఖ్యం. ఇక్కడితోనే ఆగితే ఏమీ మిగలదు. ఇది ఒక్కటీ లేకుంటే – ఇక ఏదీ మిగలదు. ఈ అన్యోన్య సంబంధం స్థూలంగా కన్పించే స్వ – పర – సమాజ సంబంధం అని అంటాను. లోలోపల చెబితే – నియమబద్ధమైన, నియమాతీతమైన తరంగాల సంబంధం అని అంటాను. అక్కడ లభించిన కల్యాణం, అమంగళం – వీటిని తానొక్కడే కాకుండ క్రమంగా శాంతభావంతో సహోదరులు కూడ అనుకరించేట్లు చేయగోరతాడు. ఇది ఇలా పెరుగుతూ చాలా ఆవశ్యకమైన రాజకీయ సమస్యగా మనముందు గోచరిస్తుంది. ఇక్కడ సమస్యలనన్నింటినీ చెబుతాను. రాజ్యం ఏలే రాజు కావాలి ? సంఘం చాలా? రాజకీయం కేవలం రాజకీయమా ? అలా కాకూడదు కదూ ! అది రసాత్మకం కావడం ఎలా? సునాయాసంగా సమాజంతో కలిసి, వ్యక్తిగత జీవనాన్ని పరిపుష్టం చేసి, ఆ వ్యష్టి సమూహమే సమిష్టిగా మారి, అలాంటి పిల్లల, వృద్ధుల మధ్యవర్తి రాజ్యాంగ విధానం ఏర్పడాలి కదా ? వేరే దారే లేదు. ఏర్పడాలి. అలాంటి విధానాన్ని పూర్ణులైన వారే



తీసుకురా గల్గుతారు. ఇలాంటి పూర్ణనాయకులను అనుసరించే అభిలాష మనలో లేదు. అందుకే ఈ దురదృష్టం ! అదలా ఉండనీ ! విషయానికి వద్దాం. మనలో ఉండే ఈ బుద్ధిద్వారా దేన్ని ముట్టినా వ్యర్థమే ! “తాను తన కోసమై, తాను అందరికోసమై, అందరు అందరికోసమై జీవించునట్లు చూడాలన్నా” అని నేను నా బంధువులకు, యువకులకు చెబుతున్నా. రాజకీయంలో ఏమేమో చేస్తూ, దాని పరిణామాల్ని గమనిస్తూ ఒక సందిగ్ధస్థితి ఈ 20వ శతాబ్దంలో మనకు కన్పిస్తోంది.

ఏదేమైనా మన నిజమైన మనిషి, వైశాల్యాన్ని ఆలింగనం చేసుకుని ఎదగడానికి విశ్వసంబంధ సమస్యలే ప్రధానం అంటాను. దీనికి అవతల ఉండేవన్నీ అప్రధానమైనవి. ఇపుడు ఇతడు నిబ్బరంగా నిలిచిపోవాలి. అపుడు తెలుస్తుంది మానవత్వం అంటే ఏమిటో ! దాని పూర్ణత్వం అంటే ఏమిటో ! ఈ లోపల అతడు సాహిత్యంలో అయినంత మేరకు సత్యాంశాలవైపే మొగ్గు చూపాలి. వాటిని గ్రహించగలగాలి. క్షణిక విషయాలు, పుస్తకాల్ని ఉద్యానవనానికి పరిమితం చేయాలి. తోటలో ఓ మొక్కను చూసినవేళ వృక్షశాస్త్రం ఏం చెబుతుంది. దాంట్లో నేనేం గ్రహించాలి. భౌతిక జీవనానికి అది ఎలా ఉపయోగిస్తుంది – అనే అంశాల్ని గ్రహించేంతటి సాహిత్య మథనశక్తి మనలో పెరగాలి.

ఆనందాన్ని అందించగలిగే కావ్యసంపద కావాలి. అది బ్రహ్మానందంతో తులతూగ గల్గాలి. ఇదే సమరసజీవనం. ఇలా సాహిత్యం ద్వారా అన్ని క్షేత్రాల అంశాల్ని గ్రహించాలి.

ఇలా సాగితే విశ్వంలో చాలామంది ఎలాంటి ప్రగతిని పొందుతున్నారు ? అందులో రెండు ముఖ్యాంశాలున్నాయి కదూ ! అవి ఏవి ? వాటిని గ్రహించడం ఎలా? వాటిలో నాది ఏది ? నాకోసం ఉండే

నియామాలేవి? లోకకల్యాణం కోసం ఉండే అంశాలేవి అనే విషయాల్ని గ్రహించగల్గాలి.

ఈ అంశాల్ని పరామర్శించేవేళలో తప్పక తెలుసుకోవాల్సిన అంశం ఉంది. దాని కోసమే కదా మీరంతా ఇక్కడ చేరింది ? మానవ బంధువులందరికీ ఆవశ్యకమైనది మానవ పూర్ణత్వం. ఇందులోనే భౌతిక పూర్ణత్వం, భవ్య(శుభమైన) పూర్ణత్వం అనేవి దాగి ఉన్నాయి. ఈ రెండింటి గురించి తప్పక ఆలోచించాలి. భవ్యపూర్ణత్వం వైపుకు చూపులు త్రిప్పి, నోరు తెరిచినంత మాత్రాన, కాళ్ళు నిలబడకుంటే, నడుము కృంగిపోతే, పొట్టలో పురుగులు చేరితే ఇక భవ్య పూర్ణత్వ మెక్కడిది ? మనిషికి భౌతికపూర్ణత్వం, అంటే ఏమిటి ? దీన్ని పరిపుష్టం చేసుకోవడం ఎలా ? దీన్ని పొందడం ఎలా ? అనే ఆలోచనరావాలి.

When man fails to understand the seen facts and get solutions for the problems and achieves the fruits for 'self' as well as universe, how can be a man for journey of Bhavyapurnathva ? ఇపుడు అతడు మేల్కొంటాడు. భౌతికజీవనం తత్త్వపు పునాదిపై నిర్మించ బడాలి. ఎవరెవరో చెప్పే 'వైరాగ్యం'లో ప్రధానం త్యాగమొక్కటే కాదు. ఇక్కడ మనిషి అన్వేషణ మొదలు పెట్టాడు. బంగారాన్ని తవ్వితీశాడు. వజ్రం దొరికింది. నీళ్ళు కూడా వచ్చాయి. ఇలా శోధించేవేళలో భూగ్రహాల శక్తుల చైతన్యాన్నే ఉపయోగించుకున్నాడు. ఆ వస్తువుల సౌందర్యానికి నవజీవనం కల్గింది. బంగారం, స్త్రీ, మట్టి – వీటిని మాయ అంటారు. వస్తువు మాయ కాదు. ఈ తలతిరిగిన వాడి మోహం, లేదా దురుపయోగమే చెడ్డది ! దీన్ని కనుక్కున్న శాస్త్రవేత్తలు బంగారాన్ని తయారుచేశారు. కృత్రిమవజ్రాలు తయారయ్యాయి. వీటిని



సదుపయోగం చేసుకుంటే ఆర్థికమైన స్వావలంబనతో జీవితం హాయిగా సాగదా ? మట్టి మాయ అంటే – మట్టిలో పుట్టే ధాన్యాలతో ఈ శరీరం పెరగకూడదు కదా? దానికేం! దేహం నశ్వరమా ? కాదు. అది తప్పు ఔతుంది. ఏమౌతుంది ? సత్యాన్ని తెలుసుకోలేని కర్మభ్రష్టుల వ్యర్థ ప్రలాపమౌతుంది. ఇంకా ముందుకు వెళ్ళి జవాబు చెప్పాలా ? ఆ శాశ్వతమైన ఆత్మ, దానితో పాటు ఉండే జీవాత్మ – ఇవన్నీ ఈ శరీరంలో ఉన్నాయా ? నశ్వరదేహం! ఇంకేమిటి సర్వం ! అవన్నీ ఎక్కడ ? ఇలా అన్నపుడు మీరు ఆస్తికులో నాస్తికులో ఆలోచించండి. అదలా ఉండనీ! మన మనిషిని చూద్దాం. భూపరిపుష్టత కోసమే నిలిచాడా ? ఒకరకంగా అతడు అతణ్ణే చూస్తున్నాడా ! అలాగే, మానవశాస్త్రం వెలువడింది. అది ఏ తేదీన పుట్టింది ? అనేది నాకు ముఖ్యం కాదు. అపుడెపుడో వెలువడిందనే సత్యాన్ని పలికే వాణ్ణి నేను. అలాగే faciology, astrology, say all alogies ఎందుకంటే దీనికే ఓ రోజంతా గడిచేను. అలా పైకి చూశా. నక్షత్రాలు, సూర్యచంద్రులు, గ్రహగోళాల ఉపయోగం చాలా ఉంది అన్నాడు. ఇలా చెప్పడం సాధ్యం కావచ్చు. అయితే అప్పటి పరిశోధకులు కనిపెట్టిన బరువేమిటి ? ఇది భౌతిక భవ్యమా ?

సున్నకు వెలకడుతూ లెక్కించడం మొదలు పెట్టా. తొమ్మిది నుండి శూన్యాన్ని ప్రధానంగా చేసుకుంటూ ఎన్నో సంఖ్యల్ని గుణించాను. ఇందులో తత్త్వం చెప్పేందుకు ఎంతో అవకాశం ఉండి ఉండవచ్చు. స్థూలంగా అది లెక్క. సూక్ష్మంగా చూస్తే అది లక్ష. శుద్ధయోగంలో సాగిపోయిన మహానుభావులు ఆధ్యాత్మికాన్ని అనుభవించి, 'భగవంతం సనాతనం' దర్శించి, తమ పరిశుద్ధమైన లక్ష్యంతో గుణించుకుంటూ పోయేవేళ – తాము దర్శించిన ఒకటి, తమ అనుభవపు లక్ష్యం 'రెండు' దాని

ప్రయోగాత్మక అంశపు 'మూడు' వివిధ కార్యకలాపాలు 'నాల్గు', ఆ కాలాపాల సాధనలు 'ఐదు', పరిణామంగా కలిగే ఉద్వేగాలు 'ఆరు', ఉద్వేగప్రతీకలు 'ఏడు' వాటి భావాలు 'ఎనిమిది' దాంట్లోకి ప్రవేశించే ప్రయోగమార్గం 'తొమ్మిది' ఇలా సంఖ్యల్ని చెప్పి, వీటికి సున్నాలను చేర్చే వేళలో ఒకదానికొక అంకెను చేర్చే వేళలో సృష్టిలోని వివిధరహస్యాల్ని చక్కగా విశ్లేషించి, వివరించారు. ఇక్కడ కూడ వాళ్ళు దర్శించిన భవ్యత, స్థూలసూక్ష్మాల సుందరమైన రెండు ఆవరణల మధ్య సాగింది ! అక్కడ గీతలో కృష్ణభగవానుడు "సాంఖ్యయోగౌ పృథక్ బాలాః ప్రవదంతి న పండితాః" అన్నాడు. అయినా బాల్యచాపల్యం కొద్ది, సంయమం కోల్పోయి, వారు చెప్పిన సత్యాన్ని గ్రహించజాలక, శంకిస్తే నడుస్తుందా ? 9 సంఖ్య నుండి చివరిదాకా, మళ్ళీ పైన దశమాన్ని చేరుకునేంత దాకా వ్యాపించిన సాంఖ్యాన్నే ప్రయోగించాను. ఇదంతా దేనికి ? ఇక్కడ ఆ విషయచర్చ అనవసరం.

ఇదంతా ఎందుకు చెప్పాను ? ఆ మానవ పూర్ణత్వ పథంలో ఎన్నో శోధనలు నిండినాయని తెలిపేందుకు. ఇక్కడ భౌతిక విజ్ఞానం సముద్రపు అవతల ఉండే బంధువుల్లో ప్రగతిగా వ్యాపిస్తుంది. మనం వారికి సాగరం అవతల ఉండే బంధువులు కారాదా ? అలా కావాలంటే, మీరు ఇచ్చేందుకు ఏం సిద్ధం చేసుకున్నారు ? చరిత్రకారులు అందించిన అంశాలా ! ఏమిటి ? గుర్తుకు రావడం లేదా ? 'అదెక్కడి నుండో వచ్చిన ఆర్యులనే తెగ; వారి కాలం వేదకాలం. నిప్పు, వెలుగు, గాలి – వీటినే వారు పూజించేవారు. వాళ్ళు నాగరికులు. పశుపాలన, వ్యవసాయం మొదలు పెట్టారు. అక్కడ నుంచి మనం ఏమేమో నేర్చుకున్నాం. ఇంతే మనకు తెలిసింది. అందుకే మనం ఇప్పుడు ఏమేమో అయిపోయాం.



పాపం ! వేదాల్లో 'ఆర్య' శబ్దం పూజ్యులు అనే అర్థంలో ప్రయోగించబడింది! అది ఎదిగి పూజ్యులనే చోట ఆర్యులు అని ప్రయోగించడం శాస్త్రాల్లో కన్పిస్తుంది. ఎవరో గతానుగతికంగా వచ్చిన కొన్ని నాగరికవర్గాలే మనకు అన్నీ అందించారన్నారు. అపుడు భారతస్థితి రాముని కాలంలోని శాల్యన్నపు స్థితి! విశ్వామిత్రుని శక్తితో ఎదిగి వచ్చింది!

ఇక క్రిందటి దంతా అపరిమితమైనది అని గ్రహించరాదా ? పాపం ? విజ్ఞానం కావాలి. నిజంగా చెప్పాలంటే సృష్టి విజ్ఞాన సర్వస్వం తెలియాలంటే – భౌతికవిజ్ఞానంతో పాటు ఆంతరంగిక విజ్ఞానం కలిస్తేనే సాధ్యం. ఇదొక్కటే సిద్ధాంతం ! భౌగోళికమైన భేదాల వల్ల కాలానుగుణంగా కలిగే భూమి, జలం వీటి మార్పుల వల్ల ఒక్కొక్కరిని చూచి, తెలుసుకోకుండ, చాలాకాలం గడిపినంత మాత్రాన ఏదో రకమైన నిర్ణయాన్ని తీసుకోవడం సాధ్యం కాదు. అలా చేయకుండా, విచక్షణతో ఇదివరకే మనదేశంలో ఇప్పటి భౌతిక విజ్ఞాన పరిశోధనలన్నింటినీ గావించారు. అవి ఇపుడు ప్రయోగంలో లేకపోతే – అది మన తప్పు. అన్నీ అభివృద్ధి చెందుతున్నాయి. ఈ జ్ఞానాన్ని పొంది, అక్కడ దొరకని అంశాల్ని భారతీయ సాహిత్యంలో పొంది, వారికి అందిస్తూ పోవాలి. ఇది ఒక విశ్వబాంధవ్యం.

ఇలా జరిగితేనే, విశ్వజనీనత కోసం శ్రమించినట్లు ! మనిషి ప్రగతిశీలుడు. సచ్చారిత్ర్యమే మన దారి బత్తెం కావాలి. అది మనలో అణువణువునా కన్పించాలి. దాని కనుగుణంగా మన బ్రతుకును తీర్చి దిద్దాలి. అపుడు మనం నిజంగా ప్రగతిపథంలో పయనించినట్లే! ఈ దిశగా పరిశోధనలు కొనసాగిస్తూ ఇంకా 'Man is something un-known' అనే స్థితికి వస్తాం. వాళ్ళు పరిశోధనలో అలా చెప్పబోయే వేళ Man is something that and this అని చెబితే చాలదు. Man is

what, in what, as what, for what ? అనే ప్రశ్న ఆలోచించదగినది. ఈ ఆలోచనకు స్వరూపమే పునాదిరాయి !

భౌతికపూర్ణత్వం సుందరాభరణం కావాలి. ఇక్కడ అవి తేలికైన ఆభరణాలు కావాలి. బిగించే బంధనాలు కారాదు. అంటే – జతజతగా ఆంతరంగిక విజ్ఞాన జిజ్ఞాస పెరిగి, సాధనలోనూ దానిని ఉపయోగించుకుని, సిద్ధుల్ని పొందుతూ సాగుతాడు. శాంతిని పొందుతాడు. సర్వోత్తముడని అనిపించుకుంటాడు. Here I shall say man is the authorised subject to do for the harmony of truth in the universe, the soul is eligible to enjoy the bliss in self and to be for the grace of the lord.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**



# 10. మానవ పూర్ణత్వం – (ఆధ్యాత్మికం)

**ప్రియమైన మనుష్యత్వమా !**

'తత్త్వం' పెనుభూతం కాదని మీరు గ్రహించలేదా ? చాలా సంతోషం. ప్రజలు తత్త్వాన్ని కోరుతున్నారు. అందుకే మిమ్మల్ని జిజ్ఞాసు బంధువులారా అని పిలుస్తున్నాను. భాష, దేశం, వ్యావహారిక పరిపుష్టత కోసం మనిషి జాగృతుడై అన్నివైపుల నుండి వైశాల్యాన్ని ఆలింగనం చేసుకోవాలి. ఆ వైశాల్యం వల్ల శుద్ధ సత్యాన్ని గ్రహించగల్గాలి. ధర్మపు బయటి స్వరూపం లోపలి స్వరూపం ఈ దృక్పథంతో ఉపన్యాసం జరిగింది. దీని బాహ్యశరీరం 'ధర్మాలు'. దీని లోపలి ధర్మం మాత్రం నిజంగా ఒక్కటే. దాన్నే ఈ అర్థంలోనే 'విశ్వమానవధర్మం' అన్నారు. దేహం వెలుపల అనేకరీతుల ధర్మపు బాహ్యశరీరం అంతరించి, ఆధ్యాత్మికంలో ఆ ధర్మపు లోపలి స్వరూపం ఆవిష్కృతమై, అంటే అనుభవానికి వచ్చి, ఆధిదైవికానికి అర్పితం కావాలి. ఇలా అయితేనే, ధర్మ నైర్మల్యం మనకు దక్కినట్లవుతుంది. దేవుణ్ణి చూపేందుకు తీసుకువెళ్ళే ధారణాశక్తి, దానికి సంబంధించిన అనుభవం – ఏదైతే ఉందో అదే 'ధర్మం' అంటాను ! ఇదే అంశాన్ని నేను ఎన్నోసార్లు నొక్కి వక్కాణించాల్సి వచ్చింది. అందుకే ఎన్నిసార్లు చెప్పినా నాకు ఇంకా చెప్పాలనిపిస్తోంది. ఈ రోజు నేను గ్రహించి, గ్రహింపజేసే అంశం 'భవ్యపూర్ణత్వం' కదా ! అందుకే ధర్మం గురించి ఇదంతా ప్రస్తావించాల్సి వచ్చింది. దీన్ని నిర్ధారణ చేసుకోకుంటే – మానవుని భవ్యపూర్ణత్వం, దానికుండే ఒకే ఒక్క సత్యనిశ్చితమార్గం మనకు ఎలా అర్థమౌతుంది ? ఈ దురంతాన్ని ఆశ్రయించిన ధార్మికమైన మత పైశాచిక సామ్రాజ్యమే తాండవిస్తోంది. సమాజంలో శాంతిరక్షణ కోసం

కాలదేశానుగుణంగా ధర్మపు బాహ్య స్వరూపం కొన్ని మార్పుల్ని పొందుతూ ఉంటుంది. మానవత్వాన్ని గ్రహించి, అనుభవించిన వేళ అది ఆధ్యాత్మికమై, మనస్సు, ఆత్మ – వీటి ప్రగతి, ఏకైక మార్గమనే అశాశ్వత మానవధర్మమే! 'ధర్మం' అనే దాన్ని మరిచిపోయేంతగా జాతి వైరాన్ని రేపే కోతి అడ్డంగా వస్తే గతి ఏమి?

నిజంగా ప్రగతి సాధించాల్సిన జీవుడు మనసారా నవ్వాలి. అది జరగనే జరుగుతుంది. అలా అయితేనే అది భవ్యపూర్ణత్వం ! అపుడే మానవ పూర్ణత్వప్రాప్తి ! దీనివల్ల మతాచారాల ఖండన జరగదు. మనుష్యత్వానికి అడ్డువచ్చే నిజాన్ని ముంచే ఏ అంశానికి ఇక్కడ అవకాశం లేదు.

ప్రపంచంలో సుందరంగా జీవించగల్గాలి. జీవించడం ఒక కళ. దీనికోసం భౌతికంగా కర్తవ్యశ్రద్ధ, మంచి ప్రేమ భావం, లక్ష్యాలు – ఇవన్నీ అవసరం. ఈ దిశలో పరిశోధన సాగి అన్ని అంశాలను తెలుసుకుని, జననం నుండి జీవనం దాకా వివిధ సమస్యల చిక్కుముడుల్ని విడదీసుకుంటూ ఎలా జీవితాన్ని చక్కదిద్దుకోవాలి? సృష్టిలోని ఏ ఏ మూలభూతమైన అంశాల్ని వైజ్ఞానికంగా పరీక్షించుకుంటూ ఆత్మకల్యాణాన్ని, లోకకల్యాణాన్ని ఎలా సంపాదించాలి? అనే అంశాల్ని అయినంత కూలంకషంగా, భౌతికపూర్ణత్వంలో విశ్లేషించాం. చాలా కాలం క్రితం అంటే మానవత్వం ఎలా అన్ని విషయాల్ని శుద్ధరీతిలో పరిశోధించి, పరిష్కరించి ఫలాన్ని పొందిందో, ఒక రకంగా అనేక విషయాల పరిశోధన మన ఈ యుగంలోనూ జరిగింది. ఈ సత్యశోధనకు మనదేశం చాలా ప్రాధాన్యం అందించి ఉంటుంది. అలాగే, భౌతిక, ఆధ్యాత్మిక తత్త్వాలు రెండింటినీ మానవత దర్శించింది. అందువల్ల మనం ఆది నాగరికులం?



ఇక్కడ ఉద్వేగంతో 'ఉత్తిష్ఠత' అనే మాట చాలా అవసరం. 'జాగ్రత' అనే అర్థం కోసం. మనమా ? మనపూర్వీకులా ఆదినాగరికులు ? అనే అపహాస్యపు నవ్వునాది ! నవ్వు నోట్లో కన్పిస్తే – స్మృతి మనస్సులో గోచరిస్తుంది. ఏదో ఒక కృత్రిమ భేదంతో పాశ్చాతుల్ని నిందిస్తే దుఃఖం మీకే కల్గుతుంది. ఆధారం కోసం కాకపోయినా దూషణకు ప్రతివ్యంగ్యం అని అంటాను. ఇంతకు ముందు జరిగింది ఏదేనా కానీ ! ఇపుడు మాత్రం భారతీయుల కర్తవ్య రాహిత్యానికి, ఈర్ష్యాసూయులకు రోసి, జగత్ సాక్షి అయిన సూర్యుడు పశ్చిమ దిక్కులో తన ఆశ్రయాన్ని పొందుతాడు. పాశ్చాత్య దేశం భౌతికశాస్త్ర శోధనల్లో చాలా శ్రద్ధతో కర్తవ్య నిర్వహణ చేయగల్గడం సూర్యుని ఆశీర్వాదం వల్లనే అంటాను. ఇదొక భావనాత్మక మైన నీడ ! అందుకే ఉదయించే సూర్యుడు మనవాడు. తొలిదిక్కు మనది. దిగ్దిగంతాలకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించే వాళ్ళం మనమే కావాలని ఇంతగా మనవి చేసుకుంటున్నాను.

ప్రతి ఆలోచన, ప్రతి పరిశోధన, ప్రతి శాస్త్రం వైజ్ఞానిక పరిధికే పరిమితంగా ఉండిపోతుందని అనుకోనవసరం లేదు. అలా కాజాలదు. Psychology, innate capacity అంటే Mass is something unknown అని ఓ శాస్త్రవేత్త అన్నాడు ! పంచభూతాల్ని భౌతికంగానే పరిశోధించే సాహసక్రియలో "There is something more. That too above all అనేది శాస్త్రవేత్తకు శరణ్యం. అంటే ఏమిటి ? ఏదో ఒక రహస్యం ఉంది – అనే చోట అన్ని శాస్త్రాలూ ఆగిపోతాయి.

ఇక్కడ ఉపాయమేమంటే ఆంతరంగిక విజ్ఞానాన్ని గ్రహించాల్సి ఉంది. అలాగే ఎదిగివచ్చిన మానవుని భౌతికపూర్ణత్వం ! అందుకే – దీన్నంతా భరించిన విశ్వవాణి "ఏమైననే మంట, తాను తెలుసుకొననది?

నిన్ను తెలియకున్న ఎక్కడున్ననేమంట ? ఉచ్చనీచములన్ని కల్పనాత్మక డోల అపరిమితానందమొక్కటే ఒక్కటే!" అంటుంది. ఆ అద్వితీయానందాన్ని అందించగల్గే మూలమైన ఆత్మను అందుకుని విశ్వమానవులంతా ముందుకు సాగాలన్నదే నా కోరిక! సాగినవేళలోనే మానవ పూర్ణత్వం ! ఇప్పటి విప్లవ సంఘర్షణ అనండి! నేనైతే ఆలోచనల మథనం అంటాను. అయినా సామాన్యంగా భయానకమే గంభీరంగా సాగి,సామరస్యాన్ని అందుకోవాల్సిన మానవత ఇపుడు గంభీరమైనది. చాలాసార్లు ధర్మానికే విప్లవం వచ్చిందేమో అని అన్పిస్తుంది. కాదా? 'నాశం' అని అనరాదు. కృష్ణపరమాత్మే, 'గ్లాని' అన్నాడు. ఆ 'గ్లాని'నే కదల గల్గడం అని అనాలి. అనేకరంగాల్లోలా విప్లవం కూడా ఒక రంగమని చెప్పాలి. నాయనా ! ఆ విప్లవానికి అనడము తప్పే అయినా ఆ విషయపు ఆలోచనాతరంగాల్లో బుద్బుదాకారం (బుడగ ఆకృతి) కన్పిస్తుంది. సరే ! భయం లేదు. ఈ తూగులాట ఎంతదాకా నడుస్తుంది ? ఊగి ఊగి, విసిగి వేసారి, తన్ను దింపిన ఆ ఉయ్యాల వద్దకు వచ్చి నిలవాల్సిందే ! ఇక్కడ కూడ ఆ మహా గర్భం నుండి వెలువడిన సృష్టిలో ఎప్పటి నుండో ఎన్నో ఊగిసలాటలు సాగుతూనే వచ్చాయి. నిత్యగర్భంలో స్థాపితమైన స్థితిలోనే నిలచిపోవడం జరుగుతుంది. ఈ సమయంలోని మహర్షుల వాక్యాలైన "అభీః అభీః" మంత్రం వైపుకు మనదృష్టిని మరల్చాలి. అలా చేస్తేనే "పరిపశ్యంతి ధీరాః" అనే మాటకు అర్థం స్ఫురిస్తుంది. ఇది అర్థంకాక చార్వాకాది వాదాలు చెలరేగాయి. "రేపటి చింత మనకెందుకు ఈ రోజు సుఖపడదాం" అనే తాత్కాలిక వాదమూ ఉంది. ఇదేమీ వేదంకాదు. నిన్న బలాన్ని పొందాం. ఈరోజు దాన్ని అనుభవిద్దాం. అలాగే రేపటికి సిద్ధిని పొందుదాం. ఇదే నిజమైన దర్శనం. ఇక్కడ చులకన, నిర్లక్ష్యం వీటికి



తావే లేదు. "Yesterday is not gone one alone. It is the song that brings forth to day ... what you invest is gate for next" gets what all ! వేళ్ళకు నీళ్ళు పోస్తే మొక్క, చెట్టు, పూలు, తీగలు సుందరంగా పెరుగుతాయి. సమస్యలే కొమ్మలు. ఆలోచనే పూవుగా కాయలు, పండ్లు వాటి పరిణామాలన్నాక ఇంకేమి ? వృక్షమూలం అన్నపుడు ఈ కాయకల్ప వృక్షమూలాన్ని మనం చేరుకోవాలి. ఈ ఆధ్యాత్మిక పునాదిపై జీవన సమస్యలన్నీ పరిష్కరింపబడాలి. అపుడే మనిషికి పూర్ణత్వ ఫలప్రాప్తి కల్గుతుంది. లేకుంటే "పుట్టవా, గిట్టవా, గురి అనేదేదీ లేక, మేడి పండులో పురుగులుండవా? అటులనే ఈ మానవులు కూడా లెక్కలేనంతమంది" అని అనాల్సివస్తుంది.

ఆధ్యాత్మిక శాస్త్రంలో చెప్పడం జరగలేదు. కానీ ఎన్నెన్నో మార్గాలు, ఎన్నో వేదాలున్నాయి. అవన్నీ వేర్వేరు అని అనిపించవచ్చా ? అందులోనే హాని ఉంది. "No ism is complete and end by itself. The true essence of life that found in Dharma in its original shape is only the gate for goal అని అంటాను. తత్త్వానికి ఒక్కటే దారి. వేరే మార్గాల్లో "క్షీణే పుణ్యే మర్త్య లోకం విశంతి" అనే సత్యం వర్తిస్తుంది. అలాంటి ఏకైక మార్గాన్నే మహర్షులు మనకు చూపారు. దాన్నే చెప్పేవేళ ప్రశంసించేవేళ – ఆ విషయంలో సంతోషపడే వేళ – వివిధ వర్ణనల కోసమే "శృతిశ్చభిన్నా స్మృతయశ్చ భిన్నా నైకోమునిః ధర్మస్యతత్త్వం నిహితం గుహాయాం మహా జనోయేన గతః సపంథాః" అనడం జరిగింది. దీన్ని ఎలా మనం వాడుకోవాలి? దీన్ని ఎవరు చెప్పారు ? "మహాజనాః" అంటే ఎవరు ? వేలాది మందికి నాయకత్వం వహించడమా? గొప్పతనమే జీవనంగా మలచుకున్న వ్యక్తి. అంటే ఆత్మజ్ఞాని. అతడు చెప్పేదింతే !

ఇదేదో ఒక సమాజం కోసం చెప్పబడింది కాదు. శుద్ధంగా "మహాజనుడు" మారేవేళలో జాతి, సమాజం, దేశం, విశ్వం వీటన్నింటిలో సమత్వాన్ని దర్శించి ఉంటాడు. అతని మాట అఖండమానవ జాతికి వర్తిసుంది. వేదాలు భిన్నంగా ఉన్నాయి. పురాణాలు విభిన్నంగా ఉన్నాయి. అంటే పానంలో సుఖించే వ్యక్తి ఒక్కడు కాదు. ధర్మతత్త్వం గుహలో ఉంది. మహాజనులు సాగిపోయేదే నిశ్చితమార్గం. 'గుహ' అంటే ఎక్కడో ఉంది. కానరాని చోట దాగి ఉంది. అంటే అది మరుగు పడిపోయింది అని అర్థం కాదు. వాళ్ళే, తత్త్వాన్నే చెప్పారు. ఖచ్చితంగా చెప్పారు. ఈ మార్గంలో సాగిపోయిన వాళ్ళే మహాజనులు అని అన్నారు. "ధర్మస్య తత్వం నిహితం గుహాయాం" జీవుడు ఎల్లపుడు ధరించిన చైతన్యం, దాని స్థితి. ధర్మం, దాని తత్త్వం. త్రికాలాబాధితమైన స్థితి – గుహలో ఉంది. ఇది అనుభవజ్ఞుల మాట ! తమ దేహంలో ఆత్మ ఆనందంగా నివసించే సుందరమైన ఆవరణానికే "బ్రహ్మపురి" అని ఒకరు అన్నారు. అది చాలా రహస్య స్థలం. అందువల్ల దాన్ని "గుహ" అన్నారు. ఆ గుహలో చేరి విహరిస్తే తత్త్వానుభవం తప్పక కల్గినట్లే. దాని కోసం ఎలా సాగాలో ఆలోచిద్దాం.

శుద్ధంగా మనం జాగృతులమైతేనే – ఆ తత్వం స్పష్టంగా మనకు గోచరిస్తుంది. గుహలోని ఆనందాన్ని, ఆ బ్రహ్మపురి దివ్యత్వాన్ని చూసి ఆనందించేందుకు అవసరమైన ఆధ్యాత్మిక సాధన గురించి మాట్లాడేవేళ – అవి కథలు కావు. అల్లితే అల్లుకునే సాలెగూడు లాంటిది కాదు. వేరే వాళ్ళ మాటలొక్కటే కాదు. ఆ నిశ్చితమైన సాధనలో నిలబడి సాధించే వ్యక్తి, గురుకృపతో విశ్లేషించిన వేళలో ఆ గుహద్వారానే సత్యసహాయం లభిస్తుంది. అందుకే మరోసారి మిమ్మల్ని జాగృతుల్ని చేస్తున్నాను. ఓం శాంతిః



నడిచే పరిశోధన ఈ దివ్యదేవాలయం నుండి. ఈ దేహనిర్మాణం దేనివల్ల ? దీని సృష్టి ఎలా జరిగింది ? ఎముకలు నలిగిపోతాయి. అరిగిపోతాయి. నొప్పి కల్గుతుంది. దీంట్లోని రక్తం ఏమిటి ? ఇలా మొదలు పెట్టాక, మనదేహం ఏదో కొంత హెచ్చుతగ్గులు జరిగాక – ఈ రోగాదులు వచ్చిన వేళలో, లోపించిన ఆయా వస్తువుల్ని ప్రకృతి నుండి మనం తీసుకుంటాం. రోగాన్ని చక్కదిద్దుకుంటాం. కొంచెం లోతుగా ఆలోచిస్తే బాహ్యసృష్టిలో ఉండే భూతధాతువులన్నీ మనదేహానికి ఒక్కోరకంగా ఉపకారం చేస్తాయి. మూలమైన పంచభూతాల్ని, వాటి ఉపభాగాల్ని వాడుకునే మన దేహపు రచన వీటివల్లనే ఏర్పడి ఉండదా ? ఎందుకు ? నీరు నీటిని చేర్చుకుంటుంది. నూనె నూనెలో చేరుతుంది. సూదంటురాయి ఇనుమునే ఆకర్షిస్తుంది. ఇది కూడా ఇలాంటిదే !

పంచభూతాలతో నిర్మింపబడినది విశ్వదేహం. ఆధ్యాత్మికత యొక్క బాహ్యావరణము అయిన ప్రకృతి సాంగత్యమంటే ఏమిటో మనకు అర్థమౌతుంది. మనం మొట్టమొదట ప్రకృతికి శరణువేడాలి. అంటే ఆ విశాల ప్రకృతి, మనదేహ ప్రకృతులతో సంబంధాన్ని ఏర్పరచుకుంటుంది. కాలనియమానికి బద్ధమైన ప్రకృతి, ఆయా ఋతువులకు తగిన ప్రకృతి, అలాగే దేహప్రకృతి. వీటిని వర్తింపజేసుకుంటూ ఆహార విహారాల వ్యవస్థను తెలుసుకోగల్గుతాడు. ప్రకృతిలో ఉన్నదంతా ఈ శరీరంలో ఉంది. లవణాలు, లోహాలు, రసాలు ఇవన్నీ ఎన్నెన్నో ? వైద్యశాస్త్ర మనిపించుకుంటాయి కదా ! ప్రకృతిలో వైద్యశాస్త్రం, దేహానికి వైద్యశాస్త్రం. ఆత్మకు దేహం. ఇలా ఉన్నపుడు వైరుధ్యం ఎక్కడ నుంచి వస్తుంది. అలా చెప్పేవేళ, భూత, ధాతు, రస,లవణాలు, ఆయా చైతన్యాలు విశాల విశ్వంలో స్థూలంగా ఉంటే – అధిక ప్రమాణంలో ఉంటే, సూక్ష్మంగా, శుద్ధంగా,

మిశ్రితంగా ఉంటాయి. వీటిని అర్థం చేసుకుంటూ ఆలోచిస్తే – ప్రకృతికి శరణు వేడి, ఆ ప్రకృతి ద్వారానే సత్యాన్ని గ్రహించు అనే అనుభవజ్ఞుల మాట ఎంతో సత్యం.

ఇలా ప్రకృతిపథంలో సాగే వేళ, మూలవస్తువులైన పృథ్వి, జలం, అగ్ని, వాయువు ఆకాశం – వీటిలో దేని ఆధారం మీద అంతా నిలచి ఉంది ? దేని ప్రాధాన్యం వల్ల విశ్వదేహంలో ప్రకృతి ఆటలు సాగుతున్నాయి? అన్నింటిలోనూ జీవనాధారంగా ఏది మనకు కన్పిస్తుంది? ఇక్కడ భూతాలు, ఉపభూతాలు అన్నింటిలో కలగాపులగం, మిశ్రణం ! అప్రధాన్యమైన, ప్రాధాన్యరీతి కన్పిస్తోంది. ఇది చాలా జటిలమైన అంశం. ప్రస్తుతానికి ఏ చైతన్యం ఆవశ్యకమైనదో, దేని ఆధారంగా అన్ని కార్యకలాపాలు సాగుతున్నాయో ఆ వాయుచైతన్యమే ఆధారంగా మనం బ్రతుకుతున్నాం. ఆ మహాచైతన్యం పైననే ఈ ప్రకృతి ఆధారపడుతుంది. మనం ఈ ప్రకృతి స్నేహాన్ని అవగాహన చేసుకోవాలి. ఇది అంటే ఆ మహాచైతన్యం. మీరొక్కరే కాదు. ప్రతి ఒక్కటి స్తబ్ధంగా ఉంది! అన్నపుడు కూడ అదొక్కటి జరగనే జరిగింది. దీన్నే ఏమి ? ఏమి ?అని ప్రశ్నించే జిజ్ఞాసువులకు అంతటా వ్యాపించింది అని జవాబు ఇస్తారు ఉపనిషత్కారులు. ఈశావాశ్యోపనిషత్తులో ఇలా ఉంది.

**"ఈశావాస్యమిదం సర్వం యత్కించ జగత్యాం జగత్**
**తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్యస్విద్ధనమ్"**

'ఈశ్' అనే ధాతువునకు శబ్దాత్మక చైతన్యం అని అర్థం. ఇది సర్వవ్యాపకం. నీలోనూ ఇది ఉంది. దాన్నే అనుభవించు. బయటి సొమ్ముకు ఆశపడవద్దు. మనలోనే ఉండే సొమ్ము ఏది ? అనే అంశాన్ని చర్చిద్దాం. శ్రీకృష్ణ పరమాత్మ దీన్ని ఇలా విశ్లేషించాడు.



**ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా**

''ఈశ్'' అనే ఆ చైతన్యం అన్ని ప్రాణుల్లోనూ ఉంది. హృదయంలోనూ ఉంది. చూడండి. ఇపుడే మన హృదయాల్ని స్మరిద్దాం. కన్పిస్తోందా ? టక్ టక్ టక్ అనే శబ్దం విన్పిస్తుంది. ఇదే ఆగిపోతే ఇక గతి ఏమిటి? మన ఆటముగిసినట్లే. ఈశుడు – ఈశ్వరుడు ఈ శబ్దాలే భగవద్దర్శకాలు. ఆ దేవునికే 'ప్రణవం' అనే పేరు ఉంది. దీన్ని గ్రహించే వేళలో ఇది ప్రకృతిలో ఎలాగుందో మనకు తెలుస్తుంది. ప్రకృతిలోని సారభూతమైన వస్తువులన్నింటిని తెచ్చి అందిస్తుంది. మనం ఆ పరమతత్త్వంతో స్నేహంగా సాగితే, ఆ సేవద్వారానే మనకు ప్రకృతి స్నేహం లభిస్తుంది. ఇక్కడ ప్రకృతి స్నేహం అంటే – 'అయ్యో ! ఉపాధి, ఉల్బణం – ఇవే ఎక్కువగా కన్పిస్తున్నాయి కదా ! దానికేం ? భగవద్గీతలో ఉపాయం ఉంది.

**శీతోష్ణం సమం కృత్వా లాభాలాభౌ జయా జయౌ**

అనే మంత్రం ఎవరికి తెలియదు ? ఈ మంత్రాన్ని బాగా జపం చేసే వాళ్ళు ఎంతమంది అలా చలిని తట్టుకుని ఉండగల్గుతున్నారు ? ఆచరణలో పెట్టాలి మరి ! అలా అంటే సాధ్యమా? ఎండలో తలకు తడిబట్ట చుట్టాలి. చలిలో నిప్పు కావాలి. మరి ఈ శ్లోకార్థం అర్థం కాదు. శబ్దార్థాలు నిఘంటువు ద్వారా తెలుస్తాయి. సత్యార్థం మనకు హృదయకోశంలో లభిస్తుంది. బ్రహ్మవిద్యావిహీనులకు ఇది ఎలా సాధ్యం? ఎలా అర్థమౌతుంది ? అందుకే 'గురుం వినా పరోనాస్తి' అని అన్నారు. కృష్ణపరమాత్మ శీతోష్ణాది ద్వంద్వాలను సమానంగా చూడాలని అంటాడు. మాట లాడమని చెప్పడు. ప్రకృతిలో చల్లదనం కల్గినవేళ ఆ వాయుచైతన్యపు

గతాగతిలో ఉష్ణం ఉత్పత్తి ఔతుంది.దాన్ని పొందితే ఉపాధి తగ్గుతుంది. ఉష్ణం పెరిగినవేళ – ప్రకృతిలో గతి స్థిమితంగా ఉంటే అతని నుండే శాంతి లభిస్తుంది. అపుడు కూడ ఉపాధి తప్పుతుంది. (అందువల్ల) స్నేహం పెరుగుతూ (బాహ్యశక్తుల వల్ల) లభించే ఉపాధులన్నిటినీ జయిస్తాడు. అపుడే ప్రకృతితో సమానత్వం ! ఆ స్థితినే "నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః" అని వర్ణించడం జరిగింది. అందుకే ప్రకృతిని ఆశ్రయించాలి. ప్రకృతితో స్నేహం, సామ్యం పొందాలని అన్నారు. వీటన్నింటికీ ఆ మహాసాధనే ఆధారం ! దాన్నే బ్రహ్మవిద్య అన్నారు. ప్రణవం లేకుంటే ఏదీ ప్రాప్తించదు.

సాధారణంగా అన్నిచోట్లా అడగాల్సింది.

**"ప్రణవమూలమంత్రమన్న ! వేరే దృష్టి నీకు శ్మశానమార్గం!**
**నిజమైన గానం ప్రణవగానం ! వేరే రాగమైతే అదే రోగం**
**ప్రణవభేరీ భవ్య పూర్ణత్వ ప్రాప్తి ఆత్మజ్ఞానమే నీకు నిలయం.**
**అచటనే నీకు అన్నిమర్యాదలు పరమాత్మ ప్రేమకు అదే**
**వాహనం ప్రణవం మూలమంత్రమన్న !"**

ఆ ప్రణవం అంటే ఏమిటి ? దాన్ని కనుక్కోవడం ఎలా ? దానితో సాధన చేయడం ఎలా ? అనే అంశాల్ని మనం తెలుసుకోవాలి. ఈ సాధన గురించి సుందరంగా, అలంకార భరితంగా, వర్ణించిన, తత్త్వాన్ని కంఠస్థం చేసినట్లుగా చెప్పబడిన శ్లోకం ఉంది.

**"ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్యముచ్చతే**
**అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్ యస్మింద్యౌః**
**పృథివీ చాంతరిక్షమోతం మనః సఃప్రాణైశ్చ సర్వైః తమేవైకం**
**జానథ ఆత్మానమన్యావాచో విముంచ థా**



**మృతశ్యేష సేతుః"** అని చెప్పబడింది. జాగృత ప్రాణపు ఉద్యాణ ఝంకారమే – ధనుస్సు. గురూపదేశం పొందిన సాధకునికి సహాయకమౌతుంది. అంటే ప్రాణుని వాయు గతాగతిలో పుట్టే శబ్దం. దాన్నే – ప్రారంభించిన స్థలం నుండి పుట్టి, తాను గమ్యం చేరే దాకా ఉండే శబ్దస్థితినే 'ఓం' అన్నారు. అన్నం తినే వేళ శబ్దం ఎలా పుడుతుంది? అపుడు నోరు మూసుకుంటుంది కదూ ! అనే వేళ ప్రారంభించే మూలస్థానం లోంచి వెలువడే శక్తి ఆ స్థితినే పొందాలి. అదే 'ఓం'. అది ప్రాణం ద్వారానే సాధ్యం.ఆ రకంగా తనకు తానుగా ఝంకరించే ప్రణవమే ధనుస్సుగా, ఆ ప్రాణమిలనంలో అంటే మనోగతిలో ప్రవహించి వచ్చినంత ఆత్మాంశను బాణంగా, బ్రహ్మమే గురిగా సాగాలి. బ్రహ్మ అంటే ఇక్కడ సాధకుని స్థితికాదు. బ్రహ్మేంద్రియాల సముదాయపు స్థానం; ఇక్కడ ఎక్కడ విడిపించాలి ? నిరంతరం జాగృతుడై శరంలా తదేకచిత్తుడు కావాలి. సాధారణుడైన ఒక యోధుడు గురిపెట్టి బాణం వదిలినపుడు, అటు ఇటు కదలకుండా, ఎలా ఒకేరీతిలో పయనిస్తుందో, అలాగే ఏకధారగా గతాగతి నడవనీ ! పృథ్వి అంటే – మనదేహంలో శిరస్సు నుండి క్రింద ఉండే భాగం. అంతరిక్షం అంటే – తలపై భాగం. ఈ మధ్యలో నిండిన వాయుచైతన్యంతో దేహం సర్వవ్యాప్తమైన ప్రాణశక్తితో, మనః ప్రాణాల మిలనం జరిగి, అదే ధ్యానస్థితిలో ఆత్మదాకా చేర్చే అమృతత్వ సేతువు. దీన్నే సాధన అంటారు.

ఇలా ఆరోహణ చేస్తూ చేస్తూ అవరోహణరీతిలో సాధనాస్థితిని వర్ణించేవేళ

**దివ్యే బ్రహ్మపురే హ్యేష వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః**

ఇక్కడ అలంకారానికి, సాహిత్యానికేం కొదవ ? వస్తువిన్యాసమే రూపకమై చెప్పేరీతి ఉపమగా, సత్యాన్ని ఆ బ్రహ్మపురి ప్రతిష్ఠింపచేస్తుంది. ఆ బ్రహ్మపురిలో అంటే – ప్రణవోధనుః నుండి నిర్మితమైన సేతువుపై అఖండ ప్రవాహాన్ని దాటి శుద్ధసాధకుడు చేరే ఊరే ఆ బ్రహ్మపురి. పోదామా ? డబ్బులు ఎవరిస్తారు ? మన జన్మ సంస్కారం ఇవ్వాలి. కాలకర్మల కలయిక, కారణకారి స్థితికి అంటిన మన ఆలోచనాశక్తి ఇవే మనకు ఆ ధనాన్ని అందించాలి. కారణపురుషుడైన నిజగురువుకు ఆ ధనం సమర్పితమైతే, లభించే అనుగ్రహం మనకు మనమే ! అపుడు మనకు ఆ 'ప్రణవోధనుః' లభిస్తుంది. అక్కడ నుండి మనం మనలోనే ఉండే, ఆ ఆత్మ ప్రతిష్ఠింపబడిన ఆ దివ్యపురాన్ని చేరుకోగలం.

**"మనోమయః ప్రాణశరీరనేతా**
**ప్రతిష్ఠితోన్నే హృదయం సన్నిధాయ"**

ఆ మహాచైతన్యం మనోమయంగా, ప్రాణమయంగా, ఈ శరీరమంతా వ్యాపించి, హృదయప్రదేశంలో ప్రతిష్ఠింపబడింది. అది ఎలా ఉంది ? ప్రణవాన్ని ధనుస్సుగా ఎలా మార్చుకుంటుంది ? బ్రహ్మపురిని చేరటం ఎలా ? ఈ ఆంతరిక భవ్యజ్ఞానం ఉన్న మహాపురుషులు దీనికిలా జవాబు అందించారు.

**తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరాః**
**ఆనందరూప మమృతం యద్విభాతి**

ఆ విజ్ఞానాన్ని గురూపదేశం పొందిన పద్ధతిలో ఆచరించి, ఆ విజ్ఞానంలో ధీరుడై నిలచి ఆనందరూపమైన అమృతత్త్వమును



చేరుకుంటాడు. అది లభిస్తుంది. ఇదే భవ్య విజ్ఞానం స్వామి. ఈ విజ్ఞానంలో సాగిపోకుంటే – ఈ స్థితి లభించడం సాధ్యం కాదు. భౌతికంగానే Studying everything through everything is materialistic view materially possible. Studying one thing in everything knowing , mentally possible. Really for the manifestation of the self and perfection along with the universe. i.e. also physical perfection, only through practice of the definite Vignana, which and which is of everything; that is us studying everything in one thing, is the only way for goal that called realisation, that runs Adi-daivika. This very Pranava Vidya should be perfectly practised with implicit obedience and faith as they bid. Vayuranila Mamrita Mathedam Bhasmantham Shariram" to get the result'. 'భస్మాంతం శరీరం' ఇది ఇక్కడ ప్రాకృతిక దేహం పూర్తిగా శుద్ధమై చిచ్ఛక్తిలో అంటే వాయువు యొక్క గతాగతిలో ఉత్పత్తి అయ్యే అనిలశక్తిలో పుటం పెట్టబడినట్లుగా మారి పంచభూతాల మృణ్మయత్వాన్ని దాటి, సమత్వంలో నిలిచి, చిన్మయత్వాన్ని దాటి, సమత్వంలో నిలిచి, చిన్మయత్వాన్ని పొందే – అమృతప్రాప్తి అయ్యే దివ్యవిజ్ఞానమే మనకు భవ్యమైన పూర్ణత్వాన్ని అందజేస్తుంది.

దీని కోసమే ఈ సాధన కోసమే బ్రహ్మచర్యం అవసరం. దీన్నే గీతాచార్యుడు ఉపదేశించాడు. అర్జునునికి బ్రహ్మచర్యోపదేశమా ! అందుకే మనకు ధైర్యం ! దీనికి సంసారులు భయపడనవసరం లేదు. అవివాహితులుగా మిగిలిపోనవసరం లేదు. మనకు కావలసింది

సాధనాత్మక బ్రహ్మచర్యం. ప్రణవం సాధన అయ్యేవేళ – ఆ బ్రహ్మ విద్యలో అన్ని ఇంద్రియాల సమూహం కోరేది! 'దృష్టి' భ్రూమధ్యాన్ని చూస్తుంటుంది. వాక్కు ఇంద్రియం మూతపడి, చెవులు ఆ ప్రణవనాదాన్నే వింటూ ఉంటాయి. చేతులు, కాళ్లు ఆసనంలో స్థిరంగా ఉంటాయి.మనస్సు ప్రాణంతో కలుస్తుంది. ఇది మన దేవుడు ఉపదేశించిన బ్రహ్మచర్యం! లక్ష్యం భ్రూమధ్యంలో నిలిచి, బ్రహ్మేంద్రియాల సమూహమే, అలా దర్శించే ప్రక్రియే బ్రహ్మచర్యం! దీనికే 'అవ్యభిచారిణీ భక్తి'అని పేరు.

ఈ విద్య ఎక్కడినుండో వచ్చింది కాదు. వచ్చేది లేదు. అందుకే దీన్ని 'సత్యవిద్య' అన్నారొకరు. 'సహజవిద్య'గా మరొకరు వర్ణించారు. ఎన్ని రకాలుగా వర్ణించినా, జీవుడు నిరంతరం దేన్ని ధరించాడో, ఆ ధర్మాన్నే 'విశ్వమానవధర్మం' అని అన్నారు. ఏ విద్యను ధరించకుంటే మనిషి సజీవంగా ఉండజాలడో ఆ ధర్మాన్నే ధరించాడు. అపుడే మానవతకు ఒక అందమైన పూర్ణత్వం. అలా కాక ఏదో దుర్బుద్ధికల్గిన వాళ్ళ మాయాజాలంలో పడితే ఇక ధర్మక్రీడ లెందుకయ్యా! శ్మశానానికి చేరే మార్గం ! దానికి గురువు అక్కరలేదు" అంటూ ముందుకు సాగుతాం. ఇపుడు ఆ ధర్మంఅంటే (అమరవిద్య మానవులను దారితప్పించింది. కుమార్గానికి పంపించింది) అదెలా ? ఏమి ? అనే అంశాల్ని గురించి చర్చిద్దాం. మళ్ళీ అందరం చిన్నవాళ్ళం కావాల్సివచ్చింది. ఎన్నెన్నో పెద్ద పెద్ద మాటల్ని విని ఇపుడు పిల్లవాడిలా తయారైనాం కదా! ఔను! భవ్యపూర్ణత్వాన్ని పొందగోరిన మనం మూలమైన ఆ అమరవిద్యయే లేకుండ ఎంత ఎదిగితే ఏం ప్రయోజనం? ఆ నిత్యవిద్య స్వరూపం, స్వభావం ఏమిటి ? దాని మార్గం ఎలా ఉంది? ఇదే కదా మనకు కావాల్సింది. తల్లి కడుపులోంచి భూగర్భానికి వచ్చిన శిశువును తక్షణం పరిశీలిస్తే



అతని దృష్టి భ్రూమధ్యంలో ఉంటుంది. నెత్తిపైన బ్రహ్మరంధ్రం ఉన్నచోట తగ్గు ఉంటుంది. అక్కడ నాడీ స్పందన కన్పిస్తుంది. ఆ పటపట ప్రాణవాయు స్పందనమే! వెంటనే ముక్కును పరిశీలించండి. అక్కడ ఎలాంటి చలనంలేదు. కొంతమంది పిల్లలు అంతదాకా ఏడ్వనే ఏడ్వరు. ఇదంతా చాలామంది తల్లులకు తెలుసు. కాలికి వాతపెట్టో, ఏదైనా శబ్దంచేసో శిశువును ఏడ్చేట్లు చేస్తారు. అప్పట్లో శిశువు ఏకాగ్రత అంతర్ముఖంగా ఉంది. దీనికోసమే concentration అవసరం. ఏకాగ్రత కావాలి. నిశ్చలత కావాలి. ఇలా అందరూ కేకలు వేస్తుంటారు. ఆ జీవధర్మం, జీవకర్మ భ్రష్టతలో ఎలా ఉంది ? ఆ నోరుతెరిచిన వేళ విశ్వంలో వ్యాపించిన స్థూలవాయువు లోపలి ప్రాణవాయువును ఆకర్షించింది. ఆ రాపిడివల్ల శబ్దం పుట్టింది. అంతటితో దృష్టి క్రిందకు దిగింది. ఇకపై అంతా ప్రారంభం చూడండి! ఇపుడు తెలుస్తుంది. దేహం లేకుండా ఏ జీవుడూ ఆత్మల్ని అర్థం చేసుకో జాలదు. దేహ స్వచ్ఛతలో, భౌతికశుద్ధిలో మాయను ఛేదించుకుంటూ తత్త్వదర్శనం చేసికోవడం సాధ్యం. అందుకే **"దేహం చెడిపోకుండా చూడు. మలభాండమని దీనిని నాశము చేయవద్దు. ఆత్మవృక్ష సంబంధం, జీవునికాశ్రయమై, తోటల్ని ఆ దేవుడు దేహభూమిలో నాటాడు చూడు"** అని విశ్వవాణి ఘోషిస్తోంది. తర్వాత ఆ శిశువు తల్లిపాలను రుచిచూసింది. శుద్ధరీతిలోనే ఎన్నో కలసి అంతా లోపలికి ప్రవేశించినట్లయింది. దాంతో పాటు మనస్సూ ఎదిగింది. పాలతర్వాత అన్నం, రసాలు ఇవన్నీ పెరిగాయి. దేహమూ పెరుగుతూ వచ్చింది. అయినా మిశ్రణం మాత్రం కలుషితంగానే మిగిలింది. మనస్సు అలా అలా బలిసి, వ్యాపించడంవల్ల ఆహార దోషాలు పెరిగినట్లలా, అగస్త్యముని ప్రణవ నాదంలో లీనులై 'మురళి' అని వర్ణించిన

ఆ జీవుని వీణాతంతిలాంటి ఆసన మూలాధార స్తంభమేదైతే ఉందో, వజ్రదండం లేదా బ్రహ్మదండం ఏదైతే ఉందో అది మూతపడిపోతూ వచ్చింది. దానితో మనస్సు అధోముఖమై చాంచల్యాన్ని అందుకుంది. తత్త్వాశనమనేది లేదు. కొంచెం కొంచెంగా మొదలుపెట్టిన కుమార్గం అనండి ! జీవునికి అసహజమైన అధర్మం అనండి ! ప్రారంభమైంది. పైకి వెళ్ళే దారి లేకపోవడం వల్ల ముక్కునే దారిగా మార్చుకుంది. ముక్కుతో ప్రాణస్పందన మొదలైంది. అదే అలవాటై, మనశ్చాంచల్యం పెరిగి బయటి పిపాసలన్నీ పెరిగిపోయాయి. సూక్ష్మ వాసనలు కూడా క్షుద్ర వాసనలే అని భావించేంత దాకా ముక్కుద్వారా ప్రవేశించిన స్థూలవాయువులు మనస్సును ఆకర్షించడం మొదలు పెట్టాయి. Thought waves of external force began to get down the settled thoughts of its own one's mind. Thus, everything elaborated something like to say established mental departments through 'dasendriya's and took them granted as originality and the same is wrongly recognised as manliness by each human being away in greater round as such Bhavya purnatva i.e. Adhyatma has become only a gazing point అక్కడ నుంచి మనిషి విషయవివేచన కోల్పోయి, లాలసుడై, సత్యాసత్యాల నిత్యమోహాల భేదాన్ని గ్రహించ లేకపోయాడు. జగత్తులో కర్తవ్యంలో అతడు ఉన్నాడు. కాని ఆ కర్తవ్య దక్షత లేదు. అందువల్ల రకరకాల గందరగోళాలకు బలై, సందిగ్ధంలో పడిపోయాడు. విశ్వానికి సంబంధించిన కళ అంటే అతనికి నీరసం. ఆంతరంగిక కర్మల కళను కూడ మరచిపోయాడు. ఇది నిజానికి చాలా శోచనీయమైన స్థితి. ఈ క్రాంతిలో చిక్కుకున్న కొందరు శాంతిని కోరుకుంటారు. అయితేనేం? శాంతి బయట



లభిస్తుందా ? తిరిగి, తిరిగి, విసిగి, వేసారి, నిద్రమబ్బులు కమ్ముకున్నాయి. అపుడొక్కటే – మనస్సు కొంచెం ఓడిపోవడంతో, ఆ ప్రాణిగతి ఎంతో ప్రయత్నించి ఊర్ధ్వముఖంగా వెళ్ళేందుకు సాహసం చేస్తుంది. దారి ఎంత దాకా శుద్ధంగా ఉంటుందో అంత పైకి వెళ్ళుతుంది. అపుడు లభించిందే శాంతి ! ఇలా బాగా ఆలోచించే అవకాశం జీవికి ఉందా ? అంటే లేదనే చెప్పాలి. అక్కడక్కడ కనిపించేది ఏమిటి ? నన్ను నేనే తెలుసుకోకుండా, నాలోనే శాంతిని పొందని నాకు, హఠాత్తుగా ఓ దైవం! లేదా మా ఇష్టం కొద్దీ ఏర్పరచుకున్న ఒకరిద్దరు దేవుళ్లు know they self నీవు శిశువులా మారు ! మరణం నీకులేనపుడు ముక్తిని నీవు పొందుదువు ! అని సాధకులు, అనుభవజ్ఞులు అంటారు. ఈ గందరగోళంలో వాళ్ళ మాటలు మనం ఎక్కడ వింటాం ?

భక్తి, కర్మ, జ్ఞానం ఇవి వేర్వేరుగా నిలిచాయి. వీటిలో భాగాలు ఎన్నో ! ఇలాంటి వేళ ఆత్యంతికమైన శాంతి ఎక్కడ ? దీని స్థితే దారి తప్పాక సర్వోత్తముని మాటలకు విలువేది ? ఎవరెవరిదో ఏవేవో అభిప్రాయాలట! మతాలట ! జీవధర్మాన్నే వదిలి, ఈ మనస్సు చెప్పినట్లు అనుసరించే మతాల్నే మనం వెనుకేసుకు వస్తున్నాం. జీవమతం! ఆత్మమతం! ఆత్మమతమే పరమాత్మునికి సమ్మతం – అనేదే జ్ఞానులమాట ! సాధకులు చూసి, అనుభవించే సత్యం. దీన్ని అనుభవించే భాగ్యాల్ని మనకు అందించిన గురువర్యులు అచ్యుతుల దర్శనం ద్వారా లభించిన సత్యం ఇది. ఈ అనుభవాన్ని నేను వివరించాలంటే – విశ్వవాణిని ఆలకించండి.

**"భక్తి, కర్మ, జ్ఞానం దారులు మూడు అంటే ఇది బుద్ధిమాంద్యం చూడు" ఒకే లక్ష్యపు మూడు అంశములు. అనుభవికి యోగంలో నిష్ఠయే**

**భక్తి. దానికి అనుగుణంగా వెళ్ళుటే కర్మ, అనుభవమును చూసి ఆస్వాదించుచైతన్యమే జ్ఞానము- విజ్ఞానము, లక్ష్యమును చేరినచో పూర్ణత్వం. ఇది తత్త్వజ్ఞులు, మహాజ్ఞానుల సిద్ధాంతము".** దీన్ని వదలి, కేవలం శబ్దాడంబరాలకు పోయే, తత్వానుభవశూన్యులైన కుహనాకవుల నోళ్ళు జీవాత్మ సంయోగం యోగమని చెప్పకుండా దేన్నో 'యోగ' అనే శబ్దానికి చేర్చి, భక్తియోగం వేరు. కర్మయోగం వేరు – జ్ఞానయోగంవేరు. చివరకు నాగలి యోగం వేరు – అనే స్థితిని వివరించాయి. ఆ యోగవిద్యలోని భక్తి, విద్యతో ఆచరణలో పెట్టబడే కర్మ, విద్యానుభవ జ్ఞానం ఇవన్నీ వీళ్ళకు అర్థం ఔతాయా?

ఇకచూసుకో! దీని తర్వాత ఇంకేమీ అవసరంలేదని, అంతా తమవల్లనే జరుగుతుందని, ఏకాంతంలో విచిత్ర వాదుల కలహాలు ! ఇక్కడ ఈలోకంలో అన్ని హక్కులు పొందడం ఒక గొడవ. 'సర్వార్పణం' అనే మాట అక్కడో పెద్ద గొడవ! నిజానికి నిజాన్ని తెలుసుకోక, తాము చెడిపోవడమే కాకుండా, అమాయకులకు కూడా ఇంత కషాయం అందిస్తున్నారు. నిజానికి ఎంతో నమ్రతతో అడుగుతున్నా "ఇది తత్త్వభూమి! తత్త్వంలో నిలిచాక నాకు 'పరిపశ్యంతి ధీరాః' అనే సహాయం ఉంది. 'అభీః' అనే మంత్రంతో మైత్రి ఉంది. ఎలాంటి ద్వేషంకానీ, అసూయకానీ లేదు. అయితే మాయాజాలానికి మాత్రం భయం అక్కరలేదు. 'సర్వార్పణం' అంటే ఏమిటి ?

ఆ 'సర్వం' అంటే ఏమిటి ? నిజానికి ఆధ్యాత్మానుభవికి 'సర్వం' ఏది ? దాంట్లోని సత్యం ఏది ? సత్యసర్వాల సూత్రాలేమిటి? ఈ మూడు తెలుసుకోవడం అవసరం కాదా? నోటితోనే 'సర్వార్పణ' అని చెప్పనా ? లేక, అందరూ ఒకేసారి పడిపోదామా ? సర్వార్పణ? ఇంకా గట్టిగా 'మనసా' అని కూర్చున్నవేళ ఆ మనస్సు నిద్రించి నోరు తెరచిన వేళ



ఓవేలు దూర్చి చూడాలి. అందుకే చెబుతున్నా. దేని ద్వారానూ సర్వార్పణ సాధ్యం కాదు. సర్వార్పణం చేసే వాళ్ళం మేం కావడంవల్ల దీనికి సంబంధించిన సర్వాన్ని గురించి మాత్రమే విశ్లేస్తున్నాం.

'సర్వం' అంటే ప్రకృతి సర్వం. పరమాత్మ. మనం చెప్పే సర్వార్పణకు సంబంధించింది ప్రకృతి సర్వం–దాంట్లో ఉండేది సత్యం–ఆత్మ ! పాంచభౌతికమైన ప్రకృతి సర్వం! ఈ స్థూల దేహం! దాంట్లో ఉండేది. ఆత్మ ! పాంచభౌతిక ప్రకృతి. దాంట్లో ఉండే సత్యం! మధ్యలో సూత్రం ఎవరు ?ఇంతసేపూ దీన్ని గురించే చెబుతున్నా. ఇప్పటికీ దేహధారిగా అడిగేవేళ 'వాయుమహాన్' సూత్రం ఔను ! యాజ్ఞవల్క్యుడు మొదలైన మునుల మాటల్లో, జనకుల దివ్యాదర్శంలో, అతన్నే 'సూత్రాత్మ' అని అన్నారు. ఎవరు వదలబోతే నడుస్తుంది ? అన్నపుడు ఆసూత్రంతో ఈ ప్రకృతి అర్పణ జరగాలి. సూత్రార్పణ, ఆత్మదర్శనం, ఆనందానుభవం; ఇది ముగిస్తే సర్వార్పణం ! ఇది సర్వోత్తమునికి ! 'సర్వ' అంటే ఈ మూడింటి శక్తి – అంటే సర్వార్పణశక్తి, సర్వార్పణ బుద్ధి, సర్వార్పణ చైతన్యం – ఇవి లేకుంటే – అది సర్వార్పణం కానే కాదు. అది కేవలం అయితే అసాధ్యం. కదాచిత్తు అయితే మనస్సు అనే ఇంద్రియాన్ని అర్పించడం. కాయానికి కైవల్యం, కల్పానికి కైవల్యం, జీవునికి కైవల్యం – ఇస్తేనే ఔతుంది. కాయకల్పాల ఉద్ధారానికి 'ప్రణవోధనుః' మార్గం. అపుడు జీవునికి అశనం. 'అశనగతః ప్రాణః" జీవుడు పరిపుష్టుడై జీవాత్మ సంయోగం సాధ్యం. ఇదే సర్వార్పణ మార్గం. వజ్రములా స్తంభీభూతమైన భౌతికశరీరమున, బ్రహ్మ విద్యారతుడై వాయుమథనమున నిమగ్నమైయుండ కఫముల చిక్కులు విడదీసి శుక్లమును పొందగా ఆ శుక్లము చిచ్ఛక్తితో భస్మమై, పుటము పెట్టబడిన ఓజమగును. ఆ ఓజస్సు ఓతప్రోతమై తేజస్సుగా మారు – ఆ దివ్యతేజస్సే చైతన్యమున చేరు ! అదే వీర్యము

అని చెప్పదలచాను. ఇది దర్శన కావ్యం ! దీనికై వెదకాలి. అనుభవజ్ఞుడైన గురువు సాధనలో మార్గదర్శనం చేస్తుంటే ఆ అనుభవమే కావ్యమై వెలువడితే ఆశ్చర్యమేమి ? ఈ వీర్యాన్ని సంపాదించాలనే ఉపనిషత్తు చెబుతుంది. 'సహవీర్యం కరవావహై' ఇది సర్వార్పణం !

ఇక మూలభూత విద్య గురించి ఆలోచిద్దాం. భవ్యపూర్ణత్వపు సత్యం గురించి ఇలా ఇంతదాకా విశ్లేషించుకుంటూ ఈ నిర్ణయానికి వచ్చాం. ఈ విషయంలో 'అప్రమత్తేన వేద్ధవ్యం' అనేది అవసరం. i.e. Being ever alert to understand the eternal beauty of the original way to attain Bhavya Purnathva, is very impartant. By this it is ever concluded that it is only Jiva Vidya for which Viswa manaviyatha should surrender, should be friend should be one with that which leads to thou art that maketh to have Sarvathama (Sarvothama) Darshana ! అందుకే శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన క్రింది వాక్యాన్ని అనుభవజ్ఞులంతా ప్రశంసించారు.

**తపస్విభ్యోఽ ధికో యోగీ జ్ఞానిభ్యో పిమతోధికః**
**కర్మిభ్యశ్చాధికోయోగీ తస్మాద్యోగీ భవార్జున.**

ఇక్కడ ఈ ముగ్గురూ వేర్వేరు కాదు. ఆయోగం కోసం ఆ విద్యకోసం తపించడం అంటే శోధించడం. అతడే తపస్వి! అక్కడితో ఆగకుండా ముందుకు వెళ్ళాలి. అంటే విజ్ఞాన సమయంలో ప్రజ్ఞ లభిస్తుంది. అక్కడ కూడా ఆగకుండా క్రియాత్మకుడై ముందుకు సాగాలి. ఎక్కడా ఆగకుండా జీవాత్మ సంయోగం పొందే యోగివి కమ్ము ! వాడే అధికుడు అంటాడు. యోగంలోనే అధిదైవత్వాన్ని గ్రహించి, అంతటిని అతనికే అర్పించి, అతని ప్రేమకు పాత్రుడైనవాడే నిజమైన భక్తుడు. అతడు అందరికంటె అధికుడు!



ఈ అమృత విద్యను, యోగవిద్యను శతాబ్దాల నుండి సరిగ్గా అర్థం చేసుకోలేక 'ప్రాణాయామ' శబ్దాన్ని గ్రంథాల్లో చదివి, దాన్ని వాయుబంధన క్రియగా భావించి ఏమేమో చేయాలని చూశారు. No any ancient authority or practical experience supports for this wrong sense of adopting the method of inhaling and exhaling through nostrils and claiming it to be as pranayama. As mere literature with experience or not even proper understanding or ancient scripts, advanced; this has been interpreted. So, I here by pray and confirm the necessity of a practical Master who can give 'Brahmopadesha'.

అందుకే ఈ యోగవిద్యకు చాలా మహత్వం! పుస్తకాల్లోని వాక్యాలతో, జీవహింసతో కూడిన ప్రాణాయామంతో ఇది నడవదు. దీనికి గురువు కావాలి. నోటితో ఉపదేశిస్తే కుదరదు. సర్వద్వారాలు మూసుకున్నవేళ, ఆ ప్రాణశక్తిని జాగృతం చేస్తాడు. అదే ఉపదేశం ! నిజమైన మార్గం లభిస్తుంది. దాన్నే కొనసాగించాలి. రోగాలు, రాగాలు అన్ని నశిస్తాయి. సమరస జీవనం, సాంగత్యం, సంప్రాప్తిస్తుంది.

ఆ దివ్యవిద్యను ఆశ్రయించి మనిషి భౌతిక, ఆధ్యాత్మిక రంగాల్లో పరిపూర్ణతను పొందనీ ! మీ అందరి ప్రేమవల్ల, విశ్వ తత్త్వాభిలాషుల ఆశీర్వాదంతో, మా గురువు ప్రభు అచ్యుతుల కృప – ఇవన్నీ కలగలసి, నాతో చెప్పించాయి. ఆ యోగదర్పణంలో కన్పించేది జీవన సౌందర్యం!అదే విశ్వానందం ! విశ్వమనే ప్రమిదలో జీవన దీపాలు వెలుగుతున్నాయి. ఆత్మప్రకాశంలో పరమాత్మ ! నీ కర్పితం ! స్వీకరించి తృప్తుడవు కమ్మని అంటాను ఓ దేవ దేవా ! సర్వార్పణమస్తు.

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# 11.వేదాంత సిద్ధాంతం

**జిజ్ఞాసువులారా !**

ఈరోజు practical philosophy గురించి ఉపన్యసించాలని నన్ను అడుగుతున్నారు. ఇది వరకు దాదాపు ఓ గంటసేపు ఒక చిన్న అభినందనసభ (Appreciating Confrence) జరిపారు. Practical Philosophy అంటే ఇదే ! మీ కార్యదర్శిగారు నా ఉపన్యాసాల పునః సమీక్షనే గావించారు. వారి ఉద్దేశమేమంటే – విజయాంధ్రుల ప్రతి ఒక్క వాక్యము ప్రశస్తి పత్రం సమర్పించటమే! దీనికన్నా ఒక అడుగు ముందుకు వేసి, అధ్యక్షులు తన పాండిత్య పూర్ణ శైలిలో ఒకానొకప్పుడు ఉపాధ్యాయుడుగా ఉండడాన్ని జ్ఞాపకం చేసుకుని "ఈరోజు నేను చూస్తున్నది అప్పటి బాల్యపు విజయాంధ్రులను కాదు. వీరు ప్రపంచానికే గురువు అయ్యేందుకు యోగ్యులు" అని చెప్పారు. ఇదంతావాళ్ళ శుభాకాంక్ష ! తత్త్వాశయాల అభిలాష! నేను చెప్పేదింతే – ఇది appreciate conference. ఇదొక్కటే ఆశయమై ఉంటే – యౌవనంలో వివిధ కార్య క్షేత్రాలు నన్ను పిలిచేవి. ప్రజలు వినకుండా ఉండవచ్చు. తప్పనిసరిగా చేయాలన్న విజ్ఞప్తులు కూడా వచ్చాయి. అయితే వాటిని అంగీకరించలేదు. బాల్యం నుండి వెలుగును చూడాలనే కోరిక బలంగా ఉంది. ఏదో ఒక రంగంలో, ఏదో ఒక ప్రశస్తిని ఆశించి, కొంచెం చమత్కారంతో సేవలోకి దుమకడం వద్దని అనిపించింది. అంతరంగంలో అంతుచూడాలి. అది నా అర్థానికి కైవల్యం కావాలి. దాని మూలంగా కాల, కర్మ సంయోగం నిజంగా కోరుకుంటే సేవ తప్పకుండా జరగాల్సిందే ఈ విషయంలో.



స్థూలమైన ఉపకరణాల సహాయం నన్ను సమర్థుడిగా, తృప్తుడిగా గావించడం కుదరదని నాకు తెలిసి పోయింది. అందుకే ఇప్పటికి పెద్దవాడను కాని నేను, బాల్యం నుండి ప్రత్యక్ష తత్త్వసాధనకై నిరంతర ప్రయత్నం గావిస్తూ వచ్చాను. నాకు చిన్న వయస్సులోనే ప్రత్యక్ష సిద్ధపురుషుల, కారణజన్ముల, గురువుల స్నేహం, సేవాభాగ్యం, అదృష్టంకొద్దీ లభించాయి. గురువైన అచ్యుతుల కృపకొద్దీ ప్రత్యక్ష సిద్ధాంత సాధకుడనయ్యాను.

దీని ద్వారా జరిగే నా సేవలన్నీ ''స్వామి సేవలు''గానే మిగిలిపోతాయి. ఇదంతా ఎందుకు చెప్పాల్సివచ్చింది ? మీరు ఇంతదాకా ఏర్పాటుచేసిన appreciating conference కు ఇది నా జవాబు. In one way how practical philsophy is Experienced or is being digested in one's own way that how it must be of human cause. అంటే ప్రత్యక్ష వేదాంతాన్ని అలవరచుకునే మార్గాన్ని ప్రదర్శిస్తున్నా. ప్రగతి సాధించాలని కోరుతున్నా, పరమాత్మ కరుణించనీ! అలాగే విశ్వమానవ బంధువుల లక్ష్యాలు ఆధ్యాత్మికోన్ముఖంగా సాగనీ ! ప్రత్యక్ష సాధనలో నిమగ్నం కానీ !

ఈరోజో, రేపో, పాశ్చాత్యులు భారతదేశం నుండి ఆశించేది – ప్రేమించేది మన 'ఆధ్యాత్మిక సంస్కృతినే'. ఇది పాతకాలం నాటిది అని అంటున్నాం. ఇప్పటి మనుషులు మానవకర్తవ్యాల నుండే విముఖులు ఔతున్నారు. ఇక వీళ్ళకు తత్త్వ జీవనాసక్తి కల్గడం సాధ్యమా? అలాకారాదు. కేవలం సంస్కృతి గురించిన ఆలోచనలు ఉంటే చాలదు. ప్రత్యక్ష సాధన కావాలి.

When he individually becomes practical philosopher, he can enlighten others by putting them in practical

path. Then only the development of every field with contentment gets fruits. I want to put the direct practice of Jiva Vidya only as the practical philosophy. Accepting the sadhana and the result with Jignasa Buddhi is the theory of philosophy, Expecting the result by mere imaginary Vague thoughts, shapes, acts, which are neither supported by the ancient Rishies foundation nor proved as the true Sadhana for realisation and claiming it as philosophy is foolishness.

వేదాంత సిద్ధాంతాలు మన నిత్యజీవితంలో ఆచరణ ద్వారా, అనుభవంలోకి రావాలి. ఇలా కాకుంటే – ఏదీ మనకు సరిపోదు. ఉదాహరణకు, మనదేహంలో బాహ్యచక్షువులే మనకు కనిపించవు. వాటిని చూడాలంటే అద్దం కావాలి. మన తల మనకు కన్పించదు. అక్కడ గాయమైనా, లేక చిన్న కురుపు లేచినా స్పర్శతో తెలుసుకుంటాం. వేరేవాళ్ళ సాయంతో దానికి చికిత్స జరపాల్సి ఉంటుంది. మనదేహాన్నే మన స్థూలమైన ఇంద్రియాలు, మనస్సు – ఇవి పూర్తిగా తెలుసుకోలేక పోతున్నాయి. అలాంటప్పుడు ఈ విశాల సృష్టిలో ఎన్నో శక్తులు అవ్యక్తంగా ఉన్నాయి. వాటినన్నింటిని గ్రహించాలంటే – మనకు జ్ఞానచక్షువులు అవసరం. ఆ జ్ఞానచక్షువులతోనే అన్నిటినీ తెలుసుకోగల్గుతాం. ఈ నేత్రం తెరచుకోవాలంటే నిత్యజీవితంలో ప్రత్యక్ష తత్త్వ సాధనను ఆచరణలో తీసుకురావాలి.

వేదాంతం, సిద్ధాంతాలు ఈ రెండూ వేర్వేరు కాదు. అయితేనేం? అరకొర జ్ఞానంతో తమను వేదాంతులమని చెప్పుకునే వాళ్ళు 'ఓ! ఎవరు? మీరు సిద్ధాంతులా ? అయితే వేదాంతులు కారన్నమాట! అని అంటారు.



ఈ మాటలకు మనం నవ్వుతాం. లోలోపల మథనపడాలి. వీళ్ళకు ఈ రెండింటి గురించి తెలియదు.

Siddhantha is not only the decissions that any body ditermines by any force. Siddhantha is that which is in its own original force with Anantha.

తనలోనే అనంతాన్ని గర్భీకరించుకున్న సిద్ధాంత దేవుడు. ఇది ఆ రకమైన సిద్ధాంతం. నీవు కనుక్కున్నాక అది నీకు ఖచ్చితంగా లభిస్తుంది. సహజంగా, తనకు తానుగా నిలిచేస్థితే శాంతి ! ధ్వనిలో కూడ ఇది ఆ స్థాయినే అందుకుని నిలిచింది. అది సిద్ధాంతం. నీవు దీన్ని అలవరచుకుని, దాంట్లో సుఖించాక,ఆ సిద్ధాంతాన్ని నీవు దర్శించినట్లే. ఇలా ఎన్నైనా చెప్పవచ్చు. ఆ సిద్ధాంతంలో ఎలాంటి మార్పులు, చేర్పులూ చేయనవసరం లేదు.

'వేదాంతం' 'వేదం' ఇది సిద్ధాంతం. వేదం అంటే ఏమిటి? పుస్తకంలోని నాల్గు మంత్రాలా ? 'వేదాన్ని' విడమరచి చెబితే– ఆత్యంతిక గమ్యస్థానం ! వేద్యమైనది వేదం ! వేద్యమయ్యే విద్య వేదవిద్య. దేన్ని వేద్యం చేసుకోవాలో అది వేద్యమయినందువల్ల అది 'నిత్య' మనిపించుకుంది. వేదాంతం అంటే ఆ వేద్యమైన వేద విద్యలో చివరిస్థితి. అది వేదాంతం. వాడుక భాషలో దాన్ని 'ఉపనిషత్తు' అంటారు. విద్య యొక్క చిట్టచివరి భాగాన్ని, ఆధ్యాత్మిక గమ్యస్థానాన్ని సమీపించడం, సమీపంలో వసించి, విరమించడం – మొదలైన వాక్యాలు చెప్పవచ్చు. ఆ సమీపించే స్థితియే స్వయం సిద్ధాంతం.

సిద్ధాంతానికి అంటని సూత్రం ఒకటి ! సూత్రానికి అంటని సిద్ధి ఒకటి ! ఇలా సిద్ధాంత వేదాంతాలు వేర్వేరని అర్థం కాదు. They, as it is the result in Adhyatmika to be attained by practical philosophy.

ఏదైనా ఒక విషయం పరిశీలనలో ప్రత్యక్షంగా తెలియకపోతే! మన హృదయానికి నాటుకోకపోతే – అది రాద్ధాంతమని అనిపించదా? దానికి జిజ్ఞాసువులో ఉండే చికిత్సా బుద్ధికూడ సహకరించాలి. లెక్కలు రాని ఓ పిల్లవాడు 'గణితశాస్త్రం' అవసరమా ? దాంట్లో ఎలాంటి అర్థం లేదు అన్నంతమాత్రాన మెచ్చుకోవాలి. అది అతని అమాయకత్వం !

'తత్త్వం' అనేది అవ్యక్తంగానే నిండినదే అయితే, ప్రత్యక్షంగా దాన్ని ఆచరణలో పెడుతూ సాగాలి. దాంట్లోని మన జీవనజ్యోతిని దర్శించాలి. ఆత్మ, జీవుడు, భక్తి –ఇవన్నీ నిజంగా ఉన్నాయి. ఈ అంశాన్ని గ్రహించి అనుభవించాలి. ఆ రకమైన అంశాల్ని మన ప్రవర్తనగా మార్చుకోవాలి.

ఏదేని ఒక సత్యం ప్రత్యక్షానుభవానికి రాకుంటే – ఆ అంశం, దానికోసం ఏర్పడ్డ తర్కం, కుతర్కంగా మిగిలిపోతుంది. మనం జ్ఞానాన్నే విస్మరించాం. ఇది తాత్వికభాష. దీనికే పరిమితమై, దీన్నే స్థాపించబూనితే ఆధ్యాత్మిక జీవనపు ప్రత్యక్షత్వం లోనూ ఈ దోషాన్నే వెదకబోతే – అది నిజంగా అస్తవ్యస్తతే ఔతుంది. మనుష్యత్వంలో జీవించి ఉండే స్త్రీ పురుషులు ఇద్దరూ, వారి వారి మనోభావాల కనుగుణంగా అధికారులు, అనధికారులు ఔతుంటారు. అలాంటి ప్రత్యక్ష జీవనం లేని తత్త్వం విరుద్ధ దాంపత్యంతో సత్సంతానం లభించదు. ప్రపంచ సాగరంలో సాగర నౌక సరళంగా, సాఫీగా సాగడానికి స్త్రీ పురుషులు ఇద్దరూ అవసరం.



ఏమో ఇదంతా కాలగతి అనే ఒక ధ్వని విన్పిస్తుంది. అది అర్థం లేని మాట ! ఏ కాలంలో నైనా, కాలాన్ని, అప్పటి ప్రజల కర్మ, ప్రవృత్తియు, ప్రాబల్యం అనుగుణంగా చూస్తూ వచ్చా.

కాలానికి స్వాతంత్ర్యం లేదని కాదు. అలాంటప్పుడు కాల, కర్మల సామరస్యం కారణం అంటాను. శుద్ధంగా పనిచేసే వాడికి సూర్యుని నడక జడ పదార్థం అని అనిపించదు. ఇదే అంశం సోమరి పోతుకు ప్రొద్దు నెత్తిమీదికి వచ్చినట్లు అనిపిస్తుంది. అంటే ఏమిటి? మనం పొందే కర్తవ్యమిలనం వల్ల కాలం విభిన్నంగా కన్పిస్తుంది. కర్మ బద్ధత, కర్మాసక్తులున్న వ్యక్తికి కాలానంద, కాలప్రేమ, కాలస్నేహం, చివరకు కాలస్వామ్యం కూడా సంభవిస్తుంది. మరి కాలాన్ని ఎందుకు నిందించడం? కాలం సహకరిస్తుంది. వీడు చేసిన కర్మకు, కర్మ భ్రష్టులైన వారికి మోక్షం లభించదు. సోమరిపోతుపై కన్నతల్లి కూడ ప్రేమను ప్రదర్శించదు. చూపించరాదు. మరి అలాంటపుడు పరమాత్మ ప్రసన్నుడైతే లభించే మోక్షం ఎలా సాధ్యం ? కాలాన్ని నిందించడంలో అర్థం లేదు. మనదేశానికి ఈ దుఃస్థితి వచ్చిందంటే, వేదాంతం పేరు చెప్పి మనం అనుసరించిన కర్మ భ్రష్టతే మూలకారణం. ఆధ్యాత్మికంగా మనకు మంచి జరగాలంటే వేరే రకంగా ఇది జరగనే జరగదు. తనలోనే జరగాలి. ఈ విషయంలో అంతర్ విజ్ఞానమునకు సంబంధించిన శాస్త్రమే శరణ్యం. మనకు తెలిసే స్థాయికి ఆ సొత్తును స్వాధీనం చేసుకోవడానికి పెద్దవాళ్ళను ఆశ్రయించాల్సిందే !

నీవు ఏమై ఉన్నావో అందులో అంతా ఉంది. 'నీవేమై ఉన్నావో' అనేదే ఒక సమస్య. అక్కడి దాకా వెళ్ళి తెలుసుకో గల్గేంతదాకా –

ఉండేదంతా నీవే అయి ఉన్నావు. ఇది అర్థం అయిందా ? తత్త్వభాష ఇదే నాయనా ! సరే ! దీన్ని విడమరిస్తే – సృష్టిలో వివిధ రసాలు, గంధాలు, ధాతువులు, శక్తి, తేజస్సు మొదలైన గుణాలు, గుణరూపాలు కలిసిన పంచభూత సూత్రం – అంతా నీలో ఉంది. ఇవన్నీ మనస్సనే మహారాజుగారి వివిధ రూపాల వల్ల తారుమారై పోతాయి ! కొంచెం క్రిందకి రండి. ఆ 'నీవు' అనే దాంట్లో ఇవన్నీ చేరాయి. వీటన్నింటికీ మూలచైతన్యం – జీవుడు. నీవు ఏమై ఉన్నావో, ఆ ఉన్నావో అనే స్థితినే 'ఆత్మ' అంటాం. అర్థమౌతోంది కదూ ? ఆ ఆత్మలో అంతా దాగి ఉంది. అనుభవించాలంటే మాత్రం ఇక్కడెక్కడో 'సూత్రం' అన్నాం కదా ! అదే సాధన ! తనకు తానుగా ప్రత్యక్ష ఆధ్యాత్మిక జీవనం సాధ్యమౌతుంది. ఇలాంటి వ్యష్టి, సమిష్టికావాలి. బుద్ధుడు కూడా "సంఘం శరణం గచ్ఛామి" 'ధర్మం శరణం గచ్ఛామి' అని అన్నాడట.

ఇక్కడ కొంచెం కఠినంగా మాట్లాడతా. సమాజంలోని సన్యాసులకు, మఠాధ్యక్షులకు ఆధ్యాత్మిక తత్త్వ రహస్యం ఎందుకు అర్థం కాలేదు ? వాళ్ళంతా తత్త్వం తెలుసుకుని సమాజాన్ని ముందుకు నడిపించాల్సిన వాళ్ళు కదా ! సమాజానికి వారికి ఇక వేరే సంబంధం ఏదుంది ? గట్టిగా ప్రశ్నిద్దాం. తత్త్వవాక్యాల వల్ల వాళ్ళకు ఆత్మ కళ్యాణం ఏమాత్రం జరిగింది? సమాజానికి వాళ్ళు ఏమి అందిస్తున్నారు. ఎంతో మంది జిజ్ఞాసువులు ప్రశ్నించి ఉండవచ్చు? దీనికి జవాబు ఏమిటి ? 'చెప్పింది చేయ్'. సమాజానికి లభించింది వాళ్ళ కోపం, అధికార, అనధికారం మొదలైన అహంకారం లేదా నిందా వాక్యాల వర్షం. మాటల్ని మళ్ళీ మళ్ళీ చెప్పడం. అవి మంత్రాలు. మళ్ళీ 'నేను చెప్పిందిచేయి' దీంతో ఊరుకుంటాడా?



అనుభవం కావాలంటాడు. "నీవు చేసేదేమిటి ? నీ అనుభవం ఏమిటి అని అననా ?

ఇలా కాకుండా ప్రవక్త శుద్ధ సాధకుడైతే – శిష్యుని సందేహాన్ని గ్రహించి సరైన మార్గాన్ని చూపిస్తాడు. ఆధ్యాత్మిక జీవనం, సూత్రాలు ఇవన్నీ స్వయంగా ప్రకాశించేవి. అయితే మనం వీటికి దూరంగా వెళ్ళుతున్నాం. విద్యుద్దీపపు ప్రకాశం వెలుగులోకి వచ్చిన వానికి తెలుస్తుంది. చీకటి గదిలో కూర్చుని 'దీపంరా దీపంరా' అని అరుస్తూ 'కన్పించడం లేదు! కన్పించడం లేదు' అంటే ఏమైనా ఔతుందా ?

ఉపన్యాసాల ద్వారానే కాకుండా ప్రత్యేకంగా ప్రత్యక్ష సాధన గురించి ఎన్నో అంశాలు తెలుసుకున్నారు. అయినా, Repetition of truth is not mere repition of words, but confirming the truth in you! మొదట మనలో ఉందనీ, దాని వల్లనే మనకు ఆహారం అని ఏదైతే తెలిసిందో దాన్ని అంగీకరించకుంటే ఇక ముందు ఏమీ తెలియదు. ప్రత్యక్ష జీవనం కదూ ! జీవం ఉంది కదూ ? అంటే సజీవంగా ఉన్నాం కదూ ? బ్రతుకుకు ఆధారం ఏది ? దాన్నే 'సూత్రాత్మ' అని అన్నారు. ఇది యాజ్ఞవల్క్యుడు మొదలైన మహర్షులమాట ! ఆదర్శమూర్తి జనకమహారాజుగారి మాట ! ఉన్న సిద్ధాంతాన్ని చూసి, పలికిన సత్యం.

దేహరచన కోసం పంచభూతాల కలయిక జరిగేది ఆ వాయువు ద్వారా ! ఆ intermediary చైతన్యం ద్వారా. దాన్నే 'నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి' అని అన్నారు.

ఆధ్యాత్మిక జీవితపు సాక్షాత్కారానికి జన్మసంస్కారం, ఆలోచనా శక్తి, Implicit obdience ఇవి కారణాలు. జన్మసంస్కారాల విషయంలో

చాలా మందికి భిన్నమైన అభిప్రాయాలున్నాయి. దీనికి ఉదాహరణంగా పెద్దవాళ్ళ పేర్లను చెబుతారు. సృష్టిలో మూడు రకాల జీవులున్నారు. ముక్తికి యోగ్యులు. సాత్విక, రాజసిక, తామసిక గుణ ప్రాధాన్యం కల్గిన జీవులు. అందుకని ఇలా దీనివల్ల ఎవరూ నిరాశ పడనవసరం లేదు. ఒక సాధారణ వ్యక్తిలో – మనిషిలో – ఏదో ఒక గుణం మాత్రమే ఉండడం సాధ్యం కాదు. అన్నంత మాత్రాన తమోగుణ ప్రధాన వ్యక్తికి లేదా రజోగుణ ప్రధాన వ్యక్తికి ఆధ్యాత్మిక జీవనపు అధికారమే లేదని అర్థంకాదు. ఆలోచనాశక్తిని సత్సాంగత్యంతో పెంచుకుని, గుణాల సామరస్యాన్ని సంపాదించి, ముందుకు వెళ్ళడం సాధ్యం ఔతుంది. ఇక్కడ కృష్ణపరమాత్ముని గీతావాక్కు మనకు ధైర్యాన్ని అందిస్తుంది.

**"ప్రయత్నా ద్యతమానస్తు యోగీసంశుద్ధకిల్బిషః**
**అనేకజన్మ సంసిద్ధ: స్తతోయాతి పరాంగతిమ్"**

ప్రయత్నపూర్వకంగ యోగవిద్యలో సాగే వ్యక్తికి పాపాలు నశించి, అనేక జన్మల సంసిద్ధితో పరమగతిని పొందుతాడు. ప్రయత్నం ముఖ్యమన్నాక Implicit obedience ఆవశ్యకతను మనం తప్పక గ్రహించాలి. ఎందుకంటే జీవవిద్యలో సాగేవేళ – అది ఆ ప్రాణచైతన్యం తన నిజమార్గాన్ని శుద్ధీకరించుకునే వేళ – అంతకు ముందు నిండిపోయిన వాత, పిత్త శ్లేష్మాదుల వికారం వల్ల పుట్టి సుప్తంగా ఉండే స్థూల రోగాలు, మనోచాపల్యం వల్ల కల్గిన రాగాది మనోరోగాలు ప్రారంభ స్థితిలో కొంచెం విజృంభించడం సహజమే ! వాయు, అనిలాల మథనపు చిత్ప్రభలో స్థూలదేహం పుటం పెట్టబడి, శుద్ధమౌతుంది. అపుడు అమృతత్వ ప్రాప్తి కల్గుతుంది ! శాశ్వత శాంతి కల్గుతుంది ! ఆ లక్ష్యం నెరవేరే దాకా సాధకుడు తన సాధనను నిలుపకుండా సాగితేనే దాని ఫలం లభిస్తుంది!



అలా కాకుండా మధ్యలో కలిగే ప్రకృతి విజృంభణలకు భయపడి విముఖుడు అయితే, వేదాంత రాద్ధాంతమే ! అందుకే సాధకునికి Implicit obedience చాలా అవసరం అని చెప్పడం జరిగింది.

ఇదే యోగవిద్య. ఇది ప్రత్యక్ష జీవవిద్య. ఇది ఉపదేశింప బడాలి. ఇది చేయాల్సిందే! చెప్పడానికి రాదు. ప్రాణ చైతన్యాన్ని జాగృతం చేసి, లోపలి మార్గంలో గురువు ఊర్ధ్వగామిగా మారుస్తాడు. అనుభవం లేనివాళ్ళు – నిజమైన సాధన అంటే ఏమిటో తెలియని వ్యక్తులు, తాము మాత్రమే పాడై పోకుండా, చేయకూడని దాన్ని చేయబోయే రీతిలో, ముక్కు మొదలైన మార్గాల్ని చెప్పి ఉండవచ్చు. దాంట్లో ఏం చేయాలి ? ఏమైనా చేస్తే అది ప్రాణి హింస ఔతుంది. ఈ నిజమైన జీవవిద్యలో అపాయం ఉంది అని ఎవరైనా అంటే వారికి 'శాపం' ఉంది!

మనిషిలాంటి చిన్నప్రాణికి అపాయం కల్గించేందుకు ఆ "వాయుః సర్వత్రగోమహాన్" అవసరమా ? అది అతనిని నిరంతరం రక్షించే చైతన్యం. ఏసుప్రభువు చెప్పినట్లుగా "అది అతడు నిద్రపోయిన వేళ అతనిని రక్షిస్తుంది. నడిచే వేళ నడిపిస్తుంది" దీనివల్ల కల్గే ఫలాన్ని గురించి మహాత్ములు ఎంతో గొప్పగా వర్ణించారు. ఎంత చెప్పి ముగించాలి ? ఒక మంత్రం–

**ప్రథమం కాయశుద్ధ్యర్థం ద్వితీయం ధర్మసాధనం**
**తృతీయం మోక్షమాప్నోతి ఏవం తీర్థం త్రిధాపిబేత్.**

శంఖంలో ఉంటేనే తీర్థం. ఈ మంత్రాన్ని ఏం చేద్దాం ? ఇది అనుభవజ్ఞుల వాక్యం. సాధకులకు అర్థమయ్యే మాట! ఆ ప్రాణచైతన్యం ఊర్ధ్వగామి అయినపుడు అన్ని వైపుల జారే జల ప్రవాహాన్ని తాగాలి. దీని వల్ల దేహశుద్ధి మొదలౌతుంది. 'ప్రథమం కాయశుద్ధ్యర్థం' అన్నారు.

మొదటగా ప్రారంభించిన వేళ కల్గిన అనుభవం ఏమిటని శిష్యుడు వెళ్ళి అడిగినాక అనుభవజ్ఞులు అందించిన సమాధానం. ఊర్ధ్వ స్థానాల్ని స్పర్శించి వచ్చేవేళ – దాని రుచుల గురించి వచ్చి చెప్పాడు. "ఔను. ధారణశక్తి పొందుతున్నది. "ద్వితీయం ధర్మసాధనం" అన్నారు. చివరిగా అమృత పానం లభించాక "తృతీయం మోక్షమాప్నోతి". ఇది మోక్షప్రాప్తిని అందిస్తుంది. దీన్ని నిరంతరం పానం చేస్తూండు అనే అర్థంతోనే "ఏవం తీర్థం త్రిథాపిబేత్" అన్నారు. ఇది మోక్ష విద్య అన్నారు. ఇది మోక్ష విద్యా ఫలం !

తత్త్వం, ధర్మం ఒకటే అని ! బాహ్యశరీరంలో వైవిధ్యం కన్పించినా, ఆంతరిక శరీరమైన తత్త్వధర్మం, దేశం, కాలం, భాష వీటికి అతీతమైనదని గ్రహించిన విశాలమతులు బైబిల్‌లో కూడా దీన్నే చూడవచ్చు. చూడండి. "నీ దేహాన్ని చాలా జాగ్రత్తగా రక్షించుకో. దాంట్లో నుంచే జీవధారలు వెలువడుతాయి. సొంత కోనేరు, సొంత బావిలో ఊరే నీటిని మాత్రమే త్రాగు"

"వివేకవంతునికి జీవుని మార్గం పైపైకి వెళ్ళుతుంది. ఏసుని వాక్యం! అదే మాట మన తత్త్వవేత్తల మాటల్లో 'ప్రాణం ఊర్ధ్వంలో (బ్రహ్మరంధ్రం) నిలవాలి" అని చెప్పబడింది. చివరిగా, ఎన్ని జన్మలు అంతరించి ఉండాలి. ఎన్ని పొరలి పోయాయి ! వీటిని గమనించి జిజ్ఞాసువు మొరపెట్టు కుంటాడు. ఆధ్యాత్మికతను ప్రత్యక్ష జీవనంలో అలవరచుకోవాలని ! ఇతని కోరికే అందరి కోరిక కానీ !



**My "What All" speaks to you all as such : Oh ! My Lord ! Countless rounds I rolled & rolled Endless due is the deed of the gift ! Why the interval of repetition for waste ? Keep me up in science of yoga And allow me to do and do of my portion Suffice Sweetness and greatness stand as need always! Let the need be fed in deed!**

ఇది వర్షం. తన కల్యాణాన్ని ఆధ్యాత్మిక రూపంలో చేసుకుని, సమిష్టి కల్యాణాన్ని చేసే రీతి. అందుకే – శుద్ధ జిజ్ఞాసువులు అనుమానపరిచే దాన్ని చూడనీ ! 'సంశయాత్మా వినశ్యతి' అనే దోషానికి బలికావడం వద్దు. ప్రత్యక్ష సిద్ధాంత వేదాంతాన్ని అలవరచుకుని భవ్యపూర్ణత్వాన్ని చూడనీ ! మానవ పూర్ణత్వం లభించనీ! పరమాత్మ అందరికీ శుభాన్ని అందించనీ!

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# 12. యోగం మరియు పూర్ణత్వం

**(19.11.1940లో ధర్మస్థలంలో జరిగిన సర్వధర్మ సమ్మేళనంలో ఇచ్చిన ఉపన్యాసం).**

ఓం శ్రీ గురుయోగి అచ్యుతాయ నమః ! విశ్వమానవ ధర్మోజ్జ్వలత లభించనీ !

అధ్యక్షులారా ! సోదరసోదరీమణులారా ! ఇది సర్వధర్మ సమ్మేళనం! నా మాటల్లో అందరినీ ధర్మంలో మేళవింపజేసే ఒక కలయిక ! దేవుణ్ణి చూపించగల్గే దారిలో తీసుకుపోయేదే ధర్మం. అదే విశ్వమానవ ధర్మం!

కర్మచ్యుతి కలగనీయకుండా, మానవుని మమకారాన్ని పారద్రోలి, మమతలో రమించేంతటి కర్తవ్య తత్పరతలో సాగించేదే 'కర్మ' !

స్వార్థాన్ని కరిగించి, త్యాగాన్ని అందించి, సత్యమార్గం వైపుకు తీసుకు వెళుతూ సంయమమున్న వాళ్ళుగా మార్చగల్గేది శాస్త్రం !

ఆది నుండి అంతం దాకా ప్రళయంలోనూ తథ్యమనిపించుకునేదే – సత్యం – అదే 'తత్త్వం'.

ఆ తత్త్వోక్తమైన తథ్యాన్ని తెలుసుకోవాలి. సత్యగాములు ఆచరించాలి. దాని సాధనే 'యోగం'.

ఈ రోజు యోగతత్త్వం గురించి మాట్లాడాలని నిర్ణయమైంది కదూ! ఎందరో విద్వాంసులున్నారు. నా వయసు లేతదనమూ ఉంది. ప్రత్యక్ష జీవనమార్గంలో జీవనం సాగించడం వల్లనే నేను ఆ విషయం గురించి మాట్లాడేందుకు ప్రేరేపించబడ్డాను. ఇపుడు నేను స్మరించేదేమంటే–



**"పిల్లవాడనునేను, పిల్లతనంనాలో ఉన్నది లక్ష్యమున్నది పెద్దది ! అడుగు చాలా చిన్నదిరా ! ఆటంకములు రాక, పదవినందు కునేందుకు యత్నించిన భారము తగ్గు ధన్యమీ బ్రతుకు దేవా!" (విశ్వవాణి)**

అందువల్ల విషయం సమర్థింపదగినది. నేను ఆశ్రయించిన మహాయోగ చైతన్యమే ఇదంతా అచ్యుత గురువుల కృపాపరిణామం! మనదేశంలో ఆధ్యాత్మిక జీవితం సత్యమై, సహజమై, అనుకరణలో విఖ్యాతమైనది. నిజం ! అయితే, దృష్టికోణాలు విభిన్నాలై, నిజాంశాల జ్ఞానం స్ఫురించక వేదాంతం చాలా సార్లు రాద్ధాంతమే అయింది.

తొలుత – యోగ్యతత్త్వం వివరణల స్థితికి రాకున్నా, చాలామంది గురువుల ద్వారా తెలుసుకోదగిందిగా ఉంది. అది చాలా రహస్యమయంగా ఉంది. సకలశాస్త్ర సంగ్రహాల్లో ఎన్నో విధాలుగా దీన్ని వర్ణిస్తూ వచ్చినా గీతలో దీనికి 'గుహ్యం గుహ్యం' అనే పేరు ఇవ్వబడింది. శ్రీకృష్ణుడలా వర్ణించాడు.

నాగరికత అనే దుష్టమార్గంలో పయనించే మన మానవజాతికి జ్ఞానం కల్గడమే కఠినం. అందునా యోగసిద్ధులను పొందే సామర్థ్యాన్ని పొందడం కఠినం. ఆ లాలసకు కొంత ఆతురతను జోడించి విచిత్రమైన కార్యాలు చేయడం జరిగింది. అందుకే సాధకుని విమర్శ ఇలా సాగింది.

**"ఊరు తెలియక తిరిగే వారినంతా దారి అడుగుటేల ? వారిని నిందించడం దేనికి ? వాళ్ళ అడ్డదారిలో సాగుటెందులకు ? సారము లేనపుడు అచట నిలుచు టెందులకు? జ్ఞానము కల్గిన ఆక్షణమున అన్నిటినీ**

**విడువక, జ్ఞానహీనతతో అరిషడ్వర్గముల కంటుకుని అనవరతము శోకించుటేల ? (విశ్వవాణి)**

ఇప్పటి ప్రపంచం సత్యవిమర్శలో బాగా వెనుకబడింది. ఆచార్య పురుషుని, యోగపూర్ణుని సంపూర్ణకర్తవ్య తత్పరత చాలా అవసరం. అలాగే యోగమహిమ ఏమిటి? అనే అంశాన్ని మనం అంతా గ్రహించాల్సిన అవసరం ఉంది.

ఆధ్యాత్మికరంగంలో తనను తాను తెలుసుకోవడం చాలా ప్రధానం అని ఇంతదాకా చాటుకుంటూ వచ్చాం. అలా అంటే ఏమిటి ? అది ఏమిటి? ఇవి మాత్రం స్థూలంలో సమస్యలు గానే మిగులుతూ వచ్చాయి.

తనను తాను తెలుసుకునే విధానాన్ని గ్రహిద్దాం. ప్రకృతిలో అంతటా ఏఏ ధాతువులు, రసాలు, పరిణామాలు సృష్టింపబడి, నిండి నిబిడీకృతమై ఉన్నాయో అవన్నీ మనలో ఉన్నాయి. అందుకే విమర్శాత్మక సాధకుడు –

**“స్థూలపులోతే సూక్ష్మం ! జడము యొక్క చైతన్యమే జాగృతి! ఘటములో ఘనము దాగెను ! మూలమును కనుగొని జాగృతుడై ఘటశుద్ధి కల్గినవాడే కదా గహనమైన అవగాహనను పొందును చూడు !” (విశ్వవాణి)** అంటాడు.

అయితే – ఇవన్నీ బాహ్యంగా అధిక ప్రమాణంలో కలసిపోతే, లోపల సూక్ష్మం, మరియు మిగతావన్నీ బయటి నుండి విరుద్ధంగా సంపర్కం చేయబోతే, వ్యంగ్యమయ్యెను. దీనివల్ల వ్యతిరేక పరిణామాలు కల్గెను ! మనలో జలాంశ చైతన్యముండడం వల్లనే, నీరు లోపలికి వెళ్ళుతుంది. మనలో వెలుగుల చైతన్యముండడం వల్లనే – బయటి వెలుగులోని ఉగ్రతను భరించగల్గుతాం. ఇలాగా మిగతా ధాతువర్గాలు.



చాలామంది గాలి, నీరు మారితే ఆరోగ్యం చెడుతుంది. దీనికేం కారణం? లోపలి వస్తువు యొక్క మార్పులకు లొంగదని అర్థం. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమంటే – తనలోని ధాతువుల కలయిక ఎక్కడెక్కడ ఏ విధంగా జరిగింది? ఆ సృష్టికి, ఆ చైతన్యానికి ఉండే సంబంధమేమి ? దానికి, మనకు సంబంధం కల్పించడంఎలా ? సంబంధం ఎంతమటుకు ? ఇది సృష్టి నియమాల సత్యాంశాన్ని గ్రహించే మొదటి విధానం.

అక్కడ ప్రాణుడు, జీవుడు, వాయు చైతన్యం – వీటి నిత్యగతి, దీని ముఖ్య ప్రేమ – దాని యత్నం, దానికి కల్గే ప్రాప్తి. “ఈశ్వరః సర్వభూతానాం” అనే అంశానికి సంబంధించిన పూర్ణజ్ఞానం. ఇదంతా జరగాలంటే – యోగమే కావాలి. యోగసాధన లేకుంటే తనను తాను తెలుసుకున్నట్లు కాజాలదు.

ఆయోగమే మొదటి నుండి వేదంలో,ఉపనిషత్తులో, బ్రహ్మసూత్రంలో అన్ని చోట్లా ఉపదేశింపబడింది. శ్రీకృష్ణభగవానుడు గీతలో ఆ యోగానికి చాలా ప్రాధాన్యమందించి, అదే ఆత్మజ్ఞానసాధనమనీ, మోక్షసాధనమనీ అన్నాడు. ఆ ప్రాణయోగం – వాయుయోగం గురించి అంత గొప్పగా చెప్పి ఉన్నాడు.

ఆ ప్రాణయోగమే ప్రకృతిని చదివింపజేసి, తన స్వరూపాన్ని విశదీకరించి, ఆత్మజ్ఞానమందించి, పరమాత్మ దర్శనప్రాప్తికి దోహదం చేస్తుంది. ‘యోగ’ అంటేనే రకరకాల యోగాలు మనకు స్ఫురిస్తాయి. భక్తియోగం, కర్మయోగం, రాజయోగం, జ్ఞానయోగం, పూర్ణయోగం లాంటి అనేకపదాలు నూతనంగా స్ఫురిస్తాయి. అయితే ఇవేవీ యోగసాధనలు కావు. ‘యోగం’ ఒక్కటే సాధన. కాలానుగుణంగా వివిధరకాల పేర్లు

ప్రచారంలోకి వచ్చాయి. యోగంలో భక్తి ఉంది. కర్మ ఉంది. జ్ఞానం కోసమే యోగం – జ్ఞానమే యోగం. ఇంతేకాని ఈ వేర్వేరు యోగాలనేవి లేనేలేవు. మొండితనం కొద్దీ కొందరు విభిన్న యోగాల్ని పుట్టించారు. ప్రాణుని వ్యాయామమే – ప్రాణాయామమే 'యోగం' అనిపించుకుంటుంది. ప్రాణం లేని వస్తువు లేదన్నాక, ప్రాణానికి ఆధారం వాయువు. అదే ప్రాణం. వాయుతత్వాత్మకమైన ప్రాణాయామమే యోగం. ఇది యోగసాధకుల అభిప్రాయం.

**"విశ్వానుభవం ఎంత లభించినా తనివి తీరదు. కొంచెం కష్టపడిన గుట్టు బట్టబయలు కాదా ! జగదాధారమైన వాయుతత్త్వమును గ్రహింప, అన్ని లీలలూ తనకు తానుగా కరతలామలక మౌతాయి. ఇది వదలి, ఊరకె తిరిగితే ఏమీ ప్రయోజనం లేదు. కృత్రిమత్వమును కత్తిరించుము. యోగమునననుసరించి సుఖించుము మిత్రమా !" అని విశ్వవాణి చెబుతుంది.**

ప్రతి మనిషిలో వాయువు తన మూలస్థానాన్ని కలిసేందుకు ప్రయత్నిస్తుంది. అలా కలవడం అవసరం. అలా ఒక్కసారి అయినా నిత్యం కలవకపోతే, అతని మరణం సమీపించిందని భావించాలి. దీనికో కొండగుర్తు: ఉదయం నెలల తరబడి రెండునాడులూ ఒకటై పోతాయి. సూర్యచంద్రనాడులున్నాయి. వీటి పరిచయం అవసరం లేదు. నిజమైన యోగానికి ఇది అవసరం లేదు. ముక్కురంధ్రాలతో సాగేది యోగం కాదు. అది కేవలం శారీరకం. ఏదో ఒక విద్యా ప్రాప్తి కోసం వాయువును బంధించినట్లే. అదలా ఉండనీ !

సూక్ష్మంగా తెలుసుకునేవేళ, యోగానికి బయట నుండి రాకపోకలు చేసే ఈ గాలి అవసరం లేదు. లోపల వాయువు తన ప్రయాణాన్ని



బ్రహ్మరంధ్రం, నాభి – ఈ రెండింటి మధ్య చేసి ఉంటుంది. రెండు వస్తువులను ఎదురుగా ఉంచినపుడు, దేంట్లో అధికమైన అంశం ఉందో, అది ఇంకోదాన్ని ఆకర్షిస్తుంది. అందుకే, అధికారుల వైవిధ్యం కారణంగా, తొలుత జీవన స్థానం నాభియే అయినప్పటికీ అది పైకి వెళ్ళేందుకు ప్రయత్నిస్తుంది.

హృదయంలో ఉంటూ లయానిత్వంగా సాగే జీవన వాయువును నాభి నుండి బ్రహ్మ రంధ్రానికి పంపడమే ఒక వ్యాయామం. ఇది యోగానికి సంబంధించిన గొప్ప అంశం. అలా కాకుండ ముక్కుపుటాల్ని వ్రేళ్ళతో బంధించి, తన జీవహత్యను తానే చేసుకోవడాన్ని వింటే చాలా బాధవేస్తుంది. ప్రత్యక్ష గురువు లేకపోవడంతో గ్రంథాలపై ఆధారపడి మనం బాగా పాడైపోతున్నాం. ఇది మహాపాపం!

హృదయకమలంలో లయబద్ధంగా సాగేవాయువుకు ఇలా నాభి నుండి బ్రహ్మరంధ్రం దాకా వ్యాయామం కల్గించడమే ప్రాణాయామం. దీన్ని వర్ణించడం కష్టం. అందువల్ల దీన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించడం కష్టమై, కేవలం రాతల్లోనే ఉండిపోవడం వల్ల ప్రాణాయామం ఎన్నో అపార్థాలకు దారితీసింది. ఈ అంశం యోగులకు తెలుసు. అదేమిటంటే – దీనికి గురువు కావాలి. ఆ మహామార్గదర్శకుని సహాయంతో ప్రాణానికి వ్యాయామం కల్పించి, చాలా సార్లు పైకి, క్రిందికి పరుగెత్తించి, యోగసిద్ధిని పొందాల్సి ఉంటుంది.

శిశువును గమనిస్తే, ఈ యోగ ప్రక్రియ మనకు అర్థమౌతుంది. ఈ అంశం యోగులకు తెలుసు. శిశువు తనకు కావలసిన ఇష్టమైన వస్తువు లభించకుంటే ఏడుస్తుంది. అలా ఏడ్చినపుడు గమనిస్తే, ఒక

అంశం తెలుస్తుంది. శిశువు తన ప్రాణాన్ని పైకి తెచ్చుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఆ వెక్కి వెక్కి ఏడ్వడం అంటే ఏమిటి ? అలా ప్రాణాన్ని పైకి తెచ్చుకుని కష్టపడడం దేనికి ? తన బ్రహ్మరంధ్రాన్ని తాకేందుకు శిశువు చేసే ప్రయత్నమిది. అయితే మధ్యలో శిశువు, అజ్ఞానంతో తల్లిని చూచినంతనే ఏడ్పు మానేస్తుంది. ఆ వాయువు బ్రహ్మరంధ్రానికి చేసే ప్రయాణాన్ని, తల్లిని చూసినంతనే కలిగే వ్యామోహంతో ఆపేస్తుంది. ఇలా యోగప్రక్రియకు శిశువును ఒక ఉదాహరణగా స్వీకరించవచ్చు. శిశువు యొక్క ఈ స్థితి ద్వారా యోగులు, సిద్ధపురుషులు తత్త్వరహస్యాన్ని వర్ణించగల్గుతారు. యోగమార్గంలో అనుభవం పొందిన వాళ్ళకు ఈ అంశం స్ఫురిస్తుంది. అయితే అది అతనికి ఆనందదాయకంగా ఉంటుంది. ఇక్కడ మాయవల్ల శిశువుకు దుఃఖదాయక మనిపిస్తుంది. ఇదే శివచైతన్య మనిపించుకుంటుంది. శివత్వానికి, ఈశ్వరత్వానికీ ఉండే భేదం కేవలం యోగులకే ఎరుక. ఆ స్థితిలో యోగసిద్ధులై తనను తాను తెలుసుకున్నాక ఆత్మజ్ఞానం కల్గుతుంది. ఆత్మ సాక్షాత్కారం తర్వాత భగవత్ సాక్షాత్కారం కల్గుతుంది !

ఇలాంటి యోగం గురించి ఏమని చెప్పి ముగించాలి ! ఈ యోగం గురించి మీకు బోధించిన దానికన్న ఎక్కువ అంశాల్ని ప్రత్యక్షంగా అనుభవించగోరే వారికి వివరించడం జరుగుతుంది. అలాకాక వేరే వాళ్ళకు వివరించడం సాధ్యం కాదు. చెప్పాల్సినవి కొన్ని మిగిలి ఉన్నా, ఆలస్యం జ్ఞాపకానికి వస్తుంది. అందువల్ల మీకు ఇష్టమైన ప్రాణయోగాన్ని ఇక్కడితో ఆపి, 'పూర్ణత్వం' గురించి కొన్ని మాటలు చెప్పి విరమిస్తాను.



పూర్ణత్వం గురించి చాలా సూక్ష్మంగా చెబుతున్నా. ఎందుకంటే – అనేక గ్రంథాల్లో ఏమేమో వర్ణింపబడింది. అదే చాలు. నా ఉపన్యాసం మీకు నీరసాన్ని కల్గించరాదు. అందుకే కొంతసేపట్లో నా ఉపన్యాసాన్ని నిలిపి వేస్తున్నా.

'జీవాత్మ సంయోగమే' ఇపుడు చెప్పాల్సిన పూర్ణత్వం. ఇక ముమ్ముందు ఏమిటి ? అని అడగవచ్చు. ఆ తర్వాతిది – మొదటి దాని తర్వాత ఉండేది. అది మొదటిది ! ప్రత్యక్షానుభవం కల్గకుంటే పూర్ణత్వం గురించి చెప్పడం సాధ్యం కాదు. నేను చెప్పజాలను కూడా !

ఇకపోతే, అలాంటి పూర్ణుని వల్లనే లోకానికి కళ్యాణం. పూర్ణుడనని జగత్తును తిరస్కరించలేను; తిరస్కరించలేదు. సర్వోత్తముడు కావాలన్నపుడు సృష్టి కూడ కావాలి. సర్వోత్తమునిపై భక్తి సృష్టిలో శ్రేయస్సును కల్గించాలి. యోగికుమారుని నిర్ణయమేమంటుందో తెలుసా ?

**"దేవుని అమూర్తత్వపు ఆంతర్యము నెరిగిన భావ సౌందర్యము – అదియే వ్యక్తి విశ్వచరితము ! మనస్సు మౌనముగా ఉన్న ఏమిటి ? భావసౌందర్యమున మునిగిన మౌని ఆత్మలో విశ్వ సుస్వరముల జ్ఞానము! ఆ భవ్యపూర్ణత్వము నెరుగుటలోనే జగత్ పూర్ణత్వమలరారును. మిగిలిన సౌందర్య సత్యసౌరభమంతయు మనుషుల ప్రాపంచిక చాపల్యపులీల ! లోతుకు పోయిన లోపలి సత్యములు తెలియునురా" (విశ్వవాణి)**

ఇలాంటి గొప్ప చరిత్ర కల్గిన ఈ జగత్తుకు కల్యాణం కల్గించడం ఆ పూర్ణుని లక్ష్యం ! కర్తవ్యం ! ఈ విషయంలో చాలా మందికి చాలా ప్రశ్నలు కలుగవచ్చు. పూర్ణునికి ప్రపంచం దేనికి ? విశ్వపు గొడవలెందుకు? జగత్తు మిథ్య మొదలైనవి. ఈ భవ్యలీలను మిథ్య అని

చెప్పడం జరుగలేదు. వాళ్ళు 'అసత్యం' అనే చెప్పి ఉంటే దాని మర్మం ఇంతే –

**"అసత్యము అసత్యము అనిన వారంతయు మౌనముగా చనిపోయినారు కదా ! సత్యము నుండి వెలువడి, స్వతంత్రముగా జీవించి ఆనాటి నుండి ఈనాటి వరకు, నిత్యమూ నిజమని నిలిచినదీ జగత్తు చూడుమోయీ" (విశ్వవాణి)**

ఎవరెంతగతించినను, ప్రగతి ఎంత సాధించినను విశ్వము నిలిచినది. నిలిచి నిన్ను పిలుచుచున్నది ! మరెందుకు దీనిని కలగా భావింతువు ! అన్నపుడు తప్పక, చెప్పదగిన మాట ఒకటి యున్నది.

**స్వప్నము తాను అనెడి స్మృతి మనసులో ఉండిన**
**దృష్టికందిన దొకటి ! సృష్టికి అంటిన దోషము ! కలల**
**కల్పన కరగి తనకు తానుగా సర్వసత్య సౌందర్యమధుర**
**దృశ్యముల ప్రసారమును గమనించు మోయీ" (విశ్వవాణి)**

మనలో కలిగే స్వప్నములోని కలవరింతను దూరం చేసుకోవాలి. అంటే – అపుడే పూర్ణత్వం పొందిన వారి సిద్ధాంతం అవగాహనకు వస్తుంది. ఉదాహరణకు, జనకుడు మహాయోగి, చక్రవర్తి, కర్మజీవి. చివరకు నాగలిపట్టి తన కర్మ కౌశల్యాన్ని చాటుకున్న వ్యక్తి. ఎందరో మునులకు మార్గదర్శకులుగా జనకుడు ఉండేవాడు. నిరాడంబరుడు. నిత్యతాత్వికుడు. అలాంటి వాళ్ళే పూర్ణులు. అలాంటి పూర్ణత్వ ప్రగతిపథంలో, నేతృత్వంలో విశ్వమానవజాతి సాగిపోవాలని ఆకాంక్షిస్తున్నాను.

ఎంతో చెప్పానని అనిపించినా ఇది వేదిక. ఇంకా విపులంగా వివరించాల్సిందెంతో మిగిలి ఉండవచ్చు. ప్రశ్నలు అడగాలనుకునేవాళ్ళు



తమ చిరునామా సమేతంగా ఇస్తే, ఆశ్రమం నుండి వారికి ఉత్తరాలు వస్తాయి. నేను బసచేసిన చోట చర్చించటానికి అవకాశముంది.

ఇంతసేపు ఓపికతో ఉపన్యాసం ఇవ్వడానికి నాకు సహకరించిన పుణ్యమూర్తులు మీరు. నా ఉపన్యాసంలో సత్యము వెలువడింది. దీనికి కారణం మా గురువుగారైన పూజ్యశ్రీ అచ్యుత ప్రభువులు. చివరిగా మంగళం పాడుతున్నా.

**"విశ్వమను ప్రమిదలో బ్రతుకు దివ్వెలు వెలిగె**
**ఆత్మప్రకాశమున ఓ దేవ ! నీకివె అంకితమ్ము, స్వీకరించి**
**నీవు సంతృప్తుడవు కమ్ము దేవాధి దేవా" (విశ్వవాణి)**

దివ్యసంధి ! యోగతత్త్వం గురించిన ఉపన్యాసం ! ఆ యోగమనే అద్దంలో భూమి తన జీవన సౌందర్యాన్ని చక్కదిద్దుకుంటుంది. అపుడే ప్రపంచానికి ఆనందం.

అలాంటి జాగృతి కల్గుగాక !

**శాంతిరస్తు !**

# 13. గీతా సందేశం

**అన్నదమ్ములారా ! అక్కచెల్లెళ్ళారా !**

భక్తియే తమ అధికారంగా భావించే వాళ్ళకే నా ఉపన్యాసం వినేందుకు ఆహ్వానం ! ఆ భక్తి-ప్రేమల అధికారానికి ఆటంకాలే లేవు. తత్వానికి భాష, జాతి, దేశం, లింగం లాంటి భేదాలు ఎలా ఉండవో, అలాగే ప్రేమ కూడ ఈ భేదాలకు అతీతమైనది.

శాశ్వత సత్యాన్ని గ్రహించడమే మానవుని లక్ష్యం కావాలి. ఆ సత్యాన్ని మనం గ్రహించి, అనుభవించి, వేరేవాళ్ళకు కూడా ఆ అనుభవం కల్గేట్లు చేయడమే మన జీవన లక్ష్యం కావాలి. ఇది నా గురువుగారి ఆదేశం. నా లక్ష్యం !

భగవంతుడైన ఆ శ్రీకృష్ణుడికి తప్ప నాకు, మీకు తత్త్వవిచారాన్ని అంత సరళ సుందర వాక్యాల్లో చెప్పడం సాధ్యం కాదు. అయితే ఆయన చెప్పిన భగవద్గీతను ఎంతమంది అర్థం చేసుకున్నారు. అర్థం చేసుకున్నవాళ్ళు ఎంతమటుకు ఆచరణలో పెడుతున్నారు ? మా గురువుగారు అడుగుతారు. "నీవద్ద గీత ఉందా ?" "ఉంది స్వామీ! దాన్ని రోజు చదువుతాను" అని పలికినంతనే ఆయన నవ్వుతారు. "నాయనా ! కృష్ణపరమాత్మ గీతను చదవడానికి కాదు చెప్పింది. చేయడానికి ! మీరంతా దాన్ని చదవడానికి పోయి గీతను ఒక రోతగా మారుస్తున్నారు" అన్నారు. శ్రీకృష్ణుడు అర్జునునికి కర్తవ్యబోధన చేయడానికే గీతను ఉపదేశించాడు. చదవడానికి కాదు. ఆ భగవద్గీత మొదటి నుంచి ఉండనే ఉంది. ద్వాపరాంతంలో మళ్ళీ దాన్ని ఆచరించాలని చెప్పి ఉన్నాడు. ఈ గీత అంతటా వ్యాపించి ఉంది. అదేమి ? ఎక్కడుంది ? స్థూలసూక్ష్మాల్లోనూ మనకు మనమే అంటించుకున్న



కర్తవ్యం, కర్మ, వీటి సంబంధముంది. ఈ 'కర్మే' (స్థూలసూక్ష్మాల్లోనూ అంటుకుని ఉండేది) గీత ! అది చెప్పాల్సింది, చదవాల్సింది కాదు. చేయాల్సింది.

విదేశాల్లో తత్వచింతన గురించి మాట్లాడే అలవాటు అంతగా లేదు. ఆ విషయాన్ని చర్చించేవాళ్ళను చూస్తే వాళ్ళకు ఆశ్చర్యం ! సత్యం గురించి మాట్లాడడం లోనే కాలయాపన చేయకుండా వాళ్ళు సత్యానికి సమీపంగా ఉంటున్నారు. భౌతికక్షేత్రంలో అన్నిటా వారికి ప్రగతి లభించింది. జీవితంలో సమృద్ధి, సంతోషం, తృప్తి ఇవి లభించాయి. ఇది దేనివల్ల? వారి కర్తవ్య పరాయణత్వం వల్ల, మనదేశంలో తత్త్వం గురించి మాట్లాడడంలోనే కాలయాపన జరిగి, స్థూలసూక్ష్మాల్లోనూ కర్తవ్య భ్రష్టత పెరగడం వల్ల మన ప్రజలంతా దైవకృపకు దూరంగా ఉన్నారు. పైగా మనం 'తత్వజ్ఞులం' అనే అహంకారం మనలో ఉంది. కర్మనిష్ఠులైన విదేశీయులలో సామాన్యమానవుని ముఖాల్లో కన్పించే గెలుపు, తత్వవేత్తలమని డంబాలు పలికే మీ ముఖంలో లేదు. అలాంటివేళ - మీరు వాళ్ళకేమి ఇవ్వగల్గుతారు. వాళ్ళు మీ శుష్కవాక్యాలకు గౌరవం ఎందుకు చూపాలి? కర్మనిష్ఠుడికి మీరు ఇచ్చేదేమిటి ? రోజంతా కర్తవ్యం కోసం శ్రమించి, దేహం, మనస్సు, అలసి, సొలసి, ఇక చాలు అనిపించిన వేళలో - ఒక్షణం ఏకాంతంలో ప్రార్థన చేసుకుని విశ్రమిస్తాడు. భక్తుల సంఖ్యను పెంచుకోవడానికి, వాతావరణంలో శాంతిని ప్రసారం చేసేందుకు బహిరంగంగా చేసే ప్రార్థనలున్నా, ఏకాంత ప్రార్థనా పద్ధతి అన్ని రకాల జనాల్లో, ధర్మాల్లోనూ ఉంది. దాని క్రమాన్ని లోతుకు వెళ్ళి పరిశీలిస్తే - తత్త్వ రహస్యాలు అర్థమౌతాయి. స్వరూపదర్శనం, జగత్పూజ-రెండూ మన జన్మలకు కారణమై ఉండగా దేనినీ విడిచేటట్లు లేదు. భారతీయతత్త్వం ఆద్యులైన మహర్షుల వల్ల విఖ్యాతిని పొందింది. వాళ్ళు 'యద్యదా చరతి

శ్రేష్ఠః” అనగల్గే ఆదర్శపురుషులు కావడంవల్ల, కొన్ని శతాబ్దాలుగా ఆచరణలో పెట్టడం తరిగి, ఒట్టి వాక్యాలకే పరిమితమైనది తత్త్వచింతన.

స్వస్వరూప చింతన మనండి, ధ్యానమనండి, చేసే స్థానం, స్థితి స్వల్పమై సూక్ష్మంలో ఉంది.

18 అధ్యాయాల భగవద్గీతా శ్లోకాల్ని ఉచ్చరించడం నా ఉద్దేశం కాదు. దాని కోసం గ్రంథం ఉండనే ఉంది. ఆ గీతోపదేశ లక్ష్యాన్ని సారాన్ని మనం సింహావలోకన క్రమంలో చూసి మనకర్తవ్యాన్ని పరిష్కరించుకుంటే చాలు. కావాల్సింది కూడ అంతే !

గీతోపదేశం చేయబడింది పార్థుని కోసం. అది కేవలం యుద్ధం కోసమే అయినట్లయితే, అందరికీ అన్నికాలాలకు దాని అవసరం లేదు. ఇప్పటికీ భారతీయులతో పాటు విదేశీయులు కూడా గీత పై శ్రద్ధాభక్తులు చూపించటానికి కారణమేమి ? An admirer of it i.e. Lamerson. దాని గురించి చదివి, వ్రాసి, మహాత్ముడనిపించు కున్నాడంటే – దాని మహిమను ఏమని వర్ణించను ? గీతసర్వులకు అంగీకారయోగ్యం కావడానికి కారణం ఏమిటి ? కొంచెం ఆలోచిద్దాం.

అర్జునుడు పిరికిపంద కాదు. శాస్త్రం నెపంతో తప్పించుకోజూచిన నీచుడు కానే కాదు. కృష్ణునికి వేరే భక్తులు లేకుండిరి అని అర్థంకాదు. ఏకాంతభక్తుడు భీముడున్నాడు. మహాభక్తుడు ఇచ్ఛామరణుడైన భీష్మాచార్యుడున్నాడు. సాత్వికభక్తుడైన విదురుడున్నాడు. ఇంకా ఎందరో ఉన్నారు. అయినా గీతోపదేశానికి అర్జునుడే తగిన వ్యక్తి అయ్యాడు. కారణం స్నేహం పొందినా పార్థుడు మోహితుడు కాదు. శాస్త్రజ్ఞుడూ అయి ఉన్నాడు. సాధకుడూ అయినాడు. చివరకు అంకురించిన మహావైరాగ్యమే కారణం. అక్కడికి అతని పరిపక్వత పూర్ణమైంది. అర్జునుని



అఖండ విశ్వమానవ జాతికి ప్రతినిధిగా పెట్టుకుని భగవంతుడు గీతను బోధించాడు. పురుష శ్రేష్ఠుడైన పార్థునికి పురుషోత్తముడైన కృష్ణుడు బోధించిందే గీత.

గీతలో చూడాల్సింది భక్తి, కర్మ, జ్ఞానాల సంగమం ! ఉదయించే రవిని చూడాలంటే పూర్వాభిముఖంగా నిలవాలి కదా ! అలాగే ‘అనన్యాశ్చింత యంతోమాం’ అనేది ! అలాగే ‘సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ’ మరియు “తపస్విభ్యోధికోయోగీ” మొదలైన వాక్యాలున్నాయి. ఇక్కడ ఈ వాక్యాలన్నీ ఒక దానికొకటి contradictory arguments లా కన్పించినా, నిజానికి అలాంటి వైరుధ్యమేమీ లేదు. The available truth in us in Sath. దాన్నే విప్రులు విభిన్నరీతులుగా వర్ణించారు. ఆ ‘సత్తు’ విభిన్నరూపాలు ధరించలేదు. శాంతి, మోక్షం, సుఖం, ఆనందం కావాల్సిన వేళ, దానికి శాశ్వత మార్గమే కావాలి. అశాశ్వత మార్గం ద్వారా శాశ్వత సుఖం లభించదు’.

మొత్తం గీతనంతా ఈ రెండు మూడుగంటల్లో ముగించాలనే భావన వద్దు ! ఆ గీతా లక్ష్యం బ్రహ్మవిద్య. దీన్ని గురించి మీకు వివరించే అవకాశం లభిస్తే, చూస్తాను. ప్రాచీన కాలంలో రాజాధిరాజులు, తపస్వుల నుండి తత్త్వానికి సంబంధించిన నాల్గు అనుభవపు మాటలు లభిస్తాయి అని భావిస్తూ ఆర్తితో ఆశ్రమాలకు వెళ్ళి, భక్తితో, భయంతో నియమనిష్ఠలతో సంవత్సరాల తరబడి వేచేవాళ్ళు. వారి వారి భక్తికి తగినంత రీతిలో ఆయా వ్యక్తుల ఉద్ధారం జరిగేది. ఈనాటి ప్రజల పైశాచికత్వం గురించి ఏమని చెప్పను ? ఒక తపస్వి, సాధకుడు, సన్యాసి, తన అనుభవంతో తత్త్వం గురించి ఉపన్యాసం చేసి, హెచ్చరించడమే కాక బ్రహ్మవిద్యను కూడ అందించదలిస్తే – ఊళ్ళన్నీ తిరిగి, ఇంటింటికి వస్తే – మనవాళ్ళు తమ జడ్యాన్ని వీడడం లేదు. ఏమి చేయాలి ? వారు తమ చైతన్యాన్ని

ఉజ్జ్వలంగావించి, శివుని మూడో నేత్రాన్ని తెరిపించే ప్రయత్నం చేయాలి.

'తత్త్వం' ఎవరికి ? బ్రహ్మవిద్య అనేది బ్రాహ్మణులకే పరిమితం అనే గుడ్డివాదం చేసే వాళ్ళు చాలా మంది ఉన్నారు. మరో వర్గం చెలరేగి, అధీరతే ఔదార్యంగా మారి, బ్రాహ్మణ, క్షత్రియులకు వేదాధికారం ఉందనే వాదమూ ఉంది. ఇవన్నీ సామాన్య మానవుల మాటలు. అలా ఉంచండి! దేవుడనిపించుకున్న కృష్ణుడు ఏమి సెలవిచ్చాడు ? స్త్రీలకు, వైశ్యులకు, శూద్రులకు అందరికీ వర్తిస్తుంది గీత. ఇది ఏదో ఒక జాతికి పరిమితం కాదు. ముమ్ముందు కలికాలంలో రాబోయే క్షుద్రత్వాలను దృష్టిలోపెట్టుకునే స్పష్టంగా చెప్పాడు. వేదాలు మా సొత్తు అనేవాళ్ళు ఆ గ్రంథాలను ఎదురుగా పెట్టుకుని అరవనీ ! మాకు కావలసింది పుస్తకం కాదు. తత్త్వం. దానికి సాధనమైన యోగవిద్య. దాన్నే మనం అనుసరిద్దాం. ఆత్మదర్శనం కల్గించే భగవత్కృపను పొందుదాం. అందరూ జాగృతులు కండి ! దానికి సిద్ధం కండి !స్త్రీలకు తత్త్వం అవసరమా ? అనే ప్రశ్న చాలా మూర్ఖమైనది. కావాల్సిందే ! అంతేకాదు. ఆడవాళ్ళకు అది సులభంగా లభ్యమౌతుంది. ఎందుకో తెలుసా ? వారిలో మాతృవాత్సల్యపు అమాయకత్వ ముంది. ప్రేమపూర్ణ ముగ్ధత్వముంటుంది. వ్యావహారికమైన లంపటత్వం చాలా తక్కువ. అందువల్ల తత్త్వసాధనలోనూ వారికి భక్తి, ఏకాగ్రతలు సులభమై, ఆనందం లభిస్తుంది. చివరికి విషయలోలత్వంలో పడిపోయిన మీ భర్తల్ని బాగుపరచాల్సింది మీరే తల్లి ! కాలగతిని శుద్ధీకరించే సత్సంతానాన్ని కని, ఆర్ష సంప్రదాయాన్ని మహోజ్వలంగా కొనసాగించాల్సిన బాధ్యత మీదే ! ఉత్తమ ప్రజల్ని జగత్తుకు కానుక చేసి, జగత్పూజ గావించి ధన్యతను పొందాల్సింది మీరే ! అలాంటప్పుడు మీ దేహం, వీర్యం, మనస్సు – ఇవన్నీ శుద్ధంగా ఉండాలి. అందుకు ఆ యోగ విద్యనే శరణు వేడాలి.



గీతను అధ్యయనం చేసే ముందు ఆ దివ్యసందేశాన్ని బోధించిన శ్రీకృష్ణుని వ్యక్తిత్వం ఎలాంటిది అని గ్రహిస్తే – అతడు ఉపదేశించిన తత్త్వంపై శుద్ధ భక్తి కల్గుతుంది. అది లేకపోవడం వల్ల తత్త్వనిష్ఠ, సాధనానిష్ఠ – ఇవి రెండూ భారతదేశంలో క్షీణించడం జరిగింది. దీనికి వ్యక్తి నిష్ఠయే మూలం. కృష్ణుడు గొల్లకాపరి చేసే పనులు మొదలుకొని, 'దేవుడు'గా చేయాల్సిన పనుల్ని కూడ చేశాడు. ఆట, పాట, కుస్తి, యుద్ధం, సంహారం మొదలైన కార్యాల్ని నిర్వర్తించాడు. గోకులంలో అనాగరికుల మధ్యలోనే ఎదిగాడు. ఆహార విజ్ఞానం నుండి రాజకీయ సుస్థిరత పొందే స్థితికి వాళ్ళను తీసుకు వచ్చాడు. 'నవనీతచోరుడు' అనే మాటను గమనించండి. వెన్న సాత్వికాహారం. కంసుని పరిపాలనలో ఆహార విజ్ఞానం కోసం స్త్రీలకు, పిల్లలకు కూడ మిగల్చకుండా వెన్ననంతా రాజుకే అందించేవారు. రాజదండ భయం కొద్దీ పిల్లల పోషణ స్తంభించి ఉంది. కృష్ణుడు అక్కడ చేసింది దొంగతనం కాదు. పిల్లలందరినీ ఒక చోట చేర్చి, పిల్లలందరిచేత పాలు, వెన్నలు కలిపి తినిపించాడు. ఇక్కడేమిటి ? Everybody enjoying the fruit of everybody's toil and right. ఇది న్యాయసమ్మతం. మీరు దీన్ని రాజకీయమనండి ! లేదా ఇంకేదైనా పేరు చెప్పండి ! అలాగే కృష్ణునిపై జారత్వపు ఆరోపణ కూడా అసంబద్ధమే ! గోకులంలో రాసక్రీడ, జలక్రీడల వృత్తాంతమంతా కృష్ణుని బాల్యంలో 7–11 సంవత్సరాల మధ్య జరిగింది. ఆ బాల్యంలో ముద్దులొలికే బాలకుని ఆటపాటలకు మోహితులై ఆడుకోవడం ప్రతి స్త్రీకి సహజం. అంతమాత్రాన కృష్ణునికి జారత్వాన్ని అంటగట్టడం భావ్యమా? ఇకపోతే గోపికల వలువల్ని అపహరించడం. ఈ కార్యాన్ని కృష్ణుడు కాముకత్వంతో చేయలేదు. గోపికలు కాత్యాయనీ వ్రతం చేసేవారు. స్నానం చేశాక మడికట్టుకోవాలని వారికి తెలియదు. బట్టబయలు నగ్నంగా స్నానమాడరాదనే జ్ఞానం కూడా వాళ్ళకు

లేదు. ఈ విషయంలో గుణపాఠం నేర్పించేందుకు అలా చేశాడు. ప్రౌఢవయస్సులో కృష్ణుడు చక్రధారియై యుద్ధం చేశాడు. సారథియై రథాన్ని నడిపాడు. కసువు ఊడ్చాడు. మోసాన్ని మోసంతో జయించాడు. అసత్యానికి అసత్యాన్ని ప్రయోగించాడు. భక్తికి సత్యాన్ని అందించాడు. ఇలా దేన్ని ఎలా నిర్వహించాలో అలా చేశాడు. చివరకు పరమాత్మగా నిలిచాడు ! దీనివల్ల తెలిసేదేమిటి ? పుట్టి, పెరిగి, జీవించి, మరణించేలోపల, అన్ని కర్మల్లో పూర్ణతను సాధించాలి. చాతుర్వర్ణ్యాల కర్తవ్యాన్ని ముగించాల్సి ఉంటుంది. అపుడే బ్రహ్మత్వం అవగాహనకు వస్తుంది.

చివరికి వానప్రస్థాశ్రమాన్ని ఆశ్రయించి, శిష్యుల్ని సంగ్రహించి తత్త్వబోధ చేశాడు. అవతారపురుషుడైన కృష్ణుడు అన్ని కర్మల ఆనందాన్ని స్వీకరించే వ్యక్తి. మానవులందరి క్షేమం కోసమే ఇవన్నీ చేశాడు. స్వార్థంతో కాదు. గీతలో కృష్ణుడు చెప్పిన తపోమార్గము అందరికోసమే ! తత్త్వసాధనంగా దేన్ని వర్ణించాడు కృష్ణుడు ?

'తపస్వి భ్యో ఉ ధికో యోగి' ఇక్కడేమిటి ? తపస్సు యొక్క లక్ష్యం యోగం' అందువల్ల తపస్వికన్న యోగి అయిన వాడే శ్రేష్ఠుడు. 'యోగం' లో చాలా విభాగాలున్నాయని అంటారు. దీని వాస్తవమైన అర్థం తెలుసుకుంటే విభిన్నమైన యోగాలనేవి లేనే లేవు. అది ఒక్కటే అనే సత్యం గోచరిస్తుంది. చాలా మటుకు అందరూ కూరుకుపోయేది విషాదంలోనే ! అలాగే భక్తి – ప్రయత్న ఫలాలు కలవడమే యోగమా? అలా అయితే, యోగాన్ని "వ్యావహారిక కర్తవ్యయోగం' అని అనాల్సి ఉంటుంది. నిజానికి 'యోగం' అంటే ఇది కాదు. మన క్రింది భాగంలో చలించే చైతన్యం ఊర్ధ్వముఖంగా పయనించి, మూలస్థానంలో లీనమై, ఆనందానుభవం కల్గడమే యోగం. జీవుడు, ఆత్మ వంటి technical terms ముఖ్యంకాదు. 'గీతా సందేశం' మానవులందరి కోసం !



అలాంటపుడు మానవులందరికీ అర్థమయ్యే రీతిలో శబ్దాలను ప్రయోగించి చాటితే మనం ధన్యులమైనట్లే ! మనస్సులోని చాంచల్యాన్ని అరికట్టేందుకు చేయబడిన తాత్కాలికమైన, స్థూలమైన ఏర్పాట్లు పూజ (విగ్రహం), జపం (మంత్రం, నామం) మొదలైనవి ప్రారంభమై, రాను రాను Extra luxury గా ఆగి – ఇదే తత్త్వచింతన అనే స్థితికి దాపురించాయి. అలా కారాదు. తత్త్వపిపాస ఆంతర్యంలో necessity కావాలి.

మన కర్మేంద్రియాలు, బ్రహ్మేంద్రియాలు, మనస్సు – వీటన్నింటికీ పరాజయముంది. వీటి వల్ల కల్గే అనుభవం శాశ్వతం కాదు. బాహ్యేంద్రియాలతో తన చాపల్యాల్ని చెప్పి, తీర్చుకునే మనస్సు ద్వారా ఆ శాశ్వత పదవి సాధ్యం కాదు. దీనికి ఆ భక్తి, కర్మ, జ్ఞానాల కలయిక అవసరం. అది ఏది ? ఎలా ? ఇది సంస్కారం ఉన్న వాళ్ళకు తెలిసే భాష. సంస్కృతులు అంటే ఎవరు. వాళ్ళే భక్తులు ! స్వస్వరూప కర్మనిష్ఠ సుసంస్కృతా! ధర్మపథంలో నిరతులై చేయదగిందే కర్మ ! ఆనందాన్ని పొందే, తెలుసుకునే చైతన్యమే జ్ఞానం ! జ్ఞానం పొంది, యోగాన్ని పొంది ఆనందైక జీవిగా నిలిచే యోగి సర్వశ్రేష్ఠుడు.

ఇవన్నీ stages మాత్రమే ! వేరే వేరే విషయాలు కావు ! అన్ని అవస్థలకూ మూలమైన ఆ స్వరూపం కర్మల్ని చేసేదెలా ? "ఉత్తిష్ఠత ! జాగ్రత ప్రాప్యవరాన్ని బోధత" లేవండి ! జాగృతులు కండి ! తెలిసిన వాళ్ళ ద్వారా ఉపదేశం పొందండి. ఇది లేకపోవడం వల్ల, ఊహకొద్దీ ముక్కు మొదలైన ద్వారాల ద్వారా చేసే కుచేష్టల వల్ల ప్రజల అధోగతికి పతనం అయ్యారు.

లౌకిక వ్యవహారాల కవసరమయ్యే విద్యలకే గురువు కావాలి. అలాంటప్పుడు ఆ దివ్యత్వాన్ని అందించే జీవవిద్య, అమృతవిద్య, బ్రహ్మవిద్య – గురువు లేకుండా ఎలా వస్తుంది ?

**"సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ మూర్ధ్న్యా**
**ధాయాత్మనః ప్రాణమా స్థితో యోగధారణాం'**

ఇది కృష్ణుని మాట ! ముక్కు నవద్వారాల్లో ఒకటి కదా ! హృదయంలో ఉండే ప్రాణుణ్ణి మనో ప్రాధాన్యంతో బ్రహ్మరంధ్రంలో ఆత్మ సామీప్యంలో చేర్పించే స్థితియే యోగధారణ ! ఇది కేవలం దేహపు ఆంతర్యంలోనే జరగాలి. ఆ ఆంతర్యంలో ఉండే మార్గం – గురుద్వార గమనం గురువు లేకుండా సాధ్యంకాదు ! అవగాహనకు రాదు ! అంతటా నిండిన దేవుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికి ఎందుకింత కష్టపడాలి? అని అడగవచ్చు. "అంతా నాలో ఉంది. నేను వాటిలో లేను!" ఇది కృష్ణుడు పరమాత్మగా నిలిచి పలికిన వాక్యం. అన్నిటా దేవుడుంటే – ఆయా వస్తువుల క్షుద్రత్వం ఉంటుందా ? శవాన్ని కాలుస్తారా ? ఆ పరమాత్మలోని కొంత అంశాన్ని కల్గిన ప్రాణుడుంటే దేహాన్ని కాల్చలేరు. అది చెడిపోయేది కాదు. అన్నపుడు ఆదేహం కుళ్ళిపోయేదా ? ఇలా విమర్శించడాన్ని 'నాస్తికత్వం' అని అనకండి!

దేవుణ్ణి అన్ని వైపుల చూడవచ్చు. కాని అన్నింటిలోను ఆయన లేడు. అలా తమతమ కల్పనలకు అనుగుణంగా మానసికంగా దర్శించి ఆనందించగలం. అంతేకాని దేవుడు ఆ ఆకారాలకు లిప్తుడై ఉండడం లేదు. దేవుణ్ణి దేవుణ్ణిగానే చూడాలంటే – అది తపస్వులకే సాధ్యం. అతని చైతన్యపు అంశలన్నిటా వ్యాపించింది. దాన్నే 'ఈశుడు', 'ఈశ్వరుడు' మొదలైన శబ్దాలతో పిలుస్తున్నా. అందుకే అతని స్వరూపాన్ని 'స్వయం స్థానేన వ్యక్తః, సర్వస్థానేన వ్యక్తా వ్యక్తః' అని వర్ణిస్తాం.

ఈ దేహరథాన్ని తన కర్తవ్యం కోసం ఆత్మ మొట్టమొదట నిర్మించుకుంది. తాను ఉండాలంటే – ప్రాణం అవసరం. దాన్నీ సృష్టించుకుంది. ఆ ప్రాణం మూలంగానే మనకు ఆత్మదర్శనం సాధ్యం.



ఆ ప్రాణం మన దేహం లోపల ఉంది. వెలుపల లేదు. అందుకే కృష్ణుడు "సర్వద్వారాణి సంయమ్య" అని చెప్పాడు. అపస్వరాలు పలికే ప్రాణాన్ని సుస్వరగతిలోకి పంపించాలంటే – కొంచెం శ్రమించే సాధకుడే కావాలి! అతడే గురువు ! అతని ద్వారా మాత్రమే యోగవిద్య లభించగల్గుతుంది. మాటలు, పుస్తకాలతో లభించేది రోగవిద్య. అందుకే 'నగురోరధికం' అని అన్నారు. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" దీని రహస్యమేమిటి? మాకు కృష్ణుడు కావాలి. అతడే ఆదర్శం. అతడే మనకు శరణ్యం. అలాంటప్పుడు మనకు అతని బోధనలు, ఆదర్శాలు, ఆచరణలు కావాలో, అతని రూపం, నామం – ఇవి రెండే కావాలో ? ఏది ? అనే ప్రశ్న కల్గుతుంది. 'శరణం మమ' అంటే ఏమిటి దాని అర్థం ? తెలుసా? నన్ను అంటే సర్వకర్మ పరిపూర్ణుడై ఉన్న కృష్ణుని స్మరిస్తే కాదు. సర్వకర్మల్ని, తపస్సును తనలాగే ఆచరిస్తే దేవుడికి శరణు వేడినట్లే !

ఈ మార్గంలో పయనించే వ్యక్తి ఎలా ఉండాలి ? 'నాత్యశ్నతస్తు యోగోఽ స్తి'. అతిగా భుజించేవాడికి యోగం ఫలించదు. జీవనం అన్ని క్రియలు నియమబద్ధంగా ఉండాలి. ఆహార విహారాలు కూడా దీనికి వ్యతిరేకం కాదు.

**"యుక్తా హారవిహారస్య యుక్త చేష్టస్య కర్మసు**
**యుక్త స్వప్నావబోధస్య యోగోభవతి దుఃఖహా"**

అలాంటి వ్యక్తికి యోగం ప్రాప్తిస్తుంది. ఈ రీతి వేరే కుకల్పన లేవీ లేకుండా, భగవానుడు చెప్పిన రీతిలో సాగే ఆత్మచింతకునికి, ధ్యానశీలికి, యోగానికి కావలసిన క్షేమాన్ని తానే స్వయంగా అందిస్తానని భగవంతుడు ఆశ్వాసన అందించాడు.

We must study Krishna from all aspects of him and follow. That and that only can be real submission to him.

చివరగా కృష్ణుడు చెప్పిన "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అనే మాటను విశ్లేషిద్దాం. మార్గం కన్పించవచ్చు. ధర్మస్థాపన కోసం వచ్చిన కృష్ణభగవానుడు, "నీవు క్షత్రియ వీరుడివి, యుద్ధం నీ ధర్మం, చేయాల్సిందే ! వదలరాదు' అని ఆప్తుడైన భక్తుడైన అర్జునునికి బోధించాడు. ధర్మభ్రష్టుడవు కమ్మని బోధించాడా ? కానే కాదు ! సమాజం సక్రమంగా సాగడానికి అవసరమైన ధర్మపు వివిధ బాహ్యాంగాల గురించి వివరించి, చివరకు ముక్తిసాధన కుపకరించే ధర్మపు ఆంతరిక విద్య – బ్రహ్మవిద్య గురించి చెప్పాడు. అపుడు ఇంతకు ముందు చెప్పిన దానిని ఇక్కడ స్మరించవద్దు. అదంతా జగత్తు యొక్క పూజకోసం.

నేను ఇపుడు చెప్పేదాన్ని మాత్రం ఆశ్రయించు ! ఎలాంటి మాట అది ! దీన్ని యోగీశ్వరుడైన కృష్ణుడు యోగి కాబోయే పార్థునికి చెప్పింది. ఈ రీతిగానే దీన్ని గ్రహించే ప్రయత్నం చేయాలి. అది ఆంతర్యంలో ఉంది. బాహ్యంలో ఏ విధంగా కన్పిస్తుంది. దాని బాహ్య శరీరాంగాలు! బయటివి విడుదల ఔతాయి. వెళ్ళిపోతాయి. లోపలి శరీరం పోయిన వేళలోనే !

బాహ్యేంద్రియ ధర్మాలు, పనులు లోపలి ధర్మం ఆధారంగానే సాగుతాయి. వీటన్నింటిని వదలి ఆంతర్యంలో ఉండే అంతరింద్రియ కర్మతో వస్తేనే మోక్షం. మనిషి జాతి మారితే, ధర్మభ్రష్టుడైనాడని అర్థం కాదు. నాలాగే నీవు అయ్యే వేళ – దూరం చేయాలని కాదు. కుక్క మాంసం తినే వ్యక్తిని తన జాతివాడని ఎందుకు ముట్టాలి ? ధర్మం అంటే జాతి కాదనేందుకు ఇదంతా ! గీత ఎవరికి సులభం ? ఎవరికి సమీపం? 'విద్యావినయ సంపన్నే' అలాంటి వారికి ! ఇక్కడ విద్య అంటే బ్రహ్మవిద్య.



బ్రాహ్మణుడంటే – బ్రహ్మత్వాన్ని గ్రహించినవాడు. అనుభవంతో గ్రహించి ఉండాలి. తత్త్వవేత్తలు వర్ణం, వర్ణ ధర్మాల్ని వర్ణించింది జాతి దృష్టితో కాదు. ప్రతి మనిషిలోనూ నాలుగు వర్ణాలు, స్త్రీత్వపురుషత్వాలూ ఉన్నాయి. అధో ఇంద్రియ కర్మ శూద్రత్వం. చంచలత, అధీరత – ఇదే స్త్రీత్వం ! విమర్శాబుద్ధి వైశ్యత్వం ! ధీరత క్షాత్రం. జ్ఞానం బ్రహ్మత్వం ! ఈ జ్ఞానం మనందరి ప్రయత్నాల ఫలంగా లభించింది. మిగతా దంతా అభ్యసింప బడాల్సిందే. గీతను అందరూ చదువుతారు. అనుభవజ్ఞుని నుండి గ్రహించి చేస్తే మాత్రం సార్థకం. దేన్ని తెలుసుకోకుండా పరదేశాలకు వెళ్ళి చిలుక పలుకులు పలికితే తత్త్వబోధ కల్గుతుందా? Why Indians boast about philosophy with no experience of it ? ఉపనిషత్కారుల మాటలన్నీ contradictory అనే వ్యక్తులు అనుభవజ్ఞులా? మాటి మాటికీ దేవుని గురించి మాట్లాడే వాళ్ళకు ఇది తెలుసా ? అతడు సుందర సృష్టిలో అవసరమైన అన్ని సౌలభ్యాలని అందించి, ఆడి, సేవించి, గ్రహించేందుకు మమ్మల్ని పంపించాక ఆ దొరికిన యోగ్యతను సదుపయోగపరచు కోకుండా మళ్ళీ మళ్ళీ దేవుణ్ణి అడిగితే, ఆయన ఆలకిస్తాడా? మీ నీచనాలుక పలికే మాటలు ఆయనకు చేరతాయా ? దాన్ని దేవుడి దాకా చేర్చే చైతన్యం ద్వారా మనం ప్రయత్నిస్తే కృప సాధ్యం ఔతుంది. ఆ చైతన్యపు యోగ్యత ఆనందానుభవం కల్గేంత దాకా? అది ప్రయత్నం వల్లనే సాధ్యం ! ఆనందానుభవం తర్వాత ఆనందారాధ్యుడైన పరమాత్మ గురించి ఇక ఎందుకు చెప్పాలి ?

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

# 14. అమరజీవనం

**సజ్జనులారా ! తత్వబంధువులారా ! పరమాత్మ కృపాపిపాసువులారా!**

తత్త్వశాస్త్రం లాంటి గంభీర విషయం గురించి తెలుసుకోవాలంటే, చాలా మంది ఉండే సభకన్న, తీవ్రాకాంక్ష ఉండే కొంతమందితో కూడిన సభే శ్రేష్ఠం. ఇక్కడ ఇలాంటి స్థితే ఉంది ! కాలకర్మల సంయోగమే కాబోలు ! అందరూ దగ్గరలోనే కూర్చున్నారు! ఉండే జనాలు తక్కువే ! నాకు 18 రోజుల ఉపన్యాసం, ఎడతెగని చర్చల వల్ల కల్గిన గొంతు నొప్పి కాస్త తగ్గింది. 'ఉపదేశం' లాగే, ఉపదేశింపబడాల్సిన బ్రహ్మవిద్య గురించి పలికే ఔపదేశిక వాక్యాలు దగ్గరలో చెప్పడమే మంచిది. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" ఆ స్థానం నుండి సమీపస్థానంలో, ఆర్తునికి, భక్తునికి, ప్రేమికునికి, మొదట తత్త్వాంశాన్ని చక్కగ మాటల్లో వివరించి, తర్వాత ఆ తత్త్వవిద్య నందించాలి. దీన్నే "ఉపదేశం" అని అంటారు.

భిక్ష కోసం బయలుదేరిన సన్యాసి ప్రతి ఒక్క ఇంటికి వెళతాడు. దేన్నీ వదలడు. వదలడం అతని ధర్మం కాదు. ఒక ఇంటి ముందు అడిగినపుడు గృహిణి వెంటనే రాలేదని సన్యాసి వెళ్ళలేడు. కాలినుంచి నెత్తిదాకా వేడిపైకెక్కే దాకా అలాగే నిలబడి "లోపల అమ్మ లేదో ? ఏమో ? ఉంటే భిక్ష వేయలేదెందుకు ? నాకు మాత్రమే వేయలేదా ? లేక ఎవరికీ వేయలేదా ? నాకు మాత్రమే భిక్ష వేయలేదంటే కారణం ఏమిటి? ఎవరికీ భిక్ష వేయలేదంటే దానికి కారణం ఏమిటి ? "ఇలా పరిపరి విధాల ఆలోచిస్తూనే ముందుకు వెళతాడు. తినే భిక్షకోసమే ఇన్ని రకాల బాధలు అనుభవించాలి. అలాంటప్పుడు మనోభిక్ష కోసం, తత్త్వ భిక్షకోసం



వచ్చిన వాడే రీతిలో నిరీక్షించాలి ? ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే – మీరంతా నాపై ఎంతో గౌరవం పెంచుకున్నారు. ఆహ్వానించారు. సమయమూ బాగానే అయింది. అయినా మీ తొలి ఉత్సాహానికి ఇక్కడ కొరత ఎందుకు వచ్చిందని ఆలోచించేవేళ – ఇంటి నుండి వచ్చేవేళ కొంచెం ఆలస్యం అయి ఉండవచ్చునని భావించి 5–10 నిమిషాలు, రాని వారి కోసం నేను వేచి ఉండడంవల్ల, వచ్చిన వాళ్ళు బాధపడరాదని ఇదంతా చెప్పాల్సి వచ్చింది.

మీ అందరి మనస్సుల భిక్ష కోసం వచ్చానని అన్నాను. నా జోలెను మీ ముందు చాచాను. అందులో మీ మనస్సును వేయండి! నేను కొంచెం రుచి చూస్తా. దాని రుచిని మీకువర్ణిస్తా. కొరత ఏముందో తెలియజేస్తా. విశ్వవ్యాప్తమైన అఖండ మనస్తత్వం లోంచి వచ్చిన మీ మనస్సు, మళ్ళీ దాంతోనే కలిసి ఆ ఆనందాన్ని అనుభవించే మార్గాన్ని మీకు వివరిస్తా, చూపిస్తా! చూడండి ! నా జోలెలో అనంత ప్రజల మనస్సు పడింది. దాని అస్తిత్వం అందులో పరిసమాప్తం కాలేదు. చక్కగా ఉంది ! ఇలా ! నాకు మనోభిక్ష వేసిన వాళ్ళ సాత్వికసంపద బాగా పెరిగింది. వాళ్ళంతా పనికి మాలిన వాళ్ళు కాదు! తెలియని వారికి నేనొక వ్యర్థ పదార్థంలా కన్పించినా–రహస్యం అది కాదు. దంబాలు పలుకుతూ ఆడంబరాలు చూపే సంపద కన్న అనాసక్తి అనే సంపద చాలా శ్రేష్ఠం. ఆ సంపత్తే నా సాధనా లక్ష్యం! అలాగే నేను తత్త్వభిక్ష కోసం బయలుదేరాను. కేవలం భిక్ష పొందడానికి కాదు. పొందిన తర్వాత దాన్ని పంచడానికి ! మీ మనస్సును ఇవ్వండి. తత్త్వాన్ని పొందండి.

నేను చెప్పేరీతి మీకు కొత్తగా కనిపించినా 'తత్త్వం' కొత్తది కాదు. నాది కాదు ! నాకు దాన్ని అందించిన గురువు 'నాది' అని చెప్పలేదు.

ఆదికాలం నుండి నిత్య గర్భంలోంచి వెలువడి, మహర్షులకు లభించిన తత్త్వమే నాకు మా గురువు గారి ద్వారా లభించింది. అయితే దీనివల్ల గురువు స్థానం చాలా స్వల్పమని ఎవరూ భావించరాదు. దీన్ని తెలుసుకోకుంటే ఇక అధఃపతనమే ! తత్త్వం విషయంలో నేను ఇంకా విద్యార్థినే! ఇంకా పరిపక్వత రాలేదు. అయితే నా విద్య పుస్తకంలోని పాఠం కాదు. అమృతవిద్య. గురుకృపా ప్రసాదితమైన విద్య ! అందుకే అది నాకు గర్వకారణం ! గురువుకన్న తక్కువ అని భావించినపుడే తెలుసుకున్నాకే – ఇతనికి ఆ పూర్ణలాభం. ఆనందం ! నా మాటలన్నీ సమర్థుడైన అచ్యుతయోగి ప్రేరణతో వెలువడినవే! అది నాకూ పుణ్యప్రవాహమే ! నాది అనేదేదీ అక్కడ లేదు! అది నాకోసం ఇక్కడ ! అందరం అందులో స్నానం చేద్దాం! శుద్ధులమౌదాం! 'అమరజీవనం' కోసం సిద్ధమౌదాం.

జీవనంలో ప్రతిదానికో వ్యవస్థ కావాలి ! అలాంటప్పుడు తత్త్వస్థాపన ఎందుకు చేయకూడదు ? స్వామి అయిన వ్యక్తికి సిబ్బంది ఉన్నపుడు సంస్థానం ఔతుంది. స్వామి తన సంపూర్ణశక్తిని లోకకల్యాణానికి వినియోగించాలన్నా ఈ వ్యవస్థ అవసరం. తొలుత అతని తత్త్వాన్ని బాగా వివరించి, జనుల మనస్సును తత్త్వం వైపుకు మరలించే (మోహించే వంచించే వాడు కాదు) వ్యక్తి, వక్త కావాలి. అలాంటి వక్త లిద్దరుండాలి. జగత్తులోని వివిధ విచారాల్ని విమర్శాత్మకంగా గ్రహించి, తత్త్వనిష్ఠుడైన స్వామి బలాన్ని అటువైపు ఆకర్షించే ప్రజ్ఞాజీవులిద్దరు కావాలి. కర్మదక్షులై ప్రతి ఒక్క కార్యంలోనూ సహాయపడే సేవకులిద్దరు కావాలి. ఇలా బయటి విషయాల్లో వ్యవహరించి, ఉపన్యాసం, ఉపదేశాల వ్యవస్థను కావించి, తత్త్వ ప్రచార కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించే వ్యవహారకుశలులైన



స్వామి భక్తులిద్దరు కావాలి. ఆహార విజ్ఞానం తెలిసిన పాకశాస్త్ర ప్రవీణులు ఇద్దరు కావాలి. అపుడే అతని సంస్థానం సార్థకం. అది నిజమైన తత్త్వకేంద్రమై పోతుంది.

చెప్పడం, వినడంలోనే కాలం గడిపితే, ఇక తత్త్వం ఎవరికి? మీరెవరూ తత్త్వ విచారం వినరాదని కానీ, నేను జవాబు చెప్పనని కానీ అర్థం కాదు. పెద్దల ఔదాసీన్యం కొద్దీ, మన అసమర్థత వల్ల మనల్ని మనం మరచి పోవడమే కాక మన ఆయువు క్షీణించేట్లు చేసుకున్నాం. అందుకే 'రేపు చూద్దామనే మాటేవద్దు. ఈరోజే ప్రారంభిద్దాం! తెలిసిన వాళ్ళ ద్వారా మన సంశయాల్ని పటాపంచలు చేసుకుందాం. చెప్పడం, వినడంలోనే జీవితం గడవడం కాదు. చేయడంలో గొప్పతనం ఉంది. చావు జీవన లక్ష్యం కాదు. "Death is not the result of life. It is an accident. అది ఒక ప్రమాదం! మేల్కొని, తెలుసుకుని, ధీరులై నిలబడి సాధించేవాళ్ళకు ఆ ప్రమాదం నుండి తప్పించుకుని, సత్యాన్ని సమీపించి, ఆనందాన్ని అనుభవించి, పూర్ణునికృపకు పాత్రుడయ్యే 'అమరజీవనం' సాధ్యం. అది సాధ్యం. దానికో మార్గం ఉంది. సాధన ఉంది. చేయండి ! అని అనుభవం ఉన్నవాళ్ళు చెబితే దాన్ని ఆచరించి చూద్దాం. ప్రయత్నం చేస్తే నష్టమేమీ లేదు కదా ! ఆ దివ్య బ్రహ్మత్వాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నం చేసే సదవకాశం లభించడమే పుణ్యం! అదే నా గురువుల పవిత్రవాణి! "ప్రయత్నమే సాధకుని పుణ్యం" ! ధీరులకు శాశ్వత సుఖం ! 6 భాగాలు ప్రయత్నం, 7వది ఫలం. అది ప్రయత్నం వలన లభ్యం. అయినా దేవుడి దయే ! అందువల్ల కాలాన్ని మొదట సేవిద్దాం. కాలానికి భయపడి – అంటే కాలాను గుణమైన కర్మాచరణలో సాగుదాం! క్రమంగా కాలపుస్నేహం మనకు సిద్ధిస్తుంది. కాల, కర్మ

సంయోగ రహస్యం తేటతెల్లమౌతుంది. చివరకు కాలం యొక్క స్వామ్యం (అధికారం, హక్కు) ప్రాప్తిస్తుంది. ఏ కాలంలో నైనా అతని సత్యసంకల్పం తప్పక నెరవేరే సామర్థ్యం ప్రాప్తిస్తుంది. అలాంటి వాళ్ళే జ్ఞానులు ! కాలాతీతులు ! వారు క్రమబద్ధమైన నిరంతర శాంతియుత సాధనతో ఆ స్థితికి చేరారు. క్రమం తప్పి నడవడం కన్న వేరే కష్టమేముంది ? అని ఓ కవి పాడాడు. కాలస్వామ్యం దొరికిన తర్వాత, ఏ కాలంలోనైనా అతని చేత జరగాల్సిందంతా సత్యసేవకు, దైవప్రేమకు, జగత్ కల్యాణానికే జరుగుతుంది.

అమరజీవనం గురించి మాట్లాడేందుకు సజ్జనులు నన్ను ఆదేశించారు. అందమైన, విశాలమైన భవనంలో రంగురంగుల రంగవల్లికల పుణ్యాహవాచనపు సంబరం వద్దు ! ఆత్మశుద్ధి చాలు! దివ్యమైన అమరజీవనం గురించి ఒక సాధువు, సాధకుడు మాట్లాడేవేళ పరిచయం చేసుకోవడం అంటే ఏమిటి ? నా దేశంలో ఎప్పటి నుంచో తత్వజ్ఞులకు అవకాశం అందించిన ఈ భారతంలో ఒకని నింకొకడు పరిచయం చేసుకునే ఈపద్ధతే వద్దు ! అతనెవరు? అతని గురించి చెప్పే ఇతనెవరు? ఈ ప్రశ్నలు దేనికి ? అందరూ మొదటి 'నేనెవరు' అనే దాన్ని గురించి ఆలోచించే జిజ్ఞాసువులు కావాలి. ఆ జిజ్ఞాసే అమరజీవనానికి తొలి సోపానం.

'నేనెవరు ?' తొలుత ప్రశ్నించుకోండి. రాత్రంతా ఆలోచించండి. ఎదిగాక నిర్ణయించుకోండి. దీనికోసమే మన ఈ సభ. నేనొక సాధకుణ్ణి. నాలాగే మీరు సాధించి ప్రగతిని పొందాలని కోరుకుంటాను. గురువుగారి ఆదేశాన్ని శిరసావహించి వచ్చాను. మీకు అందరికీ చక్కగా వివరించాల్సిన ఆజ్ఞ, అధికారం నాకుంది. ఆ అధికారం అపారానందదాయకం. అంతే



శ్రమతో కూడుకున్నది. సూక్ష్మంలో అధికారి. అయితే స్థూలంలో ఏమి ? భిక్షార్థి మొత్తం విశ్వమంతా భిక్షకోసం సంచరించడం నా అధికారం. అలాగే మీ వద్దకూ వచ్చాను. నాకు డబ్బులు వద్దు ! బియ్యం వద్దు ! నాలాంటి భిక్షుకుడు ఇది వరకూ మీకు గోచరించి ఉండడు. నాకు కావాల్సింది మీ హృదయభిక్ష ! మనస్సు లగ్నం చేసి వినాలి. అందరూ మనస్సును మథించాలి. వికల్పాలు రానీ ! నిలువలేవు ! విచారతరంగాలు లేవనీ! స్థిరత్వం మందర పర్వతంలా కదలకుండా ఉండనీ ! చివరికి ప్రజ్ఞ అనే నవనీతం (వెన్న) తప్పక లభిస్తుంది. సులభంగా మీ మాటల్లోనే వివరిస్తున్నా. అక్కడికీ అర్థం కాకుంటే ! రండి ! చేసి చూడండి ! అంతా అర్థమౌతుంది. అంత సులభంగా వదిలే భిక్షకుణ్ణి కాదు నేను. ఎందుకు ? నేను ఇచ్చేందుకు బయలుదేరిన భిక్షకుణ్ణి ! నాదానం మీకు వద్దా ? వదలలేను – అనే నిర్ణయం కల్గేదాకా నిరీక్షించి, తర్వాత పరుగెత్తు. ఇది స్వామి ఆజ్ఞ. దేవవాణి నాలో ఎంత మేరకు ప్రతిబింబించిందో మీరే చూడాలి ! గ్రాహ్యం, అగ్రాహ్యం – వీటి గురించి తెలుసుకునే జిజ్ఞాసువులు కండి !

'జీవనం' ఎంత దాకా అనిపిస్తుంది ? అది 'జీవ–జీవన' అనే శబ్దాల కతీతంగా నిలిచే దెప్పుడు ? వీటిని గ్రహిస్తే 'అమరజీవనం' మీకు అర్థమౌతుంది. దీని కోసం మనం ఏం చేయాలి ? 'సర్వార్పణం' సర్వార్పణ ప్రాప్తి ఎలా ఔతుంది ? సర్వ కర్మల్ని ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే, ఇక తర్వాత ప్రతిదీ ఈశ్వర ప్రేరిత కర్మగా మారి నిష్కామ కర్మ సిద్ధిస్తుంది. అదే – కృతిపూర్ణత్వమే కర్మత్యాగం. అంటే స్వార్థం కోసం చేసే కర్మను త్యాగం చేయడం. దీనివల్ల సర్వార్పణకు దారి సుగమం ఔతుంది.

దేహం పాంచభౌతికమని అందరూ అంటారు. నిజం. పంచభూతాల్లో చైతన్యమూ చేరింది కదూ ? బాహ్యేంద్రియ సౌందర్యం,

సౌష్ఠవాల ఆలయంలో అది లభించాకే జీవితం. ప్రపంచంలోని అన్ని ప్రాణులకూ ఇలాంటి జీవనముంది. అయితే పశుపక్ష్యాదుల్లో మనస్సు ఒక పరిమితిలో ఉంటుంది. మానవునిలో ఆ మనస్సు – దాని ప్రవర్తన విశేష ప్రాధాన్యాన్ని సంతరించు కుంటుంది. మనస్సు లేకుండా జీవి జీవించజాలడు. మనస్సు లేకుంటే ఏమీ లేదు. ఆ మనస్సు అతీతమైనది. అదే సర్వస్వం. అది లేకుంటే బంధమూలేదు. మోక్షమూ లేదు. దీని ఆకారం చాలా పెద్దది. **"మనలోన ఉండు నేను, నీవు అను రెండు శక్తులు, గగన తలమున నొకటి, రసాతలమున నొకటి నిలిపి, ఎచటెచటో తిరుగుచుండు మనస్సు ఆకారము బృహదాకారము చూడు"** అని విశ్వవాణి **చెబుతుంది.**

※※※